సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 115

మంగళవారం 16-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'



స్పెయిన్ తడాఖా

నాలుగోసారి 'యూరో' టైటిల్ సొంతం.. ఫైనల్లో ఇంగ్లండ్‌పై విజయం - 14లో



అర్జెంటీనా ధమాకా

16వసారి కోపా అమెరికా కప్ కైవసం.. ఫైనల్లో కొలంబియాపై గెలుపు - 14లో



రాజ్యసభలో బలం 90 దిగువకు..

కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ బలం పెద్దల సభలో చాన్నాళ్ల తర్వాత 90 కంటే దిగువకు పడిపోయింది.

- వివరాలు 6లో



కేజ్రీవాల్ తగ్గిన బరువు 2 కిలోలే..

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జైల్లో ఉన్నప్పుడు తగ్గిన బరువు రెండు కిలోలు మాత్రమేనని తిహార్ జైలు అధికారులు చెప్పారు.

- వివరాలు 6లో



ఇమ్రాన్ ఖాన్‌కు భారీ షాక్

దేశ వ్యతిరేక చర్యల ఆరోపణలపై ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పీటీఐ పార్టీని నిషేధించాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించింది.

- వివరాలు 6లో



నిరుపేద దేశం సమున్నత లక్ష్యం!

విద్యార్థులందరికీ ఉచిత విద్య అందించాలన్న మూడేళ్ల నాటి నిర్ణయం అమలుకు ఆఫ్రికా దేశం జాంబియా శ్రమిస్తోంది.

- వివరాలు 6లో

'రేషన్' ఉంటేనే మాఫీ

రైతుల పంట రుణాల మాఫీ మార్గదర్శకాలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

రేషన్ కార్డుల ఆధారంగానే రైతు కుటుంబాలను గుర్తించాలని నిర్ణయం

పీఎం కిసాన్ నిబంధనలను అవసరమైన మేరకు పరిగణనలోకి తీసుకుంటాం

రూ. 2 లక్షలకు మించి రుణం ఉంటే.. ఆపై ఉన్న రుణాన్ని రైతు చెల్లిస్తేనే మాఫీ



మాఫీ సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ

బంగారం తాకట్టుపై తీసుకున్న పంట రుణాలపై మార్గదర్శకాల్లో లేని ప్రస్తావన.. తప్పుడు పత్రాలతో మాఫీ పొందినట్టు తేలితే రికవరీ చేస్తామని స్పష్టీకరణ

రుణమాఫీపై అభ్యంతరాలు, సలహాలకు మండల స్థాయిలో సహాయ కేంద్రాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల పంట రుణాల మాఫీ రేషన్‌కార్డు ఉన్నవారికే అమలుకానుంది. ఆహార భద్రత కార్డుల ఆధారంగానే రైతు కుటుంబాలను గుర్తిస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. లబ్ధిదారులను తేల్చడానికి.. బ్యాంకుల్లో రైతుల రుణఖాతాలోని ఆధార్‌ను.. పట్టాదారు పాస్‌బుక్ డేటాబేస్‌లో ఉన్న ఆధార్‌తో, పీడీఎస్ (రేషన్) డేటాబేస్‌లోని ఆధార్‌తో అనుసంధానం చేయనున్నట్టు పేర్కొంది. అర్హులుగా తేల్చిన ఒక్కో రైతు కుటుంబానికి 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ మధ్య ఉన్న పంట రుణాల బకాయిల్లో రూ.2 లక్షల వరకు మాఫీ చేయనున్నట్టు ప్రకటించింది. తప్పుడు పత్రాలతో రుణమాఫీ పొందినట్టు తేలితే ఆ మొత్తాన్ని రికవరీ చేస్తామని తెలిపింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు సోమవారం 'పంట రుణ మాఫీ పథకం-2024' మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ ఉత్తర్వులను తెలుగులో విడుదల చేయడం విశేషం.

పథకం అమలు ప్రక్రియ, ఏర్పాట్లు చేసేదిలా..

→ వ్యవసాయ శాఖ డైరెక్టర్ పంటల రుణమాఫీ పథకాన్ని అమలు చేసే అధికారిగా మిగతా 2వ పేజీలో ▶

మాఫీ ▼ ఎవరెవరికి?

భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ వర్తిస్తుంది. అయితే స్వల్పకాలిక పంట రుణాలకే వర్తిస్తుంది.

షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, వాటి బ్రాంచీల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది.	2018 డిసెంబర్ 12న, ఆ తర్వాత మంజూరై లేదా రెన్యువల్ అయి.. 2023 డిసెంబర్ 9వ తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలను ఈ పథకం కింద మాఫీ చేస్తారు.

ప్రతి రైతు కుటుంబం గరిష్టంగా రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీ పొందుతుంది. కటాఫ్ తేదీ నాటికి బకాయి ఉన్న అసలు, వడ్డీ మొత్తం ఈ పథకానికి అర్హత కలిగి ఉంటుంది.



రైతు కుటుంబాన్ని నిర్ణయించడానికి పౌర సరఫరాల శాఖ జారీ చేసిన ఆహార భద్రత కార్డు డేటాబేస్ ప్రామాణికంగా ఉంటుంది. దాని ఆధారంగా కుటుంబంలో ఇంటి యజమాని, జీవిత భాగస్వామి, పిల్లలను పరిగణనలోకి తీసుకుంటారు.

రుణమాఫీకి ఆంక్షలేంటి?

- మండిపడుతున్న రైతులు
- రేషన్‌కార్డు ప్రామాణికంతో లక్షల మందికి మాఫీ వర్తించదనే ఆందోళన
- పీఎం కిసాన్ నిబంధనలు అమలు చేస్తే మరికొన్ని లక్షల మంది రైతులకు నష్టం

2లో

ప్రజల అభిప్రాయమే జీవోగా రైతు భరోసా

మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి 2లో



అమెరికా రిపబ్లికన్ ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఆంధ్రా అల్లుడు!

ఒహియో సెనేటర్ జేడీ వేన్స్ పేరును ప్రకటించిన ట్రంప్

వేన్స్ సతీమణి ఏపీ మూలాలున్న ఉషా చిలుకూరి..

మిల్‌వాకీ: రిపబ్లికన్ అమెరికా అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్.. ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఒహియో సెనేటర్ జె.డి.వేన్స్ (39)ని ఎంపిక చేసుకున్నట్లు సోమవారం అర్ధరాత్రి దాటాక (భారత కాలమానం ప్రకారం) ప్రకటించారు. ఈ విషయాన్ని తన 'ట్రూత్' సోషల్ నెట్‌వర్క్ ద్వారా తెలిపారు. జేడీ వేన్స్ సతీమణి ఉషా చిలుకూరి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆమె తల్లిదండ్రులు అమెరికాలోని శాన్‌డియాగోలో స్థిరపడ్డారు. 2014లో వేన్స్, ఉషల వివాహం జరిగింది. యేల్ లా స్కూల్లో వీరిద్దరు కలిసి చదువుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. తన ఎదుగుదలలో ఉషా పాత్ర ఎనలేనిదని వేన్స్ పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు.



చనిపోయాననే అనుకున్నా..

కుడివైపు తిరగబట్టే బతికిపోయా

కాపాడింది దేవుడో, అదృష్టమో!

ప్రాణాంతక దాడిపై డొనాల్డ్ ట్రంప్

"ఆ సమయంలో నేను చనిపోయాననే అనుకున్నా. కేవలం అదృష్టమో, దైవమో నన్ను కాపాడాయి. నాకు చికిత్స చేసిన డాక్టర్ కూడా ఇలాంటి దృశ్యాన్ని తన కెరీర్లోనే ఎన్నడూ చూడలేదని, ఇది అద్భుతమని చెప్పారు. కాల్పుల తర్వాత కూడా ప్రసంగం కొనసాగించాలనే అనుకున్నా. కానీ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ల ఒత్తిడి మీద ఆస్పత్రికి వెళ్లా. అధ్యక్షుడు జో బైడెన్ నాకు ఫోన్ చేసి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు.

- న్యూయార్క్ పోస్ట్ వార్తా సంస్థతో ఇంటర్వ్యూలో ట్రంప్ 6లో

మళ్లీ తడబడ్డ జో బైడెన్

బ్యాలెట్ అనబోయి బ్యాటిల్!

- అమెరికన్లను ఉద్దేశించి ప్రసంగం
- తలపట్టుకుంటున్న డెమొక్రాట్లు

6లో

ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



సచివాలయం వద్ద ఉద్రిక్తత

- యూత్ డిక్లరేషన్ హామీ నెరవేర్చాలంటూ సచివాలయ ముట్టడికి పలు సంఘాల పిలుపు
- ఆందోళనకారులను అరెస్ట్ చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: బీసీ జనసభ ఆధ్వర్యంలో పలుసంఘాల నేతలు సచివాలయ ముట్టడికి యత్నించగా.. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీ మేరకు తక్షణమే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలంటూ సోమవారం ఉదయం మింట్ కాంపౌండ్ నుంచి బీసీ జనసభ, ప్రజా,విద్యార్థి సంఘాల నాయకులు సచివాలయంలోకి దూసుకెళ్లడానికి మిగతా 3వ పేజీలో ▶

కాంగ్రెస్‌లోకి పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



కాంగ్రెస్ పార్టీలోకి మరో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చేరారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. - 3లో

ప్రొటోకాల్ రగడ.. ఎమ్మెల్యే సబిత నిరసన



ఆషాఢ బోనాల చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి వెంట వచ్చిన బీఆర్‌ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు కాంగ్రెస్ నేతలను అడ్డుకోలేదు. దీంతో సబిత వేదిక వద్దే బైఠాయించి నిరసనకు దిగారు. - 12లో

అబ్బాయి హాల్ టికెట్‌పై అమ్మాయి ఫొటో

డీఎస్సీ హాల్ టికెట్లలో గందరగోళం

అమ్మాయి ఫొటో ఉండాల్సిన చోట అబ్బాయిది

మాకేం సంబంధం లేదంటున్న అధికారులు

నెట్ సెంటర్లదే పొరపాటని వాదనలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) హాల్ టికెట్లలో గందరగోళం చోటు చేసుకుంది. అబ్బాయి హాల్ టికెట్‌పై అమ్మాయి ఫొటో, అమ్మాయి హాల్ టికెట్‌పై అబ్బాయి ఫొటో, సంతకం ఉండటాన్ని అభ్యర్థులు గుర్తించారు. దీనిపై విద్యాశాఖ అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోయారు. సాఫ్ట్‌వేర్‌లో ఎక్కడో పొరపాటు జరిగిందని, హాల్ టికెట్ల రూపకల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

తప్పులు సరిచేస్తామంటున్న విద్యాశాఖ

డీఎస్సీ పరీక్ష ఈ నెల 18 నుంచి మొదలవుతుంది. పరీక్షకు సీరియస్‌గా సన్నద్ధమవుతున్న యువత హాల్ టికెట్ల గందరగోళంతో కంగారు పడుతోంది. అయితే ఈ తప్పిదాలకు విద్యాశాఖ కారణం కాదని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు చేసేటప్పుడు అభ్యర్థులు చేసిన పొరపాట్ల వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వివరణ ఇచ్చారు. అసలు తామెలా ఫొటోలు, సంతకాలు మారుస్తామని వారు అంటున్నారు. సిస్టమ్ జనరేటెడ్ హాల్ టికెట్లను తాము చూసే అవకాశమే లేదంటున్నారు. తప్పులు దొర్లినట్టు మిగతా 12వ పేజీలో ▶



ఏడు జిల్లాల్లో భారీ వర్షాలు!

వాతావరణ శాఖ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం రాష్ట్రంపైన నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నట్టు వాతావరణ శాఖ వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీవర్షాలు, అతి భారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని వాతావరణశాఖ తెలిపింది. వాయవ్య బంగాళాఖాతంలో 19న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు అంచనా వేసింది. సోమవారం రాష్ట్రంలో సగటున 1.85 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో సగటున 4.39 సెం.మీ. వర్షం కురవగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 4.33 సెం.మీ. వికారాబాద్ జిల్లాల్లో 4.16 సెం.మీ., మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 4.04 సెం.మీ. చొప్పున వర్షం కురిసింది.

డ్రగ్స్ కేసులో రకుల్ సోదరుడు అమన్ అరెస్టు

నైజీరియన్ గ్యాంగ్‌ను పట్టుకున్న యాంటీ నార్కోటిక్స్ టీమ్



- పాజిటివ్ వచ్చిన ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- 199 గ్రాముల కొకైన్ స్వాధీనం
- ఇద్దరు సూత్రధారుల పరారీ

సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి: టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ), సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌ఓటీ), రాజేంద్రనగర్ పోలీసులు చేపట్టిన ఉమ్మడి ఆపరేషన్‌లో ఐదుగురు డ్రగ్ పెడ్లర్స్ చిక్కారు. వీరి విచారణలో ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు, టాలీవుడ్ నటుడు అమన్ ప్రీత్ సింగ్ సహా 13 మంది పేర్లు వెలుగులోకి వచ్చాయి. వీరిలో అమన్ సహా ఐదుగురిని పరీక్షించగా, వారు డ్రగ్స్ వినియోగించినట్లు తేలింది. దీంతో ఈ ఐదుగురినీ నిందితులుగా చేర్చి అరెస్టు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ పేర్కొన్నారు. డ్రగ్ పెడ్లర్స్‌లో కొందరు స్థానికులూ ఉన్నారని, పరారీలో ఉన్న ఇద్దరు ప్రధాన సూత్రధారుల కోసం గాలిస్తున్నామని తెలిపారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఆయన ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

విదేశాల నుంచి తెప్పించి...

నైజీరియాకు చెందిన డివైన్ ఎబుక సుజీ, ఫ్రాంక్లిన్‌లు బిజినెస్, స్టడీ వీసాలపై మిగతా 12వ పేజీలో ▶

క్లబ్ హౌస్‌ల్లో డ్రగ్స్ వినియోగమా?

- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు చోటివ్వద్దు: హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి
- 4 వారాల్లోపు 'జనరల్ బాడీ' నిర్వహించాలని 'ఇందు' ఓనర్స్ అసోసియేషన్‌కు ఆదేశం

12లో

సమావేశంలో సీఎం రేవంత్. చిత్రంలో జానారెడ్డి, భట్టి విక్రమార్క



ప్రణాళిక సిద్ధం చేయండి

బీసీ రిజర్వేషన్ల పెంపుపై అధికారులకు సీఎం ఆదేశం

- అసెంబ్లీ సమావేశాల్లోగా తుది నిర్ణయం తీసుకుందామని వెల్లడి
- కులగణన ఆధారంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆరా

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో పంచాయతీ ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల పెంపుపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది. గత పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు వివరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుదలతో పాటు స్థానిక మిగతా 3వ పేజీలో ▶



నిర్ణయాలన్నీ పైస్థాయిలోనే!

జస్టిస్ ఘోష్ కమిషన్‌కు ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్‌ల వివరణ!

మేము అమలు మాత్రమే చేశాం.. నిర్మాణ లోపాలు, ఆర్థిక అంశాలకు బాధ్యులెవరంటూ కమిషన్ ఆరా..

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలన్నీ గత ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో జరగగా, తాము అమలు చేశామని పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, రిటైర్డ్ అధికారులు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు వివరించినట్టు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, అక్రమాలు, లోపాలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట సోమవారం పలువురు సీనియర్ ఐఏఎస్‌లు, రిటైర్డ్ ఐఏఎస్‌లు హాజరై వివరణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన మిగతా 5వ పేజీలో ▶

'మేడిగడ్డ' ఇంజనీరింగ్ బ్లండర్!

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు ప్రజెంటేషన్‌లో కె.రఘు 5లో

ఇదండీ సంగతి



అవన్నీ ఓట్లుగా మారితే ఎంత బాగుండో! ప్చ్!



అర్జెంట్ అయినా క్యూలోనే!

ఈ క్యూలైన్ చూడండి.. భోజనం కోసం విద్యార్థులు ఇలా బుద్ధిగా క్యూలో నిలబడ్డారని అనుకుంటున్నారా.. కాదండోయ్. ఒంటికి, రెంటికి వెళ్లాలంటే మరుగుదొడ్డి వద్ద రోజూ ఇలా నిలబడాల్సిందే. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 410 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి కాలకృత్యాలు తీర్చుకునేందుకు 4 మరుగు దొడ్లు, 6 స్నానపు గదులు నిర్మించారు. కొత్తగా మరో 4 గదులు ఏర్పాటు చేసినా..అందులో కొన్ని పాడయ్యాయి. దీంతో రోజూ ఉదయం కాలకృత్యాలు తీర్చుకొనేందుకు మరుగుదొడ్డి వద్ద ఇలా క్యూ కట్టి ఇబ్బందులు పడుతున్నారు. - గూడూరు

క్లుప్తంగా...

ఆగస్టు 15 నాటికి పంట రుణాలు మాఫీ: ఉత్తమ్

రైతులకు సాగుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



సాక్షి, హైదరాబాద్: రైతు రుణాలను ఒకే దఫాలో మాఫీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షల వరకు ఉన్న రైతుల పంట రుణాలను మాఫీ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. టీజీఎస్‌డీసీఎల్ చైర్మన్‌గా అన్వేష్ రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ పంట రుణాల మాఫీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ఆయకట్టును పెంచేందుకు పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించనున్నట్లు వెల్లడించారు. పంట రుణాల మాఫీ సహా పలు కీలక అంశాలపై రానున్న అసెంబ్లీ సమావేశంలో చర్చించనున్నట్లు మంత్రి తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన టీజీఐఐసీ చైర్మన్ నిర్మల, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి.

గత సర్కారు తరహాలోనే చేస్తున్నాం: తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ విషయంలో 2018లో అప్పటి సర్కారు అవలంబించిన విధానాలనే.. ఇప్పుడు రైతు కుటుంబాల నిర్ధారణ కోసం అమలు చేస్తున్నామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2018లో రుణమాఫీ కింద రూ.20 వేల కోట్లు ప్రకటించి.. 2023 ఎన్నికల సంవత్సరంలో రూ.13 వేల కోట్లు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. అందులోనూ రూ.1,400 కోట్లు వెనక్కి వచ్చినా స్పందించని ప్రబుద్ధులు.. ఈ రోజు మైకుల ముందుకు వచ్చి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రుణమాఫీ పథకంలో రేషన్‌కార్డు కేవలం కుటుంబాన్ని నిర్ణయించడానికి ప్రామాణికం మాత్రమేనని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం దగ్గర అందరి వివరాలు ఉన్నాయని, కుటుంబాల నిర్ధారణ కాగానే రుణమాఫీని మిగతా వారికి కూడా వర్తింపజేస్తామని తెలిపారు.

'హైడ్రా'కు బీఆర్‌ఎస్ వ్యతిరేకం: వివేకానంద



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేలా హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్) ఏర్పాటు చేయడం స్థానిక సంస్థల స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద అన్నారు. హైడ్రా ఏర్పాటును బీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తుందని, శివారు ప్రాంతాల్లో భూకబ్జాల కోసం కుట్రలు జరుగుతున్నాయన్నారు. పార్టీ ఎమ్మె ల్యే డాక్టర్ కె.సంజయ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌లో వివేకానంద మీడియాతో మాట్లా డారు. అధికార వికేంద్రీకరణకు బదులుగా మూడు కార్పొరేషన్ల ఏర్పాటుతో పెత్తనం చెలాయించాలని సీఎం రేవంత్ భావిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఢిల్లీలో బీజేపీతో కేటీఆర్, హరీశ్ చర్చలు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు తమ రహస్య ఒప్పందాలకు నెమ్మదిగా తెర దించుతున్నాయని ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అందులో భాగంగానే హరీశ్ రావు ప్రజానేత అని బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ డబ్బా కొడుతున్నారని విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలో కేటీఆర్, హరీశ్ రావు బీజేపీతో సంప్రదింపులు జరిపారని ఆరోపించారు. కవిత బెయిల్ కోసమే బీజేపీకి బీఆర్‌ఎస్ నేతలు స్నేహ హస్తం అందిస్తున్నారని నిందించారు. నిన్నటి దాకా హరీశ్ రావుపైన దుమ్మెత్తిపోసిన బీజేపీ నేతలు ఇప్పుడు పొగుడుతుండడం లోపాయికారి ఒప్పందంలో భాగమేనన్నారు. హరీశ్ రావును పొగడ్తలతో ముంచెత్తడం వెనుక ఆయనతో రాజీనామా చేయించి బీజేపీ తరఫున పోటీ చేయించే ఆలోచన ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. అందుకే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినా, సిద్దిపేటలో హరీశ్ మళ్లీ గెలుస్తాడని బండి సంజయ్ అంటున్నారని పేర్కొన్నారు.

రుణమాఫీకి ఆంక్షలేంటి?

మార్గదర్శకాల్లో కొర్రీలు పెట్టడమేమిటంటూ మండిపడుతున్న రైతులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పథకం అమలుకోసం విడుదల చేసిన మార్గదర్శకాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. అందరికీ రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ సర్కారు ఇప్పుడిలా కొర్రీలు పెట్టడం ఏమిటని.. ఇలాగైతే లక్షలాది మంది రైతులకు రుణమాఫీ అందకుండా పోతుందని రైతులు, రైతు సంఘాల నేతలు వాపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి.. ఆచరణలోకి వచ్చేసరికి ఆర్థిక భారం తగ్గించుకునేందుకు కొర్రీలు పెడుతోందని మండిపడుతున్నారు.

చాలా మందికి రేషన్‌కార్డులు లేవంటూ..

ప్రధానంగా రేషన్‌కార్డు ద్వారానే రైతు కుటుంబాలను గుర్తిస్తామని మార్గదర్శకాల్లో పేర్కొనడంపై రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. లక్షలాది మంది రైతులకు రేషన్‌కార్డులు లేవని.. వేర్వేరు కుటుంబాలుగా విడిపోయి పంట రుణాలు తీసుకున్న వారికి విడిగా రేషన్‌కార్డులు రాలేదని రైతు సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. రేషన్‌కార్డు లేనివారికి రుణమాఫీ వర్తించకపోవడం, పాత రేషన్‌కార్డుల్లో ఒకే కుటుంబంగా ఉన్నవారందరికీ కలిపి రూ.2లక్షలలోపే రుణమాఫీ చేయడం వల్ల లక్షల మందికి తీవ్రంగా అన్యాయం జరుగుతోందని పేర్కొంటున్నారు.

ఆధార్ లింకేజీ సమస్యతోనూ..

బ్యాంకు రుణఖాతా, పాస్‌బుక్ డేటా, రేషన్‌కార్డు డేటాలను లింక్ చేసి.. ఆధార్ ఒకటిగా ఉన్న వారికి రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొనడంపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇవన్నీ సరిగా లేని, ఆధార్ లింక్ కాని రైతులు లక్షల మంది ఉన్నారని.. వారికి రుణమాఫీ వర్తించకపోతే ఎలాగనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 12 లక్షల మంది దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నట్టు ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయి. అలాగే రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని, ఎదురుచూస్తున్న వారి సంఖ్య కూడా లక్షల్లో ఉంటుంది. మరి వీరి పరిస్థితి ఏమిటని రైతు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

పీఎం కిసాన్ నిబంధనలతో కష్టమే!

ఇక పీఎం కిసాన్ నిబంధనలనూ పరిగణనలోకి తీసుకుంటే.. మరికొన్ని లక్షల మంది రుణమాఫీకి అర్హత కోల్పోతారని రైతులు అంటున్నారు. పీఎం కిసాన్ పథకంలో.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జెడ్పీ చైర్మన్లు, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఆదాయపన్ను చెల్లించేవారిని మినహాయించారు. ఇందులో ఆదాయ పన్ను చెల్లించేవారిలో అనేక మంది ప్రైవేటు ఉద్యోగులు, చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. అలాంటి వారు గ్రామాల్లో తీసుకున్న పంట రుణాలు కూడా మాఫీ కాని పరిస్థితి ఉంటుందని రైతు సంఘాల నేతలు అంటున్నారు.

ఆర్థిక భారం తగ్గించుకునే దుష్ట ప్రయత్నం



రుణమాఫీ కోసం ప్రభుత్వం పెట్టిన కొర్రీలు ఆర్థిక భారాన్ని తగ్గించుకునే దుష్ట ప్రయత్నం. రేషన్‌కార్డులు, పాస్ పుస్తకాలు లేని రైతులు లక్షల్లో ఉన్నారు. ధరణి సమస్యల వల్ల 15 లక్షల మందికి పాస్ పుస్తకాలు రాలేదు. పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ఉంటేనే రుణమాఫీ అనడం సరికాదు. రుణాలు రెండు లక్షలకుపైగా ఉంటే.. ఆ అదనపు మొత్తాన్ని రైతులు చెల్లించాకే రుణమాఫీ చేస్తామనడం తప్పు. రీషెడ్యూల్ చేసిన రుణాలను మినహాయించడం సరికాదు. కటాఫ్ తేదీల మధ్య ఉన్న పంట రుణాలన్నీ మాఫీ చేయాలి. కౌలుదారులకు, జేఎల్‌జీ, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రుణమాఫీ వర్తింప చేయకపోవడంతో వారికి నష్టం జరుగుతుంది.

– సారంపల్లి మల్లారెడ్డి, రైతు సంఘం జాతీయ నాయకులు

పీఎం కిసాన్ నిబంధనలతో పెరగనున్న రుణమాఫీ అనర్హులు

పీఎం కిసాన్ డేటాకు జోడించడం వలన చాలా మంది రైతులు రుణమాఫీ అర్హత కోల్పోతారు. రేషన్‌కార్డులను బట్టి కుటుంబాన్ని నిర్ణయించడం వల్ల లక్షల మందికి నష్టం జరుగుతుంది. కరువులు, వరదల వల్ల నష్టపోయిన రైతులు రుణాలను రీషెడ్యూల్ చేసుకుంటే వారికి రుణమాఫీ వర్తించని పరిస్థితి. రెండు లక్షలకు మించి రుణం ఉంటే.. ఆపైన ఉన్న మేర అప్పు చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందనే కూడా దారుణం. ప్రభుత్వం వెంటనే ఈ మార్గదర్శకాలను సవరించాలి.

– పోతినేని సుదర్శన్‌రావు, తీగల సాగర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రైతుల్లో అసంతృప్తి రగులుతుంది



రుణమాఫీ అమలుకు కొత్తగా షరతులు, నిబంధనలు విధించడం భావ్యం కాదు. రేషన్‌కార్డులతో ముడిపెట్టడం, స్వల్పకాలిక పంట రుణాలకే ఇస్తామనడం వంటివి పొరపాటు. దీనివల్ల రుణమాఫీ కంటి తుడుపు చర్యగానే మిగిలిపోతుంది. ఇప్పటికే విద్యార్థులు, నిరుద్యోగ యువతలో అసంతృప్తి పెరుగుతుండగా.. ప్రభుత్వ తీరుతో ఇప్పుడు రైతుల్లో అసంతృప్తి రగిలే అవకాశాలు ఉన్నాయి.

– డి.పాపారావు, ఆర్థికరంగ విశ్లేషకుడు

'రేషన్' ఉంటేనే మాఫీ

▶ మొదటి పేజీ తరువాయి

ఉంటారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ) ఈ పథకానికి ఐటీ భాగస్వామిగా ఉంటుంది.

→ వ్యవసాయశాఖ డైరెక్టర్, ఎన్‌ఐసీ సంయుక్తంగా ఈ పథకం అమలు కోసం ఒక ఐటీ పోర్టల్‌ను నిర్వహిస్తాయి. ఈ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తం నిర్ణయించబడుతుంది. ఈ ఐటీ పోర్టల్‌లోనే.. ఆర్థికశాఖ నిర్వహించే ఐఎఫ్‌ఎంఐఎస్‌కు బిల్లులు సమర్పించడానికి, రుణమాఫీ పథకానికి సంబంధించిన భాగస్వాములందరితో సమాచారాన్ని పంచుకోవడానికి, రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకంగా మాడ్యూల్స్ ఉంటాయి.

→ ఈ పథకం అమలుకోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని బ్యాంకు నోడల్ అధికారిగా (బీఎస్‌ఐ) నియమించాలి. ఆ నోడల్ అధికారులు తమ బ్యాంక్ పంట రుణాల డేటాపై డిజిటల్ సంతకం చేయాలి.

→ ప్రతి బ్యాంకు తమ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (సీబీఎస్) నుంచి.. రిఫరెన్స్-1 మెమో, ప్రొఫార్మా- 1లో డిజిటల్ సంతకం చేసిన టేబుల్‌ను ప్రభుత్వానికి సమర్పించాలి. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు సీబీఎస్‌లో లేవు కాబట్టి.. ప్యాక్స్‌కు అనుబంధమైన సంబంధిత బ్యాంకు బ్రాంచ్, రిఫరెన్స్-2వ మెమో, ప్రొఫార్మా-2లో డేటాను డిజిటల్‌గా సంతకం చేసి సమర్పించాలి.

→ ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశం తప్పుడు చేరికలు, తప్పుడు తీసివేతలను నివారించడమే.. అవసరమైతే వ్యవసాయ శాఖ డైరెక్టర్, ఎన్‌ఐసీ డేటా వ్యాలిడేషన్ తనిఖీలను చేపట్టాలి.

→ అర్హతగల రుణమాఫీ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో (డీబీటీ పద్ధతిలో) జమ చేస్తారు. ప్యాక్స్ విషయంలో రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీ, బ్యాంకు బ్రాంచికి విడుదల చేస్తారు. ఆ బ్యాంకు వారు రుణమాఫీ మొత్తాన్ని ప్యాక్స్‌లో ఉన్న రైతుల



ఖాతాల్లో జమచేస్తారు.

→ ప్రతి రైతు కుటుంబానికి రుణమొత్తం ఆధారంగా ఆరోహణ క్రమంలో మాఫీ మొత్తాన్ని జమ చేయాలి.

→ కటాఫ్ తేదీ నాటికి ఉన్న మొత్తం రుణం, లేదా రూ.2 లక్షలు.. వీటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని రైతు కుటుంబం పొందే అర్హత ఉంటుంది.

→ ఏదైనా రైతు కుటుంబానికి రూ.2 లక్షలకుపైగా రుణం ఉంటే.. రైతులు అదనంగా ఉన్న రుణాన్ని మొదట బ్యాంకుకు చెల్లించాలి. ఆ తర్వాతే రూ.2లక్షల మొత్తాన్ని రైతు కుటుంబ సభ్యుల రుణ ఖాతాలకు బదిలీచేస్తారు.

→ రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణమున్న పరిస్థితులలో.. కుటుంబంలో మహిళల పేరిట ఉన్న రుణాన్ని మొదట మాఫీ చేసి, మిగతా మొత్తాన్ని దామాషా పద్ధతిలో కుటుంబంలోని పురుషుల పేరిట ఉన్న రుణాలను మాఫీ చేస్తారు.

వీరికి రుణమాఫీ వర్తించదు

→ పంట రుణమాఫీ పథకం ఎస్‌హెచ్‌జీలు, జేఎల్‌జీలు, ఆర్‌ఎంజీలు, ఎల్‌ఈసీఎస్‌లు తీసుకున్న రుణాలకు వర్తించదు.

→ పునర్వ్యవస్థీకరించిన లేదా రీషెడ్యూల్ చేసిన రుణాలకు వర్తించదు.

→ కంపెనీలు, సంస్థలు తీసుకున్న పంట రుణాలకు వర్తించదు. అయితే ప్యాక్స్‌ల ద్వారా తీసుకున్న పంట రుణాలకు వర్తిస్తుంది.

→ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం మినహాయింపుల నిబంధనలను.. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీని ఆచరణాత్మకంగా అమలు చేయడం కోసం వీలైనంత వరకు పరిగణనలోకి తీసుకుంటారు.

మార్గదర్శకాల మేరకు బ్యాంకులు, రైతుల బాధ్యతలివీ..

→ ప్రతి బ్యాంకు ప్రభుత్వం ఇచ్చిన ప్రొఫార్మాలో డేటాను ప్రభుత్వానికి సమర్పించాలి.

→ పథకం కోసం నిర్వహించే ప్రతి డాక్యుమెంటుపై, రూపొందించిన ప్రతి జాబితాపై బ్యాంకు బీఎస్‌వో డిజిటల్ సంతకం చేయాలి. నిర్దేశిత మార్గదర్శకాలను ఉల్లంఘించి డేటాను సమర్పించినట్టు భవిష్యత్తులో గుర్తిస్తే చట్టప్రకారం బ్యాంకులపై చర్యలు ఉంటాయి.

→ ఈ పథకం కింద రుణమాఫీ పొందడానికి రైతులు తప్పుడు సమాచారం ఇచ్చినట్టు గుర్తించినా, లేదా మోసపూరితంగా పంటరుణం పొందినట్టుగానీ, అసలు పంట రుణమాఫీకి అర్హులుకారని తేలినా.. ఆ మొత్తాన్ని రికవరీ చేయడానికి వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు అధికారం ఉంటుంది.

→ రైతుల రుణఖాతాల్లోని డేటా యదార్థతను నిర్ధారించేందుకు... సహకార శాఖ డైరెక్టర్, సహకార సంఘాల రిజిస్ట్రార్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ముందస్తు శాంపిల్ ప్రీఆడిట్‌ను చేపట్టాలి. అమలు అధికారికి ఆ వివరాలను అందజేయాలి.

→ రుణమాఫీ పథకంపై రైతుల సందేహాలను, ఇబ్బందులను పరిష్కరించడానికి వ్యవసాయశాఖ డైరెక్టర్ ఒక పరిష్కార విభాగాన్ని ఏర్పాటు చేయాలి. రైతులు తమ ఇబ్బందులపై ఐటీ పోర్టల్ ద్వారా లేదా మండల స్థాయిలో నెలకొల్పే సహాయ కేంద్రాల ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ప్రతి అభ్యర్థనను సంబంధిత అధికారులు 30 రోజుల్లోపు పరిష్కరించి, దరఖాస్తుదారుకు వివరాలు తెలపాలి.

ప్రజాభిప్రాయమే జీవోగా రైతుభరోసా

- వారిచ్చే సలహాలు, సూచనలను ఉప సంఘం ఆచరణలోకి తీసుకుంటుంది
- రైతుభరోసాపై అసెంబ్లీలో ఒక్క రోజంతా చర్చ జరిగేలా చూస్తాం
- మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, తుమ్మల, పొంగులేటి, ఎంపీ కావ్య


సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రజల అభిప్రాయాలనే ప్రభుత్వ ఉత్తర్వులుగా..చరిత్రాత్మక నిర్ణయంగా తీసుకురావడంలో ఎలాంటి సందేహం లేదని, రైతుభరోసా విషయంలో కూడా ప్రజల అభిప్రాయమే జీవోగా రాబోతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రైతుల అభిప్రాయాల మేరకు శాసనసభలో రైతుభరోసా పథకం రూపకల్పనకు చర్చిస్తామని చెప్పారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రైతుభరోసా పథకం అమలు కోసం విధివిధానాలపై ఉమ్మడి వరంగల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క, సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు జిల్లామంత్రులు మంత్రి కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రునాయక్, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, హాజరయ్యారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతుభరోసా విషయంలో సంపూర్ణంగా ప్రజలు ఏం చెబితే దాన్నే అమలు చేస్తామన్నారు. అందరి సూచనలు నోట్ చేసుకున్నామని, వాటిని ప్రభుత్వం పరిశీలిస్తుందని, అందరి అభిప్రాయానికి తగినట్టుగా సబ్‌కమిటీ నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క చెప్పా రు. వరంగల్ నుంచే ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ రైతు భరోసా హామీ ఇచ్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రైతుభరోసాపై అసెంబ్లీలో ఒక రోజంతా చర్చిస్తామని, ఆ తర్వాత అసెంబ్లీలోనే నిర్ణయం తీసుకుంటామని భట్టి పేర్కొన్నారు.

రైతుల నోటా.. వైఎస్ రాజశేఖరరెడ్డి మాట

హన్మకొండ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడిన రైతుల్లో 90శాతం మంది దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి పేరు ప్రస్తావించారు. నాడు వైఎస్ వల్లనే ఉచిత విద్యుత్, మద్దతుధర, సబ్సిడీ విత్తనాలు, పంట బీమా వచ్చాయని తెలిపారు. ఆయన కాలంలో వ్యవసాయం పండుగలా సాగిందని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత వ్యవసాయం గురించి, రైతుల గురించి పట్టించుకున్న ప్రభుత్వం, నాయకులు లేరన్నారు. రైతును రాజును చేయడానికి వైఎస్ కృషి చేశాడని కొనియాడారు.

నేడో రేపో ఆల్మట్టి గేట్లు ఎత్తివేత

- కృష్ణాలో పెరిగిన వరద ఉధృతి
- వారంలోగా శ్రీశైలానికి కృష్ణమ్మ పరుగులు!



సాక్షి, హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎగువన వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నదిలో వరద తీవ్రత మళ్లీ పుంజుకుంది. మహారాష్ట్ర, కర్ణాటక పశ్చిమ కనుమల్లో వర్షాలతో కృష్ణా ప్రధాన పాయలో వరద ఉధృతి పెరిగింది. కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌లోకి సోమవారం సాయంత్రం నాటికి 45 వేల క్యూసెక్కుల వరద చేరుతుండగా, నిల్వలు 95.22 టీఎంసీలకు చేరుకున్నాయి. జల విద్యుదుత్పత్తి ద్వారా ఆల్మట్టి నుంచి 9,730 క్యూసెక్కులను దిగువన నారాయణపూర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. వర్షాలు, వరదలు కొనసాగితే ఒకటి రెండురోజుల్లో ఆల్మట్టి డ్యామ్ గేట్లను ఎత్తి నీళ్లను దిగువకు విడుదల చేసే అవకాశముంది. దీనికి దిగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్ గరిష్ట నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 26.72 టీఎంసీలున్నాయి. దీంతో ఆల్మట్టి డ్యామ్ గేట్లను ఎత్తిన ఒకటి రెండు రోజుల్లోనే నారాయణపూర్ గేట్లను ఎత్తే అవకాశముంది. దీంతో తెలంగాణలోని జూరాల జలాశయానికి వరద చేరుకోనుండగా, వెంటనే గేట్లను ఎత్తి దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి నీళ్లను విడుదల చేయనున్నారు. ఎందుకంటే జూరాల జలాశయం గరిష్ట నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.72 టీఎంసీల నిల్వలున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో శ్రీశైలం జలాశయానికి వరద నీరు చేరుకోవచ్చని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

తుంగభద్ర బేసిన్‌లోనూ వర్షాలు

కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్ర బేసిన్‌లోనూ వర్షాలు కురుస్తుడడంతో తుంగభద్రకు వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. తుంగభద్ర జలాశయానికి 16వేల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. జలాశయం గరిష్ట నిల్వ సామర్థ్యం 100.86 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 33.07 టీఎంసీల నిల్వలున్నాయి. వర్షాలు విస్తారంగా కురిస్తే మరో వారం రోజుల్లో తుంగభద్ర గేట్లను ఎత్తే అవకాశముంది. అప్పుడు తుంగభద్ర జలాలు కూడా సుంకేశుల బరాజ్ మీదుగా శ్రీశైలం ప్రాజెక్టుకు చేరతాయి.

సోమవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లోని ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, ప్రవాహాలు ఇలా...

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో
ఆల్మట్టి	1705	129.72	1698.03	95.22	45000	9730
నారాయణపూర్	1615	37.64	1606.46	37.64	10,404	92
జూరాల	1045	9.66	1041.79	7.72	2894	1806
తుంగభద్ర	1633	105.79	1607.57	33.07	16,142	344
శ్రీశైలం	885	215.81	813.09	36.19	1055	1659
నాగార్జునసాగర్	590	312.05	502.98	120.09	0	888
పులిచింతల	175	45.77	99.08	0.69	362	50

అవి మార్గదర్శకాలు కావు.. మభ్యపెట్టే ప్రయత్నాలు

రుణమాఫీపై కాంగ్రెస్ మోసం: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ మార్గదర్శకాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ కొంతమందికే రుణమాఫీని పరిమితం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రూ.2లక్షల పంట రుణం తీసుకున్న రైతుల జాబితాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఎం కిసాన్ డేటాను మార్గదర్శకంగా తీసుకుంటామని ఎన్నికల ప్రచారంలో చెప్పని కాంగ్రెస్ ఇప్పుడు లోపభూయిష్ట షరతులు విధిస్తోందని నిందించారు. రైతు రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికం కాదని నాలుగు రోజుల క్రితం చెప్పిన సీఎం రేవంత్ ఎందుకు యూ టర్న్ తీసుకున్నారో చెప్పాలని కోరారు. రేషన్ కార్డులు లేని రైతులు, పది ఎకరాల భూమి ఉండి కూడా పింక్ రేషన్ కార్డు కలిగిన రైతుల సంగతేంటో తేల్చాలని ఓ ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రైతు రుణమాఫీ మార్గదర్శకాలు అధికారులు, రైతుల నడుమ చిచ్చు పెట్టేలా ఉన్నాయని నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

వలపోతల కంటే వడపోతలపైనే దృష్టి : మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ మార్గదర్శకాలను పరిశీలిస్తే రైతుల వలపోతల కంటే వడపోతల పైనే ఎక్కువ దృష్టి పెట్టినట్లుగా స్పష్టమవుతోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. చెప్పేదొకటి చేసేదొకటి అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీకి అలవాటు అయిందని ఎద్దేవా చేశారు. 2018 డిసెంబర్ 12వ తేదీకి ముందు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తించదనే నిబంధన అసమంజసం అని పేర్కొన్నారు. రైతుకు రుణభారం తగ్గించే ప్రయత్నం కన్నా ప్రభుత్వ భారం తగ్గించుకునే ప్రయత్నమే ఎక్కువ కనపడుతోందని నిందించారు. ఆహార భద్రత కార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికం అని ప్రకటించడం ద్వారా లక్షలాదిమంది రైతుల ఆశలపై సర్కారు నీళ్లు చల్లిందని హరీశ్‌రావు ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

షరతులు లేకుండా రుణమాఫీ ఇవ్వాలి

బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్




సాక్షి, హైదరాబాద్: ఎలాంటి షరతులు..నిబంధనలు లేకుండా రైతు రుణమాఫీ అమలు చేయాలని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రుణమాఫీకి రేషన్‌కార్డును ప్రామాణికం చేయడం ద్వారా ప్రభుత్వం తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. అందరికీ రుణమాఫీ ఇవ్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం షరతులతో కొత్తకథలు చెబుతోందని మండిపడ్డారు. దీనిపై గతంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినప్పుడు ఎలాంటి షరతులు విధించని విషయాన్ని గుర్తుచేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏ నిబంధనలు లేకుండా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి... ఇప్పుడు ఇన్ని కండిషన్స్ ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క కొత్త రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. కానీ ఇప్పుడు రుణమాఫీకి మాత్రం రేషన్‌కార్డును లింక్ చేస్తోందని ధ్వజమెత్తారు. చాలామందికి ఇది వర్తించకుండా ఎగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇంట్లో ఒకే రేషన్‌కార్డుపై చాలామంది పేర్లు ఉంటాయని, అందులో నలుగురికి రుణాలుంటే ఒక్కరికే మాఫీతో మిగతావారు నష్టపోతారన్నారు. కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవాలంటే వారితో రాజీనామా చేయించి, ఉప ఎన్నికల్లో గెలిపించి చేర్చుకోవాలని సీఎంకు సూచించారు.

సీఎం రేవంత్‌కు మరో బహిరంగలేఖ

గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన బహిరంగలేఖలో మహేశ్వర్‌రెడ్డి కోరారు. పంచాయతీల్లో నిధులు లేక పనులు చేయలేమని ప్రజావాణిలో గ్రామ కార్యదర్శులు వెల్లడించినా.. సర్కార్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తీరులో మార్పు రాకపోతే ప్రజాక్షేత్రంలో సర్కార్ తీరును ఎండగడతామని తెలిపారు. వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అలాగైతే రుణమాఫీకి చాలామంది అనర్హులు?

పీఎం కిసాన్ పథకం నిబంధనలు అమలు చేస్తే కష్టమే



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన(పీఎం కిసాన్) పథకం నిబంధనలు అత్యంత కఠినంగా ఉన్నాయి. ఈ నిబంధనల కారణంగా చాలా మంది ఈ పథకానికి అనర్హులవుతున్నారు. ఇలాంటి కఠిన నిబంధనలను ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలో రుణమాఫీకి లక్షల మంది అనర్హులయ్యే ప్రమాదం ఏర్పడింది.

పీఎం కిసాన్‌కు వీళ్లు అనర్హులు...

- రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారికి ఈ పథకం వర్తించదు. ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారితో పాటు మాజీలకు కూడా ఈ పథకం వర్తించదు.
- మాజీ, ప్రస్తుత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్స్ ఈ పథకానికి అనర్హులు.
- రిటైర్డ్, ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగులకు కూడా పీఎం కిసాన్ వర్తించదు.
- అనర్హుల జాబితాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే వారు. ప్రభుత్వ ఆధీనంలోని స్వతంత్ర సంస్థల్లో పని చేసేవారు. స్థానిక సంస్థల్లోని ఉద్యోగులు.
- ఉద్యోగాల్లో రిటైర్డ్ అయి ప్రతి నెల రూ. 10 వేల కన్నా ఎక్కువగా పెన్షన్ తీసుకునేవాళ్లు కూడా ఈ పథకానికి అనర్హులే.
- ఇక ఆదాయపు పన్ను చెల్లించే వాళ్లు ఈ పథకానికి అనర్హులు.
- డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్స్, చార్టర్డ్ అకౌంట్స్, ఆర్కిటెక్ట్స్‌కు పీఎం కిసాన్ వర్తించదు.
- ఎన్‌ఆర్‌ఐ కుటుంబాలకు వర్తించదు.

నేడు కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ భేటీ

సాక్షి, హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్ష తన మంగళవారం సచివాలయంలో కలె క్టర్లు, ఎస్పీల కీలక సమావేశం జరగనుంది. పార్ల మెంట్ ఎన్నికలు ముగిసిన తరువాత తొలి సారిగా జరుగుతున్న ఈ సమావేశంలో మం త్రులు కూడా పాల్గొంటారు. ప్రజాపాలన, విద్య, వైద్యం, ధరణి, శాంతిభద్రతలు తదితర అంశాలపై చర్చించనున్నారు. తెలంగాణను డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా మార్చడానికి తీసుకోవా ల్సిన చర్యలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. వర్షాలు, సాగు విత్తనాలు, ఎరువుల సరఫరా తదితర అంశాలపైనా సూచ నలు ఇవ్వనున్నారు. అన్ని శాఖల కార్యద ర్శులు, ప్రధాన కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొంటారు.

గీతకార్మికులకు 'రక్షణ'



అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

రూ.10 వేల విలువ చేసే ఆరు పరికరాలతో కిట్

రాష్ట్రవ్యాప్తంగా గీతకార్మికులకు పంపిణీకి ఏర్పాట్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆకాశానికి, భూమికి మధ్య ఎత్తైన చెట్లపై వేలాడు తున్న గీతకార్మికుల ప్రాణాలకు సంపూర్ణ రక్షణ కల్పించాలని ప్రభుత్వం భావించింది. ఆ మేరకు 'కాటమయ్య రక్షణ కవచం' పేరుతో ప్రత్యేక కిట్‌ను అం దు బాటులోకి తెచ్చింది. రెండు రోజుల క్రితం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ వేది కగా వీటిని లబ్ధిదారులకు అందజేసింది. సంప్రదాయ మోకుముస్తా దుకు అనుసంధానంగా వీటిని రూపొం దించింది. త్వరలోనే వీటిని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గీత కార్మికులందరికీ అందజేయనుంది. గత పదేళ్లలో 5,485 మంది గీతకార్మికులు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడగా, 775 మంది మృతి చెందారు. 1,974 మం ది శాశ్వత వైకల్యంతో బాధపడుతున్నారు.





కిట్ ఎంతో ఉపయుక్తం..

కల్లుగీత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారికి ప్రభుత్వం సరఫరా చేసిన రక్షణ కిట్టు ఎంతో ఉపయుక్తంగా ఉంది. మోకును పోలిన తాడు, ముస్తాదుకు సరితూగే స్లింగ్‌బ్యాగ్, నడుముకు బెల్టు, గుజి ఇచ్చారు. చెట్టు ఎక్కే ముందు మోకుకు అమర్చిన బోల్ట్‌లను టైట్ చేసుకోవాలి. చెట్టుపైన మోకు జారినా..స్లింగ్‌బ్యాగ్ కిందికి జారకుండా అడ్డుకుంటుంది. కల్లును ఒడుసుకుని సులభంగా కిం దికి దిగొచ్చు. ఏమాత్రం ప్రాణహాని ఉండదు.

– చరివి క్రిష్టయ్యగౌడ్, గీతకార్మికుడు, అబ్దుల్లాపూర్‌మెట్







మోకుముస్తాదుతో అనుసంధానం

వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ, ఓ ప్రైవేటు ఏజెన్సీ సంయుక్తంగా ఈ కిట్లను తయారు చేసింది. ఐఐటీ–హైదరాబాద్ వీటి పనితీరును పరీక్షించి, ధ్రువీకరించిం ది. ఒక్కో కిట్టు ధర రూ.10 వేలు. గీత కార్మికులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది. తొలి విడతలో భాగంగా ఆదివారం 500 మందికి అందజేసింది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా వీటిని పంపిణీ చేయనున్నారు. ఒక్కో కిట్టులో ఆరు రకాల పరికరాలు ఉం టాయి. వీటిలో తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్‌బ్యాగ్, లెగ్‌లూప్ వంటివి ఉంటాయి. దీనికి వాడిన మెటీరియల్ పూర్తిగా విదేశాల నుం చి దిగుమతి చేసుకున్నారు. ఈ కిట్‌కు రెం డు వేల నుంచి 3,500 కేజీల బరువును ఆపగలిగే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం గీత కార్మికులు ఉపయోగిస్తున్న సంప్రదాయ కిట్ల తరహాలోనే, ఈ పరికరాలు యూజర్ ఫ్రెండ్లీగా ఉంటాయి.

క్లుప్తంగా...

కృత్రిమ ఉద్యమాలు సృష్టిస్తున్న కేసీఆర్ : చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ కృత్రిమ ఉద్యమాలు సృష్టిస్తున్నారని తెలం గాణ ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నా రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ సచివా లయం మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. కొందరు రాజకీయ నేతలు ఆర్టిఫిషియల్ ఉద్యమాలు చేయిస్తున్నా రని, రెచ్చగొట్టి విద్యార్థుల జీవితాలతో చెల గాటమాడొద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చిన వెంటనే 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, 30 లక్షల ఉద్యోగాలు కల్పిం చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేయ బోతున్నామని వివరించారు. విద్యార్థులు తప్పుదోవపట్ట వద్దని, ప్రభుత్వంనిరుద్యోగు లు, విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు.

ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడిగా సురేశ్‌కుమార్ సింఘాల్

సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఆర్.రవికుమార్ ఎన్నిక



సురేశ్ కుమార్ ఆర్. రవికుమార్

లక్డీ కాపూల్ (హైదరాబాద్): ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇం డస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) అధ్యక్షుడిగా సురేశ్ కుమార్ సింఘాల్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో సోమవారం జరిగిన వార్షిక సర్వసభ్య సమా వేశంలో ఆయనను ఎన్నుకున్నారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్.రవికుమార్ ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. ఉక్కు మంత్రిత్వ శాఖలో వినియోగదారుల వ్యవహారాల కౌన్సిల్ సభ్యు నిగా రెండేళ్లు పనిచేసిన సింఘాల్ విభిన్న వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. ఇండియా ర్యాపింగ్ పేపర్ ఇండస్ట్రీతో పాటు ఐడీఏ మేడ్చల్‌లో పలు కంపెనీలకు వ్యవస్థాపకుడిగా ఉన్నారు. ప్రస్తుతం ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షు డిగా ఉన్న నగరానికి చెందిన టెక్నోక్రాట్, పారి శ్రామికవేత్త రాచకొండ రవికుమార్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి పొందారు. ఏరో స్పేస్, ఆటోమోటివ్, రక్షణ, ఎలక్ట్రానిక్స్ పరిశ్ర మలకు సంబంధించిన పరీక్షా పరికరాల తయారీ, సరఫరా, సేవల రంగంలో అంతర్జా తీయంగా ప్రసిద్ధి చెందిన ఆయన ఆధ్యాత్మిక, దాతృత్వ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే బహుముఖ వ్యక్తిగా ఖ్యాతి చెందారు.

నిరుద్యోగ సమస్యపై 'అఖిలపక్షం'

సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ



కాచిగూడ (హైదరాబాద్): నిరుద్యోగ సమస్యపై అఖిలపక్ష సమావేశం నిర్వహిం చాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమ వారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నిరుద్యో గులపై ప్రభుత్వ నిర్బంధం సరికాదని, వారి డిమాండ్లను గుర్తించి వాటిని పరి ష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టా లని ఆయన కోరారు. గ్రూప్‌– 1లో 563 నుంచి 1,600కు పోస్టులను పెంచాలని, గ్రూప్ – 2లో 780 నుంచి 2,000 వరకు పోస్టు లు పెం చాలని, అలాగే గ్రూప్‌–3 పోస్టులను 1,100 నుంచి 3 వేలకు పెంచాలని కోరారు. టీచర్ పోస్టులను కూడా 11 వేల నుంచి 25 వేలకు పెంచాలని, డీఎస్సీ పరీక్షలను రెండు నెలలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు.

ట్రిపుల్‌ఐటీ రెండో మెరిట్ జాబితా విడుదల

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ట్రిపుల్‌ఐటీ)లో ప్రవేశాలకు సంబంధించి రెం డో మెరిట్ జాబితాను సోమవారం విడుదల చేశారు. గ్లోబల్ కేటగిరీకి సంబంధించిన ఇతర రాష్ట్రాల విద్యార్థుల ఎంపిక జాబితాను కూడా అధికారులు విడుదల చేశారు. ఈ జాబితాలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 19న కౌన్సెలిం గ్ నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు www.rgukt.ac.inవెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సచివాలయం వద్ద ఉద్రిక్తత



పోలీసులు గేట్లు మూసేయడంతో సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగుల ఆందోళన

▶ మొదటి పేజీ తరువాయి

ప్రయత్నించారు. వీరిని అడ్డుకునేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నం చేసినా, కొందరు ఆందోళనకారులు పోలీసుల వలయాన్ని ఛేదించుకొని సచివాలయంలోకి దూసుకెళ్లారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సచివాలయంలోకి వెళుతున్న ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులు, పోలీసులకు మధ్య తోపులాటతో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరుద్యోగుల డిమాం డ్లు వెంటనే నెరవేర్చాలి... సీఎం రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అం టూ ఆందోళనకారులు నినాదాలు చేశారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాంయాదవ్‌తోపాటు గేటు దగ్గర, బయట ఉన్న ఆందోళనకారులను షాహినాత్ గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి రాజు, తెలంగాణ స్టూడెంట్ పరి షత్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌యాదవ్, టీఎస్పీ స్టేట్ కోఆర్డి నేటర్ సూర్యప్రకాశ్, ఓయూ జేఏసీ నేతలు జక్కుల మధు యాదవ్, లింగం శాలివాహన, అంబేద్కర్ యువజన సం ఘం జాతీయ సభ్యులు కొంగర నరహరి, నల్లగొండ జిల్లా యాదవ సంఘం అధ్య క్షురాలు మామిడి పద్మ, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, అడ్వొకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి గోవర్దన్, టి.జర్నలిస్టుల ఫోరం రాష్ట ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, ఆంజనేయులు, బొడ్డుపల్లి లింగం తదిత రులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నివసించే విద్యానగర్‌లోని బీసీ భవన్ వద్ద పోలీసులు భారీ ఎత్తున మోహరించి ఆర్.కృ ష్ణయ్యను బయటకు రానివ్వలేదు. బీజేవై ఎం నగర అధ్యక్షుడు మద్దూరి శివాజీని హరినగర్‌లో అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

- ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ పేరిట స్కాలర్‌షిప్స్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయిం బర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని లిబర్టీ నుంచి ప్రదర్శ నగా విద్యార్థులు బయలుదేరగా, బూర్గుల రామకృష్ణా రావు భవన్ వరకు చేరుకోగానే పోలీసులు అరెస్టు చేశారు.

నిరుద్యోగుల పక్షాన చివరిదాకా పోరాడుతాం: రాజారాంయాదవ్

విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా రేవం త్‌రెడ్డి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాంయాదవ్ ఆరోపించారు. నిరుద్యోగు లతో పెట్టుకున్న రేవంత్‌రెడ్డికి పతనం ప్రారంభమైందని, ప్రభుత్వం దిగిరాకపోతే నిరుద్యోగుల డిమాండ్లు జాతీయ స్థాయిలో వినిపించి రాహుల్‌గాంధీ అబద్ధపు ప్రచారాన్ని ఎం డగడతామని చెప్పారు. షాహినాత్‌గంజ్ పీఎస్ నుంచి రాజారాం యాదవ్‌ను ప్రత్యేక వాహనంలో ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాజారాంయాదవ్‌ను ఎక్క డకు తీసుకెళుతున్నారో చెప్పకపోవడంతో షాహినాత్‌గంజ్ పీఎస్‌లోనే బీసీ జనసభ నాయకులు దీక్షకు దిగారు.

అరెస్టులను ఖండించిన కేటీఆర్, ఆర్.కృష్ణయ్య

రాజారాంయాదవ్ సహా ఇతర విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయటాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఖండించారు. నిరుద్యోగుల సమస్యలను సానుకూల దృక్పథంతో నెరవేర్చాల్సిన ప్రభు త్వం అరెస్టులు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతి యుతంగా ఆందోళన చేయటం కూడా ఈ ప్రజాపాలనలో నిషేధమా అని కేటీఆర్ ప్రశ్నించారు.

నగర గ్రంథాలయానికి తాళం వేసి..

ముషీరాబాద్: చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయం నుంచి వందలాది మంది నిరుద్యోగులు ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు ర్యాలీగా వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు గ్రం థాలయానికి చేరుకొని గేట్లు మూసి వేసి తాళాలు వేశారు. విద్యార్థులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఘట నను మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థులపై ప్రభుత్వం ఇంత పాశవికంగా ప్రవర్తించడం దుర్మార్గం అన్నారు. ప్రజాపాలన అంటే ఇదేనా? ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. నాడు సిటీ సెంట్రల్ లైబ్రరీకి రాహుల్‌గాంధీని తీసుకెళ్లి ఓట్లు కొల్లగొట్టారని.. నేడు అదే లైబ్రరీకి పోలీసులను పంపించి విద్యార్థుల వీపులు పగులగొడుతున్నారని ఎద్దేవా చేశారు. విద్యార్థులపై జరుగుతున్న దమనకాండను ప్రభుత్వం వెం టనే ఆపాలన్నారు.

ఇవీ డిమాండ్లు..

- యూత్ డిక్లరేషన్‌లో భాగంగా తక్షణమే 2 లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి
- డీఎస్సీ వాయిదా వేసి మెగాడీఎస్సీతో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి
- గ్రూప్‌–2లో అదనంగా 2 వేల ఉద్యోగాలు, గ్రూప్‌–3లో అదనంగా 3వేల ఉద్యోగాలు కలపాలి
- గ్రూప్‌–1లో 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేయాలి
- తక్షణమే సమగ్ర కులగణన జరిపి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో మరో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చేరారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన గాలి అనిల్‌కుమార్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నీలం మధు, శశికళ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. గూడెం మహిపాల్‌రెడ్డి పార్టీ మారడంతో కాం గ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 10కి చేరింది. శాసనసభలో బీఆర్‌ఎస్ బలం 28కి పడిపోయింది.

గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలపై సీఎం రేవంత్‌రెడ్డి నోరు మెదపడం లేదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శిం చారు. పార్టీ నేతలు భిక్షమయ్యగౌడ్, పల్లె రవి కుమార్‌గౌడ్‌తో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాటాడారు. కాటమయ్య మోకుల పంపిణీ గత ప్రభుత్వం ప్రవేశపెట్టినా కోడ్ మూలంగా ఇవ్వలేకపోయా మన్నారు. వైన్, బార్ షాపుల్లో గౌడ కులస్తులకు కాంగ్రెస్ 25 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించినా నేటికీ అమలు కావడం లేదన్నారు. ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరిట నామకరణం వంటి హామీల మాటేమిటని ప్రశ్నించారు. కల్లు దుకాణాలకు శాశ్వత లైసెన్సులు, గీత కార్మికులకు రూ.10లక్షల పరిహారం, మోపెడ్‌లు వంటి హామీలను తక్షణమే నెరవేర్చాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

గీత కార్మికుల సంక్షేమానికి సర్కార్ కృషి భేష్

సాక్షి, హైదరాబాద్: కల్లు గీత వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న వారి సం క్షేమానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని కాంగ్రెస్ కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు నాగరాజుగౌడ్ అన్నారు. కల్లు గీత కార్మికులు అధునాతన పరికరాలు అందజేస్తున్నందుకు నాగరాజు ఆధ్వర్యం లో గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

ప్రణాళిక సిద్ధం చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుం డా త్వరగా ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. నివేదిక త్వరగా రూపొం దిస్తే రానున్న శాసనసభ సమావేశాలకు ముందే మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకుందామని చెప్పారు.

ఐదున్నర నెలల సమయం పడుతుంది: అధికారులు

కుల గణనకు ఇప్పటికే ఆమోదం తెలిపినందున, దాని ఆధా రంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందో చెప్పాలని సీఎం అడిగారు. ఈ దిశలో కసరత్తు పూర్తిచేసేం దుకు ఎంత సమయం పడుతుందని ప్రశ్నించారు. 2015లో కర్ణాటకలో, 2023లో బిహార్‌లో కుల గణన చేశారని, ఆంధ్ర ప్రదేశ్‌లో కుల గణన చేసినా వివరాలు ఇంకా బయటపెట్ట లేదని అధికారులు వివరించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కుల గణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందని చెప్పారు. దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కుల గణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, ఇతర అంశాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరిం చారు. వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేష న్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవ సానాలు తెలియజేశారు.

కాలక్రమ పట్టిక రూపొందించండి: సీఎం

పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటివరకు అనుసరించిన విధానాలపై కాలక్రమ పట్టిక రూపొందిం చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏవైనా సందేహాలు వస్తే సీనియర్ నేత జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకో వాలని చెప్పారు. చట్టపరమైన విషయాలను అడ్వకేట్ జన రల్‌తో చర్చించాలని సూచించారు. మిగతా రాష్ట్రాలు రిజ ర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సిం హ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, సీఎం సల హాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ తమ అభిప్రా యాలను వెల్లడించారు. సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచా యతీరాజ్ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్, న్యాయ శాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి పాల్గొన్నారు.

విపక్షాలు, నిరుద్యోగ యువతతో అఖిలపక్షాన్ని పిలవాలి

బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులు ఎదుర్కొం టున్న సమస్యలపై వెంటనే ప్రతిపక్ష పార్టీలు, నిరుద్యోగ యువతతో అఖిల పక్షం సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ ప్రధాన కార్యదర్శి డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ముందస్తు హౌస్ అరెస్టులు చేయించి మాజీ సీఎం కేసీఆర్ కంటే రెండింతల తప్పులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ గోడు వివరించేందుకు నిరుద్యోగులు సెక్రటేరియట్‌కి వస్తే వారిని అరెస్ట్ చేయించడం ఏమిటని ప్రశ్నించారు. సెక్రటేరియట్ చుట్టూ పోలీసులు ఉం టున్నారని, ఇదేమైనా పోలీస్ పాలనా అని ప్రశ్నించారు. గతం లో హౌస్ అరెస్టుల మీద మాట్లాడిన కోదండరాం, ఆకునూరి మురళి, హరగోపాల్ ఇప్పుడెందుకు మాట్లాడటం లేదన్నారు.

అన్ని కాలేజీలకూ న్యాక్ గుర్తింపు!

ఉన్నత విద్యా మండలి కసరత్తు

సాక్షి, హైదరాబాద్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు గల కాలేజీల సంఖ్య పెంచాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని పట్ట ణాల్లో ఉన్న డిగ్రీ కాలేజీలు న్యాక్ గుర్తింపు కోసం దరఖాస్తు చేసేలా ప్రత్యేక ప్రణాళికను రూపొందించనుంది. ఈ అంశంపై త్వరలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా ప్రమాణాలకు న్యాక్ గుర్తింపును కొలమానంగా పరిగణిస్తారు. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 1,159 డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిల్లో కేవలం 169 కాలేజీలకు మాత్రమే న్యాక్ గుర్తింపు ఉంది. ఇం దులో 30 కాలేజీలు హైదరా బాద్‌లోనే ఉన్నాయి. న్యాక్ గుర్తిం పు ఇవ్వాలంటే అందుకు తగిన విధంగా వసతులు విద్యా ప్రమాణాలు ఉండాలి. ఇందుకోసం దరఖాస్తు చేసిన కాలేజీలను న్యాక్ బృందాలు తనిఖీ చేస్తాయి. బోధనా సిబ్బం ది, మౌలిక సదుపాయాలు, గత కొన్నేళ్ళుగా విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్న తీరును పరిశీలిస్తాయి. బోధనా సిబ్బంది విషయంలో ప్రైవేటు కాలేజీలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంత కాలేజీలు వెనుకబడి ఉంటున్నాయి. వసతులు అంతంత మాత్రంగానే ఉం టున్నాయి. ఈ కారణంగా విద్యార్థుల ప్రవేశాలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తక్కువగా ఉంటున్నాయి. ఈ కాలేజీలకు నిధుల కొరత కూడా ఉంటోంది. ఈ కారణంగానే ఆయా కాలేజీలు న్యాక్ గుర్తింపు దిశగా అడుగులు వేయడం లేదు.

న్యాక్ ఉంటేనే దోస్త్‌లో...

భవిష్యత్తులో న్యాక్ గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే డిగ్రీ ప్రవేశాలు చేపట్టాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని, మార్పులు చేర్పులు చేసుకోవాలని సూచిస్తోంది. మరోవైపు న్యాక్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ముందుకొచ్చే కాలేజీలకు రూ.లక్ష వరకు ఆర్థిక తోడ్పాటు అందిస్తామని కౌన్సిల్ గత ఏడాది ప్రకటించింది. అయినా పెద్దగా స్పందన రాకపోవడంతో ఇక మీదట గుర్తింపు లేని కాలేజీల్లో నాణ్యమైన డిగ్రీ కోర్సులకు అనుమతి ఇవ్వకూడదని భావిస్తోంది.

నేడు ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిరుద్యోగుల ధర్నా..

ఉస్మానియా యూనివర్సిటీ: ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టనున్నట్టు నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్‌నాయక్ తెలిపారు. నిరు ద్యోగుల డిమాండ్లపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించలే దని, ఏఐసీసీ పెద్దల దృష్టికి సమస్యలను తీసుకెళ తామన్నారు. తెలంగాణ నుంచి ఢిల్లీకి చేరుకున్న 30 మంది నిరుద్యోగులు జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు పోలీసుల అనుమతి తీసుకున్నట్టు చెప్పారు. ధర్నా అనంతరం ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీని కలుస్తా మన్నారు.

కేసీఆర్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం నియమిం చిన విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. తెలం గాణ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన ఈ పిటిషన్ సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ముం దుకొచ్చింది. తొలుత కేసీఆర్ తరపు న్యాయవాది.. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేరంటూ పాస్‌ఓవర్ కోరారు. దీనికి ధర్మాసనం అనుమతిం చింది. బెంచ్‌ముందున్న మిగిలిన కేసుల విచారణ పూర్తయ్యేసరికి కోర్టు సమయం ముగిసే దశకు చేరుకుంది. సమయాభావం వల్ల కేసీఆర్ పిటిషన్ విచారణ చేపట్టలేమని, మంగళవారం విచారిస్తా మని సీజేఐ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో విద్యుత్ ఒప్పం దాలు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల నిర్మా ణాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచా రణ కోసం తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ నరసిం హారెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలి సిందే. ఈ కమిషన్‌ను రద్దు చేయాలని కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించగా ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో హైకోర్టు ఉత్త ర్వులను కేసీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

'పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలు నిర్వహించండి'

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత పోలీస్ అధికారుల సం ఘం తాత్కాలిక ప్రాతిపదికన ఉందని, దానిని రద్దు చేసి..నూతన సంఘం కోసం ఎన్నికలు నిర్వహిం చాలని కోరినట్టు పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర మాజీ కోశాధికారి జీఎస్.రాజు తెలిపారు. ఈ మేరకు డీజీపీ జితేందర్, అడిషనల్ డీజీ పర్సనల్ విజయ్‌కుమార్‌లకు సోమవారం వారి కార్యాల యాల్లో వేర్వేరుగా వినతిపత్రాలు ఇచ్చినట్టు తెలి పారు. పోలీసు అధికారుల సంఘానికి సంబంధిం చిన బైలాస్ ప్రభుత్వం వద్దకు వెళ్లాయని, అవి రాగానే త్వరలోనే ప్రస్తుత సంఘాన్ని రద్దు చేసి ఎన్నికలు నిర్వహిస్తామని ఇద్దరు అధికారులు హామీ ఇచ్చినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో జంగయ్య,జనార్దన్, సుభాష్, అప్ప లసూరి, నాగరాజు, నరేందర్, ఉమ, చంద్ర శేఖర్ రెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్, మల్లేష్, శ్రీని వాస్, జనార్దన్, నర్సింహ,భాస్కర్, చలం పాల్గొన్నారు



> ఉన్న జీవితాన్ని ఆనందించలేకపోవడం,
> అయినప్పటికీ మృత్యువును ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు భయపడటం...
> రెండింటిలో లోతైన వైరుధ్యం ఉంది.
> – యోషిదా కెంకో

సాక్షి

మంగళవారం, 16 జూలై 2024

మారకుంటే... ముప్పు

రక్తసిక్త అమెరికా రాజకీయ చరిత్రలో కొత్త పేజీ అది. అమెరికా దేశాధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా నేడో రేపో అధికారికంగా ఖరారవుతారని భావిస్తున్న మాజీ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌పై పెన్సిల్వేనియా రాష్ట్రంలోని బట్లర్ వద్ద శనివారం జరిగిన కాల్పులు, హత్యాయత్నంతో అగ్రరాజ్యమే కాదు... యావత్ ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఓ ఎన్నికల ర్యాలీలో చేసిన ఈ దాడిలో దుండగుడి తుపాకీ తూటా ట్రంప్ కుడి చెవి పైభాగాన్ని రాసుకుంటూ, రక్తగాయం చేసి పోయింది. నిఘా వర్గాల భద్రతా వైఫల్యాన్ని బట్టబయలు చేసిన ఈ ఘటనలో అదృష్టవశాత్తూ ఆయన బయట పడ్డారు. ఎన్నికల బరిలో ట్రంప్‌కు ప్రధాన పోటీదారైన ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ సహా ప్రపంచ దేశాల నేతలందరూ ఈ దాడిని ఖండించారు. దాడికి పాల్పడిన ఇరవై ఏళ్ళ వ్యక్తిని భద్రతా దళాలు మట్టుబెట్టారన్న మాటే కానీ, ఈ దుశ్చర్య వెనుక అసలు కారణాలు లోతైన దర్యాప్తులో గానీ వెలికిరావు. తాజా దాడి ఘటనతో అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయావకాశాలు పెరుగుతాయని ఓ అంచనా. అది నిజం కావచ్చు. కానీ, అంతకన్నా కీలకమైనది ఇంకోటుంది. ప్రపంచంలోని అతి ప్రాచీన ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకొనే నేలపై ఆ స్ఫూర్తి వెనకపట్టు పట్టి, హింసాకాండ చెలరేగుతోంది. అమెరికా సమాజమే కాదు... ప్రపంచమంతా ఆందోళన చెందాల్సిన విషయమిది.

అమెరికాలో నేతలపై దాడులు, హత్యాయత్నాలు ఇదే తొలిసారి కాదు. గతంలో అబ్రహామ్ లింకన్, జాన్ ఎఫ్. కెనడీ సహా నలుగురు దేశాధ్యక్షులు దుండగుల దుశ్చర్యలకు బలయ్యారు. రీగన్, థియోడర్ రూజ్‌వెల్ట్ లాంటి వాళ్ళు ప్రాణాలతో బయటపడ్డారు. అయితే, తాజా ఘటన జనంలో మునుపెన్నడూ లేని రీతిలో పేరుకున్న అణిచిపెట్టుకున్న ఆగ్రహానికీ, చీలికకూ ప్రతీకగా కనిపిస్తోంది. ఇంకా చెప్పాలంటే, ట్రంప్‌పై హత్యాయత్న ఘటన జరిగిన కొద్ది గంటల తరువాత కూడా అమెరికాలో రాజకీయ భాష రెచ్చగొట్టే విధంగా సాగడం విషాదం. ఘటన జరిగిన మూడు గంటలకే రక్తసిక్తమైన ట్రంప్ పిడికిలి బిగించిన ఫోటోలతో టీషర్టులు ఆన్‌లైన్‌లో అమ్మకానికి వచ్చేశాయి. ఈ జగడాలమారి వైఖరిని చూస్తుంటే, అగ్రరాజ్యంలో నేతలు పాఠాలు నేర్చుకున్నట్టు లేదు. విలువలు మరచిన మాటల దాడితో వేడెక్కుతున్న ఎన్నికల వాతావరణంలో ప్రజల్లో తీవ్రమైన ఇష్టానిష్టాలు ప్రబలి, పరిస్థితి ఎక్కడి దాకా పోయే ప్రమాదం ఉందో చెప్పడానికి ట్రంప్‌పై దాడి తార్కాణం. ఎన్నికలను యుద్ధంలా, రక్తం చిందించైనా సరే గెలవడమే పరమావధిగా భావించడం అతి పెద్ద తప్పు. ఇది అమెరికాయే కాక ప్రజాస్వామ్య దేశాలన్నీ విస్మరించలేని పాఠం.

ఈ పాపంలో అన్ని పార్టీలకూ భాగం ఉంది. అనేక జాతులు, తెగలతో కూడిన అమెరికా రాజకీయ వ్యవస్థలో విభేదాలు సహజమే. కానీ, ట్రంప్ మళ్ళీ పగ్గాలు చేపడితే అది అమెరికాకు విలయమేనంటూ డెమొక్రాట్లు ప్రచారం సాగిస్తూ వచ్చారు. రిపబ్లికన్లు, ట్రంప్ సైతం సైద్ధాంతికంగా దిగజారుడుతనంలో తక్కువ తినలేదు. అమెరికాలో ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ప్రతీకగా దేశ చట్టసభకు పీఠమైన యూఎస్ క్యాపిటల్ భవనాన్ని చుట్టుముట్టి, 2021 జనవరి 6న ట్రంప్ అనుకూల మూకలు యథేచ్ఛగా వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్య సౌధంలో ప్రమాద ఘంటికలు మోగాయి. తాజా హత్యాయత్నానికి డెమోక్రాట్లు, బైడెన్‌ల ప్రచార ధోరణే కారణంటూ ట్రంప్ సహచరులు విరుచుకుపడుతున్నారు. ఒక్కమాటలో... అగ్రరాజ్యమనీ, భూతల స్వర్గమనీ అనుకొనే అమెరికాలో పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. పెరుగుతున్న హింసాత్మక ధోరణులు, పార్టీల వారీగా నిలువునా చీలిపోయిన జనం, ఆగని రాజకీయ హింస అక్కడి సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి. ఆ దేశంలో తుపాకీ సంస్కృతి పెను సర్పమై బుసలు కొడుతోంది.

అమెరికాలో తుపాకీలు బజారులో అతి సులభంగా కొనుక్కోవచ్చన్నది జగమెరిగిన సత్యం. అమెరికా రాజ్యాంగ ప్రకారం ఆత్మరక్షణార్థం ఆయుధాలు కలిగివుండే హక్కు పౌరులకుంది. అమెరికా వయోజనుల్లో ప్రతి పది మందిలో నలుగురింట్లో తుపాకులున్నాయి. చిత్రమేమిటంటే, 2023 జూన్ నాటి ప్యూ రిసెర్చ్ సెంటర్ సర్వే ప్రకారం తుపాకీ చేతిలో ఉంటే చట్టాన్ని పాటించే పౌరులుగా తమను తాము కాపాడుకోవచ్చని నూటికి 49 మంది అమెరికన్లు భావిస్తున్నారు. మరోమాటలో అమెరికన్ సమాజానికి దేశ శాంతి భద్రతలపై అంతటి అపనమ్మకం ఉందనుకోవచ్చు. మరి, పౌరుల చేతిలోని ఈ ఆయుధాలు తప్పులు చేసేవారి చేతుల్లో పడితే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. దేశంలో పాఠశాలలు, వాణిజ్యభవన సముదాయాల్లో విచక్షణారహితమైన కాల్పుల ఘటనల నుంచి తాజా హత్యాయత్నం దాకా అనేక సంఘటనలే అందుకు సమాధానాలు. తుపాకీలపై నియంత్రణలున్నంత మాత్రాన ఈ ఘటనలు జరగవని కాదు కానీ, లేనప్పుడు జరిగే అవకాశాలు ఇంకా ఎక్కువని ప్రత్యేకించి చెప్పనక్కర లేదు.

ప్రస్తుతం అమెరికా ముందు, ఆ దేశ రాజకీయ నేతలు, పార్టీలు, ప్రజల ముందు ఓ పెను సవాలుంది. అంతకంతకూ దిగజారుతున్న పరిస్థితులు, పేట్రేగుతున్న రాజకీయ విద్వేషం, హింసలకు అడ్డుకట్ట వేయాల్సింది వారే. అన్ని పక్షాలూ కళ్ళు తెరిచి, ఈ పతనాన్ని నివారించాలి. అతివాదాన్ని నిరసించాలి. ఎన్నికల ప్రచారంలో పరస్పర గౌరవంతో సైద్ధాంతిక చర్చలే అనుసరణీయ మార్గమన్న తమ మౌలిక సూత్రాలనే మళ్ళీ ఆశ్రయించాలి. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదనీ, ఎన్నికలొక్కటే సామాజిక, రాజకీయ సమస్యలన్నిటికీ పరిష్కారమని ఓటర్లు తమ తీర్పు ద్వారా మరోసారి చాటాలి. అలా కాక, ఇలాంటి ఘటనల్ని వాటంగా చేసుకొని ఎవరికి వారు మరింత రెచ్చగొట్టుడు ధోరణికి దిగితే కష్టం. అది ప్రజాస్వామ్య వ్యవస్థకే పెను ప్రమాదం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, **తిథి:** శు.దశమి సా.5.05 వరకు, తదుపరి ఏకాదశి,
నక్షత్రం: విశాఖ రా.11.57 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** లేదు,
దుర్ముహూర్తం: ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** ప.2.31 నుండి 4.12 వరకు,
కర్కాటక సంక్రమణం, దక్షిణాయన ప్రారంభం.

సూర్యోదయం : 5.37
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సభాపతులే పక్షపాతం ప్రదర్శిస్తే..!

విశ్లేషణ



అజయ్ కె మెహ్రా

స్వరాజ్ పార్టీతో తన సంబంధాలను తెంచుకోవడం ద్వారా స్పీకర్ స్థానానికి విఠల్‌భాయ్ పటేల్ ఆరోగ్యకరమైన ప్రారంభాన్ని ఇచ్చారు. 1946లో సెంట్రల్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైనప్పుడు, జి.వి. మావలంకర్ 'కాంగ్రెస్‌వాడిని అయినప్పటికీ... నిష్పక్షపాతంగా వ్యవహరించడం, పార్టీకి చెందిన అన్ని అంశాలకు అతీతంగా ఉండటం నా కర్తవ్యం' అన్నారు. 1956లో స్పీకర్ పదవిని చేపట్టడం కోసం, ఎం.ఏ. అయ్యంగార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. 1970ల నాటికి లోక్‌సభ స్పీకర్ నిష్పాక్షికత బలహీనపడటం మొదలైంది. ఇక ప్రస్తుత లోక్‌సభ, రాజ్యసభల్లోని ప్రిసైడింగ్ అధికారులిద్దరూ తమ పార్టీ ఆదేశాల మేరకు భారత పార్లమెంటరీ సంప్రదాయాలను తుంగలో తొక్కడం ద్వారా, వెస్ట్ మినిస్టర్ సంప్రదాయాలకు కళంకం తెస్తున్నారు.

స్పీకర్ అన్ని ఆచరణాత్మక ప్రయోజనాల కోసం నిష్పక్షపాతంగా ఉంటారు. అన్ని అంశాలను నిర్ణయించే ముఖ్యమైన న్యాయపరమైన విధులను స్పీకర్‌కు సభ వదిలివేయవచ్చు.

– సర్ ఐవర్ జెన్నింగ్స్,
పార్లమెంట్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్, 1957

18వ లోక్‌సభ మొదటి సెషన్ జూన్ 24న సమావేశమైనప్పుడు, బీజేపీ మెజారిటీని కలిగి ఉన్న 16వ, 17వ లోక్‌సభలలో రాజకీయ పార్టీలు విడిచిపెట్టిన చోట నుండే పక్షపాతం తిరిగి ప్రారంభమైంది. సహజంగానే, లోక్‌సభ స్పీకర్‌కు పోటీ, 'ఎన్నిక', సభ తదుపరి కార్యకలాపాల నిర్వహణ వంటివి 'నిష్పక్షపాతానికి' చాలా దూరంగా ఉన్నాయి. బ్రిటిష్ పార్లమెంట్ గురించిన తన విశిష్ట అధ్యయనంలో సర్ జెన్నింగ్స్ ఇలాంటి స్థితి గురించి వివరంగా నమోదు చేశారు.

వాస్తవానికి, రాజ్యాంగానికి తగిన గౌరవం ఇవ్వకపోగా, దాని సంప్రదాయాన్ని కూడా పక్కనపెట్టి, పార్లమెంటును తన కట్టడిలోనే పనిచేసేలా చూస్తామని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ నొక్కి చెప్పింది. లోక్‌సభ, శాసనసభలలో రాజ్యాంగం అమలైనప్పటినుండి కొత్తగా ఎన్నికైన ఎంపీల చేత ప్రమాణ స్వీకారం చేయించడానికి, సభలోని అత్యంత సీనియర్ సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా నియమించే వెస్ట్‌మినిస్టర్ నమూనాకి చెందిన పురాతన సంప్రదాయానికి ఈసారి తిలోదకాలు ఇచ్చేశారు. సంప్రదాయం ప్రకారమైతే ఆ పదవిని కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ ఎంపీకి కేటాయించాల్సి ఉండింది. కానీ ఈసారి పార్లమెంటులో బీజేపీకి చెందిన రెండో సీనియర్ సభ్యునికి ప్రొటెం స్పీకర్ పీఠం దక్కింది.

సహజంగానే, 'మా ఎంపికను అంగీకరించడమే ఏకాభిప్రాయం' అనే రాజకీయ ప్రకటనలో, ఏకాభిప్రాయం కోసం ఏదైనా ప్రతిపక్ష సూచనను ఆశించే, ఆమోదించే అవకాశమే లేదు. ఈ ఏడాది లోక్‌సభలో మోదీ నేతృత్వంలోని బీజేపీ సంపూర్ణ మెజారిటీని ప్రజలు లాక్కుని ఆ పార్టీ బలాన్ని 303 సీట్ల నుంచి 240కి తగ్గించారు. ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ ఏర్పర్చుకున్న కొత్త మిత్రుల దన్నుతో 293 మంది ఎంపీలతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ 99 సీట్లతోనూ, విస్తృత ప్రాతిపదికన 'ఇండియా' కూటమి 234 సీట్లతోనూ తిరిగి రావడం వల్ల, తమను తాము నొక్కి చెప్పుకోగల ప్రతిపక్షంతో, ట్రెజరీ బెంచ్‌లను సర్దుబాటు చేసే కథను పూర్తి చేశాయి. ప్రతిపక్ష నేత కార్యాలయం రాహుల్ గాంధీని ముందుకు నడిపింది.

ఏది ఏమైనప్పటికీ, స్పీకర్ పదవికి పోటీని మొదట ప్రతిపాదించినప్పటికీ, భారతదేశం ఎక్కువగా అనుసరించే వెస్ట్‌మినిస్టర్ సంప్రదాయం ప్రకారం ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవిని కేటాయి



స్తారని ఆశించిన ఇండియా కూటమి... ఎన్డీఏ ఎంపిక మేరకు (మోదీ ఎంపిక అని భావించాలి) మునుపటి స్పీకర్ ఓం బిర్లాకు మద్దతు ఇచ్చింది. కానీ ప్రతిపక్షాలకు ఈ ప్రత్యేక పదవిని నిరాకరించడానికి, పదేళ్లపాటు ఆ స్థానాన్ని ఖాళీగా ఉంచారు. దీనిపై ఇప్పటికీ మౌనం కొనసాగించడం అరిష్టదాయకం అనే చెప్పాలి.

హౌస్ ఎక్స్–అఫీషియో చైర్మన్ అయిన భారత ఉపరాష్ట్రపతిని ఒక వ్యవస్థ ఎన్నుకున్నప్పుడు రాజ్యసభ ప్రిసైడింగ్ అధికారి ఎవరనే ప్రశ్న పరిష్కరించబడుతుంది. దీనిని తప్పనిసరి చేసే ఆర్టికల్ 89, సభ్యుల నుండి డిప్యూటీ చైర్మన్ ఎన్నికను కూడా తప్పనిసరి చేస్తుంది. ప్రతిపక్షాలకు ఈ పదవిని కల్పించేందుకు రాజ్యాంగపరమైన నిబంధన కానీ, సంప్రదాయం కానీ లేవు. అయితే, 1952 నుండి అనేక సందర్భాల్లో ప్రతిపక్ష ఎంపీ ఈ పదవిని అలంకరించారు.

'ఒకసారి స్పీకర్‌ను నియమించిన తర్వాత, ఆయన తన పార్టీ స్వభావానికి దూరంగా ఉంటాడనీ, అలాగే తనను నియమించిన వారిని సమర్థించకుండా ఉంటాడనీ' బ్రిటన్ సంప్రదాయాలు స్పష్టంగా సూచిస్తున్నాయి.

స్వరాజ్ పార్టీతో తన సంబంధాలను విఠల్‌భాయ్ పటేల్ తెంచుకున్నప్పుడు, 1926లో తన పార్టీ శాసనసభ్యులతోపాటు వాకవుట్ చేయడానికి నిరాకరించినప్పుడు వెస్ట్ మినిస్టర్ వ్యవస్థ సంప్రదాయాలకు కట్టుబడి భారతదేశం ఆరోగ్యకరమైన అభ్యాసాన్ని ప్రారంభించింది. విఠల్‌భాయ్ పటేల్ 1927లో కూడా ఈ సంప్రదాయాన్ని అనుసరించారు. 1946లో సెంట్రల్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైనప్పుడు, జి.వి.మావలంకర్ ఇలా అన్నారు: "కాంగ్రెస్‌వాడిని అయినప్పటికీ, నిష్పక్షపాతంగా వ్యవహరించడం, పార్టీకి చెందిన అన్ని అంశాలకు అతీతంగా ఉండటం నా కర్తవ్యం". 1956 మార్చిలో స్పీకర్ పదవిని చేపట్టడం కోసం, ఎంఏ అయ్యంగార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.

సర్దార్ హుకుమ్ సింగ్ (1962 నుండి 1967 వరకు లోక్‌సభ స్పీకర్) కూడా తనకు తానుగా ఆరోపణలకు దూరంగా ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ స్పీకర్ పదవికి ఎన్నిక కావడానికి, అధికారంలో ఉన్న లేదా మెజారిటీ పార్టీపై ఆధారపడటం వల్ల పాలక పార్టీల ఆజ్ఞలకు అతడు/ఆమె కట్టుబడాల్సి ఉంటుందనే విషయాన్ని ఆయన గమనించారు. అందుకే 1970ల నాటికి లోక్‌సభ స్పీకర్ నిష్పాక్షికత కాస్త బలహీనపడటంలో ఆశ్చర్యం లేదు. సోమనాథ్ ఛటర్జీ (2004–09) తన నిష్పాక్షికతతో స్పీకర్ కార్యాలయాన్ని ఉన్నతీకరించగా, బలి రామ్ భగత్, బలరామ్ జాఖడ్ వంటి కొందరు స్పీకర్ బాధ్యతలు ముగిసిన తర్వాత తిరిగి కేంద్ర మంత్రివర్గంలో చేరి పనిచేశారు.

ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత ఇద్దరూ స్పీకర్ కుర్చీ వద్దకు ఓం బిర్లాను తీసుకువెళ్లినప్పుడు, ఆయన మోదీ ముందు వంగి కరచాలనం చేయడం, తరువాతి ప్రతిపక్ష నేత వద్ద నిటారుగా నిలబడటం ద్వారా తన విధేయత ఎవరి పట్ల ఉందనే విషయాన్ని స్పష్టం చేశారు. జూన్ 27న శశి థరూర్ 'జై సంవిధాన్' అని చెప్పడం ద్వారా ఎంపీగా తన ప్రమాణ స్వీకారం ముగించినప్పుడు ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కీర్తిస్తూ ప్రమాణం చేయడానికి అభ్యంతరం ఎందుకు అని దీపేందర్ హుడా అడిగినప్పుడు, బిర్లా ఆయన్ని ఆక్షేపించి కూర్చోవాల్సిందిగా కోరారు. ఇది స్పష్టంగానే నిశ్చితమైన పక్షపాతానికి సంకేతం.

స్పష్టంగా ప్రధానమంత్రి సూచనల మేరకు, 1975 నాటి ఎమర్జెన్సీని ఖండిస్తూ బిర్లా చేసిన తీర్మానం, ఆయన పార్టీ విధేయతకు తిరుగులేని సంకేతం. లోక్‌సభకు సంబంధించిన రూల్స్ అండ్ ప్రొసీజర్‌లోని రూల్ 380 కింద ప్రధాని, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై రాహుల్ గాంధీ చేసిన విమర్శనాత్మక వ్యాఖ్యలను కూడా ఆయన తొలగించారు. కొన్ని వివాదాస్పద బిల్లులను అడ్డంకులు లేకుండా ఆమోదించడం కోసం 17వ లోక్‌సభలో 100 మంది ప్రతిపక్ష ఎంపీలను బహిష్కరించిన ఈ వ్యక్తి, అధికార పక్షానికి తన విధేయతను ప్రదర్శించారు.

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కూడా ద్వంద్వ పాత్రను పోషిస్తూ, గత పార్లమెంటులో బిల్లులను ఆమోదించడం కోసం 46 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. ప్రతిపక్ష ఎంపీలకు మాట్లాడటానికి సమయం నిరాకరించడం, వారు ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని అడ్డుకోవడం ద్వారా ధన్‌ఖడ్ రాజ్యసభ కార్యకలాపాలను నిర్వహించడంలో పక్షపాత వైఖరిని కొనసాగిస్తున్నారు.

పార్లమెంటులోని ప్రిసైడింగ్ అధికారులిద్దరూ తమ పార్టీ ఆదేశాల మేరకు భారత పార్లమెంటరీ సంప్రదాయాలను తుంగలో తొక్కడం ద్వారా, వెస్ట్ మినిస్టర్ సంప్రదాయాలకు కళంకం తెస్తున్నారు.

వ్యాసకర్త రాజకీయ శాస్త్రవేత్త
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



కుళ్లు వ్యవస్థ



చాలామంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తమ సోషల్ మీడియా అకౌంట్లను డిలీట్ చేస్తున్నారు. ఈ వ్యవస్థ ఎంత కుళ్లిపోయిందో ఊహించుకోండి. (తప్పుడు ధ్రువీకరణలతో ఒక అధికారిణి ఐఏఎస్ అయ్యిందన్న కథనాల నేపథ్యంలో.)

– మింటీ శర్మ, వ్యాఖ్యాత

ఏదైనా చెప్పొచ్చు!



మెషిన్ లెర్నింగ్‌కు సంబంధించిన దశాబ్దాల విలువైన గణితం, ప్రాతిపదిక అవగాహనలను విస్మరించి... సాధారణీకృత కథనాలతో మిమ్మల్ని వేలమంది నమ్మేట్లు చేసుకోగలిగే ఒకే ఒక్క వేదిక ట్విట్టర్.

– మరీయా ఐ. వాసిలీవా, ఏఐ సైంటిస్ట్

దేవుడి మీద కాక...



యూకే పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీల్లో 40 శాతం మంది దేవుడి మీద ప్రమాణం చేయడాన్ని ఎంపిక చేసుకోలేదు. ఇందులో ప్రధాని, క్యాబినెట్‌లోని 50 శాతం మంది మంత్రులు కూడా ఉన్నారు. తాజా బ్రిటిష్ సామాజిక వైఖరుల సర్వే ప్రకారం, 53 శాతం మంది జనాలు మతంతో ముడిపడిలేమని వెల్లడించారు. 2021 జనగణనలో ఇలాంటివారి సంఖ్య 37 శాతం మాత్రమే. ప్రపంచంలో మతాచరణ అతి తక్కువగా ఉన్న దేశాల్లో యూకే ఒకటి.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

తీవ్ర అడ్డంకి



స్వర్గాన్ని తలపించే లోయలు, సహజమైన ఊటలు, దట్టమైన అడవులు ఉండే వజీరిస్తాన్(పాకిస్తాన్) పర్యాటకులు కోరుకునే అత్యుత్తమ ప్రదేశం. కానీ తీవ్రవాదం వల్ల దాన్ని ప్రపంచపు కళ్ల నుంచి దాచి వుంచారు.

– ఐమా ఖాన్, మానవ హక్కుల కార్యకర్త

కలిసి పనిచేద్దాం!



మీ హృదయపూర్వక అభినందనలకు ధన్యవాదాలు (భారత) ప్రధాని నరేంద్ర మోదీ! మన పరస్పర లబ్ధి కోసం నేపాల్– ఇండియా సంబంధాలను బలోపేతం చేసేందుకు మీతో సన్నిహితంగా పనిచేయడానికి కట్టుబడి ఉన్నాను. మనం ఉమ్మడిగా మన చారిత్రక సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చగలం.

– కె.పి. శర్మ ఓలి, నేపాల్ ప్రధాని

అదా విజయం?



దేశానికి 'అచ్ఛే దిన్' తెస్తాననీ, కోటి ఉద్యోగాలతో ఇండియాను 'అమృత్ కాల్'లోకి నడిపిస్తాననీ వాగ్దానం చేసిన మోదీ మూడోసారి ప్రధానిగా ఉన్నారు. ఇప్పుడు మోదీకి 'ఎక్స్'లో 10 కోట్ల మంది ఫాలోవర్స్ వచ్చిన విజయాన్ని ఆయన తాలుకు అపఖ్యాత ఐటీ సెల్ ఉత్సవం చేస్తోంది. ఇన్‌ఫ్లుయెన్సరా, ప్రధానా?

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్

తుపాకుల సంగతి?



అమెరికాలో ఏ మూర్ఖుడైనా ఇట్టే ఒక సెమీ–ఆటోమేటిక్ రైఫిల్ సంపాదించగలడు కాబట్టే డొనాల్డ్ ట్రంప్ దాదాపుగా హత్యకు గురయ్యారు. తుపాకుల హింస కారణంగా అమెరికాలో ప్రతీ ఏడాది 40 వేల మంది చనిపోతున్నారు. అయినా ఈ మూల కారణం గురించి ఎవరూ పట్టించుకుంటున్నట్టు లేదు. ఆయుధ మాఫియాను నియంత్రించడానికి ట్రంప్ గానీ, బైడెన్ గానీ పెద్దగా ఏమీ చేయలేదు.

– ధ్రువ్ రాఠీ, యూట్యూబర్

తిరుగుబాటు వీరుడు

తెలుగు నేలపై 1857లో మొదటి స్వాతంత్ర్య పోరాటానికి తెరలేపి అసువులు బాసిన రొహిల్లా వీరుడు తుర్రాబాజ్ ఖాన్. నాటికి నిజాం రాజ్యంలో, దేశం మొత్తంలో సంభవిస్తున్న రాజకీయ పరిణామాలకు ప్రభావితుడైన అతడు పలు బ్రిటిష్ వ్యతిరేక కార్యకలాపాల్ని గుల్బర్గా వంటి ప్రాంతాల్లో చేపట్టాడు. అందుకు కఠిన శిక్షలూ అనుభవించాడు. 1857 జూలై 17న హైదరాబాద్‌లోని మక్కా మసీదు దగ్గర జరుగుతున్న రహస్య సమావేశానికి హాజరయ్యాడు. మౌల్వీ సయ్యద్ అల్లాఉద్దీన్ కోఠీలో ఉన్న బ్రిటిష్ రెసిడెన్సీని ముట్టడించాలని పిలుపునిచ్చాడు. తానూ ఈ ముట్టడిలో పాల్గొనడానికి అంగీకరించి గుర్రంపై శరవేగంగా బేగం బజారుకు వెళ్లాడు తుర్రాబాజ్. అప్పటికప్పుడు దాదాపు 5 వేల మంది రోహిల్లాలూ, అరబ్బులూ, ఇతరులనూ సమకూర్చుకొని రెసిడెన్సీ వైపుకు కదిలాడు.



తుర్రాబాజ్ ఖాన్

మౌల్వీ సయ్యద్ అల్లా ఉద్దీన్ కూడా తన అనుచర గణంతో పుత్లీ బౌలి మీదుగా పయనించి రెసిడెన్సీ నైరుతి కొన ప్రాంతానికి చేరుకొన్నాడు.

తుర్రాబాజ్, అల్లా ఉద్దీన్‌ల నాయకత్వంలోని ఉద్యమకారులు తొలుత రెసిడెన్సీ పశ్చిమ గోడకు ఎదురుగా గల అబ్బన్ దాస్, జై గోపాల్ దాస్‌ల రెండు పెద్ద గృహాలను, దిల్‌షుక్ గార్డెన్‌ను స్వాధీన పరచుకొని రెసిడెన్సీని ముట్టడించారు. రెండు గేట్లను ధ్వంసం చేశారు. కానీ బ్రిటిష్ వారి ప్రతిఘటనతో అబ్బన్, జై గోపాల్ ఇండ్లపైకి చేరుకొని తుపాకీలతో పోరాటం ఆరంభించారు. 1857 జూలై 17 సాయంత్రం 6.30 గంటలకు మొదలైన ముట్టడి తెల్లవారు జామున 4 గంటల వరకు కొనసాగింది. ఈ పోరాటంలో పలువురు మరణించడం, బంధీలవ్వడంతో అదనపు బలగాలు సేకరించడానికై తుర్రాబాజ్, అల్లా ఉద్దీన్‌లు అక్కడి నుంచి నిష్క్రమించారు. ఈ ప్రయత్నంలో ఉండగానే జూలై 22న అషూర్ ఖానా సమీప అడవుల్లో బ్రిటిష్ సైనికులకు చిక్కాడు తుర్రాబాజ్ ఖాన్. అండమాన్ దీవుల్లో జీవితాంతం ఖైదీగా ఉండాలని హైదరాబాద్ కోర్టు తీర్పు చెప్పింది. కానీ, అతడు 1858 జనవరి18న జైలు నుండి తప్పించుకొన్నాడు. చివరకు, కుర్బాన్ అలీ నేతృత్వంలోని సాయుధ బలగాలు 1859 జనవరి 23న తూప్రాన్ దగ్గర అతడిని చంపేశాయి. గులాం హైదర్, బాబూలాల్ వంటి వారి రక్షణలో ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చి బేగం బజార్‌లోని ఆయన ఇంటి సమీపంలోని చెట్టుకు వేలాడదీశారు. అల్లా ఉద్దీన్‌ను కూడా నాటి ఇబ్రహీం పట్నం తాలూకాలోని మంగల్‌పల్లిలో పట్టుకుని అండమాన్ పంపారు. ఇలాంటి వీరుల గురించి భావి తరాలకు చెప్పవలసిన బాధ్యత మనదే!

– దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత చరిత్రాచార్యులు
(రేపు బ్రిటిష్ రెసిడెన్సీని ముట్టడించిన రోజు)

సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయాలి!

అభిప్రాయం



డా॥ ఎ. కుమార స్వామి

ప్రాదేశిక సమగ్రత, అభివృద్ధికి కొన్ని ప్రాంతాల్లో ఉన్న దేశాలు సభ్యదేశాలుగా ప్రత్యేక సంస్థలు ఏర్పడ్డాయి. అటువంటివాటిలో ఒకటి షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్సీఓ). ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రాంతీయ సంస్థగా గుర్తింపు పొందింది. సుమారుగా 40 శాతం జనాభా, 20 శాతం జీడీపీని ఈ ఎస్సీఓ సభ్య దేశాలు కలిగి ఉన్నాయి.

ఎస్సీఓ 1996లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, కజకిస్తాన్, కిర్గిజ్‌స్తాన్, రష్యా, తజికిస్తాన్ వంటి ఐదు దేశాలతో ఏర్పాటు చేశారు. తర్వాత ఉజ్బెకిస్తాన్, భారతదేశం, పాకిస్తాన్, ఇరాన్, బెలారస్‌లు క్రమంగా చేరుతూ రావడంతో ప్రస్తుతం దీని సభ్య దేశాల సంఖ్య పదికి చేరుకుంది. ఎస్సీఓ ప్రధాన కార్యాలయం చైనా రాజధాని బీజింగ్‌లో ఉంది. ఈ సంస్థ యురేషియా (ఆసియా, యూరప్) ప్రాంతాల్లో తీవ్రవాదం, వేర్పాటువాదాలను నిర్మూలించడానికి... రాజకీయ, ఆర్థిక, వ్యాపార, రక్షణ, శాంతి భద్రతల అంశాల్లో సహకారం కోసం ఈ సంస్థ కృషి చేస్తోంది. అందుకే దీన్ని యురేషియన్ పొలిటికల్, ఎకనామిక్, సెక్యూరిటీ కూటమిగా చెప్పవచ్చు.

ఈ ఏడాది జూలై 3, 4 తేదీల్లో మధ్య ఆసియా దేశమైన కజకిస్తాన్ రాజధాని ఆస్తానాలో షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ 24వ సమావేశం జరిగింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, మన దేశ విదేశాంగ మంత్రి జయ శంకర్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ భద్రత, స్థిరత్వాలను మెరుగుపరచడం; ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని పెంపొందించడం; సాంస్కృతిక, మానవతా సహకారాన్ని ప్రోత్సహించడం; పర్యావరణ సంబంధిత సమస్యలను, సవాళ్లను పరిష్కరించడం; డిజిటల్ సేవలు, ప్రాంతీయ రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేయడం;



సంస్థ సభ్యత్వాన్ని విస్తరించడం వంటి అంశాలపై చర్చించింది.

ఎస్సీఓలో భారత్ కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి మోదీ హాజరు కాకపోవడాన్ని కొందరు విమర్శించారు. ఎస్సీఓ నుంచి భారతదేశం వైదొలుగుతుందనడానికి సంకేతంగా దీన్ని చైనా మీడియా వక్రీకరించింది. నిజానికి మన దేశంలో సార్వత్రిక ఎన్నికల తర్వాత మొదటిసారిగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ప్రధానమంత్రి ఎస్సీఓకు హాజరు కాలేకపోయారు. నరేంద్ర మోదీ 'సెక్యూర్' ప్రసంగాన్ని మన దేశ విదేశాంగ మంత్రి జైశంకర్ చదివి వినిపించారు. జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. భారతదేశ వాస్తవాధీన రేఖను చైనా గౌరవించాల్సిన అవసరం ఉందని జైశంకర్ ప్రకటించారు.

2023 నాటికి ఎస్సీఓ ముఖ్యంగా భద్రతకు సంబంధించిన అంశాలపై దృష్టి కేంద్రీకరించింది. ఈ సంస్థ ఎటువంటి వాస్తవ సంఘర్షణలలో సైనిక సహాయాన్ని అందించలేదు. అయితే, 2017 నుండి తీవ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని, సమన్వయాన్ని ప్రోత్సహించడానికి సభ్య దేశాల మధ్య సైనిక విన్యాసాలు మాత్రం జరుగుతున్నాయి. 2023లో ఆర్థిక సహకారాన్ని పెంపొందించడానికి ఒప్పందంపై సభ్యదేశాలు సంతకం చేశాయి. స్వేచ్ఛా వాణిజ్యాన్ని స్థాపించాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని ప్రతిపాదించారు.

యురేషియా ప్రాంతాలలో శాంతి సౌభ్రాతృత్వాలను నెలకొల్పుతూ, తీవ్రవాదాన్ని నియంత్రించడానికి ఏర్పడ్డ ఎస్సీఓ సభ్య దేశాల మధ్యే తరచూ ఉద్రిక్తతలు రేకెత్తుతుండటం విమర్శలకు దారి తీసింది. భారత్ – చైనాల మధ్య సరిహద్దుల సమస్య, భారత్ – పాకిస్తాన్‌ల మధ్య ఉన్న వేర్పాటువాద, ఉగ్రవాద సమస్యలపై ఉన్న వివాదాలు; కజకిస్తాన్– తజికిస్తాన్ సరిహద్దు సమస్య వంటివి పరిష్కారమైతేనే ఈ ప్రాంతంలో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ ఏడాది సమావేశాలు ఆ దిశలో ముందడుగు వేయాలి.

వ్యాసకర్త పోలీస్ పరిశోధన – అభివృద్ధి సంస్థ పూర్వ పరిశోధకులు । 90006 18068

విశ్వవ్యాపకుడు

మహా భారత కథలో పాండవులు కపట జూదంలో ఓడిపోయాక, పెద్దలందరు ఆసీనులైన నిండు సభలో, దుశ్శాసనుడు ద్రౌపదీ దేవిని ఈడ్చుకుని వచ్చి అవమానం చేయటానికి పూనుకుంటాడు. ద్రౌపదికి ఆ సమయంలో దిక్కు తోచదు. వెంటనే కృష్ణ పరమాత్మ గుర్తుకు వచ్చాడు. 'ఓ గోవిందా! ద్వారకా వాసా! నన్నీ అవమానం నుంచి కాపాడమని' ప్రార్థించింది. సమయం గడుస్తున్నా కృష్ణుడు రాలేదు. ఏ సహాయం అందించలేదు. ద్రౌపది మళ్ళీ శ్రీకృష్ణుని 'విశ్వాత్మ! విశ్వ భావన! మహా యోగి! ఈ అవమానం నుంచి కాపాడ'మని ఆర్తితో ప్రార్థించింది. తక్షణమే ద్రౌపదికి కృష్ణ సహాయం లభించింది. ఆపద తొలగింది.

కృష్ణుడు ఆర్తరక్షణ పరాయణుడు కదా తను ప్రార్థించిన వెంటనే ఎందుకు సహాయం చేయలేదు? కొంచెం ఆలస్యం ఎందుకు చేశాడు? అని చాలా రోజులు అనుకున్నది ద్రౌపది. తర్వాత, కృష్ణుని దర్శనం దొరికినప్పుడు ఆమె ఈ ప్రశ్నలనే అడిగింది. అప్పుడు కృష్ణుడు 'నన్ను భక్తితో ప్రార్థించిన వారికి సహాయం చేయటం నా కర్తవ్యం. నిజమే. కానీ, నువ్వు మొదట ద్వారకా వాసీ అని సంబోధించావు. ద్వారక నుంచి హస్తినాపురం రావాలంటే సమయం పడుతుంది కదా' అని చిరునవ్వు నవ్వాడట. అప్పుడు ద్రౌపదికి అర్థమైంది. విశ్వమంతా వ్యాపించిన పరమాత్ముని నేను ద్వారకకే పరిమితమైనట్లు భావించాను. అందుకే ఆయన రాలేదు. రెండవసారి విశ్వాత్మ అని సంబోధించిన వెంటనే వచ్చి కాపాడాడు కాబట్టి భగవంతుడు అపరిమితుడు అని గుర్తించింది. ఏ రూపమైనా దేవుడొక్కడే, ఆయన విశ్వవ్యాపకుడు. అంతటా నిండి ఉంటాడు. ఏ ప్రదేశానికీ, ఏ రూపానికీ, ఏ పేరుకీ పరిమితుడు కాదని గ్రహించాలి.



– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

పీసీసీ కావాలి.. వేరే పదవి నాకొద్దు

● చిట్‌చాట్‌లో మధు యాష్కీ గౌడ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తన జీవితమంతా కాంగ్రెస్‌లోనే నడిచిందని, 40 ఏళ్ల నుంచి పార్టీలో వివిధ హోదాల్లో పని చేసిన తనకు పీసీసీ అధ్యక్షుడిగా అన్ని అర్హతలున్నాయని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీగౌడ్ వ్యాఖ్యానించారు. తాను పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే తీసుకుంటానని, వేరే పదవి వద్దని స్పష్టం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో ఆయన ఇష్టాగోష్టి మాట్లాడుతూ పీసీసీ అధ్యక్ష పదవి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి.. మహేశ్‌గౌడ్‌కు, మంత్రులంతా తనకు మద్దతు ఇచ్చినట్లు వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు. బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తామని బావ, బామ్మర్దులు ఢిల్లీలో చర్చలు జరిపారని, కేసీఆర్ సీరియస్‌గా ప్రయత్నం చేస్తున్నారని, కవితను జైలు నుంచి విడిపించడం కోసం కేటీఆర్, హరీశ్‌లు పాకులాడుతున్నారని దుయ్యబట్టారు. బీఆర్ ఎస్‌ను విలీనం చేసుకునే విషయంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయని, విలీనానికి కిషన్‌రెడ్డి ఓకే చెప్పారని, బండి మాత్రం హరీశ్‌ను లాక్కొని బీఆర్‌ఎస్‌ను చీల్చాలని చూస్తున్నాడన్నారు. నారాయణ, శ్రీ చైతన్య సంస్థల్లో కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు 15% వాటా ఉందని, నోటిఫికేషన్ వేసి పరీక్షలు వాయిదా వేస్తే ట్రైనింగ్ సెంటర్లకు లాభమని, వాయిదా వేస్తే శిక్షణ సంస్థలు రూ.100 కోట్లు లబ్ధి పొందుతాయన్నారు. అందులో కేటీఆర్, హరీశ్, కవితకు వాటా ఎంతో చెప్పాలన్నారు.

‘మేడిగడ్డ’ ఇంజనీరింగ్ బ్లండర్!

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో కె.రఘు

● తుమ్మిడిహెట్టి వద్ద నీటిలభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పిందనడం పూర్తిగా అబద్ధం
● 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించినా 165 టీఎంసీలను తరలించవచ్చు
● మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంతో ప్రజలపై భారం



సాక్షి, హైదరాబాద్: ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మించాల్సి ఉండగా, అక్కడ 165 టీఎంసీల నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తెలపడంతోనే మేడిగడ్డ వద్దకు లొకేషన్ మార్చినట్టు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెప్పడం పూర్తిగా అవాస్తవమని తెలంగాణ జేఏసీ చైర్మన్, ట్రాన్స్‌కో ఇంజనీర్ కె.రఘు స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు లొకేషన్‌ను మార్చడం ఇంజనీరింగ్ బ్లండర్ అని విమర్శించారు. మహారాష్ట్ర అభ్యంతరాల నేపథ్యంలో తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించనున్న బరాజ్ ఎత్తును 148 మీటర్లకు తగ్గించినా మొత్తం 165 టీఎంసీలను తరలించడం సాంకేతికంగా సాధ్యమేనని తేల్చి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు సోమవారం హాజరైన ఆయన.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తన వాదనలు వినిపించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

వాదనలకు తగిన ఆధారాలు అందజేశా

నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ జరిపిన అధ్యయనాల ప్రకారం తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉందని, ఆ మేరకు ఆధారాలను కమిషన్‌కు అందజేసినట్టు రఘు తెలిపారు. అక్కడ 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించినా, 165 టీఎంసీలను తరలించడానికి ఆస్కారముందనడానికి సంబంధించిన ఆధారాలను కూడా అందజేసినట్టు చెప్పారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు లొకేషన్‌ను మార్చడం వల్ల ప్రాజెక్టు పెట్టుబడి వ్యయంతో పాటు నిర్వహణ వ్యయం భారీగా పెరిగిపోయిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్దే బరాజ్ నిర్మిస్తే ఆదిలాబాద్ జిల్లాలో 2లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరు అందేదన్నారు. డీపీఆర్‌లను సీడబ్ల్యూసీ ఆమోదించడానికి ముందే మూడు బరాజ్‌లను నిర్మించడంతో చాలా తప్పిదాలు జరిగాయన్నారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణ స్థలం ఎంపికలో లోపం జరిగిందని, బరాజ్‌ల నిర్మాణానికి అది ఏమాత్రం అనువైన స్థలం కాదని పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు

కాళేశ్వరం ప్రాజెక్టు కాంట్రాక్టు ఒప్పందాల నిర్వహణలో తీవ్ర అవకతవకలు, లోపాలు చోటు చేసుకున్నాయని రఘు ఆరోపించారు. ఈపీసీ విధానంలో ఏదైనా ప్రాజెక్టు పనుల వ్యయాల్లో వ్యత్యాసాలు వస్తే కాంట్రాక్టర్‌దే బాధ్యత అని, దీనికి విరుద్ధంగా పనుల వ్యయం పెరిగినప్పుడు కాంట్రాక్టర్లకు అదనపు చెల్లింపులు జరిపారని తెలిపారు. అదే సమయంలో పనుల వ్యయం తగ్గినప్పుడు కాంట్రాక్టర్లకు చెల్లింపులను తగ్గించలేదని వివరించారు. అప్రోచ్ రోడ్లు, ఇతర నిర్మాణాల ఖర్చులను కాంట్రాక్టర్లే భరించాల్సి ఉండగా, వీటికీ చెల్లింపులు జరిగాయన్నారు. కంకర, ఇసుక తదితర ధరల విషయంలో లీడ్ చార్జీలను నిబంధనలకు వ్యతిరేకంగా చెల్లించారని చెప్పారు. వీటికి సంబంధించిన ఆధారాలను కమిషన్‌కు అందజేసినట్టు తెలిపారు. బరాజ్‌ల నిర్మాణం 2019లోనే పూర్తి కాగా నిర్వహణ, పర్యవేక్షణను గాలికి వదిలేశారని, దీంతోనే వాటికి తీవ్ర నష్టం జరిగిందని రఘు ఆరోపించారు. పంప్‌హౌస్‌ల సర్వీస్ బేను తక్కువ ఎత్తులో నిర్మించడంతోనే 2019 వరదల్లో మునిగిపోయాయన్నారు.

నిర్ణయాలన్నీ పైస్థాయిలోనే!

▶ మొదటి పేజీ తరువాయి

కార్యదర్శి కె.రామకృష్ణా రావు, నీటిపారుదల శాఖ రిటైర్డ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) పోస్టు నుంచి ఇటీవల బదిలీ అయ్యి పోస్టింగ్ కోసం వెయింటింగ్‌లో ఉన్న వికాస్‌రాజ్, నీటిపారుదల శాఖ ప్రస్తుత కార్యదర్శి రాహుల్ బొజ్జా, మాజీ సీఎం కేసీఆర్ కార్యదర్శిగా పనిచేసిన స్మితా సబర్వాల్.. బీఆర్‌కేఆర్ భవన్‌లోని కమిషన్ కార్యాలయానికి వచ్చి తమ వాంగ్మూలం ఇచ్చారు. రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.



విచారణకు హాజరైన సోమేశ్‌కుమార్, స్మితా సబర్వాల్, రజత్‌కుమార్, వికాస్‌రాజ్, రాహుల్ బొజ్జా, రామకృష్ణా రావు

మీ పాత్ర ఏమిటి?

బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో వీరి పాత్రను కమిషన్ అడిగి తెలుసుకుంది. నీటి పారుదల శాఖ ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించి ఇప్పటికే సేకరించిన సాక్ష్యాధారాల ఆధారంగా ఐఏఎస్, మాజీ ఐఏఎస్ అధికారులపై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించినట్టు సమాచారం. బరాజ్‌ల నిర్మాణానికి పరిపాలనపర అనుమతుల జారీ, పనులను కాంట్రాక్టర్లకు అప్పగించిన తీరు, వారితో చేసుకున్న ఒప్పందాలు, ఒప్పందాల అమలు తీరు, ఉల్లంఘనలు తదితర అంశాలపై కమిషన్ వారి వివరణ కోరినట్టు తెలిసింది. బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించి ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయాలకు బాధ్యులు ఎవరు? అసలు నిర్ణయాలు ఎవరు తీసుకున్నారు? వంటి అంశాలను ఆరా తీసినట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలపై సైతం లోతుగా ప్రశ్నించినట్టు సమాచారం. అంచనా వ్యయం ఆమోదం, అంచనాల పెంపు, పరిపాలనాపర అనుమతుల జారీ, నిధుల విడుదల, కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతుల జారీ, దాని ద్వారా రుణాలు సమీకరించిన తీరు తదితర అంశాలపై ఆరా తీసినట్టు తెలిసింది. కాగా కమిషన్‌కు వివరించిన అంశాలను అఫిడవిట్ రూపంలో రాతపూర్వకంగా వారం రోజుల్లోగా సమర్పించాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆదేశించారు. రామకృష్ణారావు రాష్ట్ర బడ్జెట్ 2024–25 ప్రతిపాదనల తయారీలో బిజీగా ఉండడంతో ఆయనకు మాత్రం ఆగస్టు 5 వరకు సమయం ఇచ్చారు.

ఐఏఎస్‌ల విచారణ ఎందుకంటే..?

తెలంగాణ ఏర్పాటయ్యాక సుదీర్ఘకాలం పాటు రాష్ట్ర నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి/ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే జోషి పనిచేశారు. ఆ తర్వాత మూడేళ్లకు పైగా ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రజత్‌కుమార్ వ్యవహరించారు. సోమేశ్‌కుమార్, వికాస్‌రాజ్‌లు కొంత కాలం ఆ శాఖ కార్యదర్శులుగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ కార్యదర్శిగా స్మితా సబర్వాల్ కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణాన్ని పర్యవేక్షించారు. దీంతో వీరిని కమిషన్ విచారించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు రుణాల సమీకరణ కోసం కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతుల జారీ, రుణాల సమీకరణ, వినియోగం, బడ్జెట్ నిధుల కేటాయింపులు, బిల్లుల చెల్లింపులు తదితర అంశాలపై విచారణలో భాగంగా రామకృష్ణారావును కమిషన్ ప్రశ్నించింది. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ వి.నాగిరెడ్డిని సైతం ఇదే వ్యవహారంలో ప్రశ్నించడానికి కమిషన్ రమ్మని కోరగా, ఆయన నుంచి స్పందన రాలేదని అధికారవర్గాలు తెలిపాయి. దీంతో ఆయన్ను మరోసారి పిలిపించనుంది. కాగా కమిషన్‌కు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని విచారణకు హాజరైన ఐఏఎస్ అధికారులు, రిటైర్డ్ ఐఏఎస్‌లు హామీ ఇచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

12 లేన్లుగా ఎన్‌హెచ్-44 రహదారి

● సిద్ధమవుతోన్న డీపీఆర్
● ఆర్ ఆర్ ఆర్ పనులకు సెప్టెంబర్‌లో టెండర్లు
● ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జడ్చర్ల: హైదరాబాద్–బెంగళూరు మధ్య 44వ నంబర్ జాతీయ రహదారిని 12 లేన్ల రహదారిగా మార్చేందుకు డీపీఆర్ సిద్ధమవుతోందని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలో బాలానగర్, మిడ్జిల్, నవాబ్‌పేట, రాజాపూర్ మండలాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం జడ్చర్లలో మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌ఆర్ హయాంలోనే ఓఆర్‌ఆర్, విమానాశ్రయం, కోకాపేట్ సెజ్ అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.30వేల కోట్లతో భూసేకరణ చేసి ఆర్‌ఆర్‌ఆర్ పనులకు సెప్టెంబర్‌లో టెండర్లు పిలిచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 65 పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి టీసీఎస్ కంపెనీ రూ.1,860 కోట్లు పెట్టుబడులు పెడుతోందని, ఇందుకు తమ ప్రభుత్వం వాటాగా రూ.310 కోట్లు పెట్టి ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఏడాదికి 10 వేల మందికి శిక్షణ ఇస్తామని చెప్పారు. గత సీఎం కేసీఆర్ ఏనాడైనా ఇలాంటి ఆలోచనలు చేశారా అని ప్రశ్నించారు. గ్రూప్–1 లీకేజీలకు బాధ్యులైన గత పాలకులు నేడు తమ ప్రభుత్వంపై విడ్డూరంగా మాట్లాడుతున్నారని, తాము అసెంబ్లీలో జాబ్ కేలండర్‌ను ప్రకటించి ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరినందుకే విద్యుత్ స్కాంపై కమిషన్ వేశామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందినా మాజీ సీఎం వైఎస్ జగన్ అసెంబ్లీకి హాజరై ప్రమాణ స్వీకారం చేశారని, తెలంగాణలో మాత్రం మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకుండా, రెండు నెలల తర్వాత ప్రమాణ స్వీకారం చేశారని మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదాను గౌరవించాలని, ప్రజలు ఇచ్చిన రాజ్యాంగబద్ధమైన పదవితో అసెంబ్లీకి హాజరు కావాలని కోరారు.

పేడ.. మద్యం.. నోట్లతో నిరసన

● పట్టాభూమి రిజిస్ట్రేషన్ చేయాలని బాధితుడి వినతి



నిరసన తెలుపుతున్న దుర్గం మనోహర్


కరీంనగర్: రెవెన్యూ అధికారుల తీరుపై సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామానికి చెందిన దుర్గం మనోహర్ వినూత్న నిరసన చేపట్టాడు. తండ్రి నుంచి సంక్రమించిన భూమిని తనకు రిజిస్ట్రేషన్ చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని కలెక్టరేట్ ఎదుట పేడ, మద్యం, నోట్ల కట్టతో పాటు ప్రజావాణిలో గతంలో ఫిర్యాదు చేసిన పత్రాలు ప్రదర్శిస్తూ అసహనం వ్యక్తం చేశాడు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తి పరిధిలోని 18వ డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబరు 55, 137లో గల భూములు కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే అధికారులు తన సొంత భూమిని తనకు కాకుండా చేశారని మనోహర్ ఆరోపించాడు. తన తండ్రి చనిపోయిన తరువాత తనవాటాకు రావాల్సిన 21గుంటలు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి దరఖాస్తు చేసుకుని, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లితే రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయాడు.

ఆగస్టు 14న ట్రైడెంట్ చక్కెర కర్మాగారం వేలం

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 14వ తేదీన కర్మాగారం వేలం పాట జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనేవారు చక్కెర తయారీ రంగంలో అనుభవజ్ఞులై ఉండి.. రాబోయే క్రషింగ్ సీజన్‌లో చెరకు రైతుల ఉపయోగార్థం కర్మాగారాన్ని నడపడానికి హామీ పత్రం సమర్పించాలని పేర్కొన్నారు.

తెలంగాణకు 5.4.. ఏపీకి 4.5 టీఎంసీలు

● కృష్ణా జలాల కేటాయింపులపై త్రిసభ్య కమిటీ నిర్ణయం
● కేవలం తాగునీటి అవసరాలకే వినియోగం



సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని ప్రధాన జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వలు అడుగంటిపోయిన నేపథ్యంలో ఎగువ నుంచి వరదలు వచ్చే వరకు ప్రస్తుతం ఉన్న నిల్వలను తాగునీటి అవసరాలకే వాడుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాలు నిర్ణయించుకున్నాయి. సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయిపూరే, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ (జనరల్) సి.నారాయణరెడ్డితో కూడిన కమిటీ దాదాపు రెండు గంటల పాటు రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలపై చర్చించింది. నాగార్జునసాగర్‌లో సరిపడ నిల్వలు లేనందున విద్యుదుత్పత్తి ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి ఏపీ 3 టీఎంసీలు, తెలంగాణ 2.7 టీఎంసీలను కలిపి మొత్తం 5.7 టీఎంసీలను సాగర్‌లోకి విడుదల చేయాలని నిర్ణయించింది. దీంతో సాగర్‌లో నీటి లభ్యత 9.9 టీఎంసీలకు పెరగనుండగా, అందులో నుంచి ఏపీకి 4.5 టీఎంసీలు, తెలంగాణకు 5.4 టీఎంసీలను కేటాయించనుంది. హైదరాబాద్ జంటనగరాలతో పాటు నల్లగొండ, ఖమ్మం తాగునీటి అవసరాల కోసం 5.4 టీఎంసీలను సాగర్ ఎడమ కాల్వ ద్వారా తెలంగాణ విడుదల చేసుకోనుంది. ఈనెల 17వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనుండగా, శ్రీశైలంలో జలవిద్యుదుత్పత్తిని సోమవారం రాత్రి నుంచే ప్రారంభించాలని నిర్ణయించారు. ప్రస్తుతం సాగర్‌లో 500 అడుగులపైన 47 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉంది.

పిచ్చి కుక్క స్వైర విహారం..21 మందికి గాయాలు



గాయపడ్డ వారికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో సోమవారం ఓ పిచ్చి కుక్క స్వైర విహారం చేస్తూ మొత్తం 21 మందిని గాయ పర్చింది. బాధితులు స్థానిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్సలు చేయించుకున్నారు. తీవ్ర గాయాలపాలైన ముగ్గురిని ఆస్ప త్రిలో ఇన్ పేషెంట్లుగా చేర్చుకుని అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ నరేశ్ తెలిపారు. కాగా, పంచాయతీ సిబ్బంది ఆ పిచ్చికుక్కను పట్టుకుని చంపేశారు.

నిరుపేద దేశం...సమున్నత లక్ష్యం!

జాంబియాలో ఉచిత విద్య • భారీగా పెరిగిన విద్యార్థులు • మౌలిక సదుపాయాలే సవాలు

జాంబియా. ఆఫ్రికా ఖండ దక్షిణ భాగంలో ఉండే అత్యంత నిరుపేద దేశం. మూడేళ్ల క్రితం ఓ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. అదే... బాల బాలికలందరికీ ఉచిత విద్య. అందులో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి దాకా విద్యా వ్యయమంతటినీ ప్రభుత్వమే భరిస్తుంది. జాంబియా వంటి దేశానికి ఇది ఒకరకంగా తలకు మించిన భారమే. మిగతా రంగాల మాదిరిగానే జాంబియాలో విద్యా రంగాన్ని కూడా మౌలిక సదుపాయాల తీవ్ర లేమి పట్టి పీడిస్తోంది. మరోవైపు కాసులకు కటకట. అయినా ఉచిత విద్యా పథకం అమలు విషయంలో అక్కడి ప్రభుత్వం వెనక్కు తగ్గడం లేదు. పదో తరగతి స్థాయిని దాటినా సజావుగా చదవను, రాయను రాని దుస్థితి నుంచి తమ కాబోయే పౌరులను బయట పడేసి తీరాలని కృతనిశ్చయంతో ఉంది. ఆ లక్ష్యసాధన కోసం గత మూడేళ్లలో విద్యా రంగంపై ఏకంగా 100 కోట్ల డాలర్లకు పైగా వెచ్చించింది!





సమయం ఇంకా ఉదయం ఏడు గంటలే. పైగా చలికాలపు ఈదురుగాలులు ఈడ్చి కొడుతున్నాయి. అయినా సరే, ఆ విద్యార్థులంతా అప్పటికే స్కూలుకు చేరుకున్నారు. తమ క్లాసురూముల వైపు పరుగులు తీస్తున్నారు. అవును మరి. ఏమాత్రం ఆలస్యమైనా బెంచీలపై కూర్చోవడానికి చోటు దొరకదు. రోజంతా చల్లటి చలిలో కింద కూర్చోవాల్సిందే! జాంబియా రాజధాని లుసాకాకు 60 కి.మీ దూరంలోని చన్యన్యా ప్రభుత్వ ప్రైమరీ, సెకండరీ స్కూల్లో మూడేళ్లుగా రోజూ ఇదే దృశ్యం. ఉచిత విద్యా పథకం మొదలై నాటినుంచీ దేశంలో స్కూళ్లన్నీ విద్యార్థులతో కిటకిటలాడిపోతున్నాయి. గరిష్ఠంగా 40 మంది ఉండాల్సిన క్లాసురూముల్లో కనీసం 90 నుంచి 100 మందికి పైగా కన్పిస్తున్నారు. 30 మంది మాత్రమే పట్టే ఒక క్లాస్‌రూములోనైతే ఏకంగా 75 మంది బాలలు, 85 మంది బాలికలు కిక్కిరిసిపోయారు! ఈ మూడేళ్లలో దేశవ్యాప్తంగా ఏకంగా 20 లక్షల మందికి పైగా విద్యార్థులు కొత్తగా బడిబాట పట్టారు మరి!

మంచి సమస్యే!

ఇంతమందికి విద్యార్థులకు తగిన స్థాయిలో దేవుడెరుగు, కనీస స్థాయిలో కూడా మౌలిక వసతులు లేకపోవడం జాంబియా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. 2019లో ఒక్కో క్లాసులో 40 మంది పిల్లల కంటే ఉండేవారు కాదని, ఇప్పుడు మాత్రం కనీసం 100కు పైగానే ఉంటున్నారని క్లియోపాత్రా జులు అనే టీచర్ వాపోయారు. వీళ్ల చాలరన్నట్టు దాదాపు రోజూ కొత్త విద్యార్థులు జాయినవుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వమిచ్చే ఒక్కో పుస్తకాల సెట్టు కోసం కనీసం ఆరేడు మంది పిల్లలు కొట్టుకునే పరిస్థితి! అయితే ఇవన్నీ 'మంచి సమస్య'లేనంటారు దేశ విద్యా మంత్రి డగ్లస్ స్యకలిమా. ''క్లాసురూముల్లో ఇరుక్కుని కూర్చునైనా సరే, ఈ బాలలంతా మూడేళ్లుగా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటున్నారు. వారంతా మరో దిక్కు లేక నిస్సహాయంగా వీధులపాలైన రోజులతో పోలిస్తే ఇదెంతో మెరుగు కదా'' అన్నది ఆయన పాయింటు. ''మౌలిక సదుపాయాలు కూడా త్వరలో మెరుగవుతాయి. ఎందుకంటే విద్యా రంగంపై చేసే పెట్టుబడి నిజానికి అత్యుత్తమ పెట్టుబడి'' అని వివరించారు. ఆయన వాదన నిజమేనని 18 ఏళ్ల మరియానా చిర్వా వంటి ఎందరో విద్యార్థుల అనుభవం చెబుతోంది. ''2016లో నాలుగో తరగతిలో ఉండగా స్కూలు మానేశాను. ఉచిత విద్యా పథకం పుణ్యాన మూడేళ్లుగా మళ్లీ చదువుకోగలుగుతున్నా. మా అమ్మానాన్నా ఏ పనీ చేయకుండా ఇంట్లోనే ఉంటారు. ఉచిత పథకం లేకుంటే స్కూలు ఫీజు కట్టడం అసాధ్యం మాకు'' అని చెప్పుకొచ్చిందామె. 2026 నాటికి కనీసం 55 వేల మంది కొత్త టీచర్ల నియామకం చేపట్టాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికే 37 వేల మంది నియామకం జరిగిపోయింది. తమకిచ్చిన ప్రభుత్వ నివాసాల్లో అత్యంత దుర్భరమైన పరిస్థితులున్నాయని టీచర్లు వాపోతున్న నేపథ్యంలో ఆ సమస్యపైనా దృష్టి సారించారు. దీనికి తోడు దేశవ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన కనీసం మరో 170 స్కూళ్లు నిర్మించనున్నారు. 2020లో రుణ ఊబిలో చిక్కి దివాళా తీసిన దేశానికి ఇది నిజంగా గొప్ప ఘనతేనని ఐరాస బాల సంస్థ యునిసెఫ్ కూడా ప్రశంసిస్తోంది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

చదువు అందని ద్రాక్షే

ఆఫ్రికాలో జాంబియా వంటి సబ్ సహారా ప్రాంత దేశాల్లో అందరికీ విద్య ఇప్పటికీ అందని ద్రాక్షే. అక్కడి దేశాల్లో సగటున ప్రతి 10 మంది విద్యార్థుల్లో ఏకంగా 9 మందికి నాలుగు ముక్కలు తప్పుల్లేకుండా చదవడం, అర్థం చేసుకోవడం ఇప్పటికీ తలకు మించిన వ్యవహారమేనని ఐరాస బాల సంస్థ యునిసెఫ్ అధ్యయనం చెబుతోంది. అయితే కొంతకాలంగా ఆ దేశాలన్నీ జాంబియా బాటలోనే నాణ్యమైన విద్యపై దృష్టి సారిస్తుండటం హర్షణీయమంది.

యాంటీ నార్కోటిక్స్ హెల్ప్ లైన్–1933

జాతీయ స్థాయిలో త్వరలో అందుబాటులోకి..

న్యూఢిల్లీ: జాతీయ స్థాయిలో తొలిసారిగా టోల్ ఫ్రీ నంబర్ మానస్–1933 ఈ నెల 18న అందుబాటులోకి రానుంది. దీంతోపాటు, ఈమెయిల్ కూడా అదే రోజు హోం మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. వీటి ద్వారా డ్రగ్స్ నేరాలు, సంబంధిత ఇతర అంశాలపై నేరుగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)కి ఎవరైనా సమాచారం అందించే వీలుంటుంది.

చైనా, రష్యా విన్యాసాలు

నాటో దేశాల ఆందోళన

బీజింగ్: చైనా, రష్యా నావికా దళాలు సంయుక్త కసరత్తులు నాటో కూటమికి ఆందోళన పెంచుతున్నాయి. ఇరు బలగాలు ఇటీవల పశ్చిమ, ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో గస్తీ కాశాయని చైనా రక్షణ శాఖ ఒక సంక్షిప్త ప్రకటనలో తెలిపింది. నూతన అంతర్జాతీయ సైనిక కూటమికి చైనా కేంద్రంగా మారుతోందని నాటో ఆరోపించడం తెలిసిందే.

ఇమ్రాన్‌కు భారీ షాక్

- ఆయన నెలకొల్పిన పీటీఐ పార్టీని నిషేధించే యోచనలో పాక్ సర్కార్
- దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిందని ఆరోపణ



ఇస్లామాబాద్: ప్రధాని పదవి కోల్పోయి పలు కేసుల్లో ఇరుక్కుని జైలుపాలైన పాక్ మాజీ క్రికెటర్, మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌ను కోలుకోలేని దెబ్బతీయాలని పాకిస్తాన్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిందని ఆరోపిస్తూ ఇమ్రాన్‌కు చెందిన ది పాకిస్తాన్ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్(పీటీఐ) పార్టీని నిషేధించాలని నిర్ణయించినట్లు సమాచార శాఖ మంత్రి అతౌల్లాహ్ తరార్ సోమవారం పత్రికాసమావేశంలో ప్రకటించారు. 2022 ఏప్రిల్‌లో అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయాక ఇమ్రాన్ ప్రభుత్వం కుప్పకూలింది. పలు కేసుల్లో ఇరుక్కున్న ఇమ్రాన్ ప్రస్తుతం రావల్పిండి నగరంలోని అడియాలా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు పీటీఐను నిషేధించడంతో పాటు ఇమ్రాన్, మాజీ పాకిస్తాన్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ, పైనా ఆర్టికల్ 6 ప్రకారం కేసులు నమోదుచేస్తామని మంత్రి ప్రకటించారు.

బలమైన ఆధారాలున్నాయ్..

''దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే పీటీఐ వంటి పార్టీలు అవరోధంగా ఉండకూడదు. మా ఓర్పు, సహనాన్ని చేతగానితనంగా కొందరు భావించారు. విదేశీ నిధుల కేసులు, మే 9న దేశవ్యాప్తంగా చెలరేగిన అల్లర్లు, హింస, సైఫర్ కేసులు, అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) నుంచి పాక్ ప్రభుత్వం రుణాల పొందకుండా అడ్డుకునే కుట్ర ఉదంతాల్లో పీటీఐ పార్టీ దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు బలమైన ఆధారాలు లభించాయి. అందుకే నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిషేధం నిమిత్తం ప్రభుత్వం త్వరలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేయనుంది. స్వతంత్రులుగా గెల్చి వేరే పార్టీలో చేరిన పీటీఐ నేతలకు దామాషా పద్ధతిలో పార్లమెంట్‌లో రిజర్వ్‌డ్ సీట్లు కేటాయిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని మరో పిటిషన్ వేస్తాం. పీటీఐ అడక్కపోయినా కోర్టే ఆ పార్టీకి ఇలా ఉపశమనం కల్పించింది' అని మంత్రి ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వ్‌డ్ సీట్లు పొందే అవకాశం పీటీఐకి రావడం, అక్రమ వివాహం కేసులో ఇమ్రాన్‌కు ఉపశమనం లభించినవేళ పీటీఐపై ప్రభుత్వం కఠిన ఆంక్షలకు దిగడం గమనార్హం. సుప్రీంకోర్టు తీర్పు అమలైతే పార్లమెంట్, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలు, మైనారిటీలకు కేటాయించిన రిజర్వ్ సీట్లు పీటీఐ పార్టీకి దక్కుతాయి. దాంతో 109 మంది సభ్యులతో పాక్ పార్లమెంట్‌లో అతిపెద్ద పార్టీగా పీటీఐ అవతరిస్తుంది. దీనిని ఎలాగైనా అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లింలీగ్–నవాజ్(పీఎంఎల్–ఎన్) ప్రభుత్వం ఇలా నిషేధ నిర్ణయం తీసుకుంది.

చనిపోయాననే అనుకున్నా

- కుడివైపు తిరగబట్టే బతికిపోయా
- కాపాడింది దేవుడో, అదృష్టమో!
- ప్రాణాంతక దాడిపై ట్రంప్

మిల్వాయుకీ (డెలావెర్): ప్రాణాంతకమైన దాడికి గురైన క్షణాలను అమెరికా మాజీ అధ్యక్షుడు గుర్తు చేసుకున్నారు. ''ఆ సమయంలో నేను చనిపోయాననే అనుకున్నా. కేవలం అదృష్టమో, దైవమో నన్ను కాపాడాయి'' అని చెప్పుకొచ్చారు. పెన్సిల్వేనియాలో ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా 20 ఏళ్ల దుండగుడు ఆయనపై కాల్పులకు తెగబడటం తెలిసిందే. 78 ఏళ్ల ట్రంప్ కుడి చెవికి తూటా గాయంతో త్రుటిలో బయటపడ్డారు. తనను రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించే మూడు రోజుల పార్టీ జాతీయ సదస్సుకు వెళ్తూ ఆయన న్యూయార్క్ పోస్ట్ వార్తా సంస్థతో మాట్లాడారు. సరిగ్గా కాల్పులు జరిగిన సమయంలోనే కుడివైపుకు తల తిప్పడం వల్లే బతికి బయటపడ్డానన్నారు. దీన్ని నమ్మశక్యం కాని అనుభవంగా అభివర్ణించారు. ''గాయం తర్వాత పిడికిలి పైకెత్తి ఫైట్ అంటూ నేను నినదిస్తున్న ఫొటోను అంతా ఐకానిక్ ఫొటోగా అంటున్నారు. అలాంటి ఫొటో కావాలంటే మామూలుగానైతే చనిపోవాల్సిందే'' అంటూ సరదా వ్యాఖ్యలు చేశారు. కాల్పుల తర్వాత కూడా ప్రసంగం కొనసాగించాలనే అనుకున్నట్టు వెల్లడించారు. అధ్యక్షుడు బైడెన్ తనకు ఫోన్ చేసి క్షేమం కనుక్కున్న తీరును అభినందించారు. ఈ సందర్భంగా ట్రంప్ కుడి చెవికి బ్యాండేజీ ధరించి కన్పించారు.

రిపబ్లికన్ సదస్సుకు భారీ భద్రత

రిపబ్లికన్ల మూడు రోజుల జాతీయ సదస్సు మిల్వాయుకీలో సోమవారం మొదలైంది. ట్రంప్‌పై దాడి నేపథ్యంలో సదస్సుకు కనీవినీ ఎరగని స్థాయిలో వేలాది మంది సిబ్బందితో అత్యంత కట్టుదిట్టమైన భద్రత కల్పించారు.

పోలీసును బెదిరించాడు!

ట్రంప్‌పై దాడికి దిగిన క్రూక్స్ కదలికల్ని కాల్పులకు ముందే ఓ పోలీసు అధికారి పసిగట్టాడు. క్రూక్స్ నక్కిన గోడౌన్‌పైకి ఎక్కి అతన్ని సమీపించబోగా తుపాకీతో బెదిరించాడు. దాంతో ఆ పోలీసు కిందికి దిగేశాడు. అదే సమయంలో ట్రంప్‌పై క్రూక్స్ తూటాల వర్షం కురిపించాడు.

స్కూలు రోజుల నుంచీ ముభావే

క్రూక్స్ స్కూలు రోజుల నుంచీ ఒంటరిగా, ముభావంగానే ఉండేవాడని తోటి విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ''క్రూక్స్‌కు పెద్దగా మిత్రులు కూడా లేరు. తోటి విద్యార్థులంతా అతన్ని బాగా ఏడిపించేవారు. రైఫిల్ గురి పెట్టడం చేతగాక స్కూల్ షూటింగ్ టీమ్‌లోకి ఎంపిక కాలేకపోయాడు'' అన్నారు.

జగన్నాథుడే కాపాడాడు: ఇస్కాన్

ప్రాణాంతక దాడి నుంచి ట్రంప్‌ను పూరీ జగన్నాథుడే కాపాడాడని ఇస్కాన్ పేర్కొంది. 48 ఏళ్ల కింద న్యూయార్క్‌లో తొలి జగన్నాథ రథయాత్ర విజయవంతం కావడంలో ఆయన ఎంతో సాయపడ్డారని చెప్పింది.

పోలీసుల తప్పిదమే: ఎఫ్‌బీఐ

ట్రంప్‌పై దాడి ఉదంతంపై దర్యాప్తు ముమ్మరమైంది. దీనిపై ఉన్నత స్థాయి స్వతంత్ర విచారణకు బైడెన్ ఆదేశించడం తెలిసిందే. దేశీయ ఉగ్రవాద చర్యగా దీనిపై ఎఫ్‌బీఐ విచారణ చేపట్టింది. దుండగుడు థామస్ మాథ్యూ క్రూక్స్ ఒంటరిగానే ఈ ఘాతుకానికి తెగబడ్డట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. భద్రతా లోపానికి స్థానిక పోలీసు విభాగానిదే బాధ్యత అని సీక్రెట్ సర్వీస్ విభాగం వాదిస్తోంది. క్రూక్స్ మాటు వేసిన గోడౌన్ తమ భద్రతా పరిధికి ఆవల ఉందని పేర్కొంది. కనుక అదంతా స్థానిక పోలీసుల బాధ్యతేనని వివరించింది.

'ట్రంప్ ధిక్కార' టీ షర్టుల జోరు



బ్యాంకాక్: అటు తూటాల వర్షం. ఇటు చెవి నుంచి చెంప మీదుగా బొటబొటా కారుతున్న రక్తం. అంతలోకే రక్షణ వలయంగా కమ్ముకున్న సీక్రెట్ సర్వీస్ సిబ్బంది. అంతటి భీతావహ పరిస్థితిలోనూ పిడికిలి గట్టిగా బిగించి పైకెత్తి 'పోరాటమే'నంటూ గొంతెత్తి నినాదాలు. ట్రంప్‌పై దాడి జరిగిన క్షణాలకు శాశ్వతత్వం కల్పించిన ఫొటో ఇది. హత్యాయత్నం నుంచి త్రుటిలో బయటపడ్డ క్షణాల్లో కూడా ట్రంప్ ఆత్మనిబ్బరానికి, ఆయన ప్రదర్శించిన సాహసానికి ప్రతీకగా నిలిచిన ఈ ఫొటో అప్పుడే టీ షర్టులపైకి కూడా ఎక్కింది. అది కూడా దాడి జరిగిన రెండు గంటల్లోపే! అంత తక్కువ సమయంలోనే టావోబావో, జేడీ.కామ్ వంటి చైనా ఈ కామర్స్ దిగ్గజాలు ఆన్‌లైన్ దుకాణాలు ఆ ఫొటోలతో కూడిన టీ షర్టులను తయారు చేయడం, ఇ–కామర్స్ ప్లాట్‌ఫాంల్లో అమ్మకానికి పెట్టడం చకచకా జరిగిపోయాయి! వాటికి చూస్తుండగానే చైనా, అమెరికాల నుంచి 2,000 పై చిలుకు ఆర్డర్లు వచ్చాయి!



మళ్లీ తడబడ్డ బైడెన్

బ్యాలెట్ అనబోయి బ్యాటిల్!
తలపట్టుకుంటున్న డెమొక్రాట్లు

మిల్వాయుకీ: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తడబాట్ల పరంపర అంతులేకుండా కొనసాగుతూనే ఉంది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై దాడి తర్వాత ఆదివారం జాతినుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన మళ్లీ తప్పులు మాట్లాడారు. విభేదాలను బ్యాలెట్ బాక్సుల్లో పరిష్కరించుకుంటాం అనబోయి 'బ్యాటిల్ (యుద్ధ) బాక్సుల్లో' పరిష్కరించుకుంటామని అన్నారు. దాంతో ఆయన సొంత పార్టీ అయిన డెమొక్రాట్ నేతలు మరోసారి తలపట్టుకున్నారు.

ట్రంప్‌పై దాడి నేపథ్యంలో ఇది రాజకీయంగా ఉద్రిక్తతలను తగ్గించుకోవాల్సిన సమయమని బైడెన్ అభిప్రాయపడ్డారు. ''రాజకీయాలంటే యుద్ధ క్షేత్రం కాదు. పార్టీలుగా నేతల మధ్య విభేదాలు, భేదాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ మనం శత్రువులం కాదని, కలిసి పనిచేసే వారిమని, తోటి పౌరులమేనని గుర్తుంచుకోవాలి. చర్చలైనా, మరోటైనా శాంతియుతమైన జరగాలి. మన దేశంలో హింసకు తావు లేదు. జాతిగా మనమంతా ఒక్కటి కావాల్సిన సమయమిది'' అంటూ పిలుపునిచ్చారు.

నేపాల్ ప్రధానిగా ఓలీ ప్రమాణం

నాలుగోసారి ప్రధాని పీఠంపై సీపీఎన్‌యూఎంఎల్ చీఫ్



కఠ్మాండు: నెలల వ్యవధిలో ప్రభుత్వాలు కూలి కొత్త ప్రభుత్వాలు కొలువుతీరే హిమాలయాల దేశం నేపాల్‌లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్–యూనిఫైడ్ మార్కిస్ట్ లెనినిస్ట్ (సీపీఎన్–యూఎంఎల్) అధినేత కేపీ శర్మ ఓలీ ప్రధానిగా సోమవారం ప్రమాణం చేశారు. ప్రచండ నేతృత్వంలోని కమ్యూనిస్ట్‌పార్టీ ఆఫ్ నేపాల్ ప్రభుత్వానికి ఓలీ, షేర్ బహదూర్ దేవ్‌బా నేతృత్వంలోని నేపాలీ కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించడంతో ఆయన విశ్వాసపరీక్షలో ఓడిపోవడం, ప్రధానిగా రాజీనామా చేయడం తెల్సిందే. దీంతో ఓలీ, దేవ్‌బా ఏడు అంశాలపై ఏకాభిప్రాయంతో కూటమిగా ఏర్పడి నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. నేపాలీ రాజ్యాంగంలోని ఆర్టికల్76–2 ప్రకారం ఓలీని నూతన ప్రధానిగా దేశాధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఆదివారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఓలీ ప్రధానిగా ప్రమాణంచేశారు. ఓలీ ప్రధాని పదవి చేపట్టడం ఇది నాలుగోసారి కావడం విశేషం. సోమవారం కాఠ్మండూలోని రాష్ట్రపతిభవన్(శీతల్ నివాస్)లో దేశాధ్యక్షుడు పౌడెల్ ఈయన చేత ప్రధానిగా ప్రమాణంచేయించారు. సుస్థిర సంకీర్ణ కూటమి ప్రభుత్వాన్ని నెలకొల్పాలని ఆశించారు. కూటమిలోని నేపాలీ కాంగ్రెస్ నుంచి ఎవరెవరిని మంత్రివర్గంలోని తీసుకోవాలన్న విషయంలో భేదాభిప్రాయాలు పొడచూపడంతో ప్రమాణస్వీకార కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో నూతన ప్రభుత్వంలో అప్పుడే లుకలుకలు మొదలయ్యాయని ప్రపంచ పార్టీ విమర్శలు సంధించింది. కూటమిలో కీలక పార్టీ అయిన నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ భార్య ఆర్జో రాణా దేవ్‌బాకు విదేశాంగ మంత్రి పదవి కట్టబెట్టారు. ప్రధానిగా పగ్గాలు చేపట్టిన 30 రోజుల్లోపు ఓలీ పార్లమెంట్‌లో బలపరీక్షలో నెగ్గాల్సి ఉంటుంది.

ఇటలీలో 33 మందితో వెట్టి చాకిరీ..

సూత్రధారులైన ఇద్దరు భారతీయులు అరెస్ట్

రోమ్: ఇటలీలోని వెరోనా ప్రావిన్స్‌లో వ్యవసాయ క్షేత్రాల్లో 33 మంది భారతీయులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న ఆరోపణలపై సూత్రధారులైన ఇద్దరు భారతీయుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 4.33 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. తప్పుడు లెక్కలు చూపుతూ పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇదే ప్రావిన్స్‌లో తోటల్లో పనిచేసే సత్నాం సింగ్ అనే భారతీయుడు ఇటీవల ప్రమాదవశాత్తూ చేతి కోల్పోగా యజమాని అతన్ని రోడ్డు పక్కన వదిలేయడం, వైద్య సాయం ఆలస్యమై మరణించడం తెలిసిందే. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తాయి. ప్రధాని మెలోనీ కూడా దీన్ని ఖండించారు. ఈ ఘటనతో ఇటలీ వ్యవసాయ క్షేత్రాల్లో అనధికారికంగా పనిచేసే భారతీయ కార్మికుల దుస్థితి వెలుగులోకి వచ్చింది. సుమారు 2 లక్షల మంది భారతీయులు ఇటలీలోని వ్యవసాయ క్షేత్రాల్లో మగ్గిపోతున్నారని విదేశాంగ శాఖ అంచనా.

రిటైరయ్యేలోపు తీర్పివ్వండి

- చట్టాలను ద్రవ్య బిల్లుల మాటున లోక్‌సభలో ప్రవేశపెడుతున్నారు
- ఇలాంటి విధానం చట్టబద్ధతను త్వరగా తేల్చండి
- సుప్రీంకోర్టులో కాంగ్రెస్ వినతి

న్యూఢిల్లీ: ఆధార్ వంటి సాధారణ చట్టాలను ద్రవ్య బిల్లులుగా ఎన్‌డీఏ సర్కార్ లోక్‌సభలో ప్రవేశపెడుతున్న విధానాన్ని తప్పుబడుతూ ఈ విధానం చట్టబద్ధతను తేల్చేందుకు రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటుచేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు అనుమతించింది. సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సంబంధిత పిటిషన్‌ను సోమవారం విచారించింది. కాంగ్రెస్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. ''ఏడుగురు సభ్యులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటుచేశాక ఈ అంశాన్ని పరిశీలిస్తాం' అని సీజేఐ చంద్రచూడ్ చెప్పారు. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో స్పందించారు. ''రాజ్యాంగంలోని ఆర్టికల్ 110 కింద ఎన్నో సాధారణ బిల్లులను ద్రవ్యబిల్లులుగా పేర్కొంటూ మోదీ సర్కార్ లోక్‌సభలో ఆమోదింపజేసుకుంటోంది. ఈ రాజ్యాంగ అతిక్రమణకు 2016నాటి ఆధార్ చట్టం చక్కని ఉదాహరణ. ఇదే అంశాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే కోర్టు కూడా 'ఇది రాజ్యాంగపరంగా మోసమే' అంటూ సమర్థించింది. 2014 నుంచి ఆర్టికల్110 దుర్వినియోగంపై విచారణకు రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు చేస్తానని సీజేఐ తీర్పుచెప్పడం హర్షణీయం. ఈ ఏడాది నవంబర్‌లో సీజేఐ చంద్రచూడ్ రిటైర్ అయ్యేలోపు తీర్పు ఇస్తారని ఆశిస్తున్నాం' అని పోస్ట్ చేశారు. ఆధార్ చట్టం, మనీ లాండరింగ్ నిరోధక చట్టం(సవరణ) వంటి కీలక బిల్లులను ద్రవ్యబిల్లుగా మోదీ సర్కార్ లోక్‌సభలో ప్రవేశపెట్టింది. పెద్దలసభలో మెజారిటీ లేని కారణంగా అక్కడ బిల్లులు వీగిపోకుండా, తప్పించుకునేందుకు ప్రభుత్వం ఇలా చేస్తోందని చాన్నాళ్లుగా విపక్షాలు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టడం తెల్సిందే.

రాజ్యసభలో 90 దిగువకు బీజేపీ బలం

న్యూఢిల్లీ: మూడోసారి కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ బలం విచిత్రంగా పెద్దల సభలో చాన్నాళ్ల తర్వాత 90 కంటే దిగువకు పడిపోయింది. అయితే బలం తగ్గినా వెంటనే బీజేపీ కూటమికి కల్గే నష్టమేమీ లేకపోవడం గమనార్హం. వచ్చే కొద్ది వారాల్లో ఉప ఎన్నికల తర్వాత మళ్లీ కమలనాథుల బలం పుంజుకోనుంది. కొన్ని రాష్ట్రాల్లో అధికార పార్టీగా కొనసాగడమే ఇందుకు కారణం. బిహార్, మహారాష్ట్ర, అస్సాంలలో తలో రెండు సీట్లు, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్తాన్, త్రిపురలో తలో ఒక సీటును శాసనసభలో సంఖ్యాబలంకారణంగా బీజేపీ మళ్లీ సాధించనుంది. దీంతో మరికొద్ది వారాల్లో బీజేపీ బలం పెరగనుంది. సాధారణంగా నామినేటెడ్ సభ్యులు స్వతంత్ర్యంగా వ్యవహరించాలి. కానీ తమను నామినేట్ చేసిన ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తుంటారు. కీలకమైన సందర్భాల్లో అధికార పార్టీ ఎజెండాకు మద్దతు పలకడం తెల్సిందే. ప్రస్తుతం రాజ్యసభలో 226 మంది సభ్యులు ఉన్నారు. బీజేపీకి 86 మంది, కాంగ్రెస్‌కు 26 మంది, తృణమూల్ కాంగ్రెస్‌కు 13 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో ప్రస్తుతం 19 ఖాళీలు ఉన్నాయి.

కేజ్రీవాల్ 2 కిలోలే బరువు తగ్గారు

ఆప్ ఆరోపణలపై తిహార్ యంత్రాంగం స్పందన



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జైలులో ఉన్న కాలంలో తగ్గిన బరువు రెండు కిలోలు మాత్రమేనని తీహార్ జైలు అధికారులు చెప్పారు. ఆయన ఆరోగ్యంపై ఎయిమ్స్ వైద్య బృందం నిత్యం సమీక్ష జరుపుతోందని పేర్కొన్నారు. కేజ్రీవాల్ భార్య సునీత నిత్యం ఆయనతో టచ్‌లో ఉంటున్నారని తెలిపారు. జైలులో ఉన్న తమ నేత ఆరోగ్యం రానురాను క్షీణిస్తోందంటూ ఆప్ నేతలు అతిశీ, సంజయ్ సింగ్ చేస్తున్న ఆరోపణలను అధికారులు తిప్పికొట్టారు. కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ తిహార్ జైలు యంత్రాంగం ఢిల్లీ ప్రభుత్వ హోం శాఖకు ఒక నివేదికను పంపించింది. జైలులో ఉండగా కేజ్రీవాల్ 8.5 కిలోల మేర బరువు తగ్గినట్లు శనివారం సంజయ్ సింగ్ ఆరోపించారు. తీహార్ అధికారులు దీనిపై స్పందిస్తూ.. ఏప్రిల్ ఒకటో తేదీన జైలుకు వచ్చిన సమయంలో కేజ్రీవాల్ 65 కిలోలున్నారని, ఏప్రిల్ 8, 29వ తేదీల మధ్య ఆయన బరువు 66 కిలోలని తెలిపారు. 21 రోజుల బెయిల్ ముగిసి జూన్ 2న తిరిగి జైలుకు వచ్చినప్పుడు కేజ్రీవాల్ బరువు 63.5 కిలోలని చెప్పారు. జూలై 14న చూస్తే రెండు కిలోల బరువు తగ్గి 61.5 కిలోలున్నారని వివరించారు. ఇంటి నుంచి అందుతున్న భోజనం ఆయన మూడుసార్లు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

లిఫ్ట్‌లో 2 రోజులు



తిరువనంతపురం: హాస్పిటల్‌లో చెకప్ కోసం వెళ్లిన ఓ వ్యక్తి రెండు రోజుల పాటు లిఫ్ట్‌లోనే చిక్కుకుపోయాడు. కేరళలోని ఉల్లూరుకు చెందిన రవీంద్రన్ నాయర్ (59) శనివారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలకు వెళ్లాడు. ఓపీలో చెకప్ చేయించుకున్నాడు. ఫస్ట్ ఫ్లోర్ వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కాడు. దిగాల్సిన సమయంలో అది తెరుచుకోలేదు. సాయం కోసం కేకలు వేసినా లాభం లేకపోయింది. ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో శని, ఆదివారాలు లిఫ్ట్‌లోనే ఉండిపోయాడు. సోమవారం ఉదయం ఆపరేటర్ లిఫ్ట్‌ను తెరవడంతో బయటపడ్డాడు. రవీంద్రన్ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో అంతటా వెదికిన కుటుంబసభ్యులు చివరకు మిస్సింగ్ కేసు పెట్టారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు ఆస్పత్రి సిబ్బందిని అరెస్టు చేశారు.


విక్రమ్ మిశ్రీ బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ: దౌత్యవేత్త విక్రమ్ మిశ్రీ విదేశాంగ శాఖ కార్యదర్శిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ ఫారిన్ సర్వీస్ 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన ఈ పదవి చేపట్టిన 35వ అధికారి. వినయ్ క్వాత్రా స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఐకే గుజ్రాల్, మన్మోహన్‌సింగ్, నరేంద్ర మోదీ రూపంలో ఏకంగా ముగ్గురు ప్రధానుకు వ్యక్తిగత కార్యదర్శిగా పని చేసిన అరుదైన రికార్డు మిశ్రీది. ఆయన గతంలో విదేశాంగ శాఖతో పాటు ప్రధాని కార్యాలయంలో, యూరప్, ఆఫ్రికా, ఆసియా, ఉత్తర అమెరికాల్లో పలు దేశాల్లోని భారతీయ మిషన్లలో పనిచేశారు. 2019–21 మధ్య చైనాలో భారత రాయబారిగా గాల్వాన్ లోయ ఘర్షణలు, ఉద్రిక్తతల నేపథ్యంలో ద్వైపాక్షిక చర్చల్లో కీలక పాత్ర పోషించారు.

సిసోడియా కస్టడీ 22 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ: ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని కోర్టు ఈ నెల 22 వరకు పొడిగించింది.



సోమవారంతో జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో అధికారులు సోమవారం ఆయన్ను సీబీఐ, ఈడీ కేసులను విచారించే ప్రత్యేక కోర్టు జడ్జి కావేరీ బవేజా ఎదుట వర్చువల్‌గా హాజరుపరిచారు. వాదనలు విన్న జడ్జి.. కస్టడీని 22వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలిచ్చారు. మద్యం కుంభకోణంతో ప్రమేయముందంటూ మనీశ్ సిసోడియాను సీబీఐ ఫిబ్రవరిలో అరెస్ట్ చేసింది.

శివకుమార్‌కు సుప్రీంలో చుక్కెదురు



న్యూఢిల్లీ: కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. అక్రమాస్తుల కేసులో సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ ఆయన పెట్టుకున్న అర్జీని సోమవారం అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఇందుకు సంబంధించిన కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులపై జోక్యం చేసుకునేందుకు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం నిరాకరించింది. ఇప్పటికే ఇవే ఆరోపణలపై ఆదాయ పన్ను శాఖ విచారణ జరుపుతున్నందున, మళ్లీ సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయరాదని శివకుమార్ తరఫున సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గీ వాదించారు. అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ ప్రకారం అనుమతి లేకుండానే సీబీఐ దర్యాప్తున చేపట్టిందన్నారు.

ట్రంప్‌పై రహస్య పత్రాల కేసు కొట్టివేత



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎదుర్కొంటున్న అధికార రహస్య పత్రాల కేసును ఫ్లోరిడాలోని ఫెడరల్ కోర్టు జడ్జి ఐలీన్ కెనన్ సోమవారం కొట్టివేశారు. ఆరోపణలను నమోదు చేసిన ప్రత్యేక న్యాయవాదిని రాజ్యాంగ నియామకాల నిబంధనలకు విరుద్ధంగా నియమించారన్న ట్రంప్ లాయర్ల వాదనతో ఆమె ఏకీభవించారు. దీంతో, ట్రంప్ ఎదుర్కొంటున్న అనేక కేసుల్లో ఎంతో తీవ్రమైందిగా భావిస్తున్న ఈ క్రిమినల్ కేసుకు అనూహ్యమైన ముగింపు వచ్చినట్లయింది. అధ్యక్షుడిగా ఉండగా ఎన్నో ముఖ్యమైన రహస్య పత్రాలను ఫ్లోరిడాలోని మార్–ఇ–లాగో ఎస్టేట్‌కు తరలించారని, వాటిని వెనక్కి తెచ్చే ప్రయత్నాలను అడ్డుకున్నారంటూ ట్రంప్‌పై అనేక అభియోగాలున్నాయి. తనపై ఇతర కేసులనూ కొట్టేయాలని ట్రంప్ కోరారు.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 16 । జూలై । 2024



బైక్‌పై మృతదేహాన్ని తెచ్చి...
బాలానగర్ పరిధిలో జరిగిన ట్రాన్స్‌జెండర్ హత్య కేసు మిస్టరీని సనత్‌నగర్ పోలీసులు ఛేదించారు. గంజాయి గ్యాంగ్ ఈ హత్యకు పాల్పడినట్లుగా పోలీసులు తేల్చారు. -8లో



వైవిధ్యభరితం.. కాకతీయం
కాకతీయం..ఒక కమనీయ నృత్యరూపకం. చారిత్రక, సాంస్కృతిక, కళాత్మక వైభవానికి కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ పద్మజారెడ్డి సమున్నతంగా సమర్పించిన నిలువెత్తు నృత్య నీరాజనం. -10లో

గరిష్ఠం/కనిష్ఠం
28.0/23.0

వాతావరణం
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో గాలులు వీస్తాయి.

పనిచేయని స్వచ్ఛ ఆటో కార్మికులపై చర్యలు

- అక్రమ భవన నిర్మాణాలపై ఫోకస్
- అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో ఆమ్రపాలి



సాక్షి, సిటీబ్యూరో: ఇంటింటా చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోల హాజరుపై దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. సోమవారం అడిషనల్, జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమ్రపాలి మాట్లాడుతూ,తరచూ విధులకు హాజరు కాని స్వచ్ఛ ఆటో కార్మికుల వివరాలు సేకరించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. కమర్షియల్ ప్రాంతాల్లో స్వచ్ఛ ఆటోలు రాత్రి సమయంలోనే చెత్త సేకరించాలని తెలిపారు. సినిమా థియేటర్లలో పార్కింగ్ ఫీజుల ఫిర్యాదుల్ని పరిశీలించాలని అడిషనల్ కమిషనర్ (యూసీడీ)కి సూచించారు. అక్రమ భవన నిర్మాణాలపై ఫోకస్ పెట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్లో శానిటేషన్‌ను రోల్ మోడల్‌గా చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద పెద్ద సంపుల నిర్మాణం చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. డెంగీ వ్యాధి ప్రబలిన వ్యక్తుల సమాచారం రోజు వారీగా జోన్ల నుండి మధ్యాహ్నం వరకు హెడ్ ఆఫీస్‌కు తప్పని సరిగా పంపాలని తెలిపారు.

ఎల్అండ్‌టీ మెట్రో ఎండీకి లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డును ప్రదర్శిస్తున్న హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్అండ్‌టీ స్ట్రాటజికల్ ఆఫీసర్ మురళీ వరదరాజన్

సాక్షి, సిటీబ్యూరో: ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డికి టౌమ్స్‌నౌ పత్రిక లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించింది. ఈమేరకు ఇటీవల బెంగళూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డుతో సత్కరించింది. ఈ అవార్డు ఎల్అండ్‌టీ అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషికి గుర్తింపుగా భావిస్తున్నట్లు ఈ సందర్భంగా కేవీబీ రెడ్డి తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితులపై ఆరా

– పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి టెలీకాన్ఫరెన్స్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం నేపథ్యంలో.. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ జీహెచ్ఎంసీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులపై ఆరా తీశారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని సూచించారు. అక్కడి పరిస్థితుల్ని చక్కదిద్దాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు. అందుకోసం ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

నెలాఖరులోపు నాగోలు ఎస్టీపీ ఆరంభానికి సిద్ధం

ట్రయల్ రన్ ప్రారంభించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి


నాగోల్ ఎస్టీపీ ట్రయల్ రన్ ప్రారంభిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెలాఖరులోగా నాగోల్ ఎస్టీపీని ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్టీపీ ప్రాజెక్టుల్లో భాగంగా ప్యాకేజీ-2లో నిర్మిస్తున్న నాగోల్ ఎస్టీపీని సోమవారం ఆయన సందర్శించారు. వెట్ వెల్ దగ్గర ఇన్‌లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ ప్రారంభించారు. అనంతరం ప్రాంగణంలో పర్యటించి సీసీ రోడ్లు, లైటింగ్ పనుల్ని పరిశీలించారు. అంతర్గత రహదారుల నిర్మాణం సహా..ముగింపు దశలో ఉన్న పనుల్ని త్వరితగతిన పూర్తి చేసి.. ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్టీపీ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో ల్యాండ్ స్కేపింగ్, పూల మొక్కలతో సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎస్టీపీ ప్రాంగణంలో ఎండీ అశోక్ రెడ్డి మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం.సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్-2 సుదర్శన్, సీజీఎం, జీఎం, ఎస్టీపీ ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

హస్తం గూటికి 'పీర్జాదిగూడ' కార్పొరేటర్లు



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుపార్టీకి కష్టాలు మొదలయ్యాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కొడె పోచయ్య, బండి రమ్య సతీష్ గౌడ్, అలువా సరిత దేవేందర్ గౌడ్‌లు సోమవారం మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, మలిపెద్ది సుధీర్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు మరో కార్పొరేటర్ కూడా కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. కాగా ముగ్గురు కార్పొరేటర్ల చేరికతో పీర్జాదిగూడ మున్సిపల్ కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం 18కి చేరింది. ఇక బీఆర్ఎస్ కార్పొరేటర్ల సంఖ్య 8కి తగ్గింది. ఈ పరిణామాలతో పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ వశం అయ్యే అవకాశాలు ఏర్పడ్డాయి. చేరికల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాన తిప్పలు.. ఇంకెన్నాళ్లు..?

గ్రేటర్‌లో ఏళ్లు గడుస్తున్నా తీరని సమస్యలు

నగరంలో ఎప్పుడు వానొచ్చినా మహానగర మేడిపండు చిత్రం వెల్లడవుతోంది. ఆదివారం కురిసిన వర్షానికి గంటల తరబడి ట్రాఫిక్‌జామ్‌లు.. రోడ్లపై కనిపించని గుంతలు.. వరద తగ్గాక బురద. ఇవే దృశ్యాలు వానలొచ్చిన ప్రతిసారీ పునరావృతమవుతున్నాయి. ఆదివారం సెలవు దినమే అయినా ఎల్‌బీనగర్ నుంచి బేగంపేట వెళ్లడానికి రెండుగంటలు పట్టిందని ఓ ఇంజినీర్ వాపోయారంటే పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు. నగరంలో వాన కష్టాల నివారణకని మూడేళ్లుగా పనులు జరుగుతున్నా నేటికీ పరిష్కారం కాలేదు. ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ మాన్సూన్ ఎమర్జెన్సీటీమ్స్(ఎంఈటీ) తదితర పేర్లెన్ని ఉన్నా నిధులు ఖర్చవుతున్నాయి తప్ప సమస్యలు తగ్గడం లేదు. వర్షాల వల్ల ప్రతిఏటా పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

- రోడ్లు ఛిద్రం.. పరిస్థితులు అధ్వానం
- నిధులు నీళ్లపాలు.. ప్రజలు ప్రమాదాల పాలు



అమీర్‌పేట మైత్రివనం వద్ద వర్షాకాలంలో ఏళ్లుగా ఇదే పరిస్థితి

బిక్కుబిక్కుమంటూ..

రాత్రివేళ వర్షంతో ఎక్కడ గుంతలున్నాయో, ఎక్కడ క్యాచ్‌పిట్లు, మ్యాన్‌హోళ్ల మూతలు తెరచుకొని ఉన్నాయో తెలియక పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజల ఆందోళన వర్ణనాతీతం. రోడ్లతో పాటు వివిధ ఇంజినీరింగ్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజలు భయాందోళనలతో ముందుకు సాగారు.

శివార్లలో మరింత అధ్వానం

ప్రధాన రహదారుల్లోని పరిస్థితులిలా ఉంటే కాలనీలు, బస్తీల్లోని సమస్యలు ప్రజలను బయటకు వెళ్లకుండా చేస్తున్నాయి. శివార్లలోని, కాలనీల్లోని వానకష్టాలు తీరుస్తామని మూడేళ్ల క్రితం దాదాపు రూ.300 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. అవి ఏమేరకు పూర్తయ్యాయో, పూర్తయిన వాటిలో ఎన్ని కొట్టుకుపోయాయో తెలియని పరిస్థితి.

కొత్త రోడ్లకూ ఏటా వందల కోట్లు

- 2022-23లో కొత్త బీటీ రోడ్లకు చేసిన ఖర్చు రూ.31.71 కోట్లు.
- 2023-24లో చేసిన ఖర్చు రూ.50.52 కోట్లు.
- 2022-23లో కొత్త సీసీరోడ్లకు చేసిన ఖర్చు రూ.661.24 కోట్లు
- 2023-24లో చేసిన ఖర్చు రూ.668.56 కోట్లు

నిధులు రోడ్లపాలు

వర్షాకాలానికి ముందు..తర్వాత మరమ్మతులు, ఇతరత్రా పనుల పేరిట ఏటా దాదాపు రూ.200 కోట్లు ఖర్చవుతున్నా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముందస్తు జాగ్రత్తల పేరిట, వర్షాలు వెలిశాక పాట్‌హోల్స్ పూడ్చివేతల పేరిట నిధులు ఖర్చు చేస్తున్నారు. పూడ్చివేతలు సైతం తూతూమంత్రంగా చేస్తూ కాంట్రాక్టర్లు, అధికారులు నిధులు కాజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. టెలికాం, విద్యుత్, వాటర్‌బోర్డు తదితర సంస్థలు ఆయా అవసరాల పేరిట రోడ్లు వేశాక తవ్వుతుండటం పరిపాటిగా మారింది. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 నుంచి రోడ్ నెంబర్ 12 వైపు కొత్త రోడ్డు వేశాక సివరేజి పైప్‌లైన్ కోసం తవ్వడం ఇందుకు ఉదాహరణ.

జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు ఇలా..
- బీటీ రోడ్లు 2846 కి.మీ.
- సీసీ రోడ్లు 6167 కి.మీ.
- మొత్తం 9013 కి.మీ.

చేతులు కాలాక..

వర్షాకాల సమస్యల నివారణకు వేసవిలో పనులు పూర్తి చేయాల్సి ఉండగా, వర్షాకాలంలో వర్షాలొచ్చాక నీటినిల్వ ప్రాంతాల్లో పర్యటిస్తుండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. మైత్రీవనం, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్, లక్డీకాపూల్, కేసీపీ, చాదర్‌ఘాట్, చంచల్‌గూడ, అత్తాపూర్, షేక్‌పేట, బయోడైవర్సిటీ, గచ్చిబౌలి, ఆర్టీసీక్రాస్‌రోడ్స్, అంబర్‌పేటలతో సహా దాదాపు 150 నీటినిల్వ ప్రాంతాల గురించి అధికారులకు తెలియనిది కాదు. అయినా వర్షాలొచ్చిన ప్రతిసారీ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సీఆర్ఎంపీ మార్గాల్లో ప్రైవేటు ఏజెన్సీలు రోడ్లకు గుంతలు పడితే 24 గంటల్లోగా పరిష్కరించాల్సి ఉన్నా ఆ పనులు జరగడం లేదు.


మలక్‌పేటలో వర్షం కురిస్తే ఇంతే..

కాసుల వేట!

- ఆదాయంపై జలమండలి దృష్టి
- పెండింగ్‌లో నాన్‌డొమెస్టిక్.. నాన్ ఫ్రీ వాటర్ బిల్లులు
- కనెక్షన్ దారులకు నోటీసులు.. ఫోన్‌లో సంప్రదింపులు
- సర్కిళ్ల వారీగా టార్గెట్‌లు.. పెండింగ్ బిల్లుల వసూళ్లకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: ఆదాయ మార్గాలపై జలమండలి సీరియస్‌గా దృష్టి సారించింది. పెండింగ్ కలెక్షన్లను వసూలు చేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు పెండింగ్ నాన్‌డొమెస్టిక్..నాన్‌ఫ్రీ వాటర్ కనెక్షన్‌ల బకాయిల వివరాలపై ఆరా తీస్తోంది. బిల్లులు చెల్లించని వినియోగదారులకు నోటీసులు ఇవ్వడం, ఫోన్ల ద్వారా సందేశాలు పంపించి గడువులోగా చెల్లించకుంటే నల్లా కనెక్షన్లు తొలగించేందుకు సిద్ధమైంది. ఇందుకు సర్కిల్ వారీగా బకాయిల వసూళ్లకు టార్గెట్ పెట్టి చర్యలకు ఉపక్రమించింది. సరిగ్గా ఇరవై రోజుల క్రితం జలమండలి నూతన ఎండీగా బాధ్యతలు చేపట్టిన అశోక్ రెడ్డి నల్లా పెండింగ్ బకాయిలపై ప్రత్యేక దష్టి సారించారు. రెవెన్యూ పెంపులో భాగంగా పెండింగ్ బిల్లులు పక్కాగా వసూలు చేయాలని నిర్ణయించారు.

వాణిజ్య కనెక్షన్లే లక్ష్యం..

వాణిజ్య (కమర్షియల్) నల్లా కనెక్షన్ల బకాయిల విషయంలో కఠినంగా వ్యవహరించాలని జలమండలి నిర్ణయించింది. ఆరు నెలలు, ఆపై నుంచి నల్లా బిల్లు చెల్లించని వాణిజ్య కనెక్షన్ల బకాయిలను వసూలు చేసేందుకు సిద్ధమైంది. పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే కనెక్షన్లను తొలగించాలని ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. రూ.10 వేల కంటే ఎక్కువ మొండి బకాయిలు దాటిన గృహ, వాణిజ్య నల్లాల బిల్లులపై ప్రధానంగా దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. దీంతో సర్కిల్ వారిగా బిల్లులు బకాయి పడిన కనెక్షన్ దారుల ఫోన్‌కు బిల్లు చెల్లించేలా మెసేజ్‌లు పంపిస్తున్నారు. అదేవిధంగా జలమండలికి వివిధ ప్రభుత్వ విభాగాలు సైతం నల్లా బిల్లులు బకాయి పడ్డాయి. ఆయా విభాగాలు తక్షణమే బాకాయిలు చెల్లించేలా లేఖలు రాయాలని జలమండలి నిర్ణయించింది.

ఉచిత నీటి సరఫరాతో..

జలమండలికి ఉచిత నీటి సరఫరాతో నిర్వహణ వ్యయం బాగా పెరిగినట్లయింది. ప్రస్తుతం వాణిజ్య కనెక్షన్ల బిల్లులు, కొత్త నల్లాల ద్వారా జలమండలికి ప్రతి నెలా రూ.100 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. అందులో వాణిజ్య కనెక్షన్లతోనే రాబడి రూ.70 కోట్ల వరకు ఉంటుంది. అయితే వసూళ్లు అంతంత మాత్రంగా ఉండటంతో నీటి సరఫరా నిర్వహణ ఖర్చు మాత్రం భారంగా తయారైంది.

నాడు రకుల్... నేడు అమన్!

- కెల్విన్ కేసులో తెరపైకి రకుల్ పేరు
- ఆమెను విచారించిన ఈడీ అధికారులు
- తాజాగా డ్రగ్స్ కేసులో సోదరుడు అరెస్టు
- ఈ కేసులో 'పాత నిందితులే ఎక్కువ



సాక్షి, సిటీబ్యూరో: టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. గతంలో డ్రగ్స్ విక్రయం, వినియోగం ఆరోపణలపై అనేక మంది సినీ రంగానికి చెందిన వాళ్లు అరెస్టు అయ్యారు. కొన్నేళ్ల క్రితం ప్రముఖ నటి రకుల్ ప్రీత్‌సింగ్‌పై ఈ తరహా ఆరోపణలే రాగా...తాజాగా సోమవారం ఆమె సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్ డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తేలడంతో అరెస్టు అయ్యాడు. ఇతడు మాదకద్రవ్యాలు ఖరీదు చేసిన పెడ్లర్స్ ముఠాలో అనేక మందిపై గతంలోనూ కేసులు ఉన్నట్లు రాజేంద్రనగర్ పోలీసులు ప్రకటించారు.



రకుల్ వ్యవహారం ఇలా...

నగరానికి చెందిన అనేక మంది ప్రముఖులు, సినీ రంగానికి చెందిన వారికి డ్రగ్స్ సరఫరా చేసిన కెల్విన్‌తో సహా మరికొందరిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2017 జూలై 2న అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన కేసులు దర్యాప్తు చేసిన ప్రత్యేక దర్యాప్తు విభాగం (సిట్) అప్పట్లో 10 మంది సినీ ప్రముఖులతో పాటు అనేక మందికి నోటీసులు ఇచ్చి విచారించింది. ఆ జాబితాలో లేని రకుల్ పేరు ఆ తర్వాత చోటు చేసుకున్న అనూహ్య పరిణామాలతో వెలుగులోకి వచ్చింది. 2020లో బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ముంబైలో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ వ్యవహారంలో డ్రగ్స్ కోణం వెలుగులోకి రావడంతో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) అధికారులు మరో కేసు నమోదు చేశారు. ఇందులో సుశాంత్ సింగ్ గర్ల్‌ఫ్రెండ్ రియా చక్రవర్తిని అరెస్టు చేశారు. ఈమె విచారణతో పాటు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా దీపికా పదుకొణె, శ్రద్ధా కపూర్, సారా అలీఖాన్, రకుల్ ప్రీత్‌సింగ్ తదితరులకు సమన్లు జారీ చేశారు. అదే ఏడాది సెప్టెంబర్ 25న ముంబైలో ఎన్సీబీ విచారణకు రకుల్ హాజరయ్యారు. 2021 సెప్టెంబర్‌లో హైదరాబాద్ ఈడీ అధికారులు రకుల్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించారు.

పలువురిపై గతంలోనూ కేసులు...

సోమవారం చిక్కిన ఐదుగురు డ్రగ్ పెడ్లర్స్‌లో కొందరిపై గతంలోనూ కేసులు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రధాన సూత్రధారి అయిన డివైన్ ఎబుక సుజీపై వివిధ నగరాల్లో ఏడు డ్రగ్ కేసులు ఉన్నాయి. ఇతడికి ప్రధాన ఏజెంట్‌గా ఉన్న అనోహ బ్లెస్సింగ్‌పై 2019లో ధూల్‌పేట ఎక్సైజ్ పోలీసులు ఇలాంటి కేసే నమోదు చేశారు. పెడ్లర్స్‌లో ఒకడైన నిజాం కాలేజీ విద్యార్థి అజీజ్ నోహీమ్ అడెషోలా (నైజీరియన్) గతంలో ఉస్మానియా యూనివర్సిటీలో చదివాడు. అప్పట్లో ఫీజు చెల్లించడం కోసం నకిలీ డీడీ తయారు చేసి ఇచ్చి అరెస్టు అయ్యాడు. ఈ కేసులో కింది కోర్టు శిక్ష వేయగా.. ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేశాడు. అల్లం సత్య వెంకట గౌతమ్‌పై కేపీహెచ్‌బీ ఠాణాలో మహిళను వేధించిన కేసు, వరుణ్ కుమార్‌పై బండ్లగూడకు చెందిన ఈవెంట్స్ కొరియోగ్రాఫర్ మహ్మద్ మెహబూబ్ షరీఫ్‌లకు పంపిణీ చేస్తోంది. వరుణ్ కుమార్‌పై కేపీహెచ్‌బీలో, షరీఫ్‌పై జూబ్లీహిల్స్, మాదాపూర్‌ల్లో కేసులు ఉన్నాయి.


కొకైన్ వినియోగదారుడిగా చిక్కిన అమన్...

టీజీఏఎన్‌బీ, సైబరాబాద్ ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు సోమవారం చేపట్టిన ఆపరేషన్‌లో నైజీరియన్లు డివైన్ ఎబుక సుజీ, ఫ్రాంక్లిన్ సూత్రధారులుగా ఉన్న డ్రగ్ నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఈ ఇద్దరూ పరారీలో ఉండగా...అనోహ బ్లెస్సింగ్, అజీజ్, గౌతమ్, వరుణ్, షరీఫ్‌లను అరెస్టు చేసి 199 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. వీరి విచారణ నేపథ్యంలో అమన్‌ప్రీత్ సింగ్‌తో పాటు కిషన్ రాతి, అనికాంత్, యశ్వంత్, రోహిత్, శ్రీ చరణ్, ప్రసాద్, హేమంత్, నిఖిల్, మధు, రఘు, కృష్ణంరాజు, వెంకట్ పేర్లు వెలుగులోకి వచ్చాయి. వీళ్లు క్రమం తప్పకుండా తమ వద్ద నుంచి కొకైన్ ఖరీదు చేసి వినియోగిస్తున్నట్లు నిందితులు బయటపెట్టారు. దీంతో గాలించిన సైబరాబాద్ పోలీసులు అమన్ ప్రీత్ సింగ్‌తో సహా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. తమ వద్ద ఉన్న కిట్ ద్వారా మూత్ర పరీక్ష చేయగా..వీళ్లు తరచు కొకైన్ వాడుతున్నట్లు రిపోర్టు వచ్చింది. దీంతో ఆస్పత్రిలో పరీక్షలు చేయించిన పోలీసులు వీరిని డ్రగ్స్ వినియోగదారులుగా చేర్చి అరెస్టు చేశారు. పరారీలో ఉన్న వినియోగదారుల్లోనూ సినీ, వ్యాపార ప్రముఖులు ఉన్నట్లు తెలుస్తోంది.

డ్రోన్ పోలీస్!

ఒంటిపై ఖాకీ చొక్కా. చేతిలో లాఠీ లేని పోలీసులే డ్రోన్లు. వ్యవసాయం, వైద్య రంగాల్లో తరహాలోనే పోలీసింగ్‌లో కూడా డ్రోన్లు చేరాయి. పోలీసు శిక్షణ సమయంలోనే రాష్ట్రంలో తొలిసారిగా డ్రోన్ సాంకేతికత, వినియోగంపై శిక్షణ ఇస్తున్నారు. డీజీసీఏ అనుమతులు ఉన్న భారత్ డ్రోన్ అకాడమీ సహకారంతో అంబర్‌పేట, మేడ్చల్ పోలీస్ శిక్షణ కేంద్రంలోని 1,316 మంది శిక్షణ కానిస్టేబుళ్లకు డ్రోన్ వినియోగంపై ప్రత్యేక తర్ఫీదు నిస్తున్నారు. డ్రోన్ ఆపరేటింగ్, సన్నివేశాల చిత్రీకరణ, ఆనవాళ్ల సేకరణ, నిబంధనలు వంటి అంశాలపై సుశిక్షితులను చేస్తున్నారు. –అంబర్‌పేట


అంబర్‌పేట పీటీసీలో డ్రోన్ వినియోగంలో శిక్షణ



సాంకేతిక వినియోగంపై..

సమాజంలో పోలీస్ విధులు సవాలే. రోజు రోజుకూ భిన్న నేరాలు జరగడం వాటిని పరిశోధించి పరిష్కారించడం పోలీస్‌లకు విధుల్లో భాగం. అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను వినియోగించి జటిలమైన కేసులను పరిష్కరిస్తున్నారు. నేరం ఏదైనా క్షణాల్లో ఆనవాళ్లు తెలుసుకోవడానికి డ్రోన్ వ్యవస్థను వినియోగించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. డ్రోన్‌ను వినియోగించడంపై నిబంధనలు బాధ్యత, భద్రత, అనుమతులు, నో ఫ్లైయింగ్ జోన్‌లపై స్పష్టత వచ్చేలా ట్రైనింగ్ ఇస్తున్నారు. భవిష్యత్తులో నిర్వహించే విధుల్లో డ్రోన్ల వినియోగంపై శిక్షణ సమయంలోనే తర్ఫీదు ఇచ్చి సాంకేతికంగా కానిస్టేబుళ్లు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండేలా చూస్తున్నారు.

తొలిసారిగా డ్రోన్ సాంకేతికతపై శిక్షణ

- నేరాల పరిష్కారంలో ఇది బ్రహ్మాస్త్రమే
- ట్రాఫిక్, క్రైమ్ సీన్, రెస్క్యూ ఆపరేషన్‌లలో క్రియాశీలక పాత్ర

సరికొత్త అనుభూతి..



పోలీస్ శిక్షణలో శారీరకంగా, మానసికంగా శిక్షణ ఇస్తారనుకున్నాం. సాంకేతికతపై సైతం శిక్షణ ఇవ్వడం సరికొత్త అనుభూతి. ఇదెంతో ఆనందంగా ఉంది. మా బ్యాచ్‌కే మొదటిసారి డ్రోన్ వినియోగంపై శిక్షణ ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నా. ఇక్కడ నేర్చుకున్న మెలకువలను విధి నిర్వహణలో పాటిస్తూ ఉత్తమ పోలీసింగ్ చేస్తాం.
– మల్లం గణేష్, ట్రైయినీ

డ్రోన్‌లు రంగంలోకి దిగితే..

నేరం జరిగినట్లు సమాచారం అందగానే డ్రోన్‌లు రంగంలోకి దిగితే నేర పరిశోధనలో విప్లవాత్మకమైన మార్పే. ఒక ప్రాంతంలో నేరం జరిగితే ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)ని జోడించి డ్రోన్‌కు గూగుల్ లొకేషన్‌లో ఆ ప్రాంతానికి క్షణాల్లో పంపిస్తారు. అక్కడ జరిగిన సన్నివేశాల ఆనవాళ్లు కనుమరుగు కాకముందే సకాలంలో డ్రోన్ చేరుకొని వాటిని చిత్రీకరించి సాంకేతిక ఆధారాలను సేకరించి భద్రపరుస్తుంది. అలాగే.. డ్రోన్లతో ట్రాఫిక్ సమస్యను సైతం సకాలంలో పరిష్కరించేందుకు దోహద పడుతుంది. ట్రాఫిక్‌జామ్‌కు గల కారణాలను గుర్తించి పోలీసులకు చేరవేయడంతో సులువుగా ఎలా పరిష్కరించాలో తెలుసుకునే అవకాశం ఉంటుంది. భారీ బహిరంగా సభలు, క్లిష్టమైన బందోబస్తు, ప్రకృతి విపత్తులను అంచనాలు వేసి పరిష్కారానికి మార్గం సుగమం చేసే అవకాశం ఉంటుంది.

డ్రోన్ శిక్షణ గర్వంగా ఉంది



నేర సవాళ్లను ఎదుర్కోవడానికి డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం క్రియాశీల పాత్ర పోషిస్తోంది. పోలీస్ శిక్షణలో మొదటిసారి డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వడం గర్వంగా ఉంది. డ్రోన్స్‌పై ట్రైనీలకు మెలకువలు నేర్పించి భవిష్యత్తులో విధుల్లో ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేలా చొరవ తీసుకుంటున్నాం.
– పి.మధుకర్ స్వామి, పీటీసీ ప్రిన్సిపాల్

యువ పారిశ్రామికవేత్తలను తయారు చేశాం



మెషీన్ల పనితీరును అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి కేటీఆర్

మణికొండ: చదువుకుని ఉద్యోగం చేయటమే జీవిత లక్ష్యంగా కాకుండా తామే పది మందికి ఉపాధి కల్పించాలనుకునే యువకులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని, అదే తరహాల్లో ప్రస్తుత ప్రభుత్వం కృషి చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం కోకాపేటలో మురళీ నాయక్, రాకేష్‌నాయక్ అనే యువకులు సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ స్కీమ్ కింద ఏర్పాటు చేసిన 'డ్రాపిట్ మోడ్రన్ లాండ్రీ అండ్ క్లీనింగ్ హబ్'ను కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చదువులు చదవగానే చిన్న పనులు చేసేందుకు కొందరు నామోషీగా భావిస్తారని, అలాంటిది వీరు ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఎంబీఏ చదువుకుని అప్పటి ప్రభుత్వ సహకారంతో ఓ వ్యాపారాన్ని ప్రారంభించటం అభినందనీయమన్నారు. ఢిల్లీ, ఇటలీ నుంచి తెచ్చిన ఆధునిక యంత్రాలతో లాండ్రీని ఏర్పాటు చేసి పది మందికి ఉపాధిని చూపుతున్నారన్నారు. ఔత్సాహిక పారిశ్రామికి వేత్తలను తయారు చేసేందుకు గతంలో ఐఎస్‌బీ ద్వారా శిక్షణ ఇప్పించటంతో పాటు సబ్సిడీలు ఇచ్చి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సహించారన్నారు. రాబోయే రోజుల్లో నగరంలో మరో ఐదు యూనిట్‌లను ప్రారంభించి వంద మందికి ఉపాధి కల్పిస్తామని యువ వ్యాపారవేత్తలు మురళీనాయక్, రాకేష్‌నాయక్‌లు తెలిపారు.

నకిలీ విద్యుత్ ఉపకరణాల విక్రేత అరెస్టు

రూ.77 లక్షల సామగ్రి స్వాధీనం

అఫ్జల్‌గంజ్: ప్రముఖ కంపెనీల పేరిట నకిలీ విద్యుత్ వైర్లు, ఉపకరణాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని నగర టాస్క్‌ఫోర్స్, అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి దాదాపు రూ.77 లక్షల విలువైన విద్యుత్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర ఒక ప్రకటనలో వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఈ నెల 14న రాత్రి జాంబాగ్ పూజలబస్తీలోని గోదాముపై దాడి చేసి అఫ్జల్‌గంజ్‌కి చెందిన వ్యాపారి దయారాం చౌద్రి(21)ని అరెస్టు చేశారు. అతనికి చెందిన గోదాముల్లో నిబంధనలకు విరుద్ధంగా నకిలీ విద్యుత్ వైర్లు, ఇతర ఉపకరణాలను నిల్వ ఉంచి, తర్వాత దేశంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. రాజస్థాన్‌కు చెందిన దయారాంచౌద్రి ఐదేళ్ల క్రితం ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి అతని బావమరిది నరేందర్ చౌద్రితో కలిసి వీటిని విక్రయిస్తూ అమాయకులను మోసగిస్తున్నారు. నిందితుడితోపాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

టిఫిన్స్ అమ్మడానికి వెళ్తూ..



గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో లూనాపై ఉన్న టిఫిన్స్ చెల్లాచెదురైన దృశ్యం

గచ్చిబౌలి: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఫ్లై ఓవర్ పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ జీహెచ్ వెంకటేష్ తెలిపిన ప్రకారం వివరాలు... రాయదుర్గంలో నివాసం ఉండే సోము సాంబశివరావు(38) ప్రతిరోజు లూనాపై వెళ్లి కైత్లాపూర్‌లో టిఫన్ విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్‌పై నుంచి మాదాపూర్ వైపు వెళుతున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. దీంతో సాంబశివరావు ఫ్లై ఓవర్ పై నుంచి ఎగిరి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. లూనాపై ఉన్న టిఫిన్స్ చెల్లాచెదురయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ కోసం సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఫోను చోరీ.. ఖాతా ఖాళీ!

నానాటికీ తెలివిమీరుతున్న దొంగలు

- యూపీఐ యాప్ రీ-యాక్టివేట్ చేసి బాధితుడి బ్యాంకు ఖాతా ఖల్లాస్
- జూబ్లీహిల్స్, మొయినాబాద్‌ల్లో రెండు ఉదంతాలు వెలుగులోకి..
- వినియోగదారుల అవగాహనా రాహిత్యమే ఈ నేరగాళ్లకు వరం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన సెల్‌ఫోన్ చోరులు నానాటికీ తెలివి మీరుతున్నారు. ఇదివరకు తస్కరించిన స్మార్ట్ ఫోన్లను మారు వ్యాపారులకు ఎంతోకొంతకు అమ్మి సొమ్ము చేసుకునేవారు. ఇప్పుడు తస్కరించిన ఫోన్ సహాయంతో సంబంధిత యజమానికి చెందిన బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తున్నారు. ఈ యజమానుల అవగాహనారాహిత్యం, నిర్లక్ష్యమే వీరికి కలిసి వస్తోందని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా ఉదంతాలు జూబ్లీహిల్స్, మొయినాబాద్‌ల్లో వెలుగులోకి రాగా, బయటకు రానివి అనేకం ఉంటాయని పేర్కొంటున్నారు. తస్కరించిన ఫోన్ ద్వారా ఎక్కువ లాభం పొందడం, పోలీసులకు చిక్కకుండా ఉండటమే దొంగల ప్రధాన ఉద్దేశం. ఈ చోరులు తస్కరించిన ఫోన్లను నగరంలోని వివిధ మార్కెట్లలో ఉన్న సెకండ్ హ్యాండ్ వ్యాపారులకు విక్రయించేవారు. సదరు స్మార్ట్ ఫోన్ ఎంత కొత్తది అయినా దాని అసలు ధరలో గరిష్టంగా 25 నుంచి 30 శాతం మాత్రమే వ్యాపారులు చెల్లిస్తారు. మరోపక్క ఇటీవల కాలంలో నగరంలో జరుగుతున్న సెల్‌ఫోన్ చోరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. టాస్క్‌ఫోర్స్ టీమ్స్‌తోపాటు స్థానిక పోలీసులు అనేకమంది దొంగలు, వ్యాపారులను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో తస్కరించిన ఫోన్‌ను విక్రయించకుండా ధ్వంసం చేస్తున్నారు.

రొటీన్ నెంబర్లతో లాక్ చేసినవే టార్గెట్

సాధారణంగా స్మార్ట్ ఫోన్లను ఫేషియల్, బయోమెట్రిక్, ప్యాట్రన్‌లతోపాటు పిన్ వినియోగించి లాక్, అన్‌లాక్ చేసుకోవచ్చు. అయితే ప్రతి ఫోన్‌కూ ఓ లాక్ పిన్ ఉండటం సాధారణం. స్మార్ట్ ఫోన్‌ను ఫేషియల్, బయోమెట్రిక్, ప్యాట్రన్‌ల్లో అన్‌లాక్ చేయడంలో ఇబ్బందులు వచ్చినా, అన్‌లాక్ కోసం నిర్ణీత దఫాల కంటే ఎక్కువ సార్లు ఈ మూడు ఆప్షన్స్‌ను తప్పుగా వినియోగించినా అప్పుడు పిన్ ఎంటర్ చేసి అన్‌లాక్ చేస్తుంటారు. అత్యధికులు ఇప్పటికీ '0000', '1234', '1111', '9999'వంటి రొటీన్ సంఖ్యలనే పిన్ నెంబర్లుగా పెట్టుకుంటున్నారు. ఓ ఫోన్ చోరీ చేసిన తర్వాత దొంగలు ఈ పిన్స్‌తో అన్‌లాక్‌కు ప్రయత్నిస్తున్నారు. అన్‌లాక్ సఫలీకృతమైతే బ్యాంకు ఖాతాలు ఖాళీ చేయడంపై దొంగలు దృష్టి పెడుతున్నారు.



యూపీఐ యాప్ రీ-ఇన్‌స్టాల్ చేస్తూ...

నగదు అవసరమైనవాళ్లు బ్యాంకు ఖాతా నుంచి డబ్బు డ్రా చేసుకోవడానికి గతంలో నేరుగా బ్యాంకుకు వెళ్లేవారు. ఆపై ఏటీఎం మిషన్లు, నెట్ బ్యాంకింగ్స్ వచ్చాయి. అయితే ఇప్పుడు యూపీఐ యాప్స్ వినియోగంలోకి వచ్చాయి. కోవిడ్ పిరియడ్ తర్వాత దాదాపు ప్రతి ఒక్కరి స్మార్ట్‌ఫోన్‌లోనూ యూపీఐ యాప్స్ ఉంటున్నాయి. అయితే ఫోన్ అన్‌లాక్ చేయడానికి వాడిని పిన్స్‌ను వినియోగించి దొంగలు యూపీఐ యాప్స్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా యాప్ ఓపెన్ కాకపోతే, దానిని అన్ ఇన్‌స్టాల్ చేసి, మళ్లీ ఇన్‌స్టాల్ చేసి యాక్టివేట్ చేస్తున్నారు. ఈ యాక్టివేషన్ కోసం బ్యాంకు ఖాతాతో లింకై ఉన్న సెల్‌ఫోన్ నెంబర్ తమ దగ్గర ఉండటం ఈ దొంగలకు కలిసి వస్తోంది. ఇలా యూపీఐ యాప్‌లు, ఒక్కోసారి నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫోన్ యజమానికి సంబంధించిన బ్యాంకు ఖాతాను చోరులు ఖాళీ చేసేస్తున్నారు. ఫోన్ వినియోగదారుడు మేల్కొని అవసరమైన చర్యలు తీసుకునే లోపే తీవ్ర నష్టం జరిగిపోతోంది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే...

- రొటీన్ అంకెలను పిన్ నెంబర్లుగా పెట్టుకోకూడదు. ఫోన్, యూపీఐ యాప్స్‌ను అన్‌లాక్ చేయడానికి ఒకే పిన్ వినియోగించకూడదు.
- ఫోన్ పోగొట్టుకున్నా, తస్కరణకు గురైనా వెంటనే అప్రమత్తమై సిమ్‌కార్డుతోపాటు బ్యాంకు ఖాతాను కూడా బ్లాక్, ఫ్రీజ్ చేయించాలి.
- కేవలం సిమ్‌కార్డును బ్లాక్ చేయించి ఊరుకుంటే ఫలితం లేదు. చోరుల వైఫై ద్వారా ఫోన్‌లో ఉన్న యూపీఐ యాప్స్ వాడి నగదు స్వాహా చేసే అవకాశం ఉంది.
- ఈ కేటుగాళ్లు కొన్నిసార్లు స్క్రీన్ గార్డులు అధ్యయనం చేయడం ద్వారా ప్యాట్రన్స్, పిన్ నెంబర్లను గుర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన, ఎలాంటి గుర్తులు పడని స్క్రీన్ గార్డులు వాడాలి.
- అవకాశం ఉన్న వాళ్లు ఓటీపీలు పొందేందుకు ప్రత్యేకంగా ఓ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలి. ఈ సిమ్‌ను స్మార్ట్ ఫోన్‌లో కాకుండా చిన్న బేసిక్ ఫోన్ ద్వారా వినియోగించాలి.

రికార్డుల్లో ఎక్కిన రెండు ఉదంతాల్లో ఇలా...

- నగరానికి చెందిన ఓ వ్యక్తి మెట్రో రైలులో మూసాపేట నుంచి జూబ్లీహిల్స్‌కు ప్రయాణిస్తుండగా అతడి సెల్‌ఫోన్ తస్కరణకు గురైంది. దీనిపై ఆయన జూబ్లీహిల్స్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ ఫోన్ చేజిక్కించుకున్న దొంగలు దాని నెట్ బ్యాంకింగ్, యూపీఐ యాప్‌లను యాక్సస్ చేశారు. వీటి ఆధారంగా బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.5.2 లక్షలు కాజేశారు. ఈ అంశంలో కొసమెరుపు ఏంటంటే.. బాధితుడి క్రెడిట్ లిమిట్‌ను పెంచి మరీ స్వాహా చేయడం.
- వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలానికి చెందిన ఓ లారీ డ్రైవర్ ఇటీవల తన వాహనంలో సిమెంట్ లోడ్ తీసుకుని నగరం నుంచి తాండూరు వెళ్తున్నారు. అజీజ్‌నగర్ వద్ద లారీ ఆపి విశ్రాంతి తీసుకుంటున్న క్రమంలో ఆయన జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు చోరులు తస్కరించారు. ఇందులోని యూపీఐ యాప్‌లు వాడి ఓల్డ్ బోయిన్‌పల్లి, లక్డీకాపూల్ తదితర ప్రాంతాల్లో 20 లావాదేవీల ద్వారా రూ.75 వేలు స్వాహా చేశారు. పలువురిని కలిసి ఈ దొంగలు ఆస్పత్రి ఖర్చుల పేరుతో నగదు అత్యవసరం అని చెప్పారు. బాధితుడి బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు యూపీఐ ద్వారా వారికి పంపి, వారి నుంచి డబ్బు తీసుకున్నారు.

కుటుంబ తగాదా.. ఒకరికి కత్తిపోట్లు

చిలుకానగర్‌లో ఘటన

ఉప్పల్: రెండేళ్లు సహజీవనం చేసిన అనంతరం మనస్పర్థలతో విడిపోయినవారి మధ్య జరిగిన గొడవ ఒకరి కత్తిపోట్లకు దారి తీసింది. ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి తెలిపిన ప్రకారం... నల్లగొండ నివాసి లత(29) ఇళ్లల్లో పనిచేస్తోంది. భర్త చనిపోవడంతో పిల్లలతో కలిసి ఉంటోంది. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ జానకిరాములు(35)తో ఆమెకు పరిచయం ఏర్పడింది. అతడి భార్య కూడా చనిపోవడంతో గత రెండేళ్లుగా వీరు సహజీవనం చేస్తున్నారు. అయితే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో నెలరోజుల క్రితం విడిపోయారు. జానకిరాములు నగరానికి వచ్చి చిలుకానగర్‌లో నివాసముంటున్నాడు. సామాన్లు, పిల్లల సర్టిఫికెట్లు ఇవ్వాలని జానకిరాములుకు లత ఫోన్ చేయగా చిలుకానగర్ మల్లికార్జునగర్‌లోని తన ఇంటికి రమ్మని పిలిచాడు. దీంతో లత తన చెల్లెలు, ఆమె భర్త ప్రశాంత్, అక్కతో కలిసి సోమవారం చిలుకానగర్‌కు వచ్చింది. సామాన్లు తీసుకునే క్రమంలో వారి మధ్య గొడవ జరిగింది. జానకిరాములు కొడవలితో ప్రశాంత్‌పై దాడికి పాల్పడ్డాడు. తల, చేయిపై తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

స్కూల్ డ్యాన్స్ మాస్టర్‌పై పోక్సో కేసు

బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘటన

మేడిపల్లి: ఐదేళ్ల చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ డ్యాన్స్ మాస్టర్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బోడుప్పల్‌లో నివాసముంటున్న సార రవికుమార్(37) కిరణ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో రెండేళ్ల నుంచి డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. కాగా, గత శుక్రవారం పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న ఓ చిన్నారి(5) డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో అసభ్యంగా ప్రవర్తించాడు. అనంతరం ఇంటికి వెళ్లిన చిన్నారి ఆ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో సోమవారం చిన్నారి తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి యాజమాన్యాన్ని నిలదీశారు. డ్యాన్స్ మాస్టర్‌కు దేహశుద్ధి చేశారు. మేడిపల్లి పోలీసు సంఘటనాస్థలానికి చేరుకుని రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు.



పాఠశాల వద్ద గుమిగూడిన స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు

లిఫ్ట్ ప్రమాదంలో సైట్ ఇంజినీర్ మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



లక్ష్మీనారాయణ (ఫైల్)

మియాపూర్: నిర్మాణంలో ఉన్న భవనంలోని లిఫ్ట్ కేబుల్ తెగి ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మియాపూర్ సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌పేట గోపాల్‌రావునగర్ కాలనీలోని మంజీరా రోడ్డులో ఆదిత్య పార్చ్యూన్ హైట్స్ పేరుతో హైరైజ్ బిల్డింగ్ నిర్మిస్తున్నారు. అదే కంపెనీలో గచ్చిబౌలి అంజయ్యనగర్‌కు చెందిన ఉప్పల లక్ష్మీనారాయణ(56) సైట్ ఇంజనీర్. బీహార్‌కు చెందిన సద్దాం, అర్బజ్ సలాంతో కలిసి ఆదిత్య పార్చ్యూన్ హైట్ భవన నిర్మాణంలో లిఫ్ట్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం లిఫ్ట్ 12వ అంతస్తు నుంచి 9వ అంతస్తుకు రాగానే కేబుల్ తెగి కిందపడటంతో అందులో ఉన్న లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సద్దాం, సలాంలకు తీవ్ర గాయాలయ్యాయి. కంపెనీలో పనిచేసే సిబ్బందికి ఎలాంటి రక్షణ చర్యలు(హెల్మెట్లు, ఇతర పరికరాలు) లేవని, కంపెనీ నిర్లక్ష్యం వల్లే లక్ష్మీనారాయణ మృతి చెందాడని ఆయన కుమారుడు ఉదయ్ సత్యసాయి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

షేర్‌చాట్ వీడియోల పేరిట మోసం

- బాధితురాలికి రూ.11.20 లక్షల టోకరా

హిమాయత్ నగర్: ఇంటి వద్దే షేర్‌చాట్ వీడియోలు చూస్తూ ఈజీగా డబ్బు సంపాదించవచ్చని నమ్మించి సైబర్ నేరగాళ్లు ఓ ప్రైవేట్ ఉద్యోగిని మోసగించారు. సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం... నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగిని(25) ఇన్‌స్టాగామ్‌లో ఒక ప్రకటనను చూసి కాయిన్‌డీసీఎక్స్ కంపెనీవారిని సంప్రదించింది. 30 సెకన్ల షేర్‌చాట్ వీడియోలను చూస్తూ డబ్బు సంపాదించవచ్చని వారు ఆమెను నమ్మించారు. ఈ మేరకు బాధితురాలు వాట్సాప్‌లో మూడు టాస్క్‌లను పూర్తి చేసింది. అందుకుగాను మోసగాళ్లు ఆమెకు కొంత డబ్బు చెల్లించారు. అనంతరం ఆమెను టెలిగ్రామ్ గ్రూపులో చేర్చి 20 టాస్క్‌లు ఇచ్చారు. వాటిలో 16 వీడియోలు, మిగిలిన 4 ప్రీపెయిడ్ టాస్క్‌లని చెప్పారు. అనంతరం ఏదో సాకుతో ఆమె ఖాతాను ఫ్రీజ్ చేశారు. దానిని పునరుద్ధరించడానికి డబ్బును పెట్టుబడి పెట్టాలని అడిగారు. వారు చెప్పిన విధంగా డబ్బు బదిలీ చేసినా ఖాతాను అన్‌ఫ్రీజ్ చేయలేదు. ఖాతాకు సెక్యూరిటీ వెరిఫికేషన్ చేయాలని ఆమె బ్యాంక్ ఖాతా నంబర్, బ్యాంక్ కార్డ్‌తో ఉన్న ఫొటో, బ్యాలెన్స్‌లో 60% పంపాలన్నారు. ఈ మేరకు చెల్లించిన అనంతరం మరింత డబ్బు అడగడంతో ఆమెకు అనుమానం వచ్చింది. విడతలవారీగా ఇచ్చిన రూ.11.20 లక్షలను తిరిగి ఇచ్చేయాలని ఆమె కోరగా వారు తిరస్కరించారు. దీంతో బాధిత మహిళ నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



గిరిబాబు (ఫైల్)

పోచారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోచారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద రాజీవ్ గృహకల్పకు చెందిన క్యాబ్ డ్రైవర్ బొడ్డు గిరిబాబు(38) ఆదివారం సాయంత్రం జాతీయ రహదారి 163 దాటుతుండగా ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వైపు వేగంగా వెళ్తున్న ఓ కారు ఢీకొట్టింది. దీంతో అతడు గాలిలోకి ఎగిరి కింద పడ్డాడు. తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు నారపల్లిలోని వజ్ర హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి, తర్వాత గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున అతడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారుతోపాటు డ్రైవర్‌ను గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. గిరి బాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పోలీసులను బెదిరించిన హోంగార్డ్‌పై కేసు

ఘట్‌కేసర్: పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరించిన ఓ హోంగార్డ్‌పై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాలు... ఘట్‌కేసర్ వారాంతపు సంతలో ఈ నెల 12న హయత్‌నగర్‌కు చెందిన ధనుంజయ మెడలోంచి బంగారు, వెండి గొలుసును లాక్కెళ్లిన ఘటనలో అంబేడ్కర్‌నగర్‌కు చెందిన అజ్మీరా వెంకటేశ్ నిందితుడు. అతడి తండ్రి కిషన్(51) సైబరాబాద్ పోలీస్ కమిషరేట్ పరిధిలో హోంగార్డ్. ధనుంజయ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు వెంకటేశ్‌ను ఈ నెల 13న అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం రిమాండ్‌కు తరలిస్తుండగా కిషన్ వచ్చి 'నేను హోంగార్డును, మా కుమారుడినే రిమాండ్‌కు తరలిస్తారా..' అంటూ పోలీసులను దూషించాడు. డీఐ శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగాడు. 'నా కుమారుడిని రిమాండ్‌కు తరలిస్తే మీ అంతు చూస్తా, మీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి సస్పెండ్ చేయిస్తా'అని హెచ్చరించాడు. దీంతో విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా బెదిరించిన హోంగార్డుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బావను కొట్టి చంపిన బావమరిది

జవహర్‌నగర్: సోదరిని వేధింపులకు గురిచేస్తున్నాడనే కోపంతో బావను బావమరిది కర్రతో కొట్టి చంపిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జవహర్‌నగర్ శ్రీరామ్‌నగర్ కాలనీలో కారుడ్రైవర్ కానుగంటి రాజుగౌడ్(32), భార్య భవాని, కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నాడు. ఆదివారంరాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన రాజు భార్యతో గొడవపడి చేయి చేసుకున్నాడు. అడ్డుకోబోయిన అత్తపై కూడా దాడికి పాల్పడ్డాడు. దీంతో కోపోద్రిక్తుడైన బావమరిది చందు బావపై కర్రతో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన రాజును స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిల్డర్‌పై చీటింగ్ కేసు నమోదు

బంజారాహిల్స్: ఇల్లు అమ్ముతానని నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసగించిన ఓ బిల్డర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10లోని జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీగా గుంతపల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్‌గా ఆయన భార్య పద్మజ వ్యవహరిస్తున్నారు. యాదాద్రిలో జీఎస్‌ఆర్ శ్రీనివాస టెంపుల్ టౌన్ పేరుతో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో మోతీనగర్ అవంతినగర్‌కు చెందిన బిందు మౌనిక రూ.25 లక్షలు చెల్లించి 2021లో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుగోలు చేసింది. రెండేళ్లలో ఫ్లాట్ అప్పగిస్తామని, అప్పటి వరకు రూ.15 వేల కిరాయి కూడా చెల్లిస్తామని బిల్డర్ చెప్పారు. అయితే ఎంతకూ ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయకపోగా, అక్కడ కనీసం అపార్ట్‌మెంట్ కూడా కట్టలేదని బాధితురాలు గ్రహించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బిందు మాధవితోపాటు మల్లికార్జున్ అనే వ్యక్తిని కూడా బిల్డర్ మోసగించారు. చాలామందిని ప్లాట్ల పేరుతో మోసగించిన ఘటనలో వీరిపై ఇప్పటికే జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో, సీసీఎస్‌లో కేసులు ఉన్నాయి. జూబ్లీహిల్స్ పోలీసులు తాజాగా గుంతపల్లి శ్రీనివాసరావు, పద్మజలపై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

బైక్‌పై మృతదేహాన్ని తెచ్చి పడేశారు

- వీడిన ట్రాన్స్‌జెండర్ హత్య కేసు మిస్టరీ
- డబ్బుల కోసం గంజాయి గ్యాంగ్ చిత్రహింసలు
- నలుగురు నిందితులు అరెస్టు..రిమాండ్..



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్

సనత్‌నగర్: ట్రాన్స్‌జెండర్ హత్య కేసు మిస్టరీని సనత్‌నగర్ పోలీసులు ఛేదించారు. గంజాయి గ్యాంగ్ ఈ హత్యకు పాల్పడినట్లుగా పోలీసులు తేల్చారు. ఈ కేసులో బాలానగర్ రాజుకాలనీకి చెందిన దుడాని సాగర్‌సింగ్(24), ఒన్నాపురం ప్రవీణ్ (20), సూరారం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన కరణ్ బిశ్వజిత్(20), రాజుకాలనీకి చెందిన బాలింగ్ అభినవ్(19)లను పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను సనత్‌నగర్‌లో బాలానగర్ డీసీపీ కొల్లు సురేష్‌కుమార్, ఏసీపీ హనుమంతరావు, సనత్‌నగర్, బాలానగర్ ఇన్‌స్పెక్టర్లు పురేందర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌లతో కలిసి వెల్లడించారు.

గంజాయి మత్తులోనే..

ఈ నెల 12న తెల్లవారుజామున బాలానగర్ చౌరస్తా వద్ద ట్రాన్స్‌జెండర్ షీలా ఉండగా అదే సమయంలో సాగర్‌సింగ్, ప్రవీణ్, కరణ్ బిశ్వజిత్‌లు అక్కడికి వచ్చారు. అప్పటికే గంజాయి మత్తులో ఉన్నవారు కత్తులతో బెదిరించి షీలాను డబ్బులు డిమాండ్ చేశారు. రూ.3 వేలను ఇచ్చినప్పటికీ అవి సరిపోవంటూ ఆమె వద్ద ఉన్న ఫోన్ లాక్కొని ఫోన్‌పే పాస్‌వర్డ్ చెప్పాలన్నారు. ఆమె పాస్‌వర్డ్ తప్పుగా చెప్పడంతో విచక్షణారహితంగా కొట్టారు. సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి స్తంభానికి కట్టేసి కర్రలు, కత్తితో దాడి చేశారు. దీంతో భయపడి ఏటీఎం కార్డు ఇంట్లో ఉందని చెప్పడంతో సాగర్‌సింగ్, బిశ్వజిత్‌లు షీలాను బైక్‌పై ఎక్కించుకుని హెచ్‌ఎంటీ సొసైటీలోని ఆమె ఇంటికి బయలుదేరారు. వారి స్నేహితుడు అభినవ్‌తో కలిసి ఆమె ఇంటికి వెళ్లి అల్మారాలో డబ్బులు, ఏటీఎం కార్డు గురించి వెతికారు. ఏమీ దొరక్కపోవడంతో కత్తులతో దాడి చేసి ఆమెను హతమార్చారు. షీలా మృతదేహాన్ని బైక్‌పై తీసుకువచ్చి ఫతేనగర్ గ్రేవ్‌యార్డులో పడేసి పరారయ్యారు.

జాతరను తలపించేలా...
శాకంబరి ఉత్సవాలు



- ముగింపు వేడుకల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులు
- మూడురోజులు భక్తులతో కిటకిటలాడిన పెద్దమ్మ దేవాలయం
- ఆకట్టుకున్న కూరగాయల హారాలు



జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయంలో అమ్మవారు..



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ దేవాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న అమ్మవారి శాకంబరి ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. వివిధ రకాల కూరగాయలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయాన్ని, అమ్మవారిని తిలకించేందుకు నగర నలుమూలల నుంచి భక్తులు భారీగా విచ్చేయడంతో ఆలయ పరిసరాలన్నీ భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. సోమవారం ముగింపు వేడుకలకు భక్తులు వేలాది సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతిఏటా ఆషాఢ మాసంలో అమ్మవారి శాకంబరి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూడా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో హారాలుగా వేసి సుందరంగా అలంకరించారు. దీంతో మూడు రోజులు అమ్మవారు కూరగాయల హారాలతో భక్తులకు దర్శనమిచ్చారు. గర్భగుడితో పాటు ప్రాంగణమంతా బెండకాయలు, కాకరకాయలు, సొరకాయలు, పొట్లకాయలు, గుమ్మడికాయలు, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, దొండకాయలు, వంకాయలు, ఆలుగడ్డ, క్యాప్సికమ్, పాలకూర, కొత్తిమీర, క్యారెట్, బీట్‌రూట్‌తో పాటు ఆపిల్, పైనాపిల్, అరటిపండ్లు, వాటర్ మిలన్, ఖర్బూజ తదితర పండ్లతో అలంకరించడంతో ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. కూరగాయలతో చేసిన అలంకరణ భక్తులను ఆనంద పారవశులను చేసింది. ఎటుచూసినా కూరగాయలు, పండ్ల హారాలు శాకాంబరి ఉత్సవాలకు కొత్త అందాలను తీసుకువచ్చాయి. సుందరంగా ముస్తాబు చేసిన ప్రధాన ద్వారం, ప్రాంగణం, గర్భగుడి భక్తులను ఆనందానుభూతులకు లోనుచేసింది. సోమవారం ముగింపు రోజు కావడంతో వాటన్నింటినీ వేలాది మంది భక్తులకు వితరణ చేయగా, రాత్రిపూట ఆలయ పరిసరాల్లో జాతర వాతావరణం నెలకొంది. భక్తుల ఆనందోత్సాహాల నడుమ శాకంబరి ఉత్సవాలు విజయవంతంగా ముగియడంలో సిబ్బంది, ఆలయ అధికారులు చూపిన చొరవ ప్రశంసనీయమని భక్తులు కొనియాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ శ్రీనివాసరాజు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, ఫౌండర్ ట్రస్టీ విష్ణువర్ధన్‌రెడ్డి.

బంజారాహిల్స్: శాకంబరి ఉత్సవాలు సోమవారంతో ముగియనుండటంతో తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగాలు, నవగ్రహ హోమం, రుద్ర, చండీ హోమాలు బలిహరణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పూర్ణాహుతి వేడుకల్లో ఆలయ ఫౌండర్ ట్రస్టీ పి. విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం పెద్దమ్మతల్లి పల్లకీ సేవ నిర్వహించారు.

బీజేఆర్‌నగర్ నాలాపై అక్రమ నిర్మాణాల తొలగింపు



నాలాపై అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ బీజేఆర్‌నగర్ బస్తీలో నాలాపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది సోమవారం తొలగించారు. నాలాపై ఓ వ్యక్తి అక్రమంగా పైకప్పు వేసేందుకు నిర్మాణం చేపడుతుండడంతో ఫిర్యాదులు అందగా జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్ ప్లానింగ్ ఏసీపీ సంపత్ ఆధ్వర్యంలో సంబంధిత సిబ్బంది వీటిని పూర్తిగా తొలగించారు. ఇదిలా ఉండగా నాలా పైకప్పు లేకపోవడం వల్ల వ్యర్థాలు పేరుకుపోతుండడంతో దుర్వాసనతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, జీహెచ్‌ఎంసీ నాలా పైకప్పు నిర్మించకపోగా తామే సొంత డబ్బులతో నిర్మించుకుంటుంటే మీకు వచ్చిన సమస్య ఏమిటంటూ స్థానికులు సంబంధిత అధికారులను నిలదీశారు. నాలాపై స్లాబ్ నిర్మించాలని, తాము గత 15 సంవత్సరాలుగా అధికారులను కలసి వినతిపత్రం సమర్పించామని, ప్రజాప్రతినిధులను కూడా కలవడం జరిగిందని, ఏ ఒక్కరూ స్పందించ లేదని, దీంతో తామే నాలా పైకప్పు నిర్మాణానికి ముందుకు వచ్చామన్నారు. నాలా పైకప్పు నిర్మించడం వల్ల ఎలాంటి సమస్యలు ఉండబోవని స్థానికుల రాకపోకలు ఇంకా తేలికవుతాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే అనుమతులు లేకుండా ఇలా స్లాబ్ నిర్మించడం సబబు కాదని అధికారులు తెలిపారు. ఇది అక్రమ నిర్మాణం కిందికే వస్తుందని వెల్లడించారు.

మర్యాదపూర్వక కలయిక



ఎంపీ ఈటలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కీర్తిరెడ్డి జూటూరు

శ్రీనగర్‌కాలనీ: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను సోమవారం హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షురాలు కీర్తిరెడ్డి జూటూరు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జిల్లా, జూబ్లీహిల్స్ నియోజకవర్గ రాజకీయ పరిణామాల గురించి వివరించి పలు అంశాలపై చర్చించారు. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ స్థానాల్లో గెలిచి గ్రేటర్ పీఠాన్ని దక్కించుకుంటుదని ధీమా వ్యక్తం చేశారు.

బీజేఆర్‌నగర్ బస్తీ సంఘం రద్దు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీ సమావేశం పెద్దల సమక్షంలో సోమవారం నిర్వహించారు. దీంతో బస్తీలో సమస్యలపై ఇందులో వాడీవేడిగా చర్చించారు. గత ఏడాది అధ్యక్షుడిగా నల్లవు యాదగిరిని ఎన్నుకున్నారని, కానీ ఎలాంటి అభివృద్ధి జరగలేనందున ఈ కమిటీని రద్దు చేస్తున్నట్లు తీర్మానించారు. బస్తీ పెద్దలు, మహిళలు, యువత అంతా కలసి బీజేఆర్‌నగర్ బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికలను రాజకీయాలకతీతంగా నిర్వహించాలని తీర్మానించారు. ఎవరికి వారే నాయకులమని ప్రకటించుకుంటూ చలామణి అవుతుండడం వల్లనే బస్తీలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని దుయ్యబట్టారు. ఈ నెల 28న బస్తీలో కొలువుదీరిన శ్రీనల్లపోచమ్మ, శ్రీకనకదుర్గమ్మ, శ్రీఎల్లమ్మ తల్లి బోనాల వేడుకలు నిర్వహించేందుకు నిర్ణయించారు. కొత్త కమిటీని త్వరలో ఎన్నుకునేందుకు నిర్ణయించారు. ఈ సమావేశంలో బస్తీ నేతలు ఎస్.మధుకర్, నర్సింహ, నడిమింటి కృష్ణ, దామోదర్, శ్యాం, బాలరాజ్‌గౌడ్, దనగళ్ల ప్రభాకర్, విష్ణు, గ్యాస్ శ్రీను, సైదులు, రాములు, రవినాయక్, అశోక్, భాస్కర్, రాములమ్మ, ధనమ్మ, పద్మ, మల్లీశ్వరి, సరస్వతీ, శంకరమ్మ, భాగ్యమ్మ, కండె రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్స్ పేరుతో బ్లాక్‌మెయిల్

పంజగుట్ట: హ్యూమన్ రైట్స్ సంస్థ పేరుతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రియల్ ఎస్టేట్ వ్యాపారి మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన హ్యూమన్ రైట్స్ పేరుతో ఓ సంస్థ ప్రతినిధులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి తాను నాలుగు సంవత్సరాల్లో రూ. 400 కోట్లు సంపాదించానని, 400 ఎకరాల స్థలం ఉందని, 11 విల్లాలు ఉన్నాయని, తనపై పీడీయాక్ట్ కూడా ఉందని ఈ నాలుగు సంవత్సరాల్లో తాను కేవలం రూ. 10 లక్షల నుంచి 25 లక్షలు మాత్రమే ట్యాక్స్ కట్టానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. తనకు నాలుగు వందల కోట్లు సంపాదించి ఉంటే నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వడ్డెరలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



నియామక పత్రాలతో నూతన కార్యవర్గం

పంజగుట్ట: వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల ప్రచారం సమయంలో వడ్డెరలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఆ హామీని నెరవేర్చాలని ఆయన కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంచార జాతులుగా ఉన్న తమకులం గతంలో ఎస్టీ జాబితాలో ఉండేదని దాన్ని బీసీ ఏలోకి మార్చారని, తిరిగి ఎస్టీ జాబితాలోకి మార్చాలని ఆయన కోరారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల నిధులు మంజూరు చెయ్యాలని, ఆత్మగౌరవ భవనానికి ఐదు ఎకరాల స్థలం, రూ. 10 కోట్ల రూపాయలు ఇచ్చి భవనానికి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న రాజభవనం పేరు పెట్టాలని కోరారు. తాము ఎంతో ప్రమాదకరమైన పనులు చేస్తుంటామని ప్రమాదంలో మరణిస్తే రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షునిగా ఎత్తరి మారయ్య, ప్రధాన కార్యదర్శిగా సంపంగి ప్రభాకర్, చీఫ్ అడ్వైజర్‌గా, ఎం.గండయ్య, యువజన అధ్యక్షుడిగా శేఖర్, సెక్రటరీగా వెంకటేశ్, యూత్ సెక్రటరీగా రమేష్, జనగామ అధ్యక్షుడిగా రమేష్ తదితరులను ఎంపికచేసి నియామక పత్రాలు ఇచ్చారు.

ఆయుర్వేదం నుంచే సర్జరీ పుట్టింది

ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్యశాలలో ప్రపంచ ప్లాస్టిక్ సర్జన్‌డే



ఆచార్య సుశ్రుతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆయుర్వేద వైద్యకళాశాల ప్రొఫెసర్లు

వెంగళరావునగర్: ఆయుర్వేదంలో సర్జరీ ఉందా అని ప్రశ్నించే వారికి ఆయుర్వేదం నుంచే సర్జరీ పుట్టిందని సుశ్రుత సంహిత తెలియజేస్తుందని ఎర్రగడ్డ ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రారెడ్డి తెలియజేశారు. ప్రపంచ ప్లాస్టిక్ సర్జన్స్‌డే (సుశ్రుత జయంతి)ను పురస్కరించుకుని ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య సుశ్రుతుడిని ఫాదర్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జన్ అంటారని, క్రీస్తు పూర్వం 600 సుశ్రుత గ్రంథాన్ని రచించినట్టు పేర్కొన్నారు. ఈ గ్రంథంలో ఆయుర్వేదంలో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీల గురించి వివరంగా తెలియజేశారని అన్నారు. ఆనాటి మూల సిద్ధాంతాల ఆధారంగానే నేటి ప్లాస్టిక్ సర్జన్లు ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. శస్త్ర చికిత్సల్లో అనేక పద్ధతులను సుశ్రుతుడు ప్రపంచానికి తెలియజేశారని కొనియాడారు. తొలుత సుశ్రుతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ, శల్య విభాగ అధిపతి డాక్టర్ ప్రభాకర్, నేషనల్ సుశ్రుత అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎస్. సారంగపాణి, అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ, కోశాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, సభ్యులు, జయకృష్ణ, సునీత, కార్తీక్, శ్రీనివాస్‌లతో పాటుగా పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రి లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

బోరబండలో ఆపరేషన్ ఛబుత్రా


రాత్రి పది గంటల తరువాత గస్తీ కట్టుదిట్టం



యువకున్ని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు...

రహమత్‌నగర్: అర్ధరాత్రి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే యువకులపై బోరబండ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆయుధాలు కలిగి, మద్యం మత్తులో తూగుతున్న వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారు. గత వారం రోజులుగా జరుగుతున్న ఈ ఆపరేషన్ ఛబుత్రా కార్యక్రమంలో ఇప్పటికే అనేకమంది యువకులు కటకటాల పాలయ్యారు. ఈ సందర్భంగా బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ మాట్లాడుతూ బోరబండ స్టేషన్ పరిధిలో రాత్రిళ్లు జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. రాత్రిళ్లు మరణాయులతో తిరుగుతున్న యువకులు, గంజాయి సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం ఎస్‌ఆర్‌టీనగర్‌కు చెందిన మహ్మద్ షరీఫ్, మహ్మద్ మాజీద్, మదాపూర్‌కు చెందిన ఆర్యన్ కూమార్, నందినగర్‌కు చెందిన షేక్‌దస్తగీర్, బోరబండకు చెందిన బల్జిత్ కూమార్‌లను రిమాండ్‌కు తరలించడం జరిగిందని చెప్పారు. రాత్రి పది గంటలు తరువాత రహదారులపై యువకులు కూర్చోకూడదని ఆయన హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారి కోసం పోలీసులు ప్రత్యేకంగా గస్తీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు రాత్రిళ్లు బయట తిరుగకుండా జాగ్రత్తలు తీసు కోవాలని ఆయన సూచించారు.

దీపాదాస్ మున్షీ జన్మదిన వేడుక



రహమత్‌నగర్: ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ పుట్టిన రోజు వేడుకలను సోమవారం బోరబండ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకురాలు, కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా ఆధ్వర్యంలో పలు బస్తీలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోనే మహిళలకు సముచిత గుర్తింపు లభిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ చెందిన మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

నటి కరాటే కళ్యాణిపై కేసు నమోదు

క్రైం కార్నర్..

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా పోలీస్‌స్టేషన్ ముందు గుమికూడడమే కాకుండా, విద్వేషాలు రెచ్చగొట్టే రీతిలో నినాదాలు చేసినందుకు నటి కరాటే కళ్యాణితో పాటు శివాజీరాజ్ అనే వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై ఇటీవల శివాజీరాజ్ అనే వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేసిన కారణంగా బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావటంతో ఈ కేసు విషయంలో శివాజీరాజ్‌తో పాటు ఆయనకు మద్దతుగా కరాటే కళ్యాణి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. వీరితో పాటు వచ్చిన ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు నినాదాలు చేశారు. అదే సమయంలో కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకున్నారు. ఇరువైపులా తమ తమ పార్టీలకు అనుకూలంగా నినాదాలు చేస్తుండడంతో పరిస్థితి అదుపు తప్పింది. దీంతో పోలీసులు ఇరువర్గాలను పోలీసులు శాంతింపజేశారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ పి.సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరాటే కళ్యాణి, శివాజీరాజ్‌తో పాటు వారి అనుచరులు నిర్వహించిన అనుమతి లేని ర్యాలీ, రెచ్చగొట్టే నినాదాలపై కేసు నమోదు చేసి బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించకపోతే పెళ్లి చెడగొడతా...

బెదిరించిన వ్యక్తిపై యువతి ఫిర్యాదు

వెంగళరావునగర్: ప్రేమించకపోతే పెళ్లి చెడగొడతానంటూ యువతిని బెదిరిస్తున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌కాలనీకి చెందిన యువతి ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. గత ఏడాది కిందట ఆమెకు రామ్‌నగర్‌కు చెందిన కిరణ్ అనే వ్యక్తి ఫేస్‌బుక్ ద్వారా పరిచయం అయ్యాడు. ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టగా ఆమె అంగీకరించింది. అనంతరం ప్రేమ ప్రపోజల్ చేశాడు. తొలుత నిరాకరించినప్పటికీ అనంతరం ఓకే చెప్పింది. ఇరువురూ కలసి వారి స్నేహితుల బర్త్‌డేకు వెళ్లారు. అక్కడ అందరూ కలసి ఫొటోలు దిగారు. విషయం యువతి ఇంట్లో తెలిసి విచారించగా కిరణ్ మంచివాడు కాదని తెలిసింది. యువతి తల్లిదండ్రులు ఆమెకు విషయాన్ని తెలియజేయగా ఆమె అతనిని దూరం పెట్టింది. అనంతరం యువతికి ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. విషయం తెలుసుకున్న కిరణ్ ఆమెకు ఫోన్ చేసి తనను మళ్ళీ ప్రే మించాలని, లేకపోతే ఫొటోలు మార్ఫింగ్ చేసి పెళ్లి చెడగొడతానని బెదిరిస్తున్నాడు. దీంతో యువతి తల్లి సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాయమాటలు చెప్పి ఫోన్‌తో జంప్

వెంగళరావునగర్: యువకునికి మాయమాటలు చెప్పి ఫోన్ తీసుకుని పారిపోయిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... కాకినాడకు చెందిన బి.నవీన్ మాదాపూర్‌లోని ఓ షాపులో స్టోర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా కృష్ణకాంత్ పార్క్ వద్ద వాహనం ఆగిపోయింది. ఆ సమయంలో తరుణ్, సంతోష్ అనే యువకులు వచ్చి సమస్య తెలుసుకుని మరమ్మతులు చేశారు. అనంతరం స్నేహితుడికి ఫోన్ చేయాలంటూ నవీన్ వద్ద సెల్‌ఫోన్ తీసుకొని మాట్లాడుతున్నట్టుగా నటిస్తూ పరారయ్యారు. వారిని పట్టుకోవడానికి ప్రయత్నించినప్పటికీ నిందితులు చిక్కలేదు. బాధితుడు సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ జనగణనపై విధానపర ప్రకటన చేయాలి

లిబర్టీ: పార్లమెంటు సమావేశాలు ప్రారంభానికి ముందే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బీసీ జనగణనపై విధానపర ప్రకటన చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రు కుమారస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ముందుగానే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బీసీ జన గణనపై కేంద్ర ప్రభుత్వ పక్షాన స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రధానమంత్రి అయిన మోదీ కూడా బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. ఎన్‌డీఏ కూటమిలోని బీసీ కేంద్ర మంత్రులు, బీసీ లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు, రాజ్యసభ నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఇస్తున్న బీసీ మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచి జనగణన ప్రకటన చేయించేలా కృషి చేయాలన్నారు. బీసీ మంత్రులు, బీసీ ఎంపీలు, బీసీ రాజ్యసభ సభ్యులు ఉండి కూడా బీసీలకు ఏమీ చేయలేదని దుస్థితిలో ఉన్నారని ప్రధానమంత్రి చేతిలో బందీగా మారాలని ఆరోపించారు. బీసీల పట్ల ఏమాత్రం ప్రేమ ఉన్న చిత్తశుద్ధి ఉన్న జనగణనపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

'ఏఐ'పై అవగాహన అవసరం



ప్రసంగిస్తున్న టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా

బంజారాహిల్స్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో వస్తున్న మార్పుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా అన్నారు. సోమవారం వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా సుల్తాన్–ఉల్–ఉలూమ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సంయుక్తంగా 'ఫార్మాస్యూటికల్ సైన్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ కాలానుగుణంగా వస్తున్న టెక్నాలజీపై అవగాహన ఎంతో ముఖ్యమన్నారు. 0.3–0.4 కంటే చిన్న వైవిధ్యాలు ఫలితాలను ఎలా ప్రభావితం చేస్తాయో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనుపమ కోనేరు, ఎస్‌యూసీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాగా చదువుకొని పేరు తేవాలి



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న విజయారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పి. విజయారెడ్డి ఆకాంక్షించారు. సోమవారం బంజారాహిల్స్‌రోడ్ నెం.7లోని ప్రభుత్వ పాఠశాలలో ఆమె విద్యార్థులకు పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు తన తండ్రి పీజేఆర్ కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారని గుర్తు చేశారు. విద్యతోనే సమాజ అభివృద్ధి జరుగుతుందని ఆమె అన్నారు. బాగా చదువుకొని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి ఏటా తమ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్స్ అందిస్తుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆనంద్, నజీర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన వారాహిదేవి ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీకృష్ణ చాముండేశ్వరి పీఠంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. తొమ్మిదిరోజుల పాటు ఎంతో నిష్ఠతో అమ్మవారికి పూజలు నిర్వహించామని, పలువురు ప్రముఖులు సైతం వారాహి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారని శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి తెలిపారు. పీఠంలో పలు సందర్భాల్లో పూజలు నిర్వహిస్తుంటామని తెలిపారు. భక్తులు ఎప్పుడైనా పూజల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం



పూజలు చేస్తున్న ఎంఎల్‌సీ మీర్జా రహమత్ బేగ్

శ్రీనగర్‌కాలనీ: మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీక అని ఎంఐఎం ఎంఎల్‌సీ మీర్జా రహమత్ బేగ్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిగూడలోని అసుర్‌ఖానా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మొహర్రంను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్‌కాలనీ ఎంఐఎం బ్రాంచ్ ప్రెసిడెంట్ షేక్ జాఫర్, ఎండీ అజర్, షేక్ నిజామ్, షేక్ షరీఫ్, మహబూబ్, ఉమన్, సల్మాన్, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నామని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర చైర్మన్ వి.చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంస్థ వనపర్తి జిల్లా చైర్మన్‌గా పానగల్ మండలం, శాకాపూర్ గ్రామానికి చెందిన ఏ. మౌనిక తిరుపతి యాదవ్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే అన్ని జిల్లా మండల కమిటీలు ఏర్పాటు చేసి సంస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో వినియోగదారులకు హక్కులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ వై.గోపి గౌడ్, సుధాకర్, రమేష్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బోనాల చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సోమవారం బోనాల చెక్కులను పంపిణీ చేశారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజారుద్దీన్, ఆలయ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆషాఢ మాస బోనాలు పండుగ ఘనంగా నిర్వహించేందుకు నిధులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. చెక్కులను ఆయా దేవాలయ కమిటీలకు అందించాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 82 ఆలయాలకు గాను రూ.39,77,600 మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సంవత్సరం రూ. 3,61,600 అదనంగా ఇచ్చారని ఆమె గుర్తు చేశారు.

ఇళ్ల కోసం దండిగా దరఖాస్తులు



దరఖాస్తు చేసుకున్న నిరుపేదలు

సాక్షి, సిటీబ్యూరో: గూడు లేని నిరుపేదల నుంచి హైదరాబాద్ ప్రజావాణికి ఇళ్ల కోసం దండిగా దరఖాస్తులు వచ్చి చేరుతున్నాయి. ప్రతివారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి నిరుపేదలు పెద్ద ఎత్తున క్యూ కడుతున్నారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి 150 మంది అర్జీలు పెట్టుకోగా అందులో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 122 దరఖాస్తులు వచ్చాయి. డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్జీలు పెట్టుకున్నారు. పెన్షన్ కోసం 8, భూసమస్యలు 9 ఇతర శాఖలకు సంబంధించి 11 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆయా శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కారం చూపాలని ఆయన అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరవన్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్‌సింగ్, జిల్లా అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 64 విన్నపాలు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన 64 సమస్యలు పరిష్కరించాలని ప్రజలు అధికారులను కోరారు. ఫోన్ ద్వారా మరో ఎనిమిది మంది తమ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రజలు తెలియజేసిన సమస్యల్లో 28 టౌన్‌ప్లానింగ్, 10 రెవెన్యూ, 7 బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్స్, 5 ఇంజినీరింగ్ మెయింటెనెన్స్, 4 పరిపాలన విభాగానికి సంబంధించినవి, 2 వాటర్‌వర్క్స్‌కు చెందినవి ఉన్నాయి. అడిషనల్ కమిషనర్లు శ్రీవాత్సవ, కె.సత్యనారాయణ, చంద్రకాంత్‌రెడ్డి, పంకజ, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, అడిషనల్ సీసీపీ గంగాధర్ తదితరులు విన్నపాలు స్వీకరించారు.


స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాం



జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న మహ్మద్ అలీ షబ్బీర్

బంజారాహిల్స్: రాష్ట్రంలో యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం వేడుకలను బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సెట్విన్, పర్యావరణ శిక్షణ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను అతిథులు తిలకించారు. సెట్విన్ సంస్థను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన అన్నారు. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉత్తమ అవకాశాలను కల్పించేలా ముందుకు సాగుతోందన్నారు. శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి, రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, ఎమ్మెల్సీ మీర్ రెహ్మత్ అలీబేగ్ ఖాద్రి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కే.శివరాంరెడ్డి, సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ సురేష్‌బాబు, తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏపీఎల్ సీజన్–3 విజేతగా వైజాగ్ వారియర్స్



సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ 2024లో వైజాగ్ వారియర్స్ ఛాంపియన్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. నగరం నుంచి లైఫ్‌స్పాన్ స్పాన్సర్ చేసిన వైజాగ్ వారియర్స్ జట్టు ఉత్తరాంధ్ర లైయన్స్‌పై 87 పరుగుల విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా నగరానికి చెందిన లైఫ్ స్పాన్ సహ యజమాని డాక్టర్ నరేంద్ర రామ్ వైజాగ్ వారియర్స్‌కు రూ.10 లక్షల నజరానా ప్రకటించారు. ఈ సీజన్‌లో తమ జట్టు విజయంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఏపీఎల్ సీజన్-3లో భాగంగా ఫైనల్ మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ 190 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఉత్తరాంధ్ర లయన్స్ దీటైన ప్రయత్నం చేసినప్పటికీ 16.3 ఓవర్లలో 102 పరుగులకు ఆలౌట్ కావడంతో వైజాగ్ వారియర్స్ విజేతగా నిలిచింది.

వైవిధ్యభరితం.. కాకతీయం

జాయపసేనాని 'నృత్తరత్నావళి'కి నిలువెత్తు నీరాజనం

తెలంగాణ సాంస్కృతిక, కళాత్మక వైభవాన్ని ఆవిష్కరించిన 'కాకతీయం'

పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి రూపకల్పన • 17న రవీంద్రభారతిలో మూడో భాగం ప్రదర్శన



కాకతీయం.. ఒక కమనీయమైన నృత్యరూపకం. రమణీయమైన సాంస్కృతిక ప్రదర్శన. శతాబ్దాల నాటి చారిత్రక, సాంస్కృతిక, కళాత్మక వైభవానికి ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి, పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి సమున్నతంగా సమర్పించిన నిలువెత్తు నృత్య నీరాజనం. ఆమె పదేళ్ల తపోఫలం కాకతీయం.. అది జాయపసేనాని విరచిత 'నృత్తరత్నావళి'ని ఆవిష్కరించిన అందెల రవళి. ఒక్కమాటలో చెప్పాలంటే 'కాకతీయం' తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వాన్ని ప్రతిబింబించే 'తెలంగాణీయం. 'కూచిపూడి నృత్యకారిణిగా, నృత్య గురువుగా విశేషమైన ప్రాచుర్యాన్ని పొందిన డాక్టర్ పద్మజారెడ్డి కళాత్మకమైన 'కాకతీయం' నృత్యరూపకాన్ని మూడు భాగాలుగా రూపొందించారు. సంస్కృతంలో ఉన్న ఆ గ్రంథాన్ని తెలుగు, ఆంగ్ల భాషల్లోకి అనువదించారు. ఇప్పటి వరకు రెండు భాగాలను ప్రదర్శించారు. 'కాకతీయం–మూడో భాగాన్ని ఈ నెల 17న(బుధవారం) సాయంత్రం రవీంద్రభారతి వేదికగా ప్రదర్శించనున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

12వ శతాబ్దం నాటి కాకతీయుల కాలంలో రాణీ రుద్రమదేవి మేనమామ అయిన జాయపసేనాని తన నృత్తరత్నావళి గ్రంథంలో సాంప్రదాయ, జానపద కళారూపాలను వివరించారు. కానీ సిద్ధేంద్రయోగి 'కూచిపూడి'కి లభించిన విశేషమైన ఆదరణ తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించే 'నృత్తరత్నావళి'కి లభించలేదనే అభిప్రాయం ఉంది. ఈ క్రమంలో పద్మజారెడ్డి కృషి, పరిశోధన ఫలితంగా 'కాకతీయం' సాంప్రదాయ, జానపదకళలకు పట్టం కట్టింది.

విభిన్నం.. వైవిధ్యం..

కూచిపూడిలో తరంగాలు, కృష్ణశబ్దాలు, అష్టపదులు, జావళీలు, థిల్లానాలు వంటివి ఉన్నట్లుగానే నృత్తరత్నావళిలోనూ రకరకాల నృత్యరూపకాలు ఉన్నాయి. కానీ నటరాజ రామకృష్ణ రూపొందించిన ఒక్క పేరిణి నృత్యం మాత్రమే ప్రాచుర్యంలోకి వచ్చింది. పైగా దాని నిడివి చాలా తక్కువ. మొత్తం 14 అధ్యాయాలు ఉన్న నృత్తరత్నారవళిలోని అన్ని సాంప్రదాయ, జానపద కళారూపాలను పరిచయం చేయాలనే లక్ష్యంతో 'కాకతీయం'ను మూడు భాగాలుగా రూపొందించినట్లు చెప్పారు డాక్టర్ పద్మజారెడ్డి.

- మొదటి రెండు భాగాల్లో ఆమె 'కందుక నృత్యం', 'భ్రమరి' 'పేరిణి'(మహిళల ప్రదర్శన), లాస్యతాండవం, చారణ, గొండలి, గట్టిసిరి, రాసకం, కొల్లాటం వంటిసాంప్రదాయ, జానపద కళలను నృత్యాలను ప్రదర్శించారు. కాకతీయం మూడో భాగంలో మరిన్ని అద్భుతమైన నృత్యరూపకాలను ప్రదర్శించనున్నారు. కందుక నృత్యం యుద్ధానంతర విజయోత్సవాన్ని ప్రకటిస్తే పేరిణి నృత్యం యుద్ధ ప్రేరణగా సమరోత్సాహాన్ని కలిగిస్తుంది.
- కందుకలో బంతులను ఎగురవేస్తూ విజయోత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నట్లుగా నృత్య ప్రదర్శన ఉంటుంది. ఈ ప్రదర్శనలో బంతులకు బదులు పద్మజారెడ్డి 108 కర్ణాలను వినియోగించారు. ఇక అప్పటి వరకు కేవలం మగవారికే పరిమితమైన పేరిణి నృత్యాన్ని ఆమె మొదటిసారి మహిళా నృత్యకారుల ప్రదర్శనగా పరిచయం చేశారు. కాకతీయ మొదటి భాగంలో ప్రదర్శించిన మరో నృత్యం భ్రమరి. భూమి చారీస్, ఆకాశ చారీస్ వంటి 20 రకాల చారీస్ ఇందులో ఉంటాయి. కఠోరమైన నృత్యభంగిమలు కూడా ఈ భ్రమరిలో కనిపిస్తాయి. లాస్యతాండవం పూర్తిగా సాంప్రదాయ నృత్యరూపకం.
- ఇక రెండో భాగంలో చారణ, గొండలి, గట్టిసిరి వంటి నృత్యాలు జానపద కళలను ప్రదర్శిస్తాయి. గట్టిసిరి ఊరూరా తిరుగుతూ చేసే ఒక నృత్యప్రదర్శన, గొండలి గిరిజనుల గుస్సాడికి ప్రతిరూపం వంటిది. కోలాటమే నృత్తరత్నావళిలోని కొల్లాటం, శ్రీకృష్ణుడు, గోపికల నడుమ సాగే రాసలాల ఘట్టమే రాసకం. 2017లో కాకతీయం మొదటి అధ్యాయాన్ని ప్రదర్శించారు. అనంతరం 2022లో శిల్పకళావేదికలో రెండో అధ్యాయాన్ని ప్రదర్శించారు. ఈ కాకతీయం కళా నృత్యరూపకంతో ఆమెను 'పద్మశ్రీ' వరించింది.



మూడు వేలకు పైగా.. కూచిపూడి ప్రదర్శనలు..

ప్రముఖ కూచిపూడి నృత్యకారిణిగా పేరొందిన పద్మజారెడ్డి ఇప్పటి వరకు దేశవిదేశాల్లో మూడు వేలకు పైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. సందేశాత్మకమైన ఇతివృత్తాలను ఎంపిక చేసుకొని నృత్యాలను ప్రదర్శించడం ఆమె ప్రత్యేకత. భ్రూణ హత్యలు, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం వంటి అంశాలను అప్పట్లో ఎంపిక చేసుకున్నారు. అలాగే మానవతా పరిమళాలను ప్రతిబింబించే లైఫ్ ఆఫ్ ద ఫ్లవర్స్, ప్రకృతి వంటి నృత్యాలను ప్రదర్శించారు.

సంగీత, నాటక అకాడమీ అవార్డును అందుకున్న మొట్టమొదటి నృత్యకారిణి కావడం గమనార్హం. 'నా శ్వాస, ధ్యాస, తపన నృత్యం. ఐదు దశాబ్దాల ప్రస్థానంలో పదేళ్లుగా 'కాకతీయం' పైనే పరిశోధనలు చేశాను. ఇప్పుడు ఈ మూడో భాగాన్ని కూడా సమాదరిస్తారని ఆకాంక్షిస్తాను.' అంటారామె.

నగరంలో నేడు..

అంతర్జాతీయ ఇండియా ఫిలిం అకాడమీ (ఐఐఎఫ్‌ఏ) ఫిలిం ఫేర్ అవార్డు ప్రదానోత్సవంపై సాయంత్రం 4.30గంటలకు హైటెక్స్‌లోని హెచ్ఐసీసీ కాంప్లెక్స్‌లో సమావేశం జరుగుతుంది.

మూసీ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ)లపై మధ్యాహ్నం 12 గంటలకు నాగోల్‌లో నిర్వాహకుల ప్రత్యేక పర్యటన జరుగుతుంది.

సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన వారికి ఆర్థిక సాయం

ముందుకొచ్చిన కాపు ఎడ్యుకేషన్ ట్రస్ట్

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల జరిగిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలో క్వాలిఫై అయిన వారికి ఆర్థిక సాయం చేసేందుకు కాపు ఎడ్యుకేషన్ ట్రస్ట్, హైదరాబాద్ ముందుకొచ్చింది. తెలగ, బలిజ, కాపు, ఒంటరి తూరుపు కాపు, మున్నూరు కాపు వర్గాలకు చెందిన వారికి ఆర్థికసాయంతో పాటు గైడెన్స్, మెంటార్‌షిప్ అందించనున్నారు. క్వాలిఫై అయ్యి సాయం పొందేందుకు 040-23513420, 98495 55306, 99490 50399 ఫోన్ నంబర్లను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు.

ఘనంగా మాతృశ్రీ ఇంజినీరింగ్ కల్చరల్ ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సైదాబాద్‌కు చెందిన మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో ఉర్వి–2కె24 పేరుతో ఆన్యువల్ డే, కల్చరల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం చంపాపేట్‌లోని మినర్వా ఫంక్షన్ హాల్ వేదికగా నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్‌లో విద్యార్థులు పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. 3 రోజులుగా కొనసాగుతున్న ఈ వేడుకల్లో భాగంగా రెండు రోజు క్రితమే క్యాంపస్ విద్యార్థుల ఆధ్వర్యంలో బ్యానర్‌ను ఆవిష్కరించారు. అంతేగాకుండా కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఫ్లాష్‌మాబ్‌తో ఆకట్టుకున్నారు. ఈ కల్చరల్ ఫెస్ట్‌లో సంస్థ చైర్మన్ పీవీఆర్ కశ్యప్, సెక్రటరీ కేపీ శ్రీనివాస రావు, ట్రెజరర్ జే.సుధాకర్, వైస్ చైర్మన్‌లు సీతా రాంబాబు, క్రిష్ణ కుమార్ పాల్గొన్నారు.

24 గంటల కార్యకలాపాలపై సీఎంకు బహిరంగ లేఖ

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా 24X7 దుకాణాలు, వాణిజ్య సంస్థల నిర్వహణ కోసం అనుమతులను వెంటనే అమలు చేయాలని స్వతంత్రత సంస్థ కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇందులో భాగంగా స్వతంత్రత కేంద్రం సహ వ్యవస్థాపకులు, డైరెక్టర్ రాఘవేంద్ర అస్కాని ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జీహెచ్‌ఎంసీ, తెలంగాణ పోలీసు, కార్మిక శాఖ, ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌లకు బహిరంగ లేఖ రాశారు. ఈ అభ్యర్థన లేఖలో భాగంగా.. 24X7 వ్యాపార కార్యకలాపాలు ఆర్థిక గమణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు అనేక ఉద్యోగవకాశాలను సృష్టిస్తాయని పేర్కొన్నారు. ఈ అమలుతో నగర వ్యాపార రంగంలో 2% జీడీపీ వృద్ధితో పాటు 1.50 బిలియన్ డాలర్లు పెరుగుతుందని(122.22 బిలియన్ వ్యూఖ), అంతేగాకుండా తర్వాత సంవత్సరంలో నగర జీడీపీ 1.50 బిలియన్ డాలర్లు పెరిగే అవకాశముందని తెలిపారు. దీంతో పాటు ఈ కార్యకలాపాలకు నగరం సంసిద్ధతకు సంబంధించి సరళీకృత లైసెన్సింగ్ వ్యవస్థ, కార్మిక శాఖ సవరణలు, వార్షిక రుసుం నిర్మాణం, మెరుగైన పోలీసు–పబ్లిక్ డైనమిక్స్, మహిళా సిబ్బందికి రక్షణ, నైట్ లైఫ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ ఏర్పాటు, 24 గంటల ప్రజారవాణా, మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి కీలక సూచనలను లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ఈ నిర్ణయం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో పోటీపడటానికి వేదికగా మారుస్తుందని, ఈ అనుమతులను మరింత ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని సంస్థ డైరెక్టర్ రాఘవేంద్ర అస్కానీ పేర్కొన్నారు.

విభజన ఒప్పంద చట్టంపై కుట్ర

- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక కన్వీనర్ పాశం యాదగిరి

లక్డీకాపూల్: విభజన ఒప్పంద చట్టంపై కుట్ర జరుగుతోందని తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక కన్వీనర్ పాశం యాదగిరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు విభజన ఒప్పంద చట్టం అమలుపై సమీక్ష చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. 10 సంవత్సరాల ఉమ్మడి రాజధాని గడువు ముగిసిన తర్వాత తెలంగాణపై ఆధిపత్యం కోసం కుట్రలో భాగంగా కొత్త నాటకానికి తెర తీశారని ఆరోపించారు. రాష్ట్ర సంపద దోచుకోవడానికి, తెలంగాణ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడానికి పాలకులు కుట్రలు చేస్తున్నారన్నారు. రంగస్థల వేదికగా విభజన చట్టాన్ని సాకుగా ఆంధ్ర దోపిడీదారులు వాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. సకల సంపద కలిగిన తెలంగాణను సర్వనాశనం చేస్తుంటే తెలంగాణ బిడ్డలు ఎవరూ చూస్తూ ఊరుకోరన్నారు. ఈ నెల 22న సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో విభజన ఒప్పంద చట్టం కుట్ర – ఆధిపత్యంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వేదిక కన్వీనర్ గాదె ఇన్నయ్య పేర్కొన్నారు.

జలమండలిలో బదిలీలు నిలిపివేయాలంటూ నిరసన



జలమండలి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గుర్తింపు సంఘం సభ్యులు

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో సాధారణ బదిలీలు నిలిపివేయాలని బోర్డు గుర్తింపు కార్మిక సంఘం వాటర్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ డిమాండ్ చేసింది. జలమండలి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేసింది. అనంతరం యూనియన్ అధ్యక్షుడు జీ.రాంబాబు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించింది. సాధారణ బదిలీలతో ఉద్యోగులు, కార్మికులతో పాటు నగర ప్రజలకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంది. దీనికి ఎండీ అశోక్‌రెడ్డి స్పందిస్తూ సాధారణ బదిలీలు ప్రభుత్వ నిర్ణయమని, అయినప్పటికీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విధానాలు రూపొందిస్తామన్నారు. ప్రత్యేక ఇబ్బందులు ఏమైనా ఉద్యోగులకు వస్తే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టీ.నారాయణ, జీ.లక్ష్మీనారాయణ, రవీందర్, జంగయ్య, అడ్వైజర్ షకీల్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమరయ్య, డివిజన్ నాయకులు మల్లేష్, శ్రీకాంత్, శంకర్, అంజయ్య, షబ్బీర్ తదితరులు పాల్గొంటారు.


ప్రపంచంలో భారతీయ ఫార్మారంగం కీలకం



ఐఐసిటి సెమినార్‌లో ప్రసంగిస్తున్న బీడీఎంఏ అధ్యక్షుడు ఆర్‌కే అగర్వాల్

లాలాపేట: తార్నాకలోని సీఎస్ఐఆర్–ఐఐసిటి ఆడిటోరియంలో కెమికల్ క్లస్టర్ కార్యకలాపాలపై వన్ వీక్ వన్ థీమ్ పేరుతో సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనికి బల్క్ డ్రగ్ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు ఆర్‌కే అగర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ఫార్మా పరిశ్రమలు ప్రపంచ ఫార్మారంగంలో భారతదేశాన్ని కేంద్రంగా నిలిపాయని పేర్కొన్నారు. దేశీయ ఔషధాల తయారీ విజయాలను తన ప్రసంగం ద్వారా వివరించారు. పరిశ్రమలను సమన్వయం చేయడంలో సీఎస్ఐఆర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నైపుణ్యం, ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం, సాఫ్ట్‌వేర్‌తో ఆధునిక యూనిట్ల తయారీలో బల్క్ డ్రగ్ మ్యానుఫాక్చరింగ్ అసోసియేషన్ ముందుకు వెళ్తుందన్నారు. థీమ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్, ఐఐసిటి డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, పరిశ్రమ ప్రతినిధులు, వ్యాపారసంస్థల నేతలు కలిసి పని చేయడం ద్వారా మరిన్ని ఉత్తమ ఫలితాలను సాధించవచ్చనని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ.తివారి, కాస్మిక్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ జావేద్ ఇక్బాల్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ భూమిలో ఎమ్మెల్యేకు గజం స్థలం లేదు



న్యాయవాది ప్రతాప్

పంజగుట్ట: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, కాప్రా వంపుగూడలోని భూములతో ఆయనకు సంబంధం లేదని, అక్కడ ఒక్క గజం స్థలం కూడా ఆయనకు లేదని న్యాయవాది పి.ప్రతాప్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారు ఆరోపిస్తున్న భూమి 40 సంవత్సరాల నుంచి వివాదంలో ఉందని, ఆ భూమిలో ప్రేమ్‌సాగర్‌రావుకు గజం స్థలం కూడా లేదని, ఆ వివాదంతో ప్రేమ్‌సాగర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. కారకులు ఎవరైనా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'హౌసింగ్ సొసైటీలో అవకతవకలు జరగలేదు'

హిమాయత్‌నగర్: భాగ్యనగర్ ఎన్జీవో (గచ్చిబౌలి) మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సొసైటీ డైరెక్టర్లతో కలిసి ఆయన మాట్లాడారు. 2008లో శేరిలింగంపల్లి మండలం, గోపనపల్లిలోని సర్వే నంబర్–36, 37లలో 189 ఎకరాల 11 గుంటల స్థలాన్ని ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందని గుర్తుచేశారు. అయితే ఆ భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని 4 వేల మంది రిటైర్డ్, సర్వీస్ ఉద్యోగుల పొట్ట కొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి సొసైటీలో శంకుస్థాపన చేశారని, ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి ఆ భూములను తమకు కేటాయించాలని కోరారు.

బోడుప్పల్ మేయర్ పీఠం కాంగ్రెస్ కైవసం

మేయర్‌గా అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్‌గా స్రవంతి గౌడ్



మేయర్ అజయ్‌యాదవ్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ప్రొసీడింగ్ ఆఫీసర్ వెంకట ఉపేందర్‌రెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ మేయర్ పీఠాన్ని సోమవారం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మేయర్‌గా తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్‌గా కొత్త స్రవంతిగౌడ్ ఎన్నికయ్యారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రొసీడింగ్ ఆఫీసర్ వెంకట ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. క్యాంప్‌లో ఉన్న 22 మంది కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక బస్సులో నగర పాలక సంస్థ కార్యాలయం వద్దకు చేరుకున్నారు.

కేవలం కార్పొరేటర్లను మాత్రమే లోపలికి అనుమతించారు. మేయర్‌గా తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్‌గా స్రవంతి గౌడ్ నామినేషన్ వేశారు. 11.20 గంటలకు మేయర్ ఎన్నిక జరిగింది. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించారు. వారిని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు బలపర్చారు. మేయర్‌కు, డిప్యూటీ మేయర్ పదవి కోసం ఒక్కో నామినేషన్ రావడంతో వారు ఎన్నికైనట్లు ప్రొసీడింగ్ ఆఫీసర్ వెంకట ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం వారిచే ప్రమాణ స్వీకారం చేయించి, ధ్రువీకరణ పత్రాలను వారికి అందజేశారు.

డిప్యూటీ మేయర్ పదవికి ఇద్దరు పోటీ..

డిప్యూటీ మేయర్ పదవికి 4వ డివిజన్ కార్పొరేటర్ కొత్త స్రవంతిగౌడ్, 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్ పోటీ పడ్డారు. దీంతో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంత్‌రావు, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్ పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థులతో రెండు గంటలకు పైగా చర్చించారు. అనంతరం షీల్డ్ కవర్‌లో ఉన్న కొత్త స్రవంతిగౌడ్ పేరును ప్రకటించారు.

తైబజారును రద్దు చేస్తాం..

మేయర్‌గా తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్‌గా కొత్త స్రవంతిగౌడ్ ఎన్నికైన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ చిరు వ్యాపారులకు ఇబ్బందిగా మారిన తైబజారును రద్దు చేస్తామని ప్రకటించారు. బోడుప్పల్‌లో చాలా సమస్యలు ఉన్నాయని, ముఖ్యమైన సమస్యలను గుర్తించి, తోటి కార్పొరేటర్ల సహకారంతో వాటి పరిష్కార దిశగా అడుగులు వేస్తామన్నారు. ముఖ్యంగా రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం మైనంపల్లి హనుమంత్‌రావు, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, తోటకూర జంగయ్యయాదవ్ మేయర్, డిప్యూటీ మేయర్‌ను అభినందించారు.

ఇకపై ప్లాంట్ ప్రొటీన్స్

మార్కెట్‌లోకి హెర్బోకెమ్ ప్రొటీన్ ఉత్పత్తులు

సాక్షి, సిటీబ్యూరో: ఆరోగ్య సంరక్షణలో కీలకమైన ప్రొటీన్లు అందించడానికి వినూత్నంగా ప్లాంట్ ప్రొటీన్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా హెల్త్ అండ్ వెల్‌నెస్ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న నగరానికి చెందిన హెర్బోకెమ్ ఆధ్వర్యంలో మెరుగైన ఫిట్‌నెస్ కోసం మొక్కల ఆధారిత ప్రొటీన్ ఉత్పత్తులను ఆవిష్కరించింది. శాకాహారులతో పాటు ఫిట్‌నెస్ ఔత్సాహికులు, క్రీడాకారులకు ఈ ప్లాంట్ ప్రొటీన్లు మంచి ఫలితాలను అందిస్తున్నాయి. ఈ సందర్భంగా హెర్బోకెమ్ భాగస్వామి కార్తీక్ కొండేపూడి మాట్లాడుతూ.. హెర్బోకెమ్ తత్వశాస్త్రంలో భాగంగా ప్రకృతి నుంచి సేకరించిన ఆరోగ్యకరమైన ప్రొటీన్ శారీరక, మానసిక సంరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. బఠానీ, సోయా, మోరింగా నుంచి తయారు చేసిన హెర్బోకెమ్ ప్రొటీన్ ఉత్పత్తులు మంచి జీర్ణక్రియతో పాటు నాన్–అలెర్జీ లక్షణాలతో కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, జింక్ పోషకాలను అందిస్తాయని వెల్లడించారు. మానవ పోషణకు అవసరమైన మొత్తం తొమ్మిది అమైనో ఆమ్లాలను కలిగి ఉన్న పూర్తి ప్రొటీన్లను అందిస్తున్నామని ఆయన అన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 16, జూలై, 2024



హింస, అశ్లీలం, అసాంఘికాలకు వేదికగా..

పెరుగుతున్న డార్క్ హ్యూమర్ కామెడీ సంఘటనలు

కుల, మత, రాజకీయ, దేశ భద్రత అంశాల్లో అవాస్తవాల ప్రచారం

ట్రోలింగ్, బూతుల్లో మునిగితేలుతున్న యువతరం

సోషల్ మీడియాకూ సెన్సార్ విధానాలు కావాలంటున్న నిపుణులు

సోషల్ మేనియా!

సాంకేతికత రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఎన్నో అధునాతన పరిణామ క్రమాలు, టెక్నోలాజికల్ రివల్యూషన్స్ వచ్చాయి. కానీ మన జీవితాల్లో సోషల్ మీడియా చూపించినంత ప్రభావం మరే ఇతర సాంకేతిక విప్లవాలూ చూపలేకపోయాయి. ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీ అధునాతన జీవన శైలిని అలవర్చిందే తప్ప సామాజిక విలువలు, నైతికతకు అంతగా అలవర్చలేదు. 4జీ, 5జీ ప్రవేశంతో ప్రతిఒక్కరి అభిప్రాయాన్నీ విశాల వేదికలపై పంచుకునే అవకాశం లభించింది. అయితే అందివచ్చిన అవకాశాన్ని కొందరు దుర్వినియోగం చేసుకుంటున్నారు. సోషల్ మీడియా వేదికలుగా కొనసాగుతున్న నూతన ధోరణులు, ట్రెండ్స్ పేరుతో సోషల్ డిగ్నిటీని దిగజార్చుతున్న తీరు చూస్తే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, స్నాప్‌చాట్ వంటి విభిన్న వేదికల్లో మితిమీరిపోయిన స్వేచ్ఛ, నియమ-నిబంధనలపై అవగాహనా లేమితో పాటు పర్యవేక్షణ కొరవడిందని పలువురు నుంచి ఆందోళన వ్యక్తమవుతుంది. ఆ వివరాలు తెలుసుకుందాం..

-సాక్షి, సిటీబ్యూరో

లైక్స్, వ్యూస్ కోసం వింత పోకడలు, పోస్టులు..

యువత ప్రయాణం అసాంఘిక ధోరణులతో, అశ్లీలపు ఆలోచనలతో సెన్సార్ లేని సినిమాలాగా మారింది. అడ్డూ అదుపూ లేని ఈ విధానాలకు ఈ మధ్య తెరపైకి వచ్చిన డార్క్ హ్యూమర్ కామెడీ సంఘటనతో సోషల్ మీడియాకు సైతం సెన్సార్ నియమ నిబంధనలు

డార్క్ కామెడీ..

ఏర్పాటు చేయాలనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటికే సోషల్ మీడియాకు, సోషల్ యాప్స్‌కూ పటిష్టమైన నియమ నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని ఉల్లంఘిస్తున్నారు. అనేక ఘటనల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు పడిన సందర్భాలున్నాయి. అయినప్పటికీ అనేక మంది ఈ నిబంధనలపై అవగాహనా రాహిత్యంతో ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. కట్టుదిట్టమైన,కఠినమైన చర్యలు లేకపోవడంతో సోషల్ మీడియా అరాచకాలు పతాక స్థాయికి చేరుకున్నాయి.

కంట్రోల్ లేని ట్రోల్స్..

సోషల్ మీడియాలో అడ్డుకట్ట వేయలేని సమస్య ఏదైనా ఉందంటే.. అది ట్రోలింగ్. ఒక వ్యక్తినిగాని, వ్యవస్థను, సామాజిక విధానాలు ట్రోలింగ్‌కు గురవుతున్నాయి. సినిమా, క్రికెట్, రాజకీయం తదితర రంగాలను మాత్రం విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. గత ఎన్నికల నేపథ్యంలో ట్రోలింగ్ భరించలేకనే ఆత్మహత్య చేసుకున్న సందర్భాలనూ చూశాం. ఒక పార్టీకి అనుకూలంగా సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేసినందుకు ప్రత్యర్థి పార్టీకి చెందిన కార్యకర్తల ట్రోలింగ్‌కు సదరు మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఆస్తికులు, నాస్తికుల మధ్య ట్రోలింగ్ పెట్రేగిపోయి భౌతికదాడులకూ దారి తీసిన ఘటలను ఉన్నాయి. సినీతార సమంత, క్రికెటర్ హార్దిక్ పాండ్యా వరకూ ఈ ఆన్‌లైన్ ట్రోలింగ్‌కు గురైనవారే.

అదొక యూట్యూబ్ ఛానల్. వ్యూస్, సబ్ స్క్రైబర్స్ సంఖ్య పెంచుకోవడానికి బూతు పదాలతో ఏదో ఒక విషయం పైన ఉపన్యాలు ఇస్తాడు. మరొక వ్యక్తి.. మతం, కులానికి సంబంధించిన సంఘటనలు, వాటికి సంబంధించిన మూలాలపైన యూనివర్సిటీ పాఠ్య పుస్తకాల్లో లేని కల్పిత సమాచారాన్ని విశదీకరిస్తాడు. ముఖ్యంగా ఈ సమాచారం కొన్ని దేశాలు లేదా రెండు రాజకీయ పార్టీలకు మధ్య సపోర్ట్‌గా

వ్యూస్ కోసం వల్గారిటీ..

ఉంటాయి. మరో యువకుడు ఫెమినిజం పేరుతో మహిళల మనుగడనే ప్రశ్నార్థకంగా వివరిస్తాడు. మరో మానసిక రోగి విషపూరితమైన ఆలోచనా విధానాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మలిచి ఓ తరాన్నే పక్కదోవ పట్టిస్తాడు. మరికొంత మంది సాహిత్య వేత్తలు బ్లాగుల్లో సామాన్యుడి నుంచి ప్రముఖుల వరకూ వ్యక్తిగత జీవితంలోని ప్రతి అంశాన్నీ బయటకులాగి వారి మనోభావాల పైన దాడి చేస్తాడు. ఇలా సంస్కృతి, సంప్రదాయాలు, దేవుళ్లు, పండుగలు, రాజకీయనాయకులు, సెలబ్రిటీలపైన నోటికొచ్చిన భాషను ప్రయోగిస్తారు. మూర్ఖత్వానికి పరాకాష్ఠగా విశ్లేషణలను ప్రసారం చేస్తారు. ప్రణీత్ హనుమంతు వంటి వారైతే తండ్రీ-కూతుర్ల సంబంధం పైన సెక్సువల్ అబ్యూస్ చేస్తున్నారు.





సోషల్ మీడియా మాధ్యమాలు ఎల్లప్పుడూ తెరచి ఉంచే పుస్తకాలైనప్పటికీ..అందులోని సమాచారం నైతిక విలువలకు కట్టుబడి ఉండాలనేది ప్రాథమిక సూత్రం. ముఖ్యంగా వ్యక్తిగత గోప్యత, చిన్నారులు, మహిళలు, అనాథలు, అశ్లీలం, అసాంఘిక, హింస, క్రూరత్వం, సైబర్ క్రైం, దేశ భద్రత, కుల-మత-వర్గాలతో పాటు వివిధ రకాల సున్నితమైన అంశాలకు సంబంధించి సోషల్ మీడియాలో పరిమితులు, పర్యవసానాలను ఇటీవల తరచూ చూస్తున్నాం.. వీటికి నూతనంగా వచ్చిన బీఎన్ఎస్ చట్టాలతో పాటు ఐటీ యాక్ట్, లోకల్ లాస్‌కు లోబడిన సెక్షన్ల కింద కేసులు నమోదవుతాయి. పోక్సో, ఉపా వంటి కఠినమైన చట్టాలకు చెందిన శిక్షలూ ఉన్నా.. ప్రస్తుత పరిస్థితి దున్నపోతుమీద వర్షం కురిసిన చందంగా మారింది. యాప్స్‌లో అశ్లీలానికి నియంత్రణలేమితో పాటు కోట్ల సంఖ్యలో ఉన్న యూజర్స్‌పై పర్యవేక్షణ సాధ్యం కాకపోవడంతో పరిస్థితులు దిగజారిపోతున్నాయి. ముఖ్యంగా అనాథ పిల్లల ఫొటోలు, మైనర్ బాలికలకు సంబంధించి ఫొటోలు ఎలాంటి మాధ్యమాల్లో ప్రదర్శించవద్దనే నిబంధనలు ఉన్నా ఎవరూ పాటించట్లేదు.

ఫాలోవర్స్ వల్లే...

ఈ ధోరణికి ఫాలోవర్స్ కూడా ప్రధాన కారణమేనని సామాజిక వేత్తలు తెలుపుతున్నారు. మిలియన్ వ్యూస్ వస్తున్నాయి కాబట్టే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు దూకుడు ప్రదర్శిస్తున్నారనే వాదనా లేకపోలేదు. తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నారని తెలిసినప్పుడే ఆ ఛానళ్లు, ఆన్‌లైన్ పేజీలకు రిపోర్ట్ కొట్టే అవకాశం ఉందని గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా సోషల్ యాప్స్ సైతం వారి నిబంధనలను ఉల్లంఘిస్తే శాశ్వతంగా అకౌంట్లను బ్లాక్ చేసేలా మార్పులు చేయాల్సిన అవసరముంది. ప్రస్తుతం తాత్కాలికంగా అకౌంట్లను లాక్ చేస్తున్నప్పటికీ కొంత కాలం తరువాత మళ్లీ రీ-యాక్టివేట్ చేస్తున్నారు. అంతేకాకుండా సినిమాలకు సెన్సార్ బోర్డ్ ఉన్నట్లే..సోషల్ యాక్ట్‌కు విరుద్ధంగా ప్రదర్శిస్తున్న సోషల్ యాప్స్‌లోని సమాచారాన్ని కృత్రిమ మేధతో ఆటోమేటిడ్‌గా బ్లాక్/హైడ్ చేసే అధునాతన టెక్నాలజీని తీసుకురావాలని పలు సామాజిక సంఘాలు కోరుతున్నాయి.

సుమోటోగా కేసులు నమోదు



సోషల్‌మీడియాలో చట్ట వ్యతిరేకంగా ఉన్న ఏ అంశం పైన అయినా కేసులు నమోదు చేస్తున్నాం. బాధితులు ఫిర్యాదు చేసిన సందర్భంతో పాటు అనేకసార్లు సుమోటోగానూ రిజిస్టర్ చేస్తున్నాం. కేవలం సైబర్ నేరాలకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ ప్రకారమే కాకుండా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), లోకల్ లాస్ ప్రకారం ఆరోపణలు నమోదు చేసి దర్యాప్తు చేపడతాం. యూట్యూబ్‌లో సభ్యులుగా ఉండే ప్రతి ఒక్కరూ ఆ సంస్థ సూచించే కమ్యూనిటీ గైడ్ లైన్స్ పాటించాలి. వీటికి విరుద్ధంగా ఉన్న అంశాలను రివ్యూ చేసి తొలగిస్తుంది. ఎదుటి వారి మనోభావాలు దెబ్బతినేలా, కించపరిచేలా, అసభ్యకరంగా, అవమానకరంగా ఉండే అంశాలను సోషల్‌మీడియాలో పోస్టు చేయడం, షేర్ చేయడం తదితరాలు నేరం కిందికే వస్తాయి. - ఆర్‌జీ శివమారుతి, సైబర్ క్రైమ్ ఏసీపీ, హైదరాబాద్

ఆన్‌లైన్ అతిక్రమణలకు ఐటీ యాక్ట్, ఐపీసీ సెక్షన్స్, నూతన బీఎన్ఎస్ చట్టాలకు లోబడి ఉన్న శిక్షలు అమలవుతాయి. మహిళలు, చిన్నారుల అంశాల్లో జాగ్రత్తలు వహించాలి. ఈ మధ్య దేశ ఐకమత్యానికి విఘాతం కలిగించేలా, సామాజిక అంశాలను రెచ్చగొట్టేలా, వ్యక్తిగత గౌరవాన్ని కించపరచడం, బాడీ షేమింగ్, ట్రోలింగ్ వంటి అతిక్రమణలు పెరిగాయి.

ప్రైవసీకి ప్రాధాన్యత ఇవ్వండి..



సోషల్ యాప్స్ వినియోగించే వారు పర్సనల్ ఐడెంటిటీని బహిర్గతం కాకుండా చూసుకోవాలి. పోస్టులకు ప్రైవసీ సెట్టింగ్‌లను వాడాలి. ఒక కేసులో భాగంగా... ఒక అమ్మాయి సోషల్ మీడియాలో పోస్టులో ఉన్న బైక్ నెంబర్ ఆధారంగా ఆ అమ్మాయిని ట్రేస్ చేశారు. మరో కేసులో స్కూల్‌కు వెళ్లే చిన్నారి ఫొటో షేర్ చేయగా.. ఆ స్కూల్ బస్ నెంబర్ ఆధారంగా చిన్నారి కిడ్నాప్‌కు బ్లాక్‌మేయిల్ చేసిన ఘటనలు ఉన్నాయి. సోషల్ మీడియాకు సంబంధించి ప్రతి యాప్‌కూ ప్రత్యేక గైడ్‌లైన్స్, కంటెంట్ పాలసీ, పరిమితులు ఉన్నాయి. కేంద్రం డిజిటల్ నేరాలకు సంబంధించి నూతన చట్టాలకు బిల్ ప్రవేశపెట్టింది, కానీ నిబంధనలు ఇంకా నిర్ధారించలేదు.

- శ్రీకాంత్ చింతల, హైకోర్ట్ అడ్వకేట్, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు

ఫ్యాషన్ గాల

మిస్టర్ అబ్బు, మిస్ యశస్విని..





రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీహబ్ ప్రాంగణంలో నిర్వహించిన మిస్టర్ ఫ్యాషన్ గాలా-2024గా అబ్బు సాయిప్రకాశ్‌రెడ్డి, మిస్ ఫ్యాషన్ గాలా-2024గా యశస్విని ఎంపికయ్యారు. థర్డ్ ఐ ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఆధ్వర్యంలో మిస్టర్ అండ్ మిస్ ఫ్యాషన్ గాలా-2024 పోటీలను ఆదివారం రాత్రి నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో 100 మంది పోటీ పడగా, అందులో 30 మందిని ఎంపిక చేశారు. కాగా మిస్టర్ అండ్ మిస్ ఫ్యాషన్ గాలా-2024 ఫినాలే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విజేతలకు లక్ష రూపాయల చొప్పున, ద్వితీయ స్థానంలో నిలిచినవారికి రూ.50వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు రాహుల్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విశ్వవేదికపై 'శ్రావ్య'



కుటుంబ నేపథ్యం..

హైదరాబాద్‌లోని ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన బండారు రవి, సంధ్యల కుమార్తె శ్రావ్య. బాల్యంలోనే తనలో నృత్యం పట్ల ఉన్న ఆసక్తిని గుర్తించారు. తనలో ఓ గొప్ప కళాకారిణి దాగి ఉందని గ్రహించిన తల్లి ఆమెను మరింతగా ప్రోత్సహించింది. తగిన శిక్షణ ఇప్పించింది. అనేక కష్ట, నష్టాలకు ఓర్చి ఆమెను ముందుకు నడిపించింది. తల్లిదండ్రులు, ఇంజినీరింగ్, వైద్య విద్యలు మాత్రమే చదువులుగా భావిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో నృత్య కళను ప్రోత్సహించి కళాకారిణిగా తీర్చిదిద్దారు.

అత్తాపూర్: భారతీయుల్లో సృజనకు కొదవ లేదు. కానీ ఆ సృజనకు సరైన గుర్తింపు, గౌరవం లభించడం అరుదు. అలాంటి సృజన శీలురులో ఒకరు మన హైదరాబాద్ యువతి బండారు శ్రావ్య. శ్రావ్య హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయంలో పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అయితే ఐఎఫ్‌టీఆర్(ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ థియేటర్ రిసర్చ్) ప్రతి సంవత్సరం విశ్వవేదికపై కళా ప్రదర్శన ఏర్పాటు చేస్తుంది. కాగా ఈనెల 15 నుండి 19 తేదీల మధ్య ఫిలిప్పీన్స్‌లోని దిలిమన్ యూనివర్సిటీ ఈ అంతర్జాతీయ ఈవెంట్‌కు వేదిక కానుంది. ఇదే వేదికపై తన ప్రదర్శన ఇచ్చేందుకు శ్రావ్యకు అవకాశం లభించింది. పలు దేశాలకు చెందిన యువ కళాకారులు ఇందులో పాలుపంచుకోనున్నారు. రీసెర్చ్ స్కాలర్, పరిశోధక విద్యార్థిని శ్రావ్య యూనివర్సిటీ అధ్యాపకుల సహకారం, ఆర్థిక చేయూతతో పరిశోధనా పత్రాన్ని రూపొందించారు. దీనిని విశ్వవేదికపై పరిచయం చేయనున్నారు.

ర్యాంప్ 2.0



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని మై పర్‌ఫెక్ట్ ఫిట్ స్టోర్‌లో సోమవారం ఉమెన్ 2.0 వేదికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత డిజైనర్, ఉమెన్ 2.0 సీఈవో సునీత సింగ్ రూపొందించిన డిజైనరీ ఉత్పత్తులను ధరించి మోడల్స్ ర్యాంప్‌పై హొయలు పోయారు. ఫ్యాషన్ రంగంపై ఆసక్తి ఉన్న యువతకు, మహిళలకు ఇదొక మంచి వేదిక అని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఫ్యాషన్ రంగం రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతోందని, లక్షలాది మంది ఈ రంగం వైపు అడుగులు వేస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఫౌండర్లు సుశీల్‌కుమార్, అజిత్‌లు పాల్గొన్నారు.

కనువిందుగా 'మాన్‌సూన్ రెగట్టా'..

భారీగా కమ్ముకున్న మేఘాల మధ్య కురుస్తున్న తేలికపాటి జల్లుల్లో హుస్సేన్ సాగర్ మీదుగా వేగంగా వీస్తున్న గాలులను చీల్చుకుంటూ సెయిలర్స్ మొదటి రోజు పోటీలను ముగించారు. తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్, యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జూనియర్ నేషనల్ 'మాన్‌సూన్ రెగట్టా'లో వివిధ రాష్ట్రాలకు చెందిన సెయిలర్స్ తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. అండర్-16 ఆప్టిమిస్ట్ క్లాస్‌లో తమిళనాడుకు చెందిన శ్రేయా కృష్ణ, తెలంగాణకు చెందిన గోవర్ధన్ పల్లర చెరో విజయాలతో టైగా నిలిచి ఒక్కొక్కరు 3 పాయింట్లను సాధించారు. టాప్ సీడ్‌గా ఉన్న దీక్షిత ఓవరాల్ పాయింట్లను కోల్పోయి 11వ స్థానానికి పడిపోయింది. టీఎస్‌సీ మైసూర్ నుంచి తెలంగాణకు చెందిన సెయిలర్ బొంగూర్ బన్నీ మొత్తం 3 పాయింట్లతో ఉన్నారు. ఐఎల్‌సీఏ 4 అండర్ 18 క్లాస్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన సోమ్యా సింగ్ మూడు రేసులను గెలిచి టాప్‌లో ఉంది, ఐఎల్‌సీఏ 4 బాలుర విభాగంలో ఏకలవ్య బాథమ్ మెరుగ్గా ఉన్నాడు. అండర్-18 ఇంటర్నేషనల్ 420 మిక్స్‌డ్ క్లాస్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన దివ్యాన్షి మిశ్రా, అనిరాజ్ అగ్రస్థానంలో నిలిచారు. ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మీదుగా ప్రయాణిస్తున్న నగరవాసులు ఈ పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.





క్లుప్తంగా...

అర్చకుల బదిలీ జీవోపై హైకోర్టు స్టే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పూజారులు, అర్చకులను బదిలీ చేసేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. విచారణను కోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. పూజారులు, అర్చకుల బదిలీపై నిషేధాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ భద్రాచలానికి చెందిన పూజారులు కోటి శ్రీమాన్ నారాయణాచార్యులు, అమరవాది మురళీకృష్ణమాచార్యులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. మతపరమైన కార్యక్రమాల్లోకి ప్రభుత్వం ప్రవేశించడానికి అనుమతి లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. జీవోను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలిచ్చారు.

తుది తీర్పు మేరకే జీపీ, ఏజీపీల నియామకం

- 'జిల్లా కోర్టుల' పిటిషన్లపై హైకోర్టు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: జిల్లా కోర్టుల్లో ప్రభుత్వ న్యాయవాదుల నియామకం తుది తీర్పు మేరకే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది. గత ప్రభుత్వ హయాంలో జిల్లా కోర్టుల్లో జీపీలు, ఏజీపీ, ఏపీపీలు నియమితులైన వారు.. ప్రభుత్వం మారిన నేపథ్యంలో రాజీనామా చేయాలంటూ గత జూన్ 26న న్యాయ శాఖ జీవో 354ను జారీచేసింది. దీన్ని సవాల్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన జీపీ నాగారం అంజయ్య సహా 21 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. తమ గడువు ముగియకున్నా ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయించేందుకే జీవో తెచ్చారని.. దీన్ని రద్దు చేయాలని కోరారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది సామల రవీందర్ వాదనలు వినిపిస్తూ.. జీవో అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే ఇంచార్జీ జీపీలను తీసుకోవడం జరిగిందన్నారు. దీనికి పిటిషనర్ న్యాయవాది అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ న్యాయవాదుల నియామకంలో హైకోర్టుకు, జిల్లా కోర్టులకు వ్యత్యాసం ఉందన్నారు. ఏజీ సూచన మేరకు హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదుల నియామకం ఉంటుందని, జిల్లా కోర్టుల్లో జిల్లా జడ్జి ఎంపిక చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. జిల్లా కోర్టుల్లో విచారణకు ఇబ్బంది రాకుండా ఈ పిటిషన్లపై వీలైనంత త్వరగా తీర్పునిస్తామని చెప్పారు.

ఆ ఛానెళ్లవి తప్పుడు వార్తలు

- మీడియాతో వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఆదివాసి మహిళా అధికారికి కొన్ని చానళ్లు ద్రోహం చేశాయని.. మహాన్యూస్, ఏబీఎన్, టీవీ–5 చానళ్లు తప్పుడు వార్తలతో ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన జర్నలిజం విలువలనే కాలరాశాయని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి మండిపడ్డారు. విశాఖలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఒక ఆదివాసి మహిళా అధికారిని అవమానించారు. ఆమెతో నాకు అక్రమ సంబంధం అంటగట్టారు. ఎలాంటి ఆధారాలులేని అసత్య కథనాలను ప్రసారం చేశారు. ఈ వ్యవహారంపై పరువునష్టం దావా వేస్తా. పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ మూవ్‌చేస్తా.. జర్నలిస్టుల ముసుగులో ఉన్న ఇలాంటి వెధవలను శిక్షించడానికి పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కోరతా. అంతేకాక.. ఎస్టీ కమిషన్‌కు, ఉమెన్ కమిషన్‌కు, ప్రెస్ అకాడమీ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తా' అని చెప్పారు.

'భూ'కాయింపు!

శ్వేతపత్రం పేరుతో ఏపీ సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలు

సాక్షి, అమరావతి: ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి వాటిని అమలు చేయలేక కాలయాపన చేస్తున్న సీఎం చంద్రబాబు దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు శ్వేతపత్రాల పేరుతో అభూత కల్పనలు, అడ్డగోలుగా వక్రీకరణలకు దిగారు. పేదలకు మంచి జరిగేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలను దోపిడీగా చిత్రీకరిస్తూ తన కడుపుమంటను మరోసారి బయట పెట్టుకున్నారు. ఖజానాకు రాబడి పెంచిన ప్రభుత్వాన్ని నిందిస్తూ.. ఆదాయానికి తూట్లు పొడుస్తున్న తన సర్కారు గురించి జబ్బలు చరుచుకోవడంపై రాజకీయ పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచమే విస్తుపోయేలా నాడు అమరావతి, విశాఖలో తన హయాంలో జరిగిన భూ కుంభకోణాలను నిస్సిగ్గుగా కప్పిపుచ్చుతూ బురద చల్లేందుకు సీఎం చంద్రబాబు యత్నించారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా దళితులు, పేదల జీవితకాల కోరికను నెరవేర్చడాన్ని తప్పుబట్టి ఆయా వర్గాలను దారుణంగా అవమానించారు. పేదల భూముల్లో ఎన్టీఆర్ భవన్‌లు నిర్మించిన తన చరిత్రను మరచిపోయి చట్ట ప్రకారం వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు స్థలాలు కేటాయించడాన్ని నిందిస్తున్నారు. ఉచిత ఇసుక పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేల కోట్లు దోచుకోగా, వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక క్రమపద్ధతి ప్రకారం జరిగిన విక్రయాలను తప్పుబడుతున్నారు. ధరల బోర్డు ఏర్పాటు చేసి మరీ ఇసుకను విక్రయిస్తూ పైకి మాత్రం ఉచితమంటూ బుకాయిస్తున్నారు. పారదర్శకంగా ఇసుక అందచేసి ఏటా రూ.750 కోట్లకుపైగా ఆదాయాన్ని, ఐదేళ్లలో రూ.4 వేల కోట్లను రాబడిని గత ప్రభుత్వం ఖజానాకు జమ చేయడం అక్రమమా? ప్రభుత్వానికి రూపాయి రాబడి లేకుండా చేసి ఉచిత ఇసుక పేరుతో పచ్చముఠాల జేబులు నింపడం ఓ గొప్ప పథకమా? భూముల సమగ్ర రీ సర్వే (జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష చట్టం) ద్వారా అమ్మేవారికి, కొనేవారికి పూర్తి భరోసా లభిస్తుంది. వివాదరహితంగా భూములపై హక్కులు కల్పించడంతోపాటు ఏదైనా సమస్య ఉత్పన్నమైతే ప్రభుత్వమే గ్యారెంటీ ఇస్తుంది కాబట్టి నిశ్చింతగా ఉండవచ్చు. దేశ చరిత్రలో తొలిసారిగా ఆంగ్లేయుల తరువాత భూముల సమగ్ర సర్వే బృహత్తర కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ హయాంలో చేపట్టింది. రైతులపై పైసా భారం పడకుండా ఉచితంగా సర్వే చేయడంతోపాటు సరిహద్దు రాళ్లను కూడా ఉచితంగానే పాతేలా చర్యలు తీసుకుంది. 15,000 మంది సర్వేయర్లను నియమించింది. చంద్రబాబు ఆరోపిస్తున్నట్లుగా కబ్జాలే నిజమైతే తమ భూములు లాక్కున్నారని ఏ ఒక్క రైతైనా ఫిర్యాదు చేశారా? గత సర్కారు ఎర్ర చందనం స్మగ్లింగ్‌ను సమర్థంగా అరికడితే దానిపైనా అడ్డగోలు వాదనకు దిగారు. సహజ వనరులను దోపిడీ చేశారని, భూములను దోచుకున్నారని కళ్లార్పకుండా బుకాయించారు. వాస్తవానికి వైఎస్ జగన్ తెచ్చినవి సంస్కరణలైతే చంద్రబాబు హయాంలో చోటు చేసుకున్నవన్నీ స్కామ్‌లే!!

పేదలకు భూమి పంచడం నేరమా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు భూమిని పంచడాన్ని అక్రమంగా చంద్రబాబు అభివర్ణించారు. 46 వేల ఎకరాలను 40 వేల మందికిపైగా రైతులకు పంపిణీ చేయడాన్ని తప్పుబడుతూ అందులో 8 వేల ఎకరాలను వైఎస్సార్‌సీపీ వారికి పంచారంటూ గగ్గోలు పెట్టారు. నిరుపేదలైన వారికి భూములు ఇవ్వడాన్ని వక్రీకరిస్తూ అందులో రూ.1,300 కోట్ల అవినీతి జరిగిందని పేదలపై తనకున్న ద్వేషాన్ని చంద్రబాబు చాటుకున్నారు. చంద్రబాబు తన హయాంలో భూ పంపిణీయే చేయలేదు. ఏనాడూ పేదల గోడు పట్టించుకున్న పాపాన పోలేదు.

అసైన్డ్ భూములపై అడ్డగోలు వాదన

అసైన్డ్ భూముల రైతులకు చారిత్రక రీతిలో వైఎస్సార్‌సీపీ హయాంలో దక్కిన యాజమాన్య హక్కులను చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారు. వారి భూములపై వారికి హక్కులు కల్పించడం తప్పన్నట్లు చిత్రీకరించారు. అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు లేక అసైన్డ్ రైతులు అవస్థలు పడ్డా పట్టించుకోని చంద్రబాబు, వారికి హక్కులు ఇవ్వడాన్ని వక్రీకరిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు ఆ భూములను కొట్టేశారంటూ నిరాధార ఆరోపణలు చేశారు. అసైన్డ్ రైతులకు వారి భూములపై సంపూర్ణ అధికారాలు దక్కడం ఆయనకు ఏమాత్రం ఇష్టం లేదని దీన్నిబట్టి స్పష్టమవుతోంది. తమ భూములపై ఆంక్షలు లేకపోవడం, మంచి ధర రావడంతో కొంతమంది రైతులు హక్కులు వచ్చాక వాటిని విక్రయించారు. 27 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకుగానూ తొలి విడతలో పది లక్షల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి వారికి హక్కులు కల్పించారు. అందులో కొంతమంది అమ్ముకోవడం ముఖ్యమంత్రికి నేరంగా కనిపిస్తోంది. చంద్రబాబు హయాంలో 22 ఏలో చేర్చిన 2 లక్షల ఎకరాల నిషేధిత భూములు, 34 వేల ఎకరాల షరతుగల పట్టా భూములు, 50 వేల ఎకరాల అనాధీనం భూములపై వైఎస్సార్‌సీపీ హయాంలో ఆంక్షలు తొలగాయి. 1.79 లక్షల ఎకరాల సర్వీస్ ఈనాం భూములను 22ఏ నుంచి తొలగించి వారికి మేలు చేశారు. రైతుల సాగులో ఉన్న 9,064 ఎకరాల లంక భూములను 17,768 మంది లబ్ధిదారులకు హక్కులతో అందచేసింది. ఎస్సీలకు శ్మశాన వాటికల కోసం 1,543 గ్రామాలలో 933 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి గ్రామ పంచాయతీలకు అప్పగించింది. ఇవన్నీ చంద్రబాబుకు అక్రమాలు, అన్యాయాలుగా కనిపించడాన్ని ఏమనాలి?

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బోనాల చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ రగడ

- కాంగ్రెస్ నేతలను వేదికపైకి ఆహ్వానించొద్దన్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- అయినా స్టేజీపైకి పిలిచిన అధికారులు
- వేదిక కింద కూర్చొని నిరసన తెలిపిన ఎమ్మెల్యే



హర్కర వేణుగోపాల్‌రావుతో గొడవ పడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆషాఢ బోనాల చెక్కుల పంపిణీ సందర్భంగా ప్రొటోకాల్ వివాదం నెలకొంది. ఆర్‌కే పురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయ ఆవరణంలో సోమవారం దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఆషాఢ మాసబోనాల దశాబ్ది ఉత్సవాల–2024 చెక్కుల పంపిణీ కార్యక్రమం అధికారులు ఏర్పాటు చేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్‌రావు హాజరయ్యారు. లబ్ధిదారులకు మాత్రమే లోపలికి అనుమతిస్తారని పోలీసులు చెప్పడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులను లోపలకు రానీయకపోతే.. ప్రొటోకాల్ లేని వ్యక్తులను కూడా వేదికపైకి ఆహ్వానించొద్దని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయినా కాంగ్రెస్ నాయకులు వేదికపైకి వచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి చెక్కుల పంపిణీ కార్యక్రమం వద్దనే బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, చైతన్యపురి పోలీసులు అక్కడకు చేరుకొని గొడవ జరగకుండా ఇరువర్గాలను అడ్డుకున్నారు. ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను బయటకు పంపించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, చల్లా నర్సింహారెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రతినిధిగా చెక్కుల పంపిణీకే ఇక్కడకు వచ్చానని, అధికారులు ప్రొటోకాల్ ప్రకారం అందరినీ పిలిచారని, స్థానిక ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని తాను స్వయంగా పిలిచినా రాలేదని..మనస్సులో ఏదో పెట్టుకొని ఈ కార్యక్రమం ఎలా చేసిందన్నారు.

అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఎలా వస్తారు

ఎమ్మెల్యేతోపాటు ఎన్నికల్లో ఓడిపోయి, మూడోస్థానంలో నిలిచిన అభ్యర్థిని స్టేజీపైన ఎలా కూర్చోబెడతారని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మూడుసార్లు మంత్రిగా సేవలందించిన సీనియర్ మహిళా నాయకురాలికి 'ప్రజాపాలన'లో దక్కే గౌరవం ఇదేనా అన్నారు. ప్రజాప్రతినిధులను గౌరవించే సంస్కృతిని ఈ ప్రభుత్వం మర్చిపోతుందని, స్పీకర్ ఈ వ్యవస్థను గాడిలో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై అసెంబ్లీలో ప్రశ్నిస్తానని చెప్పారు.

అబ్బాయి హాల్ టికెట్‌పై అమ్మాయి ఫొటో

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చిన అభ్యర్థులకు తక్షణమే సరిచేసి న్యాయం చేస్తున్నామని విద్యాశాఖ వెల్లడించింది.

మొదట్నుంచీ వివాదమే

డీఎస్సీ నిర్వహణ మొదట్నుంచీ వివాదాస్పదమే అవుతోంది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసిన వారికి ప్రిపరేషన్ లేకుండా డీఎస్సీ పెట్టడంపై అభ్యర్థులు, రాజకీయ నేతల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. ఇవన్నీ కోచింగ్ కేంద్రాలు, రాజకీయ ప్రాపకం కోసం పాకులాడే నేతలు సృష్టించినవేనని ప్రభుత్వం కొట్టి పారేసింది. తాజాగా హాల్ టిక్కెట్లు ఈ నెల 11 నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. అయితే, చాలా చోట్ల అవి డౌన్‌లోడ్ కావడం లేదనే ఫిర్యాదులొచ్చాయి. దీనిపై విద్యాశాఖ సోమవారం వివరణ ఇచ్చింది. అన్ని చోట్ల డౌన్‌లోడ్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పింది. దీంతో పెద్ద ఎత్తున సోమవారం విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు.

ఫొటోల తారుమారు

మేడ్చల్ జిల్లా దమ్మాయి గూడ బాలాజీ నగర్‌కు చెందిన పల్లెపు రామచంద్రయ్య డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేశాడు. హాల్ టికెట్‌లో అతని పేరు సక్రమంగానే ఉంది. కానీ ఫొటో మాత్రం ఎవరో అమ్మాయిది వచ్చింది. సంతకం కూడా తనది కాదని గుర్తించాడు. నల్గొండ జిల్లా చిట్యాలకు చెందినన రుద్రారపు భవ్య డీఎస్సీలో ఎస్ఏ పోస్టుకు అప్లై చేసింది. ఆమె ఫొటో బాదులు వేరే అబ్బాయి ఫొటో వచ్చింది. దీంతో ఆమె అధికారులను ఆశ్రయించింది. తక్షణమే స్పందించిన అధికారులు ఆమె ఫొటో వచ్చేలా చేశారు.

నిజంగా నెట్ సెంటర్లదే తప్పా?

అభ్యర్థులు నెట్ సెంటర్లలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. వారి ఫొటో, సంతకాలను డిజిటల్ చేసి ఇస్తుంటారని తెలిపారు. ఎక్కువ మంది ఉండటంతో నెట్ యజమానులు ఒకరి ఫొటోకు బదులు వేరొకరి ఫొటో పెట్టారని అంటున్నారు. దరఖాస్తు చేసేటప్పుడు ఏ ఫొటో, సంతకం ఉంటుందో హాల్ టికెట్‌లోనూ అదే వస్తుందని, దీనికే తమను నిందిస్తే ఎలా అని విద్యాశాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

'ఇచ్ఛంపల్లి'కి అంగీకరించం

- అక్కడ బరాజ్‌ను నిర్మిస్తే సమ్మక్క సాగర్ వద్ద వరద నియంత్రణ కష్టం
- ఎన్‌డబ్ల్యూడీఏ పాలక మండలి భేటీలో తెలంగాణ స్పష్టీకరణ
- గోదావరి–కావేరీ ప్రాజెక్టులో 50% నీటి వాటా తమకు కేటాయించాలని డిమాండ్
- త్వరలో ప్రభావిత రాష్ట్రాలతో సమావేశం: కేంద్ర జలశక్తి శాఖ

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా గోదావరిపై ఇచ్ఛంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి అంగీకరించేది లేదని తెలంగాణ తేల్చి చెప్పింది. ఇచ్ఛంపల్లి వద్ద బరాజ్‌ను నిర్మించి ఆకస్మికంగా వరదను విడుదల చేస్తే 24 కిలోమీటర్ల దిగువన ఉన్న సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) వద్ద దాని నియంత్రణ కష్టంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన సోమవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) పాలక మండలి సమావేశంలో తెలంగాణ తరఫున రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ వాదనలు వినిపించారు. ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భోపాల్ సింగ్, తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఏపీ జలవనరుల శాఖ హైడ్రాలజీ చీఫ్ ఇంజనీర్ కుమార్ సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇచ్ఛంపల్లి వద్ద నుంచి నీళ్లను తరలించాలనే ప్రతిపాదనలను అనిల్‌కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు తమ అభ్యంతరాలు తెలియజేస్తూ గత మార్చి 6న రాసిన లేఖలోని అంశాలన్నీ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

తెలంగాణ లేవనెత్తిన అంశాలు

- ఇచ్ఛంపల్లికి దిగువన తెలంగాణ రాష్ట్రానికి 158 టీఎంసీల నీటి అవసరాలున్నాయి. ఇచ్ఛంపల్లి వద్ద బరాజ్ నిర్మిస్తే దిగువన ఉన్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అవసరాలతో పాటు గోదావరి–కావేరీ అనుసంధానం ప్రాజెక్టు అవసరాలను ఏకకాలంలో ఎలా తీరుస్తారు?
- ప్రాజెక్టు తొలిదశలో తరలించే 108 టీఎంసీల్లో 16 టీఎంసీలను కర్ణాటకకు కేటాయిస్తూ, ఆ నీటిని అల్మట్టి రిజర్వాయర్ నుంచి వాడుకోవడానికి కర్ణాటకను అనుమతించారు. అయితే ఆల్మట్టి రిజర్వాయర్ దిగువన ఉన్న జూరాల, శ్రీశైలం జలాశయాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది.
- పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీలకు బదులుగా నాగార్జునసాగర్‌కు ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకోవడానికి బచావత్ ట్రిబ్యునల్ వెసులుబాటు కల్పించింది. అందులో 21 టీఎంసీలను కర్ణాటక, 14 టీఎంసీలను మహారాష్ట్ర వాడుకుంటున్నాయి. తాజాగా మరో 16 టీఎంసీలను ఆల్మట్టి నుంచి వాడుకోవడానికి కర్ణాటకకు వీలు కల్పిస్తే జూరాల, శ్రీశైలంలపై ప్రభావం తీవ్రంగా ఉంటుంది.
- కర్ణాటకలోని బెడ్తి–వార్దా నదుల అనుసంధానంలో తరలించే 18 టీఎంసీల్లో 8 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలి.
- గోదావరి–కావేరీ అనుసంధానం ప్రాజెక్టు ద్వారా తరలించే నీటిలో 50 శాతాన్ని తెలంగాణకు కేటాయించాలి.
- ఈ ప్రాజెక్టు ద్వారా తరలించే గోదావరి జలాలను నాగార్జునసాగర్‌లో ఎత్తిపోసి అక్కడి నుంచి కావేరికి తరలిస్తామని ప్రతిపాదించారు. తెలుగు రాష్ట్రాలకు కేటాయించిన 1,050 టీఎంసీల కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ పంపిణీ చేసేవరకు సాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకోరాదు. ఒకవేళ అలా వినియోగిస్తే దానిపై ఆధారపడిన ఏపీ, తెలంగాణ అవసరాలు తీరతాయా? లేదా? అనే అంశంపై సిమ్యులేషన్ స్టడీస్ చేశాకే ఇబ్బందుల్లేవని తేలితేనే ముందుకెళ్లాలి.
- సీతారామ ఎత్తిపోతల పథకం– సీతమ్మసాగర్ బరాజ్ బహుళార్ధ సాధక ప్రాజెక్టు, సమ్మక్క సాగర్ బరాజ్ ప్రాజెక్టుల డీపీఆర్‌లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఆమోదించాలి.

ఛత్తీస్‌గఢ్ నో

ఇచ్ఛంపల్లి వద్ద 87 మీటర్ల ఎత్తుతో, సమ్మక్క సాగర్ వద్ద 83 మీటర్ల ఎత్తుతో బరాజ్‌లు నిర్మిస్తే తమ రాష్ట్రంలో తీవ్ర ముంపు సమస్య ఉంటుందంటూ ఛత్తీస్‌గఢ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు అంగీకరించబోమని స్పష్టం చేసింది.

పోలవరం నుంచి చేపట్టాలి: ఏపీ

ఇచ్ఛంపల్లి, సమ్మక్క సాగర్ బరాజ్‌ల విషయంలో రాష్ట్రాల మధ్య ఏకభిప్రాయం లేనందున పోలవ రం ప్రాజెక్టు నుంచే నదుల అనుసంధానం చేపట్టా లని ఏపీ సూచించింది. పోలవరం నుంచి సోమ శిల, అక్కడి నుంచి కావేరికి నీళ్లను తరలించవచ్చని ఇప్పటికే ప్రతిపాదించామని, వీటిపై పునఃపరిశీలన జరపాలని కోరింది.

కుదరకపోతే ఇంద్రావతిపై రిజర్వాయర్: దేబశ్రీ ముఖర్జీ

గోదావరి– కావేరీ అనుసంధానం ప్రాజెక్టుకు రాష్ట్రాలు సూత్రప్రాయంగా సమ్మతి తెలపడంపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టు ద్వారా ప్రభావితం కానున్న రాష్ట్రాలతో త్వరలో సమావేశం నిర్వహించి చిన్న చిన్న అభిప్రాయ భేదాలను పరిష్కరిస్తామని చెప్పారు. ఇచ్ఛంపల్లి, సమ్మక్క సాగర్‌ల విషయంలో సమ్మతి కుదరకపోతే కొత్తగా ఇంద్రావతిపై రిజర్వాయర్ కట్టి, నీటిని తరలించే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల హక్కులు కాలరాసేలా

ప్రొటోకాల్ ఉల్లంఘనలు

- ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్న రేవంత్ ప్రభుత్వం
- కాంగ్రెస్ నేతలకు సంక్షేమ పథకాల పంపిణీ బాధ్యతలు
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కేటీఆర్ బహిరంగలేఖ



సాక్షి, హైదరాబాద్ : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రొటోకాల్ ఉల్లంఘన మంచి సాంప్రదాయం కాదని, ఎమ్మెల్యేల ప్రొటోకాల్‌ను పరిరక్షించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కేటీఆర్ సోమవారం బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్దేశపూర్వకంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తూ ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఆ లేఖలో పేర్కొన్నారు. 'కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ మొదలుకొని ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల చెక్కులను స్థానిక ఎమ్మెల్యేకు బదులుగా కాంగ్రెస్ నాయకులే పంపిణీ చేస్తున్నారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభ కార్యక్రమాలు కూడా ఎమ్మెల్యే లేకుండానే పూర్తి చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులే ఎమ్మెల్యేలు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. హుజూరాబాద్, మహేశ్వరం, ఆసిఫాబాద్ సహా ఇలా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలున్న అనేక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలపైనే ఎదురుదాడి చేస్తున్నారు. ప్రభుత్వంలోని పెద్దల బెదిరింపులతో అధికారులు కూడా కాంగ్రెస్ నేతలు చెప్పినట్టుగా నడుచుకునే పరిస్థితి తెచ్చారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ దృష్టికి తెచ్చేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రావడం లేదు. పార్టీలతో సంబంధం లేకుండా ఎమ్మెల్యేల హక్కులు, ప్రొటోకాల్‌కు భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్పీకర్‌గా మీపైనే ఉంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఎదుర్కొంటున్న ప్రొటోకాల్ సమస్యలపై అనేక కథనాలు వచ్చాయి. స్పీకర్ హోదాలో విచక్షణ అధికారం ఉపయోగించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ప్రొటోకాల్ పరిరక్షణకు వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలి' అని కేటీఆర్ స్పీకర్‌కు రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఎమ్మెల్యేలకు గౌరవం లేదా : మాజీ మంత్రి హరీశ్‌రావు

మూడుసార్లు మంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మహిళా ప్రజాప్రతినిధికి ఇందిరమ్మ రాజ్యంలో గౌరవం లేదా అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న నాయకులకు విలువ లేదా అని ప్రశ్నించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని విస్మరించి, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, మూడోస్థానానికి పరిమితమైన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి అధికార యంత్రాంగం సలాం కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై స్పీకర్ స్పందించి చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు.

క్లబ్ హౌస్‌ల్లో డ్రగ్స్ వినియోగమా?

- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు చోటివ్వద్దు: హైకోర్టు
- శాశ్వత కార్యాచరణ ప్రణాళిక ఉండాలన్న జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి
- 4 వారాల్లోపు జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని 'ఇందు' ఓనర్స్ అసోసియేషన్‌కు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: క్లబ్ హౌస్‌ల్లో మాదక ద్రవ్యాల వినియోగంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఇలాంటి కార్యకలాపాలు చోటుచేసుకోకుండా శాశ్వత కార్యాచరణ ప్రణాళిక అవసరమని వ్యాఖ్యానించింది. నాలుగు వారాల్లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని ఇందు ఫార్చున్ ఫీల్డ్స్ విల్లా ఓనర్స్ అసోసియేషన్‌ను ఆదేశించింది. అందరితో చర్చించి అభిప్రాయాలు తీసుకోవాలంటూ తదుపరి విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. అసోసియేషన్‌లోని క్లబ్ హౌస్‌లో చట్టవిరుద్ధంగా జూదంతోపాటు డ్రగ్స్, లిక్కర్ వినియోగం లాంటివి చేస్తున్నారంటూ ఇందు ఫీల్డ్స్ 13వ ఫేజ్‌కు చెందిన హరి గోవింద ఖురానా రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జూలై 15న ఫోన్ ద్వారా, జూలై 12న రాతపూర్వకంగా, అంతకుముందు జనవరిలో వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ గేమింగ్ యాక్ట్ 1974 రూల్ 4లోని సెక్షన్లు 3, 4.. తెలంగాణ ఎక్సైజ్ రూల్స్ 2005, యాక్ట్ 1968.. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్స్ యాక్ట్ 1985, అనైతిక ట్రాఫిక్ ప్రివెన్షన్ చట్టంలోని నిబంధనలకు క్లబ్ హౌస్ చర్యలు విరుద్ధమన్నారు. తాను ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు చేపట్టేలా హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌ఓటీ), జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి, కేపీహెచ్‌బీ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు.

కమిటీ చర్యలు సరిపోవు..

అసోసియేషన్ తరఫున సీనియర్ న్యాయవాది రేసు మహేందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'క్లబ్ హౌస్‌లో జరిగే కార్యకలాపాలపై దృష్టి సారించి, ఏం జరుగుతుందో తెలుసుకునేలా సెక్యూరిటీకి సూచనలు చేయాలని ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయించింది. ఏవైనా అసాంఘిక కార్యకాలాపాలు చోటుచేసుకున్నట్లు తెలిస్తే కమిటీ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అంతేకాకుండా కమ్యూనిటీ పరిసరాల్లో అనైతిక చర్యలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కమిటీ నిర్ణయించింది' అని చెప్పారు. ఈ మేరకు ఈ నెల 10న నిర్వహించిన అసోసియేషన్ సమావేశ వివరాలను కోర్టుకు అందజేశారు. అనంతరం పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. భేటీలో కమిటీ తీసుకున్న చర్యలు సరిపోవన్నారు. జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి క్లబ్ హౌస్‌లో గేమింగ్ కార్యకలాపాలు, డ్రగ్స్ వినియోగం, లిక్కర్ పార్టీలు నిర్వహిస్తున్న వారిని హెచ్చరించాలని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నాలుగు వారాల్లోపు జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని అసోసియేషన్‌ను ఆదేశించారు. మాదక ద్రవ్యాల వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి ఏం చర్యలు తీసుకోవాలో అందరితో చర్చించాలన్నారు.

డ్రగ్స్ కేసులో రకుల్ సోదరుడు అమన్ అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌కు వచ్చారు. కొన్నాళ్లు నగరంలోని పారామౌంట్‌కాలనీలో ఉన్నప్పటికీ ప్రస్తుతం ఢిల్లీలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. విదేశాల నుంచి కొకైన్ సహా వివిధ రకాలైన డ్రగ్స్ ఖరీదు చేస్తున్న వీళ్లు తమ ఏజెంట్ల ద్వారా దేశవ్యాప్తంగా అనేక మంది పెడ్లర్స్‌కు సరఫరా చేస్తున్నారు. నైజీరియా నుంచి వచ్చి బెంగళూరులో హోమ్ సర్వీస్ పని చేస్తున్న అనోహ బ్లెస్సింగ్ వీరికి ప్రధాన ఏజెంట్‌గా ఉంది. ఈమె హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, గోవాల్లో ఉన్న పెడ్లర్స్, సెల్లర్స్‌కు మాదకద్రవ్యాలు సరఫరా చేసింది. ఏడాదిన్నర కాలంలో 20 సార్లు నగరానికి మాదకద్రవ్యాలు తెచ్చింది. డ్రగ్స్‌ను హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకుని, విమానాలు, రైళ్లలో తిరుగుతూ సప్లై చేస్తుంటుంది. ఈ డ్రగ్స్‌ను నిజాం కాలేజీ విద్యార్థిగా ఉన్న నైజీరియన్ అజీజ్ నోహీమ్ అడెషోలా, బెంగళూరులో ఉంటూ ఓ కంపెనీకి లీడ్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్న విశాఖ వాసి అల్లం సత్య వెంకట గౌతమ్, అమలాపురం నుంచి వచ్చి నగరంలో నివసిస్తున్న కారు డ్రైవర్ సనబోయిన వరుణ్ కుమార్, బండ్లగూడకు చెందిన ఈవెంట్స్ కొరియోగ్రాఫర్ మహ్మద్ మెహబూబ్ షరీఫ్‌లకు పంపిణీ చేస్తోంది. వీళ్లు తమ వినియోగదారులకు వీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

గ్రాముకు రూ.500 కమీషన్

2018 నుంచి ఈ దందాలో ఉన్న అనోహ ఆఫ్రికా నుంచి జోయినా గోమెస్ పేరుతో నకిలీ పాస్‌పోర్టు తీసుకుని వినియోగిస్తోంది. తరచూ బెంగళూరు–హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న గౌతమ్... అనోహ ద్వారా అందుకున్న డ్రగ్స్‌ను పెడ్లర్స్‌కు సరఫరా చేస్తున్నాడు. ఒక్కో గ్రాముకు రూ.500 చొప్పున కమీషన్ తీసుకుంటూ డెలివరీ ఇస్తున్నాడు. ఇటీవలే ఇద్దరు నైజీరియన్లు ఇతడి బ్యాంకు ఖాతాలోకి రూ.13.24 లక్షల కమీషన్‌ను ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇతడు ఐదు నెలల క్రితమే ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. ఆమె బ్యాంకు ఖాతాలోకీ రూ.2.5 లక్షల కమీషన్ డిపాజిట్ చేయించాడు. ఇతడు గత ఏడు నెలల్లో 2.6 కేజీల కొకైన్ క్రయవిక్రయాలు చేసినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. వరుణ్ కుమార్‌కు తన వినియోగదారుడైన మధు ద్వారా గౌతమ్‌తో పరిచయం ఏర్పడింది. అలా ఈ దందాలోకి వచ్చిన ఇతడు నైజీరియన్ల నుంచి గ్రాము రూ.8 వేలకు ఖరీదు చేసి, రూ.12 వేలకు విక్రయిస్తున్నాడు. ఇలా ఆరు నెలల కాలంలో రూ.7 లక్షల వరకు ఆర్జించాడు.



ఎబుక సుజీ



ఫ్రాంక్లిన్

నగరంలో 13 మంది...

వీరి దందాపై టీజీఏఎన్‌బీ అధికారులకు సమాచారం అందింది. దీంతో సోమవారం హైదర్షాకోట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌పై దాడి చేశారు. అక్కడ ఎబుక, ఫ్రాంక్లిన్ మినహా మిగిలిన ఐదుగురూ చిక్కారు. వీరి నుంచి 199 గ్రాముల కొకైన్, వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ పెడ్లర్స్ విచారణలో 13 మంది నగరవాసులు తమ నుంచి తరచూ డ్రగ్స్ ఖరీదు చేసి వినియోగిస్తున్నట్లు బయటపెట్టారు. వీరిలో బంజారాహిల్స్‌కు చెందిన బిల్డర్ అనికేత్ రెడ్డి, కన్‌స్ట్రక్షన్ వ్యాపారి ప్రసాద్, సినీ నటుడు అమన్‌ప్రీత్ సింగ్, మాదాపూర్ వాసి మధుసూదన్, పంజగుట్టకు చెందిన నిఖిల్ దావన్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు డ్రగ్ టెస్ట్ చేయగా... కొకైన్ వాడుతున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో వీరిని అరెస్టు చేసిన అధికారులు పరారీలో ఉన్న సూత్రధారుల కోసం గాలిస్తున్నారు. డ్రగ్స్‌పై సమాచారం తెలిస్తే 8712671111కు తెలపాలని కోరారు. ఎబుక, ఫ్రాంక్లిన్ సమాచారం అందిస్తే రూ.2 లక్షల రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించారు. కాగా, సూత్రధారులిద్దరూ నైజీరియా పారిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

మీకు తెలుసా?



ఒక గ్లోబల్ సర్వే ప్రకారం జీతం పెంపుదల కోరుతున్న స్త్రీల శాతం మన దేశంలోనే ఎక్కువగా ఉంది.

జీతం పెంపుదల కోరుతున్న స్త్రీలు

భారతదేశం	65%
యూఎస్	51%
యూకే	47%

ఇడియెట్ సిండ్రోమ్

'గూగుల్ చేసి చూడకు. రాసిచ్చిన మందులు వాడు' అని డాక్టర్ పేషెంట్‌తో చెప్పాల్సి వస్తోంది. కారణం- ప్రిస్క్రిప్షన్ తీసుకుని బయటకు వచ్చిన వెంటనే ఆ మందులను గూగుల్ చేసి వాటి గుణాలు, సైడ్ ఎఫెక్ట్‌లు, వాటిని ఏయే జబ్బులకు వాడతారు అన్నీ పేషెంట్ తెలుసుకోవడమే. తెలుసుకున్న తర్వాత ఎన్నో డౌటానుమానాలు తెచ్చుకొని కొన్ని మందులు వాడకపోవడం, కొన్ని డోస్ తగ్గించమనడం ఇలా చేస్తూ ఆరోగ్యానికి హాని చేసుకుంటున్నారని డాక్టర్లు అంటున్నారు. ఇలా చేసే స్వభావానికి 'ఇడియట్ సిండ్రోమ్' అనే పేరు కూడా పెట్టారు.

గూగుల్ కన్నా డాక్టర్ మిన్న



కొన్ని నెలల క్రితం ఒక యువతి కిడ్నీలు ఫెయిలయ్యే స్థితిలో హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి వచ్చింది. పరీక్షలు చేసిన డాక్టర్లు ఆమెకు మందులు పని చేయని స్థితిని గమనించారు. కారణం ఆమె యూరిన్ ఇన్ఫెక్షన్ అని చెప్పినప్పుడల్లా తండ్రి ఇంటర్నెట్‌లో చూసి మందులు తెచ్చి వాడటమే. అతను డాక్టర్‌ని కలవాలనుకోలేదు. డాక్టర్ కంటే గూగుల్‌ని నమ్మాడు. ఇలా చేయడం వల్ల ప్రాణాంతకమైతే తిరిగి డాక్టరే రక్షించాల్సి వచ్చింది గూగుల్ కాదు.

డాక్టర్‌కు తెలుసు

డాక్టర్‌లు తమ డాక్టర్ పట్టా కోసం ఐదేళ్లు చదువుతారు. ఆ తర్వాత తర్ఫీదు అవుతారు. ఆ తర్వాత ప్రాక్టీసు మొదలెడతారు. దేహ గుణాలు, మందు గుణాలు పేషెంట్‌ను బట్టి జబ్బును బట్టి తమ అనుభవం కొద్దీ రాస్తారు. పేషెంట్‌ను కాపాడటమే డాక్టర్ లక్ష్యం. గతంలో డాక్టర్ రాసింది పేషెంట్లు నమ్మకంగా ఫాలో అయ్యేవారు. మహా అయితే మందుల షాపువాణ్ణి ఈ మందులు మంచివేనా అని అడుగుతారు. కాని ఇప్పుడు పరిస్థితి మారింది. విస్తృతంగా వచ్చిన ఇంటర్నెట్ వల్ల ప్రతి దాన్ని తెలుసుకోవాలనే ఉబలాటం, ప్రతి దాన్నీ సందేహించే స్వభావం ఏర్పడ్డాయి. డాక్టర్ రాసిన మందులను తమ ఇష్టానుసారం మార్చుకుంటున్నారు. సైడ్ ఎఫెక్ట్స్ చదివి బెంబేలు పడి కొన్ని వాడటమే లేదు. పైగా మందుచీటిని తిరిగి తీసుకొచ్చి ప్రశ్నలతో వేధిస్తున్నారు. పేషెంట్ల ఇలాంటి రుగ్మతకు డాక్టర్లు పెట్టిన పేరే 'ఇడియట్ సిండ్రోమ్'!

నెట్ జ్ఞానం సరికాదు...

'ఇడియట్ సిండ్రోమ్'తో రోగులు వైద్యుల్ని ప్రశ్నించడం, సొంతవైద్యం చేసుకోవడం సరి కాదు. ఇంటర్‌నెట్ సమాచారంతో వ్యాధి నిర్ధారణ సమంజసం కాదు. నెట్ చూసి మందులు వాడితే ఒక్కోసారి ప్రాణాలమీదికి రావచ్చు. వైద్యాన్ని వైద్యుడు తన పరిజ్ఞానంతో, అనుభవంతో, నైపుణ్యంతో వ్యాధి నిర్ధారణ చేసి, ఏయే మందులు ఏయే మోతాదులో వాడాలో నిర్ణయిస్తాడు. గూగుల్ సమాచారంతో ఎవరికి వారు నిర్ధారణలూ, మందుల నిర్ణయాలూ సరికాదని తెలుసుకోవాలి.

– **డాక్టర్ పావనీ ప్రియాంక,** కార్యదర్శి, ఐఎంఏ, తెనాలి



శంక వద్దంటున్నారు

ఇటీవల సీఎస్ మంజునాథ్ అనే వైద్యుడు 'మీ గూగుల్ పరిజ్ఞానంతో అయోమయానికి గురై... నా మెడికల్ డిగ్రీని శంకించకండి' అంటూ బోర్డు పెట్టుకున్న దృశ్యం వైరల్ అయ్యింది. ఆయన దగ్గరే కాదు... ఈ తరహా బోర్డులు మరెన్నో ఆసుపత్రుల్లో కనిపిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో వంటలూ, వార్తలూ, కామెడీ ఎంత చూసినా పర్లేదు. కానీ వ్యాధులూ, వైద్యాలు చూస్తూ తమ జబ్బులతో తామే పేషెంట్లు చెలగాటాలాడుతున్నారని డాక్టర్ల ఆవేదన. 'ఈ మందును ఎక్కువ వాడితే సైడ్‌ఎఫెక్ట్స్ వస్తాయట' అంటూ డాక్టర్లకే వైద్యం నేర్పుతున్నారు. 'పానీ పూరీ, ఫాస్ట్‌ఫుడ్డూ తినేప్పుడు ఇలాగే సైడ్ ఎఫెక్ట్స్ గురించి ఆలోచిస్తున్నారా' అంటూ డాక్టర్లు చీవాట్లు పెడుతున్న సందర్భాలూ ఉంటున్నాయి. నిజానికి 'పేషెంట్' అనే మాటకు 'రోగి' అన్న పదం అంత గౌరవ ప్రదంగా లేదంటూ 'బాధితుడు' అని వాడటం పరిపాటి అయ్యింది. ఇడియెట్ సిండ్రోమ్ వల్ల పేషెంట్ల చేతిలో డాక్టర్లు బాధితులవుతున్నారనేది వైద్యుల ఆవేదన.

డాక్టర్ షాపింగ్

వాస్తవానికి వ్యాధి ఏమిటనేది అనుభవంతో కూడిన వైద్యులు, ఎన్నో కోణాల నుంచి పరిశోధన, ఎన్నో పరీక్షలు చేశాక నిర్ధారణ చేస్తారు. తర్వాత తగిన మోతాదులో మందులిస్తారు. అప్పుడు 'ఈ ఫలానా ఇంజెక్షనే ఎందుకు? దీనికి ప్రత్యామ్నాయంగా ట్యాబ్లెట్ ఉందిగా' అంటూ అడుగుతున్న పేషెంట్లు... అంతటితో ఆగకుండా... ఆ డాక్టర్‌ను వదిలి మరో డాక్టర్ దగ్గరికి మరో ఒపినీయన్, ఇంకో ఒపీనియన్ అంటూ తిరుగుతున్నారు. ఇలా తిరగడాన్నే వైద్య పరిభాషలో 'డాక్టర్ షాపింగ్' అంటారు. దీని తర్వాత సొంతంగా మందుల్ని కొని వాడుతూ ప్రాణాల మీదికి తెచ్చుకున్న దాఖలాలూ ఉన్నాయి. దీనికి పరాకాష్ట ఇటీవల ఓ భర్త ఇంటర్‌నెట్ చూస్తూ పురుడు పోస్తూ తన భార్య మరణానికి కారణమయ్యాడు. అందుకే 'ఇడియట్ సిండ్రోమ్' ధోరణి వద్దంటున్నారు.

– **బి.ఎల్. నారాయణ,** సాక్షి, తెనాలి.



పరాంకుశం వీణాశ్రీవాణి... ఆమె పేరులోనే సరిగమల శ్రుతి వినిపిస్తోంది. అమలాపురంలో ఓ చిన్న అగ్రహారం అమ్మాయి శ్రుతి చేసిన వీణ ఇప్పుడు అంబానీ ఇంటి వేడుకలో సరిగమలతో అలరించింది. ఆ ఆనంద క్షణాలను ఆమె సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు.

అంబానీ వేడుకలో తెలుగు వీణ

"మాది అమలాపురం జిల్లా ఇందుపల్లి అగ్రహారం. బందారులంకలోని పిచ్చుక సీతామహాలక్ష్మిగారి దగ్గర సంగీతం నేర్చుకున్నాను. ఈ రోజు ఇన్ని ప్రశంసలందుకుంటున్నానంటే ఆమె నేర్పిన సంగీత జ్ఞానమే కారణం. అంబానీ కుటుంబంలో పెళ్లి వేడుకకు వీణావాదన చేయడానికి ఆహ్వానం రావడంతో ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే నా పేరు వాళ్లకు తెలిసే అవకాశమే లేదు. నేను సోషల్ మీడియాలో చురుగ్గా ఉండడం వల్లనే నా కళను వారు గుర్తించడానికి కారణం అనుకుంటున్నాను. నీతా అంబానీ గారు చెప్పారు అంటూ వాళ్ల మేనేజరో ఎవరో కాంటాక్ట్ చేశారు. ఏ దుస్తులు ధరించాలనే విషయం నుంచి వేడుకలో ఏ పాటలు కావాలో కూడా ఆమే ఎంపిక చేశారు. నేనిచ్చిన జాబితా నుంచి ఆమె ఎంపిక చేసిన పది పాటలను వీణ మీద వినిపించాను. నా చెలి రోజావే, ఉరికే చిలకా... వంటి పలు భాషల్లోకి అనువాదమై ఉన్న పాటలనే ఎంచుకున్నాను. ఇదంతా పదిహేను రోజులపాటు నడిచింది.

నాలుగు వేల అడుగులు

పన్నెండవ తేదీ ఉదయం ముంబయికి వెళ్లాం. హోటల్‌లో రిఫ్రెష్ అయిన తర్వాత నేరుగా జియో కన్వెన్షన్ సెంటర్‌కెళ్లాం. ఆ సెంటర్ ఎంట్రన్స్ నుంచి నా ప్రదర్శన ఉన్న ఆడిటోరియంలో వేదిక వద్దకు చేరడానికి నాలుగు వేల అడుగులు పడ్డాయి. ఫోన్‌లో చెక్ చేసుకున్నాను కూడా. నిర్వాహకులు వెంట ఉండి తీసుకెళ్లకపోతే నా వేదిక ఏదో తెలుసుకోవడంతోనే రోజు పూర్తయ్యేదేమో. నీతా అంబానీ స్వయంగా కళాకారిణి కావడంతో ఈ వేడుకలో కళాప్రదర్శనకు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చారనుకున్నాను. భోజనాల దగ్గర కూడా ఆర్టిస్టుల కోసమే ఒక పెద్ద హాలును కేటాయించారు. వేల రకాల వంటలు వడ్డించారని విన్నాను. కానీ నేను సలాడ్‌లు, కాఫీ మాత్రమే తీసుకున్నాను. పెళ్లి వేడుకలో నీతా అంబానీ ఎంత శ్రద్ధగా ప్రతి చిన్న విషయాన్నీ పట్టించుకున్నారంటే డెకరేషన్‌లో ఉన్న పూలను కూడా పరిశీలించి థీమ్‌కి అనుగుణంగా మార్పించారు. కొన్ని రోజులపాటు ఆమె మధ్యాహ్నం మూడు నుంచి తెల్లవారి ఆరుగంటల వరకు పని చేశారట. అయినా సరే ఆమె ముఖంలో అలసట కనిపించలేదు. గొప్ప ఆర్గనైజర్ ఆమె.

రెండు కళ్లు చాలవు!

ఆడిటోరియానికి వెళ్లే దారిలో ఒక వరుస అత్తరులు, ఇత్తడి బిందెలతో గుజరాత్ సంప్రదాయ నమూనా అలంకరణ ఉంది. ఆ తర్వాత ధొలారి ధని థీమ్, ఫారెస్ట్ థీమ్, కలంకారీ థీమ్ ఓ వరుస ఉన్నాయి. శంకర్ మహదేవన్, శ్రేయాఘోషాల్, శివమణి వంటి సంగీతకారులు, గాయకుల ప్రోగ్రామ్‌లను టీవీ లైవ్ లో చూశాను. వందమంది రాజమౌళిలు, వంద మంది సంజయ్ లీలా భన్సాలీలు కలిసి సెట్టింగు వేయించారా అనిపించింది. చూడడానికి రెండు కళ్లు చాలవు. తలను 360 డిగ్రీల్లో తిప్పి చూడాల్సిందే. బారాత్ తర్వాత పెళ్లికి ముందు హై టీ టైమ్‌లో రాత్రి ఏడు నుంచి ఏడు ముప్పావు వరకు నా కచేరీ సాగింది. రాధిక మర్చంట్ కుటుంబం, అంబానీ కుటుంబ సభ్యులకు మాత్రమే అనుమతి. వాళ్లు కదలకుండా కూర్చుని, ఓ పాటను మళ్లీ అడిగి మరీ చక్కగా ఆస్వాదించడం, కళల పట్ల వారికున్న గౌరవం నాకు సంతృప్తినిచ్చింది.



అంబానీ పెళ్లి వేడుకలో...

వీణాపాణి ఇచ్చిన వరం

జనసందోహంలో నేను ఎక్కువ సేపు ఇమడలేను. నా కచేరీ పూర్తి కాగానే నన్ను బయటకు తీసుకెళ్లమని నిర్వాహకులను అడిగాను. గేటు వరకు తీసుకొచ్చి వెహికల్ ఎక్కించేశారు. పదమూడవ తేదీ ఉదయం ఫ్లైట్ ఎక్కి హైదరాబాద్‌కి వచ్చేసి హమ్మయ్య అనుకున్నాను. నాకిప్పుడు తలుచుకున్నా సరే అంతా కలలా అనిపిస్తోంది. ఆంధ్రుల ఆడపడుచుని, తెలంగాణ కోడలిని. నాకు తెలిసినంత వరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ వేడుకలో కళను ప్రదర్శించిన ఏకైక వ్యక్తిని నేనే... అనుకున్నప్పుడు గర్వంగా అనిపిస్తోంది. సరస్వతీ మాత వీణతోపాటు నాకిచ్చిన వరం ఈ అవకాశం అనుకుంటున్నాను" అని రెండు చేతులూ జోడించారు వీణాశ్రీవాణి తన వీణను మురిపెంగా చూసుకుంటూ.

– **వాకా మంజులారెడ్డి,** సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : **నోముల రాజేశ్ రెడ్డి**

■ పత్తి, కంది, సోయా కట్టెతో బయోచార్ ఉత్పత్తి
■ ఎకరానికి 1 టన్ను చల్లి.. 15% వరకు అదనపు దిగుబడులు
■ మహారాష్ట్రలో ఓ రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఓ) అనుభవం

బయోచార్‌తో బెట్ట నుంచి రక్షణ 15% అదనపు పంట!



ఇనుప బట్టీలతో బయోచార్ ఉత్పత్తి

పంట కోతలు పూర్తయ్యాక పత్తి, కంది, సోయా తదితర పంటల కట్టెకు నిప్పుపెట్టి పర్యావరణానికి హాని చేసే కన్నా.. ఆ కట్టెతో కట్టె బొగ్గు (బయోచార్) తయారు చేసి, తిరిగి భూములను సారవంతం చేసుకోవచ్చు. ఎకరానికి టన్ను బయోచార్ కంపోస్టు వాడితే పంటలు బెట్టను తట్టుకుంటాయి. తద్వారా పంట దిగుబడులను 12-15% వరకు పెంచుకోవచ్చని మహారాష్ట్రలో ఓ రైతు ఉత్పత్తిదారుల సంస్థ అనుభవం చాటి చెబుతోంది..

పంట వ్యర్థాలను తగులబెట్టటం పరిపాటి. ఇది పర్యావరణానికి హాని చేసే పని. పత్తి కట్టె, కంది కట్టె వంటి పంట వ్యర్థాలను కాలబెట్టటం వల్ల గాలి కలుషితమై కార్బన్‌డయాక్సయిడ్ శాతం పెరిగిపోతంది. సేంద్రియ ఎరువుల వాడకం తగ్గిపోయింది. రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోయింది. ఫలితంగా సాగుభూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోయింది. మట్టికి నీటిని పట్టి ఉంచే శక్తి లోపించటం, వాన నీటిని ఇంకింపజేసుకునే సామర్థ్యం తగ్గిపోవటం, సూక్ష్మజీవరాశి నశించటం వల్ల భూములు నిస్సారమైపోతున్నాయి. మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లాలో 4 లక్షల హెక్టార్లలో పత్తి, లక్ష హెక్టార్లలో కంది పంటలను రైతు సాగు చేస్తారు. పంట కోత పూర్తయిన తర్వాత రైతులు పత్తి, కంది కట్టెను కాల్చి వేస్తారు. దీని వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా భూమికి తిరిగి అందాల్సిన సేంద్రియ పదార్థం అందకుండా పోతోంది.

బిఎఐఎఫ్ (బైఫ్) డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్ అనే పుణేకు చెందిన స్వచ్ఛంద సంస్థ యవత్‌మాల్ రైతులతో కలసి పనిచేసి ఈ పరిస్థితిలో విజయవంతంగా మార్పుతెచ్చింది. పత్తి, కంది కట్టెను వట్టిగా కాలబెట్టకుండా.. ఒక పద్ధతి ప్రకారం (దీన్నే పైరోలిసిస్ అంటారు) కాల్చితే బొగ్గుగా మారుతుంది. దీన్నే బయోచార్ అంటారు. దీన్ని సేంద్రియ ఎరువులతో కలిపి బయోచార్ కంపోస్టుగా మార్చి భూమిలో చల్లితే మట్టిలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది. నీటిని పట్టి ఉంచే గుణం పెరుగుతుంది. సూక్ష్మజీవుల సంతతి పెరిగి భూసారం మెరుగవుతుంది. బయోచార్ కంపోస్టు వాడకం వల్ల ముఖ్యంగా వర్షాధార వ్యవసాయ నేలలకు బెట్టను తట్టుకునే శక్తిని పెంపొందిస్తాయి.

బయోచార్ కంపోస్టు తయారు చేయాలంటే.. బయోచార్‌ను ఉత్పత్తి చేసే ఇనుప బట్టీని ఏర్పాటు చేసుకోవాలి. దీన్ని కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత చిన్న రైతులకు విడిగా ఉండదు. అందుకని బైఫ్ ఫౌండేషన్ రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని (ఎఫ్.పి.ఓ.ని) 2019లో రిజిస్టర్ చేయించింది. 220 మంది రైతులను కూడగట్టి ఒక్కొక్క రైతు నుంచి రూ. వెయ్యి షేర్ ధనంతో ఎఫ్.పి.ఓ.ను రిజిస్టర్ చేయించారు. పత్తి, కంది కట్టెను కాల్చవద్దని, దీనితో ఎఫ్‌పిఓ తరఫున బయోచార్ తయారు చేసుకొని పంటలకు వాడుకుంటే బెట్టను తట్టుకొని మంచి దిగుబడులు పొందవచ్చని బైఫ్ ఫౌండేషన్ సిబ్బంది రైతులకు ఆలోచన కలిగించారు.



బయోచార్ కంపోస్టు

2021 జనవరిలో ఎఫ్‌పిఓ పత్తి కట్టెను రైతుల నుంచి కిలో రూ. 2.5–3లు చెల్లించి కొనుగోలు చేసింది. రూ. 60 వేల ఖర్చుతో బ్యాచ్‌కు 200 కిలోల కట్టెను కాల్చే ఇనుప బట్టీని ఎఫ్‌పిఓ కొనుగోలు చేసింది. ఈ బట్టీ ద్వారా పైరోలిసిస్ పద్ధతిలో ఈ కట్టెను కాల్చి బొగ్గును తయారు చేసింది. బొగ్గును పొడిగా మార్చి గోనె సంచుల్లో నింపి ఎఫ్‌పిఓ తిరిగి రైతులకే అమ్మింది. మార్కెట్ ధర కన్నా కిలోకి రూ. 2, 3 తగ్గించి అమ్మింది. 2021–22లో ఎఫ్‌పిఓ విజయవంతంగా 100 టన్నుల పత్తి కట్టెతో 25 టన్నుల బయోచార్‌ను ఉత్పత్తి చేయగలిగింది. ఎఫ్‌పిఓ బయోచార్ ఉత్పత్తిని చేపట్టటం వల్ల చాలా మందికి పని దొరికింది. కాల్చేసే పత్తి కట్టెను రైతు అమ్ముకొని ఆదాయం పొందాడు. కట్టెను సేకరించటంలో కూలీలకు పని దొరికింది. వాహనదారులకు కట్టెను బట్టీ దగ్గరకు చేర్చే పని దొరికింది. చివరికి బయోచార్‌ను రైతులే తిరిగి తక్కువ ధరకు కొనుక్కోగలిగారు. అంతిమంగా కాలబెడితే ఆవిరైపోయే పత్తి కట్టె.. ఎఫ్‌పిఓ పుణ్యాన భూమిని సుదీర్ఘకాలం పాటు సారవంతం చేసే బయోచార్‌గా మారి తిరిగి ఆ పొలాలకే చేరటం విశేషం. హెక్టారుకు 2.5 టన్నుల బయోచార్ కంపోస్టును దుక్కిలో వేశారు. ఏటేటా పంట దిగుబడులు పెరిగాయి.

ఎకరానికి టన్ను బయోచార్ కంపోస్టు

యవత్‌మాల్ జిల్లాలోని 0.5% కన్నా తక్కువగా ఉండే వర్షాధార పత్తి తదితర పంటలు పండించే నేలలను బయోచార్ కంపోస్టు పోషకవంతం చేయటమే కాకుండా నీటిని పట్టి ఉంచే సామర్థ్యాన్ని, కరువును తట్టుకునే శక్తిని పెంపొందించింది. బయోచార్‌ను ఎంత మోతాదులో వేయాలనే దాన్ని ఇంకా ప్రామాణీకరించాల్సి ఉంది. హెక్టారుకు 1 నుంచి 10 టన్నుల వరకు సూచిస్తున్న సందర్భాలున్నాయి. రైతుకు మరీ భారం కాకుండా వుండేలా హెక్టారుకు 2.5 టన్నుల (ఎకరానికి టన్ను) చొప్పున బయోచార్ కంపోస్టును వేయించాం. బొగ్గు పొడితో వర్మీ కంపోస్టు, అజొటోబాక్టర్, అజోస్పైరిల్లమ్ వంటి జీవన ఎరువులను కలిపి బయోచార్ కంపోస్టు తయారు చేసుకొని పంట పొలాల్లో వాడాం. ఆ సంవత్సరంలోనే పత్తి, సోయా వంటి పంటల దిగుబడి 12–15% పెరిగింది. పోషకాలను నిదానంగా దీర్ఘకాలం పాటు పంటలకు అందించేందుకు, బెట్టను తట్టుకునేందుకు బయోచార్ ఉపకరిస్తుంది. బయోచార్ వినియోగం వల్ల ఒనగూడే ప్రయోజనాలను రైతులు పూర్తిగా గుర్తించేలా ప్రచారం చేయటానికి ప్రభుత్వ మద్దతు అవసరం ఉంది. ఎఫ్‌పిఓలు తయారు చేసే బయోచార్ కంపోస్టుకు ప్రభుత్వం మార్కెటింగ్‌కు అవకాశాలు పెంపొందించాలి.



– **గణేశ్** (98601 31646),
బిఎఐఎఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్, పుణే

సాగుబడి
పునర్వసు కార్తె : జూలై 19 వరకు
పుష్యమి కార్తె : 20 నుంచి

మట్టి కొట్టుకెళ్లనివ్వని సాగు!

పంటలకు ప్రాణప్రదమైన భూమి పైపొర మట్టి వర్షపు నీటితో భారీగా కొట్టుకుపోతోంది. మట్టితో కూడిన బురద నీరు వరదలా పారుతుంటే.. ఇది 'ప్రవహిస్తున్న భూమాత రక్తం' అని ఓ రైతు శాస్త్రవేత్త ఆవేదన చెందారు. మట్టిని కొట్టుకెళ్లనివ్వని సాగు పేరు పిఎండిఎస్..

ప్రపంచ వ్యాప్తంగా భూముల్లో నుంచి ప్రతి ఏటా 2,400 కోట్ల టన్నుల మట్టి వాన నీటితో పాటు కొట్టుకుపోతోంది. ప్రపంచ భూభాగంలో భారత్ వాటా 2.2% మాత్రమే. అయితే, ప్రపంచం ఏటా కోల్పోతున్న మట్టిలో 23 %ని, హెక్టారుకు సగటున 16% టన్నుల మట్టిని మన దేశం కోల్పోతున్నదని ఎఫ్.పి.ఓ. చెబుతున్న లెక్క.

అయితే, ఢిల్లీ ఐఐటిలోని పరిశోధకుల బృందం 'సాయిల్ ఎమర్జెన్సీ' గురించి తాజా అధ్యయనం విస్తుగొలిపే గణాంకాలను బయటపెట్టింది. అస్సాం, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో హెక్టారుకు ఎకరానికి ఏటా 100 టన్నులకు పైగా మట్టి కొట్టుకుపోతున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో హెక్టారుకు హెక్టారుకు ఏటా 15 నుంచి 30 టన్నుల వరకు మట్టి కొట్టుకుపోతోందని ఈ అధ్యయనంలో వెల్లడైంది. ఎడారీకరణకు గురవుతున్న రాయలసీమ వంటి కొన్ని చోట్ల ఏకంగా 50 టన్నుల వరకు మట్టి కొట్టుకుపోతోందని ఈ అధ్యయనం తేల్చింది. అడవుల నరికివేత, ప్రతి ఏటా అతిగా దుక్కిచేయటం వంటి అస్థిర వ్యవసాయ పద్ధతులతో పాటు వాతావరణ మార్పులతో కుండపోత వర్షాలు కూడా ఇందుకు దోహదపడుతున్నాయని ఈ అధ్యయనం చెబుతోంది.

అయితే, ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు మాత్రం తమ భూముల్లో మట్టి కొట్టుకుపోకుండా కాపాడుకోగలుగుతుండటం విశేషం. పోర్చుగల్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ గెల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ పురస్కారాన్ని ప్రకృతి వ్యవసాయ విభాగం ఇటీవల అందుకున్న సందర్భంలో.. ప్రకృతి సాగులో ఒక ముఖ్యభాగమైన ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పి.ఎం.డి.ఎస్.) అనే వినూత్న పద్ధతి గురించి తెలుసుకుందాం. సాయిల్ ఎమర్జెన్సీ విపత్కర స్థితిని మానవాళి దీటుగా ఎదుర్కోవాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు టి. విజయకుమార్ అంటున్నారు.



పిఎండిఎస్ పొలం



పిఎండిఎస్ ప్రయోజనాలు: ● నేల గుల్ల బారి వానపాములు వృద్ధి చెందుతాయి ● నేలలో నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం పెరుగుతుంది ● పోషక విలువలతో కూడిన నవధాన్య పంటలు పశువులకు పచ్చి మేతగా ఉపయోగపడతాయి ● ఏకకాలంలో బహుళ పంటలు వేయటం వలన అదనపు ఆదాయం వస్తుంది ● ప్రధాన పంటల్లో కలుపు సమస్య ఉండదు. నేల కోతకు గురి కాదు ● ప్రధాన పంటల దిగుబడులు పెరుగుతాయి ● నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది ● మట్టిలో సూక్ష్మజీవుల జీవవైవిధ్యం పెరుగుతుంది ● ప్రధాన పంటలకు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది ● ప్రధాన పంటలకు చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది ● వివిధ పంటల వేర్లు భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవులకు ఆశ్రయం కల్పిస్తాయి. ఈ సూక్ష్మ జీవుల కార్యకలాపాల ద్వారా ప్రధాన పంటకు కావలసిన స్థూల, సూక్ష్మ పోషకాలు పుష్కలంగా అందుతాయి ● ప్రధాన పంటకు అతివృష్టి, అనావృష్టి వంటి వాతావరణ వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది ● ఏడాదిలో 365 రోజులు బహుళ పంటలతో భూమిని కప్పి ఉంచే సేద్యం ఇలా సాధ్యమవుతుంది ● భూమిని పలు పంటలతో పూర్తిగా కప్పి ఉంచడం వల్ల నీరు ఆవిరికాకుండా ఉంటుంది.

2023–24లో 8 లక్షల 60 వేల మంది రైతులు 3.80 లక్షల హెక్టార్లలో పి.ఎం.డి.ఎస్. పద్ధతిలో ఎండాకాలంలో వానకు ముందే విత్తారు. పంట కాలానికి సంబంధం లేకుండా ప్రధాన పంటకు ముందుగా వేసవిలోనే విత్తుకునే వినూత్న పద్ధతే పి.ఎం.డి.ఎస్. సాగు. 20 నుంచి 30 రకాల పంటల విత్తనాలను కలిపి వానాకాలానికి ముందే విత్తనాలు వేస్తున్నారు. వేసవి వర్షాలకు మొలుస్తాయి. సజీవ వేరు వ్యవస్థతో మట్టిని కాపాడుకుంటూ.. సారవంతం చేసుకునే ప్రక్రియ ఇది. 30–60 రోజుల్లో ఈ పంటలు కోసిన తర్వాత రైతులు ప్రధాన పంటలు విత్తుకుంటారు.

ఔషధ మొక్కల వ్యాపారంపై శిక్షణ

ఔషధ, సుగంధ మొక్కల వ్యాపారావకాశాలపై 10 రోజుల ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గుజరాత్ ఆనంద్‌లోని ఐసిఎఆర్ సంస్థ అయిన డైరెక్టరేట్ ఆఫ్ మెడిసినల్ అండ్ ఆరోమేటిక్ ప్లాంట్స్ రీసెర్చ్‌కు చెందిన మెడి–హబ్ ఆగస్టు 1 నుంచి 12వ తేదీ వరకు రోజుకు రెండు విడతలుగా మొత్తం 5.30 గంటల పాటు ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఉ. 10 గం. నుంచి మ. 12.30 వరకు, మ. 2 గం. నుంచి సా. 5.30 వరకు ఇంగ్లిష్/హిందీలో జూమ్ ద్వారా శిక్షణ ఇస్తారు. వివరాలకు.. డా. స్నేహల్‌కుమార్ ఎ పటేల్, వాట్సాప్: 99098 52552. ఆసక్తి ఉన్న వారు ఈ గుగుల్ ఫామ్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలి: https://forms.gle/vRvMHjZGgC5n1RHH6

స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో అనాహత్, శౌర్య

ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి ఇద్దరు భారత క్రీడాకారులు క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించారు. అమెరికాలో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో బాలికల సింగిల్స్‌లో జాతీయ చాంపియన్ అనాహత్ సింగ్... బాలుర సింగిల్స్‌లో శౌర్య బావా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అనాహత్ 11-6, 13-11, 11-2తో అకారి మిదోరికావా (జపాన్)పై, శౌర్య 11-9, 5-11, 11-5, 13-11తో సెగుండో పోర్టాబాలెస్ (అర్జెంటీనా)పై విజయం సాధించారు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో సుమిత్ నగాల్



భారత స్టార్ సుమిత్ నగాల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ పురుషుల సింగిల్స్ తాజా ర్యాంకింగ్స్‌లో సుమిత్ ఐదు స్థానాలు ఎగబాకి 68వ ర్యాంక్‌లో నిలిచాడు. 1973లో కంప్యూటర్ ర్యాంకింగ్స్ ప్రవేశపెట్టాక పురుషుల సింగిల్స్‌లో భారత్ తరఫున అత్యుత్తమ ర్యాంక్‌కు చేరుకున్న మూడో భారతీయ ప్లేయర్‌గా సుమిత్ గుర్తింపు పొందాడు. తొలి రెండు స్థానాల్లో విజయ్ అమృతరాజ్ (1980లో 18వ ర్యాంక్), సోమ్‌దేవ్ వర్మన్ (2011లో 62వ ర్యాంక్) ఉన్నారు.

సాత్విక్-చిరాగ్ జోడీకి అనుకూలమైన 'డ్రా'



కౌలాలంపూర్: వరుసగా రెండో ఒలింపిక్స్‌లో పోటీ పడుతున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి అనుకూలమైన 'డ్రా' లభించింది. మూడో సీడ్ పొందిన సాత్విక్-చిరాగ్‌లకు గ్రూప్ 'సి'లో చోటు దక్కింది. ఇదే గ్రూప్‌లో ఫజర్-అర్దియాంతో (ఇండోనేసియా), లమ్స్‌ఫుస్-సీడెల్ (జర్మనీ), కోర్వీ-లాబర్ (ఫ్రాన్స్) జంటలు ఉన్నాయి. ఈ మూడు జోడీలు కూడా గతంలో ఒక్కసారి కూడా సాత్విక్-చిరాగ్‌లను ఓడించలేదు. 'ఎ', 'బి', 'సి' గ్రూప్‌ల్లో నాలుగు జంటలు... 'డి' గ్రూప్‌లో ఐదు జోడీలున్నాయి. లీగ్ దశ తర్వాత ఆయా గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జోడీలు క్వార్టర్ ఫైనల్ చేరుకుంటాయి. నాకౌట్ దశలో గ్రూప్ 'టాపర్'గా నిలిచిన జోడీలు మరో గ్రూప్ 'టాపర్'తో తలపడే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో సాత్విక్-చిరాగ్ ద్వయం గ్రూప్ టాపర్‌గా నిలిస్తే క్వార్టర్ ఫైనల్లోనూ సులువైన ప్రత్యర్థి ఎదురయ్యే చాన్స్ ఉంటుంది.

మన ఆటగాళ్లకు మద్దతు ఇవ్వండి: కోహ్లి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న భారత ఆటగాళ్లకు మద్ద తు పలుకుతూ వారిని పతకాలు సాధించే దిశగా ప్రోత్సహించాలని భారత క్రికెటర్ విరాట్ కోహ్లి విజ్ఞప్తి చేశాడు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మన దేశం ఒలింపిక్స్‌లోనూ మరింత పెద్ద సంఖ్యలో పతకాలు గెలుచుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నాడు. 'మన సోదర సోదరీమణులు పతకాలు నెగ్గాలనే ఆకలితో పారిస్‌కు వెళుతున్నారు. మన ఆటగాళ్లు మైదానంలో పోటీ పడేందుకు సిద్ధమవుతుండగా మనం వారిని ఉద్వేగంగా చూస్తున్నాం. ఇప్పుడు ప్రతీ ఇంట్లో, మూలమూలన ఇండియా, ఇండియా అని మాత్రమే వినిపించాలి. త్రివర్ణ పతాకం చేబూని వారంతా పోడియం వైపు వెళ్లే దిశగా నేను వారికి మద్దతు పలుకుతున్నాను. మీరూ నాతో జతకట్టండి. జై హింద్' అని కోహ్లి పేర్కొన్నాడు.



స్పెయిన్ తడాఖా

రికార్డుస్థాయిలో నాలుగోసారి యూరో టైటిల్ హస్తగతం

- ఫైనల్లో ఇంగ్లండ్‌పై విజయం



ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్

బెర్లిన్: పుష్కర కాలం తర్వాత స్పెయిన్ జట్టు అంతర్జాతీయ ఫుట్‌బాల్ వేదికపై మళ్లీ మెరిసింది. ప్రతిష్టాత్మక 'యూరో' టోర్నీలో స్పెయిన్ రికార్డు స్థాయిలో నాలుగోసారి చాంపియన్‌గా నిలిచింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ఫైనల్లో అల్వారో మొరాటో సారథ్యంలోని స్పెయిన్ 2-1 గోల్స్ తేడాతో ఇంగ్లండ్ జట్టును ఓడించింది. స్పెయిన్ తరఫున నికో విలియమ్స్ (47వ ని.లో), మికెల్ ఒయర్‌జబాల్ (86వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... ఇంగ్లండ్ జట్టుకు పాల్మెర్ (73వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. 68వ నిమిషంలో కెప్టెన్ అల్వారో మొరాటో స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఒయర్‌జబాల్ సహచరుడు మార్క్ కుకురెల్లా క్రాస్ పాస్‌ను లక్ష్యానికి చేర్చి స్పెయిన్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. 90వ నిమిషంలో ఇంగ్లండ్ ప్లేయర్ మార్క్ గుయెహి హెడర్ షాట్‌ను గోల్ పోస్ట్ ముందు స్పెయిన్ డిఫెండర్ దాని ఓల్మో హెడర్ షాట్‌తో అడ్డుకోవడం కొసమెరుపు. ఈ గెలుపుతో స్పెయిన్ జట్టు 66 ఏళ్ల టోర్నీ చరిత్రలో అత్యధికంగా నాలుగు సార్లు విజేతగా నిలిచిన జట్టుగా గుర్తింపు పొందింది. గతంలో స్పెయిన్ 1964, 2008, 2012లలో యూరో టైటిల్‌ను సాధించింది. జర్మనీ జట్టు మూడుసార్లు (1972, 1980, 1996) విజేతగా నిలిచింది. 1966లో ఏకైక ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన తర్వాత మరో అంతర్జాతీయ టైటిల్ నెగ్గలేకపోయిన ఇంగ్లండ్ జట్టుకు వరుసగా రెండోసారి యూరో టోర్నీలో నిరాశ ఎదురైంది. 2021 యూరో ఫైనల్లో ఇటలీ చేతిలో ఓడిన ఇంగ్లండ్‌కు ఈసారి స్పెయిన్ షాక్ ఇచ్చింది. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఫైనల్ చేరిన స్పెయిన్ తుదిపోరులోనూ తమ సత్తా చాటుకుంది. బంతిని 63 శాతం తమ ఆధీనంలో ఉంచుకొని ఇంగ్లండ్ ఆటగాళ్లను కట్టడి చేసింది. ఏకంగా 60 సార్లు ఇంగ్లండ్ గోల్‌పోస్ట్ వైపునకు వెళ్లిన స్పెయిన్ 15 సార్లు గోల్ చేసేందుకు ప్రయత్నించింది. మరోవైపు హ్యారీ కేన్ కెప్టెన్సీలో ఇంగ్లండ్ జట్టు 31 సార్లు స్పెయిన్ గోల్ పోస్ట్ వైపునకు వెళ్లి తొమ్మిదిసార్లు గోల్ లక్ష్యంగా షాట్‌లు సంధించింది. స్పెయిన్ టీనేజ్ స్టార్, 17 ఏళ్ల లమీన్ యమాల్ 'యంగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'... స్పెయిన్‌కే చెందిన రోడ్రి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డులు గెల్చుకున్నారు.

విజేత స్పెయిన్ జట్టుకు 80 లక్షల యూరోలు (రూ. 72 కోట్ల 89 లక్షలు), రన్నరప్ ఇంగ్లండ్ జట్టుకు 50 లక్షల యూరోలు (రూ. 45 కోట్ల 56 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

1 యూరో టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది విజేతగా నిలిచిన తొలి జట్టుగా స్పెయిన్ రికార్డు నెలకొల్పింది.

15 ఒకే యూరో టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన జట్టుగా స్పెయిన్ గుర్తింపు పొందింది. ఫ్రాన్స్ (14 గోల్స్: 1984లో) పేరిట ఉన్న రికార్డును స్పెయిన్ తిరగరాసింది.

అర్జెంటీనా ధమాకా

- రికార్డుస్థాయిలో 16వసారి కోపా అమెరికా కప్ సొంతం
- ఫైనల్లో కొలంబియాపై విజయం
- కెప్టెన్ మెస్సీ ఖాతాలో మరో టైటిల్

మయామి గార్డెన్స్ (అమెరికా): అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ ప్రస్తుత ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా తమ ఖాతాలో మరో గొప్ప విజయాన్ని జమ చేసుకుంది. ప్రతిష్టాత్మక కోపా అమెరికా కప్ టోర్నీలో లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా టైటిల్‌ను నిలబెట్టుకుంది. సోమవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా 1-0 గోల్ తేడాతో కొలంబియా జట్టును ఓడించింది. నిర్ణీత 90 నిమిషాల తర్వాత రెండు జట్లు 0-0తో సమంగా ఉండటంతో... మ్యాచ్ అదనపు సమయానికి దారి తీసింది. అదనపు సమయం తొలి అర్ధభాగంలోనూ గోల్ కాలేదు. ఆ తర్వాత అదనపు సమయం రెండో అర్ధభాగంలో 112వ నిమిషంలో లాటారో మార్టినెజ్ గోల్ చేసి అర్జెంటీనాకు విజయాన్ని ఖరారు చేశాడు. 97వ నిమిషంలో మార్టినెజ్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చాడు. అంతకుముందు ఆట 64వ నిమిషంలో మెస్సీ మైదానంలో జారిపడటంతో చీలమండ గాయంతో అతను మైదానాన్ని వీడాడు. ఈ గెలుపుతో అర్జెంటీనా 108 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ టోర్నీలో 16వసారి చాంపియన్‌గా నిలిచింది. తద్వారా ఈ టోర్నీని అత్యధికసార్లు నెగ్గిన జట్టుగా రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. 15 సార్లు ఈ టైటిల్ నెగ్గిన ఉరుగ్వే జట్టు రెండో స్థానంలోకి వెళ్లింది. మరోవైపు 23 ఏళ్ల తర్వాత కోపా అమెరికా కప్‌లో ఫైనల్ చేరిన కొలంబియా రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. గత 28 మ్యాచ్‌ల నుంచి అజేయంగా ఉన్న కొలంబియా తొలి ఓటమిని మూటగట్టుకుంది. కొలంబియా ప్లేయర్ జేమ్స్ రోడ్రిగ్వెజ్ టోర్నీ 'బెస్ట్ ప్లేయర్' అవార్డు సొంతం చేసుకోగా... ఐదు గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచిన అర్జెంటీనా ప్లేయర్ లాటారో మార్టినెజ్ 'గోల్డెన్ బూట్' పురస్కారం దక్కించుకున్నాడు. అంతకుముందు టికెట్ లేని ప్రేక్షకులు కూడా మైదానంలోకి రావడంతో గందరగోళం చోటు చేసుకుంది. వారందరినీ బయటకు పంపించాల్సి రావడంతో మ్యాచ్ 82 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది.



చండీగఢ్ యూనివర్సిటీ ఘనత

పారిస్ ఒలింపిక్స్‌కు ఎనిమిది మంది ఆటగాళ్లు



భజన్ కౌర్

చండీగఢ్: ప్రతిష్టాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత బృందంలో ఒకే యూనివర్సిటీకి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఉండటం విశేషం. చండీగఢ్ యూనివర్సిటీకి అలాంటి అరుదైన అవకాశం దక్కింది. ఈ యూనివర్సిటీ విద్యార్థులు భజన్ కౌర్ (ఆర్చరీ), అర్జున్ (షూటింగ్), సంజయ్ (హాకీ), రితిక (రెజ్లింగ్), అక్షదీప్ సింగ్ (రేస్ వాకింగ్), యశ్ (కయాకింగ్)లతో పాటు పారాలింపియన్లు పలక్ కోహ్లి (బ్యాడ్మింటన్), అరుణ తన్వర్ (తైక్వాండో) ఒలింపిక్స్‌లో భారత్ తరఫున బరిలోకి దిగుతున్నారు. ఈ గౌరవం పట్ల చండీగఢ్ యూనివర్సిటీ చాన్స్‌లర్, ఎంపీ సత్నామ్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు.

సినిమా

సెప్టెంబరులో స్టార్ట్?



కమల్ హాసన్

ప్రభాస్ 'సలార్: సీజ్‌ఫైర్, కల్కి 2898 ఏడీ, కమల్‌హాసన్ 'విక్రమ్', రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్', యశ్ 'కేజీఎఫ్' వంటి భారీ సినిమాలకు యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌గా చేసిన అన్బరివ్ (అన్బు, అరివు ద్వయం)దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో ఈ మూవీని ప్రకటించారు. అయితే 'ఇండియన్ 2', 'థగ్ లైఫ్' సినిమాలతో కమల్ బిజీగా ఉండటం వల్ల ఈ సినిమా చిత్రీకరణ ఇంకా ప్రారంభం కాలేదు. 'ఇండియన్ 2' విడుదలవడం, 'థగ్ లైఫ్' చిత్రీకరణ తుదిదశకు చేరుకోవడంతో అన్బరివ్‌ల సినిమాపై కమల్ దృష్టిసారించారని కోలీవుడ్ సమాచారం. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబరు నుంచి మొదలయ్యేలా కమల్ అండ్ కో సన్నాహాలు చేస్తున్నారట. కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మించనున్న ఈ యాక్షన్ ప్యాక్డ్ మూవీని 2025లో విడుదల చేయాలనుకుంటున్నారు.

ప్రేక్షకులకి బోర్ కొట్టిస్తున్నాం - నాని



అశ్విన్ రామ్, చైతన్య, నభా నటేష్, నాని, ప్రియదర్శి

''ఈ మధ్య సినిమాల్లో యాక్షన్ ఎక్కువై పోయి ప్రేమకథలు, వినోదం చాలా మిస్ అవుతున్నాం. చిన్నప్పుడు అన్నిరకాల జానర్స్ మూవీస్ వచ్చేవి.. అన్నింటినీ ఎంజాయ్ చేసే వాళ్లం. థియేటర్స్‌కి వెళ్లడానికి ఎక్కువ కారణాలుండేవి. కానీ, ఇప్పుడు మనకు తెలియకుండానే ఒకే జానర్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులకి బోర్ కొట్టిస్తున్నాం. అందరం కామెడీ, లవ్‌స్టోరీ, ఎమోషనల్, యాక్షన్.. ఇలా అన్ని జానర్స్ టచ్ చేయాలి. ప్రియదర్శిలాంటి ప్రతిభ ఉన్న నటుడు వైవిధ్యమైన జానర్స్ ఎంచుకోవడం గర్వంగా ఉంది'' అని హీరో నాని అన్నారు. ప్రియదర్శి, నభా నటేష్ జోడీగా నటించిన చిత్రం 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో అనన్య నాగళ్ల కీలక పాత్ర చేశారు. కె.నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ–''డార్లింగ్' మూవీ టీజర్, ట్రైలర్ చాలా వినోదాత్మకంగా ఉంది. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి. 'హను-మాన్' మూవీ స్థాయిలో 'డార్లింగ్' విజయం సాధించాలి. వివేక్ సాగర్ మ్యూజిక్ అద్భుతంగా ఉంది. ఈ మూవీ టీజర్, ట్రైలర్ చూస్తే అశ్విన్ రామ్ ఎంత ప్రతిభ ఉన్న డైరెక్టరో తెలుస్తోంది. నభా నటేష్.. ప్రమాదం తర్వాత నీ కొత్త అధ్యాయం 'డార్లింగ్'తో ప్రారంభమైంది. దర్శి అంటే నాకు చాలా ఇష్టం. తన నటన, చేసే పాత్రలు ఇష్టం. అందుకుని 'డార్లింగ్' ఈవెంట్‌కి రాలేదు. నాకు ఇష్టమైన 'బలగం' మూవీ హీరో అని, 'బలగం' మూవీ అభిమానిగా వచ్చా. 'బలగం' స్థాయిలో 'డార్లింగ్' విజయం సాధించాలి. ఈ మూవీ తన కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవాలి. నా వాల్ పోస్టర్ ప్రొడక్షన్స్‌లో నేను నిర్మించనున్న తర్వాతి సినిమాలో ప్రియదర్శి హీరోగా నటిస్తాడు. జగదీశ్ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తాడు'' అన్నారు. ఈ వేడుకలో కెమెరామేన్ నరేశ్ రామదురై, సంగీత దర్శకుడు వివేక్ సాగర్, నిర్మాతలు శివలెంక కృష్ణప్రసాద్, వివేక్ కూచిభొట్ల, అనన్య నాగళ్ల, డైరెక్టర్స్ వీఐ ఆనంద్, వేణు యెల్దండి పాల్గొన్నారు.



తాప్సీ

సీక్వెల్ సిద్ధం

తాప్సీ పన్ను, విక్రాంత్ మెస్సే లీడ్ రోల్స్‌లో వినిల్ మాథ్యూ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'హసీనా దిల్‌రుబ'. 2021లో విడుదలైన ఈ సినిమాకు వీక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. దీంతో 'హసీనా దిల్‌రుబ'కు సీక్వెల్‌గా 'ఫిర్ ఆయీ హసీనా దిల్‌రుబ' తీశారు మేకర్స్. తొలి భాగంలో నటించిన తాప్సీ పన్ను, విక్రాంత్ మెస్సే సీక్వెల్‌లోనూ యాక్ట్ చేయగా, వినిల్ మాథ్యూనే దర్శకత్వం వహించారు. సీక్వెల్‌లో సన్నీ కౌశల్, జిమ్మీ షెర్గిల్ ఇతర పాత్రల్లో నటించారు. దర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్, భూషణ్ కుమార్ ఈ మూవీ నిర్మించారు. తాజాగా 'ఫిర్ ఆయా హసీనా దిల్‌రుబ' చిత్రం ఆగస్టు 9న నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ కానుందని మేకర్స్ ప్రకటించారు.

నా కెరీర్‌లోనే సారంగదరియా మంచి చిత్రం - రాజా రవీంద్ర



పద్మారావు, రాజా రవీంద్ర, యశస్విని, శరత్‌చంద్ర

''సారంగదరియా' చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. నేను ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాత ఇదే నాకు హ్యాపీయెస్ట్ మూమెంట్. నా కెరీర్‌లోనే 'సారంగదరియా' మంచి చిత్రంగా నిలిచింది'' అని రాజా రవీంద్ర అన్నారు. పద్మారావు అబ్బిశెట్టి (పండు) దర్శకత్వంలో రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో యశస్విని, మోయిన్, మోహిత్ ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'సారంగదరియా'. చల్లపల్లి చలపతిరావు ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మించిన ఈ మూవీ ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో శరత్ చంద్ర మాట్లాడుతూ– ''మా సినిమాకి ప్రేక్షకుల మౌత్ టాక్ వల్ల కలెక్షన్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి'' అన్నారు. ''మా సినిమాకు మంచి స్పందన వస్తుండటం సంతోషంగా ఉంది'' అన్నారు పద్మారావు అబ్బిశెట్టి, మోయిన్, మోహిత్, యశస్విని.

హైదరాబాద్‌లో యుద్ధం



ఎన్టీఆర్

హైదరాబాద్‌లో యుద్ధానికి సిద్ధం అవుతున్నారు హీరోలు ఎన్టీఆర్, హృతిక్ రోషన్. వారిద్దరూ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగులో స్టార్ హీరోగా దూసుకెళుతున్న ఎన్టీఆర్ 'వార్ 2' మూవీతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. ఇద్దరు స్టార్ హీరోలు నటిస్తున్న ఈ మూవీపై ఇటు టాలీవుడ్, అటు బాలీవుడ్‌లో ఫుల్ క్రేజ్ నెలకొంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ముంబై, గోవాతో పాటు విదేశాల్లోనూ కొన్ని సీన్స్ చిత్రీకరించారు. ముంబై షెడ్యూల్‌లో ఎన్టీఆర్-హృతిక్ రోషన్ పాల్గొన్నారు. కాగా 'వార్ 2' తర్వాతి షెడ్యూల్ హైదరాబాద్‌లో జరగనుంది. ఇందుకోసం హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో భారీ బడ్జెట్‌తో పెద్ద సెట్‌ను నిర్మిస్తున్నారు. ఆగస్టు నుంచి ప్రారంభం కానున్న ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్-హృతిక్‌లపై యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించనున్నారట. ఇంటర్వెల్‌లో వచ్చే ఈ ఫైట్ సినిమాలో ఓ హైలెట్‌గా నిలుస్తుందని సమాచారం. జాన్ అబ్రహాం, కియారా అద్వానీ ఇతర పాత్రల్లో నటిస్తున్న 'వార్ 2'ని యష్ రాజ్ ఫిలింస్ సంస్థ నిర్మిస్తోంది. 2025 ఆగస్టు 14న ఈ సినిమా విడుదలకానుంది. కాగా 2019లో విడుదలైన హిట్ మూవీ 'వార్'కి సీక్వెల్‌గా 'వార్ 2' రూపొందుతోన్న సంగతి తెలిసిందే.

కథ విన్నారా?



అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్' సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంటోంది. డిసెంబరు 6న ఈ చిత్రం విడుదల కానుంది. అయితే ఈ మూవీ తర్వాత అల్లు అర్జున్ ఏ దర్శకుడితో సినిమా చేయబోతున్నారనే చర్చ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో జరుగుతోంది. త్రివిక్రమ్, సందీప్ రెడ్డి వంగాలతో కొత్త సినిమాలకు అల్లు అర్జున్ ఆల్రెడీ కమిట్ అయినప్పటికీ ఈ చిత్రాలు సెట్స్‌పైకి వెళ్లడానికి చాలా సమయం ఉంది. ఈలోపు మరో దర్శకుడితో అల్లు అర్జున్ సినిమా చేయాలనుకుంటున్నారట. దీంతో ఆయన తర్వాతి సినిమా దర్శకుల జాబితాలో అట్లీ, బోయపాటి శీను, సురేందర్ రెడ్డి వంటి పేర్లు వినిపించాయి. అయితే రజనీకాంత్‌తో 'జైలర్' తీసి బ్లాక్‌బస్టర్ అందుకున్న నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్‌లో అల్లు అర్జున్ నెక్ట్స్ మూవీ తెరకెక్కనుందనే టాక్ తాజాగా తెరపైకి వచ్చింది. ఇటీవల నెల్సన్ చెప్పిన స్టోరీ అల్లు అర్జున్‌కు నచ్చిందని, దీంతో ఈ కథకు తుది మెరుగులుదిద్దే పనిలో ఉన్నారట నెల్సన్. అనుకున్నట్లు జరిగితే అల్లు అర్జున్-నెల్సన్ దిలీప్ కాంబినేషన్‌లో సినిమా ఉండొచ్చని ఫిల్మ్‌నగర్ టాక్.

షారుక్‌తో ఢీ?



అభిషేక్ బచ్చన్

షారుక్ ఖాన్ హీరోగా నటించనున్న తాజా చిత్రం 'కింగ్' (ప్రచారంలో ఉన్న టైటిల్)లో అభిషేక్ బచ్చన్ విలన్‌గా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. షారుక్ ఖాన్, ఆయన కుమార్తె సుహానా ఖాన్ లీడ్ రోల్స్‌లో సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో 'కింగ్' తెరకెక్కనుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ మూవీలో విలన్ రోల్ కొత్తగా ఉంటుందట. ఈ రోల్‌కు అభిషేక్ బచ్చన్‌ను సంప్రదించారట సుజోయ్ ఘోష్. నెగటివ్ రోల్ కావడంతో మొదట కాస్త విముఖతను వ్యక్తం చేసిన అభిషేక్.. పాత్రలోని డెప్త్, ప్రత్యేకత నచ్చడంతో ఫైనల్‌గా ఓకే చెప్పారని బాలీవుడ్ సమాచారం.

ఒళ్లు దగ్గర పెట్టుకుని కష్టపడతా - కిరణ్ అబ్బవరం



గోపాలకృష్ణా రెడ్డి, కిరణ్ అబ్బవరం, సుజీత్, సందీప్

''ఇండస్ట్రీలో నా పని అయిపోయిందంటూ ఎవరైనా అంటే నమ్మకండి. నా పని అయిపోయిందనిపించినప్పుడు నేనే సినిమాలు చేయను. నన్ను ప్రేమించిన అభిమానుల కోసం ఒళ్లు దగ్గర పెట్టుకుని కష్టపడతాను'' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించిన చిత్రం 'క'. కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన ఈ మూవీ త్వరలో రిలీజ్‌కానుంది. కాగా సోమవారం (జూలై 15) కిరణ్ అబ్బవరం పుట్టినరోజు. ఈ సందర్భంగా జరిగిన 'క' మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో కిరణ్ మాట్లాడుతూ– ''క' చూశాక తెలుగు నుంచి వచ్చిన ఒక మంచి సినిమా అని ప్రేక్షకులంతా చెప్పుకుంటారు'' అన్నారు. ''క' మూవీతో నా కల నెరవేరుతోంది'' అన్నారు చింతా గోపాలకృష్ణా రెడ్డి. ''మాలాంటి కొత్త డైరెక్టర్స్‌కు 'క' లాంటి టీమ్ దొరకడం అదృష్టంగా భావిస్తున్నాం'' అన్నారు సుజీత్. ''క' అంటే కిరణ్ అబ్బవరం అని అనుకుంటున్నారు. కానీ 'క' అంటే సినిమాలో ఒక ఇంపార్టెంట్ రోల్ ఉంటుంది'' అన్నారు సందీప్. ఈ వేడుకలో నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్, దర్శకుడు సతీష్ వేగేశ్న, చిత్ర సహ నిర్మాత వినీషా రెడ్డితో పాటు చిత్రయూనిట్ సభ్యులు మాట్లాడారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
16-7-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▲	145	80,665
నిఫ్టీ ▲	85	24,587

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్‌	18,501	▲ 105
డోజోన్స్‌	40,217	▽ 216
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,183	▽ 70
డాక్స్‌	18,591	▽ 157
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,974	▲ 2
నికాయ్‌	41,191	▽ 1003

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	72,932
బంగారం (99.5 స్వచ్ఛత)	72,640
వెండి (కిలో)	91,835

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	83.14	84.16
£	బ్రిటన్‌ పౌండ్‌	107.22	109.81
€	యూరో	89.94	92.32
¥	జపాన్‌ ఎన్‌ (100)	52.38	53.53
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	55.72	57.67
S$	సింగపూర్‌ డాలర్‌	59.50	64.16
SAR	సౌదీ రియాల్‌	21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్‌	21.87	23.66
¥	చైనా యువాన్‌	10.39	12.46

టోకు ధరలు రయ్‌!

జూన్‌ ద్రవ్యోల్బణం 3.36 శాతం



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం జూన్‌లో 3.36 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. 16 నెలల కాలంలో ఈ స్థాయి టోకు ధరల స్పీడ్‌ ఇదే తొలిసారి. ఆహార ధరలు ప్రధానంగా కూరగాయల ధరల తీవ్రత సూచీపై ప్రభావం చూపింది. సూచీలో మెజారిటీ వెయిటేజ్‌ ఉన్న తయారీ రంగంలో కూడా ద్రవ్యోల్బణం పెరిగిందని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. టోకు ద్రవ్యోల్బణం పెరుగుతూ వస్తుండడం వరుసగా ఇది నాల్గవ నెల.

బీఓబీ డిపాజిట్‌ ధమాకా



ముంబై: ప్రభుత్వరంగ బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా 'బీఓబీ మాన్సూన్‌ ధమాకా డిపాజిట్‌ స్కీమ్‌'ను ప్రకటించింది. అధిక వడ్డీ రేట్లపై ప్రత్యేక టర్మ్‌ డిపాజిట్లను స్వీకరిస్తున్నట్టు బ్యాంక్‌ తెలిపింది. 399 రోజుల డిపాజిట్‌పై 7.25 శాతం, 333 రోజుల డిపాజిట్‌పై 7.15 శాతం వడ్డీ రేటు ఆఫర్‌ చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ నెల 15 నుంచి ఈ పథకం అందుబాటులోకి వచ్చిందని, రూ.3 కోట్ల వరకు రిటైల్‌ డిపాజిట్లపై ఈ రేట్లు అమలవుతాయని వెల్లడించింది. ఇక 60 ఏళ్లు నిండిన సీనియర్‌ సిటిజన్లకు ఇవే డిపాజిట్లపై 0.50 శాతం అదనపు రేటును ఆఫర్‌ చేస్తున్నట్టు బ్యాంక్‌ తెలిపింది.

'సాక్షి ప్లస్‌' ఈ-పేపర్‌లో..
హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ లాభం అప్‌ | అరబిందో షేర్ల బైబ్యాక్‌

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)	
16-7-2024	
విశాఖ	575-00
చిత్తూరు	573-00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	555-00
విజయవాడ	555-00
రిటైల్‌ ధర (డజను)	72.00
హైదరాబాద్‌	535-00
వరంగల్‌	537-00
రిటైల్‌ ధర	5.95

సవాళ్లలోనూ ఎగుమతుల సత్తా

- అంతర్జాతీయంగా నెలకొన్న సవాళ్లలోనూ భారత్‌ వస్తు ఎగుమతులు పురోగమిస్తున్నాయి. జూన్‌లో సానుకూల ఫలితాన్ని అందించాయి.

ఎగుమతులు
- వృద్ధి: **2.56** శాతం
- విలువ: **35.20** బిలియన్‌ డాలర్లు

దిగుమతులు
- పెరుగుదల: **5** శాతం
- విలువ: **56.18** బిలియన్‌ డాలర్లు

- ఎగుమతులు-దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు: **20.98** బిలియన్‌ డాలర్లు

మూడు నెలల్లో..
- ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌ నుంచి జూన్‌ మధ్య వస్తు ఎగుమతులు 5.84 శాతం పెరిగి, 109.96 బిలియన్‌ డాలర్లకు చేరాయి. దిగుమతులు 7.6 శాతం ఎగసి 172.23 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి వాణిజ్యలోటు 62.26 బిలియన్‌ డాలర్లుగా ఉంది. వస్తు, సేవల ఎగుమతులు మూడు నెలల కాలంలో 200 బిలియన్‌ డాలర్లుగా ఉంది.
- **ఆయిల్‌ దిగుమతులు:** జూన్‌లో 20 శాతం పెరిగి 15 బిలియన్‌ డాలర్లుగా నమోదయితే, మూడు నెలల్లో ఈ విలువ 23 శాతం పెరిగి 51.5 బిలియన్‌ డాలర్లుగా ఉంది.
- **పసిడి దిగుమతులు:** జూన్‌లో 38.66 శాతం పడిపోయి 3 బిలియన్‌ డాలర్లకు చేరాయి. త్రైమాసికంలో 1.91 శాతం తగ్గి 9.51 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యాయి.




- భారత్‌ ప్రధానంగా ఎగుమతి చేస్తున్న దేశాల జాబితా తొలి వరుసలో అమెరికా, యూఏఈ, మలేసియా, బంగ్లాదేశ్‌, టాంజేనియా, నెదర్లాండ్స్‌, సింగపూర్‌ ఉన్నాయి.

– సాక్షి, బిజినెస్‌ డెస్క్‌

జేపీ సిమెంట్స్‌పై అదానీ కన్ను

దివాలా చట్టం కింద కొనుగోలుకు అవకాశం




ముంబై: దేశీయంగా వేగవంతంగా ఏకీకృతమవుతున్న సిమెంట్‌ పరిశ్రమలో దివాలా చర్యలను ఎదుర్కొంటున్న జైప్రకాష్‌(జేపీ) అసోసియేట్స్‌ మరింత వేడిని పుట్టించనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అల్ట్రాటెక్‌, అదానీ గ్రూప్‌, దాల్మియా, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌ రంగంలో భారీ ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. సిమెంట్‌ తయారీలో అదానీ గ్రూప్‌.. దిగ్గజ కంపెనీలు ఏసీసీ, అంబుజా ద్వారా దేశీయంగా రెండో పెద్ద సంస్థగా నిలుస్తోంది. ఈ బాటలో మరింత విస్తరించే వ్యూహాలలో ఉంది. ఇందుకు అనుగుణంగా 9 మిలియన్‌ టన్నుల వార్షిక సామర్థ్యం కలిగిన జేపీ గ్రూప్‌ సిమెంట్‌ ఆస్తులపై కన్నేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. జూన్‌ మొదట్లో జేపీ గ్రూప్‌పై దివాలా చట్ట చర్యలు ప్రారంభమైన నేపథ్యంలో అదానీ గ్రూప్‌ ప్రణాళికలకు ప్రాధాన్యత ఏర్పడింది. బ్యాంకింగ్‌ దిగ్గజం ఐసీఐసీఐ దరఖాస్తు ప్రభావంతో అలహాబాద్‌లోని జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్‌(ఎన్‌సీఎల్‌టీ) కోర్టు జేపీ అసోసియేట్స్‌పై దివాలా చట్ట ప్రక్రియకు తెరతీసింది. వెరసి ఇన్‌సాల్వెన్సీ చర్యలు అదానీ గ్రూప్‌నకు అవకాశాలను కల్పించనున్నట్లు సిమెంట్‌ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లైమ్‌స్టోన్‌ గనులు, విద్యుత్‌ ప్లాంటుసహా సిమెంట్‌ ఆస్తులను పొందేందుకు అదానీ సన్నాహాలు మొదలు పెట్టే వీలున్నట్లు తెలియజేశారు. అయితే ఇప్పటివరకూ జేపీ ఆస్తుల విక్రయానికి ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని చెబుతున్నారు.

వేడెక్కనున్న మార్కెట్‌

గత నెల(జూన్‌) 27న ఇండియా సిమెంట్స్‌లో 19.44 శాతం వాటాను షేరుకి రూ. 267 ధరలో సిమెంట్‌ దిగ్గజం అల్ట్రాటెక్‌ కొనుగోలు చేసింది. అంతేకాకుండా మరో 3.4 శాతం వాటాను ఈ ఆదిత్య బిర్లా గ్రూప్‌ కంపెనీ షేరుకి రూ. 285 ధరలో సొంతం చేసుకోనుంది. తద్వారా దాదాపు 23 శాతం వాటాను రూ. 1,900 కోట్లకు చేజిక్కించుకుంటోంది.

కొనసాగిన రికార్డుల ర్యాలీ

- సూచీలకు పీఎస్‌యూ షేర్ల దన్ను
- జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు రాణించడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లతో స్టాక్‌ సూచీల రికార్డుల ర్యాలీ సోమవారం కూడా కొనసాగింది. రాబోయే బడ్జెట్‌పై ఆశావహ దృక్పథం, ఐటీ రంగ కంపెనీలు అంచనాలకు మించి ఆర్థిక ఫలితాలు ప్రకటించడం తదితర అంశాలు కలిసొచ్చాయి. సెన్సెక్స్‌ 145 పాయింట్లు పెరిగి 80,665 వద్ద ముగిసింది. నిఫ్టీ 85 పాయింట్ల లాభంతో 24,587 వద్ద స్థిరపడింది. ముగింపు స్థాయిలు సూచీలకు సరికొత్త రికార్డు. ఒక దశలో సెన్సెక్స్‌ 343 పాయింట్లు బలపడి 80,862 వద్ద, నిఫ్టీ 133 పాయింట్లు ఎగసి 24,635 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి.

- ఎంసీఎల్‌ఆర్‌ను 10 బేసిస్‌ పాయింట్లు పెంచడంతో ఎస్‌బీఐ షేరు 2.50 శాతం, **క్యూ1లో నికరలాభం 47% వృద్ధి నమోదుతో బ్యాంక్‌ ఆఫ్‌** మహారాష్ట్ర షేరు 5.50% లాభపడ్డాయి. ఇండియన్‌ ఓవర్సీస్‌ బ్యాంక్‌ 7%, కెనరా బ్యాంక్‌ 4.50%, పీఎన్‌బీ బ్యాంక్‌, యూకో బ్యాంక్‌, బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా, యూనియన్‌ బ్యాంక్‌ షేర్లు 5 శాతం వరకు రాణించాయి.
- స్టాక్‌ సూచీలు కొత్త గరిష్టాలకు చేరడంతో ఇన్వెస్టర్ల సంపద సైతం జీవితకాల గరిష్టానికి చేరుకుంది. గడచిన రెండు రోజుల్లో రూ.3.85 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. సోమవారంఒక్క రోజే రూ. 2.70 లక్షల కోట్లు పెరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్‌ కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం గరిష్టం రూ. 455.08 లక్షల కోట్లకు (5.45 ట్రిలియన్‌ డాలర్లు) చేరింది.

జీవితకాల కనిష్టాన్ని తాకిన రూపాయి



దేశీయంగా ద్రవ్యోల్బణం పెరగడం, అమెరికా కరెన్సీ బలోపేతంతో ఇంట్రాడేలో రూపాయి విలువ 11 పైసలు క్షీణించి 83.62 వద్ద జీవితకాల కనిష్టాన్ని తాకింది. చివరికి 10 పైసలు బలహీనపడి 83.61 వద్ద ముగిసింది. రానున్న రోజుల్లో 83.30 - 83.80 శ్రేణిలో కదలాడొచ్చని ఫారెక్స్‌ నిపుణులు భావిస్తున్నారు.

స్క్రాపింగ్‌కు మరింత సపోర్ట్‌

బడ్జెట్‌పై కేంద్రానికి ఆటోమొబైల్‌ రంగం డిమాండ్లు



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ జూలై 23న పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో వివిధ రంగాలు తమ విజ్ఞప్తుల చిట్టాను ప్రభుత్వం ముందు ఉంచుతున్నాయి. ఎలక్ట్రిక్‌ వాహనాల వినియోగం మరింతగా పెరిగేందుకు రాబోయే బడ్జెట్‌లో తగు చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆటోమొబైల్‌ పరిశ్రమ సమాఖ్య సియామ్‌ కోరింది. అలాగే, వాహనాలను తుక్కు కింద మార్చే స్క్రాపింగ్‌ ప్రక్రియకు సంబంధించి అదనంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. 'ఎలక్ట్రిక్‌ వాహనాల కోసం కేంద్రం ఫేమ్‌ 3 వంటి పథకాన్ని ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నాం. ఇప్పటికే అమలవుతున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్‌ఐ) వంటి స్కీములు ఇకపైనా కొనసాగుతాయని ఆశిస్తున్నాం' అని సియామ్‌ ప్రెసిడెంట్‌ వినోద్‌ అగర్వాల్‌ తెలిపారు. 'అలాగే, వాహనాల స్క్రాపేజీ పాలసీ అమల్లో ఉన్నప్పటికీ పెద్దగా ప్రభావం లేనందున, స్క్రాపింగ్‌ విషయంలో మరిన్ని ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు ప్రకటించవచ్చని ఆశిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ఎకానమీకి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటే ఆటోమోటివ్‌, ఎఫ్‌ఎంసీజీ వంటి రంగాలకు మేలు జరుగుతుందని అగర్వాల్‌ తెలిపారు. సబ్సిడీలు ఇవ్వడం ద్వారా విద్యుత్‌ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఫేమ్‌ 2 గడువు ముగిసినందున దాని స్థానంలో ఫేమ్‌ 3ని అమలు చేస్తే పరిశ్రమకు తోడ్పాటు లభించగలదన్న ఆశలు నెలకొన్నాయి. ద్విచక్ర, త్రిచక్ర ఎలక్ట్రిక్‌ వాహనాల కోసం కేంద్రం రూ. 10,000 కోట్లతో ఈ పథకాన్ని ప్రకటించవచ్చనే అంచనాలు ఉన్నాయి.



తరుగుదల ప్రయోజనాలు కల్పించాలి: ఫాడా

వ్యక్తిగత ట్యాక్స్‌పేయర్లకు వాహనాల తరుగుదలను (డిప్రిసియేషన్‌) క్లెయిమ్‌ చేసుకోవడానికి వెసులుబాటు కల్పించాలని ఆటోమొబైల్‌ డీలర్ల సమాఖ్య ఫాడా కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. పన్ను చెల్లింపుదార్ల సంఖ్య పెరగడంతో పాటు వాహనాలకు డిమాండ్‌ పెరిగేందుకు కూడా ఇది తోడ్పడగలదని ఫాడా ప్రెసిడెంట్‌ మనీష్‌ రాజ్‌ సింఘానియా తెలిపారు. మరోవైపు, ఎల్‌ఎల్‌పీ (లిమిటెడ్‌ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్‌), ప్రొప్రైటరీ, భాగస్వామ్య సంస్థలకు సైతం కార్పొరేట్‌ ట్యాక్స్‌ను తగ్గించాలని కోరారు.

– సాక్షి, బిజినెస్‌ డెస్క్‌

భవిత

- గ్రూప్‌1, గ్రూప్‌2 ప్రత్యేకం- కరెంట్‌ అఫైర్స్‌ కోసం | ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్‌ ఆఫ్‌ మహారాష్ట్రలో 195 పోస్టులు

పుణె(మహారాష్ట్ర)లోని బ్యాంక్‌ ఆఫ్‌ మహారాష్ట్ర.. వివిధ విభాగాల్లోని పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 195.
» **పోస్టులు:** డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌, అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌, చీఫ్‌ మేనేజర్‌, సీనియర్‌ మేనేజర్‌, మేనేజర్‌.
» **విభాగాలు:** రిస్క్‌ మేనేజ్‌మెంట్‌, పోర్ట్‌ఫోలియో అనాలసిస్‌-ఐసీఏఏపీ, ఎంటర్‌ప్రైజ్‌-ఆపరేషన్‌ రిస్క్‌, మార్కెట్‌ రిస్క్‌, రిస్క్‌ అనలిటిక్స్‌-రిస్క్‌ మేనేజ్‌మెంట్‌,రిస్క్‌ మేనేజ్‌మెంట్‌, డొమెస్టిక్‌-ఫారెక్స్‌, ఫారెక్స్‌, డొమెస్టిక్‌ ట్రెజరీ, ఎంటర్‌ప్రైజ్‌ ఆర్కిటెక్చర్‌, డేటా ఆర్కిటెక్చర్‌, ఐటీ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్‌ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో డిగ్రీ/పీజీ, పీజీ డిప్లొమా, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు స్కేల్‌-2 పోస్టులకు రూ.64,820 నుంచి రూ.93,960, స్కేల్‌-3 పోస్టులకు రూ.85,920 నుంచి రూ.1,05,280, స్కేల్‌-4 పోస్టులకు రూ.1,02,300 నుంచి రూ.1,20,940, స్కేల్‌-5 పోస్టులకు రూ.1,20,940 నుంచి రూ.1,35,020, స్కేల్‌-6 పోస్టులకు రూ.1,40,500 నుంచి రూ.1,56,500.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్‌ డిస్కషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జనరల్‌ మేనేజర్‌, బ్యాంక్‌ ఆఫ్‌ మహారాష్ట్ర, హెచ్‌ఆర్‌ఎం డిపార్ట్‌మెంట్‌, హెడ్‌ ఆఫీస్‌, లోక్‌మంగళ్‌, 1501, శివాజీనగర్‌, పుణె-411005 చిరునామకు పంపించాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 11.07.2024.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 26.07.2024
» **వెబ్‌సైట్‌:** https://bankofmaharashtra.in

ఇండియన్‌ ఆర్మీలో హవల్దార్‌, నాయబ్‌ సుబేదార్‌ పోస్టులు

ఇండియన్‌ ఆర్మీ క్రీడా కోటా కింద డైరెక్ట్‌ ఎంట్రీ (ఇంటెక్‌ 02/2024) ద్వారా.. హవల్దార్‌, నాయబ్‌ సుబేదార్‌(స్పోర్ట్స్‌) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **క్రీడలు:** అథ్లెటిక్స్‌, ఆర్చరీ, బాస్కెట్‌బాల్‌, బాక్సింగ్‌, డైవింగ్‌, ఫుట్‌బాల్‌, ఫెన్సింగ్‌, జిమ్నాస్టిక్స్‌, హాకీ, హ్యాండ్‌బాల్‌, కబడ్డీ.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు అవసరం. అంతర్జాతీయ/జూనియర్‌ లేదా సీనియర్‌ నేషనల్‌ ఛాంపియన్‌షిప్‌/ఖేలో ఇండియా గేమ్స్‌/యూత్‌ గేమ్స్‌లో పాల్గొన్న అత్యుత్తమ క్రీడాకారులై ఉండాలి.
» **వయసు:** 17 1/2 నుంచి 25ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్పోర్ట్స్‌ ట్రయల్స్‌, ఫిజికల్‌ ఫిట్‌నెస్‌ టెస్ట్‌, ఫిజికల్‌ స్టాండర్డ్స్‌ టెస్ట్‌, స్కిల్‌ టెస్ట్‌, మెడికల్‌ ఎగ్జామినేషన్‌, సర్టిఫికేట్‌ వెరిఫికేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టరేట్‌ ఆఫ్‌ పీటీ అండ్‌ స్పోర్ట్స్‌, జనరల్‌ స్టాఫ్‌ బ్రాంచ్‌, ఐహెచ్‌క్యూ(ఆర్మీ), రూమ్‌ నెం.747 ఎ వింగ్‌, సేనా భవన్‌, న్యూఢిల్లీ-110011 చిరునామకు పంపించాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరి తేది:** 30.09.2024.
» **వెబ్‌సైట్‌:** https://joinindianarmy.nic.in

ఎస్‌బీఐలో 16 స్పెషలిస్ట్‌ కేడర్‌ ఆఫీసర్‌ పోస్టులు

ముంబైలోని స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా ప్రధాన కార్యాలయం.. రెగ్యులర్‌-కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన స్పెషలిస్ట్‌ కేడర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16
» **పోస్టుల వివరాలు:** సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌(ఐఎస్‌ ఆడిటర్‌)-02, అసిస్టెంట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌(ఐఎస్‌ ఆడిటర్‌)-03, మేనేజర్‌(ఐఎస్‌ ఆడిటర్‌)-04, డిప్యూటీ మేనేజర్‌(ఐఎస్‌ ఆడిటర్‌)-07.
» **అర్హత:** బీఈ/బీటెక్‌(ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ/కంప్యూటర్‌ సైన్స్‌/ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ ఇన్‌స్ట్రుమెంటేషన్‌), సీఐఎస్‌ఏ సర్టిఫికేట్‌ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు మేనేజర్‌ పోస్టుకు రూ.85,920 నుంచి రూ.1,05,280. డిప్యూటీ మేనేజర్‌ పోస్టుకు రూ.64,820 నుంచి రూ.93,960. సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ పోస్టుకు ఏడాదికి రూ.45 లక్షలు. అసిస్టెంట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌కు ఏడాదికి రూ.40 లక్షలు.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్‌ షార్ట్‌లిస్టింగ్‌, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 03.07.2024.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 24.07.2024
» **వెబ్‌సైట్‌:** https://www.sbi.co.in

'గేట్‌' గెలుపు

» 2025 ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో గేట్‌
» గేట్‌ స్కోర్‌తో ఎంటెక్‌, పీహెచ్‌డీతోపాటు పీఎస్‌యూ జాబ్స్‌
» ఐఐటీ రూర్కీ ఆధ్వర్యంలో పరీక్ష: మొత్తం 30 పేపర్లలో గేట్‌
» అభ్యర్థులు రెండు పేపర్లకు హాజరయ్యే అవకాశం

గేట్‌.. గ్రాడ్యుయేట్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌ ఇన్‌ ఇంజనీరింగ్‌! ప్రముఖ ఇంజనీరింగ్‌ ఇన్‌స్టిట్యూట్స్‌ ఐఐటీలు, నిట్‌ల్లో ఎంటెక్‌, పీజీ, పీహెచ్‌డీల్లో ప్రవేశానికి మార్గం!! అంతేకాకుండా గేట్‌ స్కోర్‌తో ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలను కూడా దక్కించుకోవచ్చు. తాజాగా గేట్‌ 2025 షెడ్యూల్‌ విడుదలైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. గేట్‌-2025 వివరాలు, గేట్‌ స్కోర్‌తో ప్రయోజనాలు, బెస్ట్‌ స్కోర్‌ సాధించడానికి మార్గాలు తదితర వివరాలు..

ఐఐటీలు,ఎన్‌ఐటీలు,జీఎఫ్‌టీఐలే కాకుండా..రాష్ట్ర స్థాయిలోనూ ఎంటెక్‌ ప్రవేశాల్లో గేట్‌ విద్యార్థులకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. పీఎస్‌యూలు కూడా గేట్‌ స్కోర్‌తో ఎంట్రీ లెవల్‌ ఇంజనీరింగ్‌ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయి. దీంతో జాతీయ స్థాయిలో లక్షల మంది ఈ పరీక్షకు హాజరవుతున్నారు. ఏటా ఎనిమిది లక్షలకు పైగా అభ్యర్థులు గేట్‌ రాస్తున్నట్లు అంచనా.

నిర్వహణ.. ఐఐటీ-రూర్కీ

గ్రాడ్యుయేట్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌ ఇన్‌ ఇంజనీరింగ్‌ పరీక్షను ప్రతి ఏటా ఒక ఐఐటీ నిర్వహిస్తుంది. గేట్‌-2025 నిర్వహణ బాధ్యతలు ఐఐటీ-రూర్కీకి అప్పగించారు. దీంతో.. సంబంధిత వర్గాలు గేట్‌-2025 వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చాయి. అదే విధంగా అభ్యర్థుల సౌలభ్యం కోసం పరీక్ష షెడ్యూల్‌, సిలబస్‌, గేట్‌ గత పరీక్ష పేపర్లను సైతం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

మొత్తం 30 పేపర్లు

గేట్‌-2025 పరీక్షను మొత్తం 30 పేపర్లలో నిర్వహించనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. వీటిలో ఇంజనీరింగ్‌తోపాటు ఆర్కిటెక్చర్‌, సైన్స్‌, కామర్స్‌, ఆర్ట్స్‌, హ్యుమానిటీస్‌ సబ్జెక్టులు కూడా ఉండడం విశేషం. పలు ఐఐటీల్లో ఇటీవల కాలంలో సోషల్‌ సైన్సెస్‌ విభాగాల్లోనూ పీజీ కోర్సులను అందిస్తున్నారు. గేట్‌ స్కోర్‌ ఆధారంగానే ఆ సీట్లను భర్తీ చేయాలని నిర్ణయించారు. దీంతో గేట్‌లో ఎక్స్‌హెచ్‌ పేరుతో హ్యుమానిటీస్‌కు సంబంధించిన సబ్జెక్ట్‌లో పరీక్ష కూడా నిర్వహిస్తున్నారు.

అర్హతలు

ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25)లో బీటెక్‌, ఇతర గ్రాడ్యుయేట్‌ ప్రోగ్రామ్‌లు మూడు, నాలుగు సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులు గేట్‌ 2025కు దరఖాస్తుకు అర్హులు.

వంద మార్కులకు పరీక్ష

గేట్‌-2025 పరీక్ష మొత్తం మూడు గంటల వ్యవధిలో ఆన్‌లైన్‌ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం వంద మార్కులకు పరీక్ష ఉంటుంది. రెండు విభాగాల్లో 65 ప్రశ్నలు అడుగుతారు. పార్ట్‌-1లో జనరల్‌ ఆప్టిట్యూడ్‌ నుంచి ప్రశ్నలు ఉంటాయి.

ఈ విభాగానికి 15 మార్కులు కేటాయిస్తారు. ఇందులో ఒక మార్కు ప్రశ్నలు అయిదు, రెండు మార్కుల ప్రశ్నలు అయిదు ఉంటాయి. ఇంజనీరింగ్‌ మ్యాథమెటిక్స్‌లో 13 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌తో పార్ట్‌-బిని నిర్వహిస్తారు. ఈ విభాగంలో 72 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. ఇలా మొత్తం 100 మార్కులకు గేట్‌ పరీక్ష జరుగుతుంది.

ప్రశ్నల తీరు ఇదే

గేట్‌ పరీక్షలో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి.. మల్టిపుల్‌ ఛాయిస్‌ కొశ్చన్స్‌ (ఎంసీక్యూ), మల్టిపుల్‌ సెలక్ట్‌ కొశ్చన్స్‌ (ఎంఎస్‌క్యూ), న్యూమరికల్‌ ఆన్సర్‌ టైప్‌ (ఎన్‌ఏటీ) ప్రశ్నలు. ఎంసీక్యూ విధానంలో నాలుగు లేదా అయిదు ఆప్షన్లలో ఏదో ఒక ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాల్సి ఉంటుంది. మల్టిపుల్‌ సెలక్ట్‌ కొశ్చన్స్‌ విధానంలో ఒకటి కంటే ఎక్కువ ఆప్షన్లు సమాధానంగా ఉంటాయి. ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే..సంబంధిత టాపిక్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగుండాలి. న్యూమరికల్‌ ఆన్సర్‌ టైప్‌ ప్రశ్నలు కొంత కాలిక్యులేషన్స్‌తో కూడినవిగా ఉంటాయి.

పీఎస్‌యూ జాబ్స్‌

గేట్‌ స్కోర్‌ ఆధారంగా ఐఐటీ, ఎన్‌ఐటీ, ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లలో ఎంటెక్‌, ఇంటిగ్రేటెడ్‌ పీహెచ్‌డీలలో ప్రవేశాతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. పీఎస్‌యూలు గత కొన్నేళ్లుగా గేట్‌ స్కోర్‌ ఆధారంగా నియామకాలు చేపడుతున్నాయి. ఇందుకోసం అభ్యర్థులు ఆయా సంస్థలు విడుదల చేసే నోటిఫికేషన్లకు అనుగుణంగా ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నిర్దిష్ట కటాఫ్‌ నిబంధనలను అనుసరించి జాబితాలో ఉన్న వారికి పర్సనల్‌ ఇంటర్వ్యూ, గ్రూప్‌ టాస్క్‌ వంటివి నిర్వహించి తుది విజేతలను ఖరారు చేస్తారు.

మలి దశ ఎంపిక ప్రక్రియ

గేట్‌ స్కోర్‌ ఆధారంగా ఐఐటీ, ఎన్‌ఐటీ, ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం పొందాలనుకునే వారు మలిదశ ఎంపిక ప్రక్రియలో పాల్గొనాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఐఐటీల్లో కౌన్సెలింగ్‌తోపాటు గ్రూప్‌ పర్సనల్‌ టాస్క్‌, గ్రూప్‌ డిస్కషన్‌ ఉంటాయి. కొన్ని ఐఐటీలు రిటెన్‌ ఎస్సేలు నిర్వహిస్తున్నాయి. వీటిలో విజయం సాధించిన వారికే సీట్లు ఖరారు అవుతున్నాయి. జనరల్‌ కేటగిరీలో 750, రిజర్వ్‌డ్‌ కేటగిరీల్లో 550కుపైగా స్కోర్‌ ఉంటే మేలని నిపుణులు సూచిస్తున్నారు.

సీఓఏపీలో యాక్సెప్టెన్స్‌ తప్పనిసరి

ఐఐటీల్లో సీట్ల భర్తీలో సీఓఏపీ (కామన్‌ ఆఫర్‌ యాక్సెప్టెన్స్‌ పోర్టల్‌) విధానాన్ని అమలు చేస్తున్నారు. అంటే.. ఆయా ఐఐటీల్లో ఎంటెక్‌, ఇతర కోర్సులకు దరఖాస్తు చేసుకునే సమయంలో.. సీఓఏపీ రిజిస్ట్రేషన్‌ నెంబర్‌ను తెలియజేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ముందుగా సీఓఏపీలో తమ వివరాలను నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్‌ నెంబర్‌ పొందిన విద్యార్థులే ఐఐటీల్లో ఎంటెక్‌ దరఖాస్తులకు అర్హులవుతారు. ఐఐటీల్లో సీటు లభించిన విద్యార్థులు సీఓఏపీ ద్వారానే తమ సమ్మతి లేదా తిరస్కరణ తెలియజేయాల్సి ఉంటుంది. అదే విధంగా పీఎస్‌యూ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారు కూడా సీఓఏపీలో రిజిస్టర్‌ చేసుకోవాల్సి ఉంటుంది.

సన్నద్ధత పొందండిలా

ఎంచుకున్న సబ్జెక్ట్‌లో బేసిక్స్‌ నుంచి అడ్వాన్స్‌డ్‌ టెక్నిక్స్‌ వరకూ.. పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతి టాపిక్‌ను చదివేటప్పుడు అందులోని ప్రశ్నార్హమైన టాపిక్స్‌ను గుర్తించడం, దానికి సంబంధించి ప్రాథమిక భావనలపై పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవడం చేయాలి.

అనుసంధానం

గేట్‌ అభ్యర్థులు ప్రిపరేషన్‌ సమయంలో అనుసంధాన విధానాన్ని అలవర్చుకోవాలి. గేట్‌ సిలబస్‌ను అకడమిక్‌ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ.. ప్రిపరేషన్‌ సాగించాలి. వీక్లీ టెస్టులు, మాక్‌ టెస్టులు, మోడల్‌ టెస్ట్‌లకు హాజరు కావాలి. ఈ అప్రోచ్‌ విజయ సాధనలో ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది.

వెయిటేజీని పరిశీలిస్తూ

గేట్‌ అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లోని టాపిక్స్‌, వాటికి గత అయిదారేళ్లుగా లభిస్తున్న వెయిటేజ్‌, అకడమిక్‌గా ఉన్న వెయిటేజీ ప్రాధాన్యాన్ని అనుసరిస్తూ ప్రిపరేషన్‌ సాగించాలి. డిసెంబర్‌ చివరి వారం లేదా జనవరి మొదటి వారానికి ప్రిపరేషన్‌ పూర్తి చేసుకునేలా టైమ్‌ ప్లాన్‌ రూపొందించుకోవాలి. ఆ తర్వాత ఉన్న వ్యవధిలో ఆన్‌లైన్‌ మోడల్‌ టెస్ట్‌లు, మాక్‌ టెస్ట్‌లకు హాజరవ్వాలి. ఇలా ఇప్పటి నుంచే నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్‌ సాగితే..పరీక్షలో మంచి స్కోర్‌ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.



ఎన్‌ఐటీలకు సీసీఎంటీ

దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్‌ఐటీలు, ట్రిపుల్‌ ఐటీలు, ఇతర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో ఎంటెక్‌ కోర్సుల్లో ప్రవేశాలకు సెంట్రలైజ్డ్‌ కౌన్సెలింగ్‌ ఫర్‌ ఎంటెక్‌/మాస్టర్‌ ఆఫ్‌ ఆర్కిటెక్చర్‌/మాస్టర్‌ ఆఫ్‌ ప్లానింగ్‌(సీసీఎంటీ) పేరుతో ఉమ్మడి కౌన్సెలింగ్‌ విధానాన్ని అనుసరిస్తారు. విద్యార్థులు సీసీఎంటీ వెబ్‌సైట్‌లో లాగిన్‌ ఐడీ క్రియేట్‌ చేసుకుని ఛాయిస్‌ ఫిల్లింగ్‌ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. దాని ఆధారంగా అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాలు, వారికి వచ్చిన స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుని.. ఆన్‌లైన్‌లో సీటు కేటాయింపు ప్రక్రియ జరుగుతుంది.

గేట్‌తో స్కాలర్‌షిప్‌

గేట్‌ స్కోర్‌ ఆధారంగా ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంటెక్‌, ఇంటిగ్రేటెడ్‌ ఎంటెక్‌+పీహెచ్‌డీలలో ప్రవేశం పొందిన వారికి ఆర్థిక ప్రోత్సాహకం కూడా అందిస్తారు. ఎంటెక్‌ విద్యార్థులకు నెలకు రూ.12,400 చొప్పున 22 నెలలు స్కాలర్‌షిప్‌ ఇస్తారు. పీహెచ్‌డీలో ప్రవేశం ఖరారైన వారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37 వేలు చొప్పున; ఆ తర్వాత మూడేళ్లు నెలకు రూ.42 వేలు చొప్పున స్కాలర్‌షిప్‌ లభిస్తుంది.

పీఎస్‌యూల్లోనూ మలి దశ

తొలిదశలో గేట్‌ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్న పీఎస్‌యూలు.. మలిదశలో సొంతంగా ఎంపిక ప్రక్రియ చేపడుతున్నాయి. మలిదశలో గ్రూప్‌ డిస్కషన్‌ /గ్రూప్‌ టాస్క్‌, పర్సనల్‌ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయి. తుది జాబితా ఖరారులో.. గేట్‌ స్కోర్‌, జీడీ/జీటీ, పర్సనల్‌ ఇంటర్వ్యూలకు వెయిటేజీ ఇస్తున్నాయి. గ్రూప్‌ డిస్కషన్‌లో భాగంగా అభ్యర్థులను బృందాలుగా విభజించి.. ఏదైనా ఒక అంశం ఇచ్చి టీమ్‌లోని ప్రతి అభ్యర్థి మాట్లాడాలని సూచిస్తారు. గ్రూప్‌ టాస్క్‌లో ఒక వాస్తవ సమస్యను అభ్యర్థుల ముందు ఉంచి పరిష్కారం కనుక్కోవాలని పేర్కొంటున్నాయి. చివరగా నిర్వహించే పర్సనల్‌ ఇంటర్వ్యూలో అభ్యర్థుల వ్యక్తిగత నేపథ్యం, టెక్నికల్‌ నాలెడ్జ్‌లను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు.

గేట్‌-2025 ముఖ్య తేదీలు

- నోటిఫికేషన్‌ విడుదల:జూలై మూడో వారంలో..
- గేట్‌ పరీక్ష తేదీలు: 2025 ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీలు.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌: https://gate2025.iitr.ac.in

అమ్మ.. ఆశ తీరకుండానే తుదిశ్వాస...

కొడుకు అన్నం పెడుతలేదని ప్రజావాణిలో కలెక్టర్‌కు వృద్ధ దంపతుల మొర

కలెక్టరేట్ నుంచి ఇంటికి వెళ్లే లోగానే ఆ తల్లి మృతి ఆదిలాబాద్‌లో విషాద ఘటన

కైలాస్‌నగర్: కనిపెంచిన కన్నతల్లిదండ్రులకు కనీసం అన్నం ముద్ద కూడా పెట్టని కొడుకు తీరుతో మానసిక వేదనకు గురైన ఆ మాతృమూర్తి తనకు న్యాయం జరుగకుండానే కన్నుమూసింది. తాము కట్టుకున్న ఇంటి నుంచి గెంటివేసిన కొడుకు నిర్వాకంపై జిల్లా కలెక్టర్‌ను కలిసి మొర పెట్టుకుని... న్యాయం జరుగుతుందన్న ఆశతో తిరిగి ఇంటికి వెళ్లేలోగానే కన్నుమూసింది ఆ తల్లి. ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకున్న ఈ విషాదఘటన వివరాలిలా.. వృద్ధాప్యంలో ఉన్న తమను కన్న కొడుకు ఆదరించడం లేదని, తాము కట్టుకున్న ఇంట్లోకే తమను రానివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన వృద్ధ దంపతులు విఠాబాయి, దేవ్‌రావు సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. విఠాబాయి, దేవ్‌రావు దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా, పెద్ద కొడుకు అనారోగ్యంతో మరణించాడు. వయస్సుపైబడిన తమను చిన్న కొడుకు గంగారం ఏడాదిన్నర కాలంగా అన్నం పెట్టకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని. చివరికి ఇంటి నుంచి గెంటేశాడని కన్నీటిపర్యంతమయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని కూడా పట్టించుకోవడం లేదంటూ వీల్‌చైర్‌లో వచ్చిన విఠాబాయి విలపించారు. విధి లేని పరిస్థితుల్లో తమ కూతురు విమల వద్ద ఉంటూ కాలం వెళ్లదీస్తున్నామని తెలిపారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న ఆర్డీఓ వినోద్ కుమార్‌ను ఆదేశించారు. వృద్ధుల సంరక్షణ చట్టం ప్రకారం సదరు వ్యక్తికి నోటీసులను జారీ చేసి ఆ దంపతులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.

ఆటోలో వెళ్తూ హఠాన్మరణం

కలెక్టర్‌ను కలసిన కలిసిన తర్వాత తిరిగి భర్త, కూతురు, అల్లుడితో కలిసి ఇంటికి వెళ్లే క్రమంలో ఆటోలోనే ఆమె తుదిశ్వాస విడిచింది. అనారోగ్యంతో బాధపడుతూనే తన ఆవేదనను కలెక్టర్ ఎదుట చెప్పుకున్న ఆమెకు న్యాయం జరగకుండానే కన్నుమూయడం అందరినీ కలచివేసింది.


కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన వృద్ధ దంపతులు

కొడుకు ఎప్పుడొస్తడో.. !

- వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు
- రష్యా తరఫున ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న 'పేట'వాసి
- ఇటీవల ప్రధాని మోదీ రష్యా పర్యటనతో సమస్య పరిష్కారానికి అడుగులు


సుఫీయన్ తల్లి నసీమా

నారాయణపేట: సయ్యద్ మహ్మద్ సుఫీయన్ ఎప్పుడు ఇంటికి తిరిగి వస్తాడని కుటుంబమంతా వెయ్యికళ్లతో ఎదురుచూస్తోంది. తల్లి నసీమా, తండ్రి సయ్యద్ జహీర్‌కు ఏడు నెలలుగా కంటిమీద కునుకు లేదు. గతేడాది డిసెంబర్ 17న సుఫీయన్ దుబాయ్ వెళుతున్నానని ఇంటివద్ద చెప్పాడు. దుబాయ్‌కు చెందిన ఏజెంట్ బాబా వీలాగ్స్ రష్యాకు చెందిన ఏజెంట్ మొయిన్ ద్వారా సుఫీయన్‌ను రష్యాకు పంపించారు. అక్కడకు వెళ్లిన తర్వాత ఏజెంట్ మొయిన్ పని ఇప్పిస్తానంటూ నమ్మబలికి నేరుగా రష్యన్ ఆర్మీ దగ్గరకు తీసుకెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా సాయుధ దళాల కోసం పోరాడుతున్న భారతీయులందరినీ విడుదల చేయాలని ఇటీవల ప్రధాని మోదీ తన పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కోరారు. ఇందుకు రష్యా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలోనే సుఫీయన్ సోదరుడు సల్మాన్ ఈ నెల 3న ఢిల్లీకి వెళ్లి విదేశాంగమంత్రి కార్యాలయంలో తన సోదరుడిని విడిపించాలని అధికారులను కోరారు. సుఫీయన్ ఇప్పుడు ఉక్రెయిన్‌లో యుద్ధ ప్రాంతానికి 7,080 కిలోమీటర్ల దూరంలో ఉన్నాడని చెప్పినట్టు వివరించారు.

'ఫార్మాకు భారత్ కేంద్రంగా నిలుస్తోంది'

బీడీఎంఏ అధ్యక్షుడు ఆర్‌కే అగ్రవాల్

సాక్షి, హైదరాబాద్ : ప్రపంచ ఫార్మారంగ పరిశ్రమకు కేంద్రంగా భారత్ నిలుస్తోందని బల్క్‌డ్రగ్ మాన్యుఫాక్చరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీడీఎంఏ) అధ్యక్షుడు ఆర్‌కే.అగ్రవాల్ పేర్కొన్నారు. దేశీయంగా జెనరిక్ మందుల తయారీ ద్వారా భారత ఫార్మా రంగ పరిశ్రమ విజయగాథ ముందుకు సాగుతోందన్నారు. ప్రస్తుతం సీఎస్ఐఆర్ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు వంటివి కీలక భూమిక నిర్వహిస్తాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఉత్పత్తిలో పరిమాణం కంటే విలువను (వాల్యూమ్ ఓవర్ వాల్యూ) పెంచుకునే దిశలో గేర్ మార్చాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో బీడీఎంఏ కూడా నైపుణ్యత, సాంకేతిక, సాఫ్ట్‌వేర్ అప్‌గ్రెడేషన్, అధునాతన మాన్యుఫాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి వాటిలో చొరవ తీసుకుంటుందని చెప్పారు. సోమవారం సీఎస్ఐఆర్‌-ఐఐసీటీలో కెమికల్ క్లస్టర్ యాక్టివిటీస్‌పై 'వన్ వీక్ వన్ థీమ్' ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డా.డి.శ్రీనివాసరెడ్డి, డా.శ్రీరామ్, డా.కె.శ్రీనివాసన్, డా.తివారి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎఫ్ఎస్ కమాండింగ్ ఆఫీసర్

సాక్షి, హైదరాబాద్: ఎయిర్ కమోడోర్ హృషికేశ్ జగన్నాథ్ పేజ్ బేగంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ (ఏఎఫ్ఎస్) కమాండింగ్ ఆఫీసర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. గ్రూప్ కెప్టెన్ మనీశ్ కుమార్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఎయిర్ కమోడోర్ జగన్నాథ్ పేజ్ 1995లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయింగ్ బ్రాంచ్‌లో నియమితులయ్యారు. క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా అనుభవం సాధించారు. ఎయిర్ ఆఫీసర్ డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్, కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ పూర్వ విద్యార్థి అయిన పేజ్.. ఫ్రంట్‌-లైన్ బేస్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్‌గా పనిచేశారు. ప్రస్తుత నియామకానికి ముందు ఆయన వెపన్ సిస్టమ్స్ స్కూల్ శిక్షణ బృందానికి హెడ్‌గా ఉన్నారు. అత్యుత్తమ సేవలకుగాను భారత రాష్ట్రపతి నుంచి ఆయన వాయుసేన పతకాన్ని అందుకున్నారు. కాగా, బాధ్యతల స్వీకరణ సందర్భంగా జగన్నాథ్ పేజ్ మాట్లాడుతూ, భారత వాయుసేన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని సిబ్బందిని కోరారు.



ఇప్పుడు చాలా వరకు వెబ్‌సైట్లలో చాట్‌బోట్ అందుబాటులో ఉంటోంది. ఆ వెబ్‌సైట్‌కు సంబంధించిన ఏ సమాచారం కావాలన్నా చిటికెలో సమాధానం చెప్తుంది. మన సందేహాలను నివృత్తి చేస్తుంది. అయితే ప్రతీది ఇంగ్లిష్‌లోనే అడగాల్సి ఉంటుంది. చాట్‌బోట్ కూడా ఇంగ్లిష్‌లోనే జవాబు చెప్తుంది. మనకు ఇంగ్లిష్ సరిగా రాకుంటే.. చాట్‌బోట్ నుంచి కావాల్సిన సమాచారం పొందడం కష్టమవుతుంది. అందరికీ ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చినా వినియోగంలో మాత్రం వెనుకబడి ఉండాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే తెలుగులో చాట్‌బోట్‌ను తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలుగులోనే ప్రశ్నలు అడగొచ్చు. తెలుగులోనే సమాధానాలు పొందవచ్చు. చాట్‌జీపీటీ తరహాలో తెలుగు ఏఐ చాట్‌బోట్‌ను రూపొందించేందుకు రాష్ట్ర ఐటీ శాఖ, స్వేచ్ఛ అనే ఎన్జీవో కలసి కృషి చేస్తున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే.. గ్రామ స్థాయిలో కూడా ఇంటర్నెట్ సదుపాయాలన్నీ సమర్థవంతంగా వినియోగించుకునే వెసులుబాటు కలగనుందని అధికారవర్గాలు చెప్తున్నాయి.

..: సాక్షి, హైదరాబాద్ :..

మన భాషలో స్వేచ్ఛగా..

- తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, చేతివృత్తులపై సమాచార సేకరణ
- డేటా సేకరించిన లక్ష మంది ఇంజనీరింగ్ విద్యార్థులు
- సమాచారం నమోదుకు ప్రత్యేక అప్లికేషన్ రూపొందించిన సంస్థ
- రెండు నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యం

తెలుగు ఏఐ చాట్‌బోట్ రూపకల్పనకు ప్రణాళికలు • ఐటీ శాఖతో కలసి 'స్వేచ్ఛ'సంస్థ ముందడుగు

లక్ష మంది విద్యార్థుల కృషి

దేశంలోని అందరికీ సాఫ్ట్‌వేర్లు ఉచితంగా అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో 'స్వేచ్ఛ'సంస్థ ఏర్పాటైంది. ఆ సంస్థ దాదాపు లక్ష మంది విద్యార్థుల సాయంతో తెలుగు ఏఐ చాట్‌బోట్‌ను అభివృద్ధి చేస్తోంది. చాట్‌బోట్‌ను ట్రెయిన్ చేసేందుకు.. తెలుగు సంస్కృతి, ప్రాంతాలు, సంప్రదాయాలు, వ్యవసాయ పద్ధతుల గురించి తెలుగు మాట్లాడే వారి నుంచి విద్యార్థులు సమాచారాన్ని సేకరించారు. ఈ సమాచారాన్ని చాట్‌బోట్‌కు ఫీడ్ చేసి, విశ్లేషించే ప్రక్రియను నిర్వహిస్తారు. దీనిని రెండు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సెప్టెంబర్‌లో జరగనున్న గ్లోబల్ ఏఐ సదస్సులో ఈ ఏఐ చాట్‌బోట్‌ను ప్రదర్శించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.


డేటా సేకరణలో విద్యార్థులు

ఏ స్థానిక భాషలోనూ లేదు

దేశంలో ఇప్పటివరకు దాదాపు ఏ స్థానిక భాషలో కూడా చాట్‌బోట్ అందుబాటులో లేదు. తొలిసారిగా తెలుగులోనే చాట్‌బోట్‌ను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. అయితే చాలా అంశాలు స్థానిక భాషలో అందుబాటులో ఉండవు. దీంతో ఏఐ ప్లాట్‌ఫారం కోసం సమాచారాన్ని సేకరించడం కష్టమైన పని. అందుకే స్వేచ్ఛ సంస్థ దాదాపు లక్ష మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ప్రత్యేకమైన అప్లికేషన్ రూపొందించి, దాని ద్వారా సమాచారాన్ని సేకరించింది.

ప్రాంతీయ భాషలో సమాచారంతో..



ప్రపంచంలోని ఏ ప్రాంతంలోనైనా ప్రాంతీయ భాషల్లో ఏఐ సాధనాలు అందుబాటులో లేవు. ప్రాంతీయ భాషలో సమాచారం అందుబాటులో లేకపోవడం, ఏఐ సాధనాల కోసం విస్తృత డేటా సేకరించాల్సి రావడమే దీనికి కారణం. అందుకే మేం ఇంజనీరింగ్ విద్యార్థుల ద్వారా ఇంటర్న్‌షిప్‌లో భాగంగా డేటా సేకరిస్తున్నాం. స్థానిక సంప్రదాయాలతోపాటు ఆటలు, పాటలు, వ్యవసాయ పద్ధతులు ఇతర అన్ని వివరాలను సేకరించే విషయంలో వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ఇప్పటికే మూడొంతుల పని అయిపోయింది.

– ప్రవీణ్ చంద్రహాస్, 'స్వేచ్ఛ'కార్యదర్శి

కొత్త పరిశోధనలకు ఊతం

విద్యార్థులకు సేకరించిన సమాచారాన్ని చాట్ బోట్‌కు ఫీడ్ చేస్తారు. దీనితో చాట్‌జీపీటీ మాదిరిగా ఏఐ ఆధారిత ప్రోగ్రామ్‌లు అందుబాటులోకి వస్తాయి. తెలుగులో వాయిస్ కమాండ్స్ ఆధారంగా పనిచేసే పరికరాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఈ దిశగా పరిశోధనకు ఊతం లభిస్తుంది.



7 వేల గ్రామాల్లో సమాచార సేకరణ

తెలుగు చాట్‌బోట్ రూపకల్పన కోసం దాదాపు ఏడు వేల గ్రామాల నుంచి సమాచారం సేకరించారు. ఆ గ్రామాల్లో వారు మాట్లాడుకునే మాటలను రికార్డు చేసి భద్రపరిచారు. అక్కడి ఆహారం, ఆహార, వ్యవసాయ పద్ధతులు, చేతి వృత్తుల గురించి సమాచారం సేకరిస్తున్నారు. ఈ డేటా అంతా ఒక్క చోటికి చేర్చి ఏఐ చాట్‌బోట్‌ను రూపొందించనున్నారు. ఈ మోడల్ రూపొందించేందుకు కేవలం రూ.10 లక్షలలోపే ఖర్చవుతోందని నిర్వాహకులు తెలిపారు.

ఇన్నోవేషన్.. అదే మా ప్యాషన్..!

- ఐఐటీహెచ్‌లో ఇన్నోవేషన్‌డే సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన
- 46 ఆవిష్కరణలను ప్రదర్శించిన విద్యార్థులు.. మానవాళి సర్వతోముఖాభివృద్ధి కోసం కృషి
- స్ఫూర్తిని నింపుతున్న సృజనలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఐఐటీ–హైదరాబాద్‌లో విద్యార్థుల నూతన ఆవిష్కరణలు అబ్బురపరుస్తున్నాయి. మానవాళి సర్వతోముఖాభివృద్ధి కోసం చేస్తున్న ఈ పరిశోధనలు అందరిలో స్ఫూర్తిని నింపుతున్నాయి. ఐఐటీహెచ్‌లో సోమవారం ఇన్నోవేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సంస్థలోని ఐటీఐసీలో జరుగుతున్న పరిశోధన లకు సంబంధించి 46 నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారు. నూతన ఆవిష్కరణల్లో కొన్ని..



మారుమూల వాసులకు రిమోట్ వైద్యం

మారుమూల ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో నివాసముండే ఆదివాసీలు, గిరిజనులకు మహానగరాలు, విదేశాల్లో ఉండే ఉన్నత వైద్య నిపుణుల వైద్య సేవలు అందడం కష్టం. అలాంటి వారి కోసం మహానగరాలు, విదేశాల్లో ఉన్న వైద్యులు రిమోట్ ద్వారా వైద్య సేవలు అందించేందుకు వీలుగా 'ప్లాబ్–సి'అనే నూతన ఆవిష్కరణను అభివృద్ధి చేస్తున్నారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ల తరహాలో ప్రత్యేక పరికరాన్ని ఉపయోగించి వైద్యులు మారుమూల ప్రాంతాల్లో ఉన్న రోగి స్థితిగతులను తెలుసుకుని అక్కడి నుంచే వైద్యం, శస్త్రచికిత్సలు చేసే సరికొత్త సీడీఎస్‌సీఓ విధానంపై పరిశోధన చేస్తున్నారు. మెకానికల్, డిజైనింగ్, సీఎస్ఈ ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందిస్తున్న ఈ టెక్నాలజీతో ప్రెగ్నెన్సీ, కేన్సర్, గాల్‌బ్లాడర్ స్టోన్స్, వెరికోస్ వీన్స్‌కు సంబంధించిన శస్త్ర చికిత్సలను రిమోట్ ద్వారా చేయొచ్చు. ఈ ప్రాజెక్టు సర్టిఫికేషన్ దశలో ఉందని ప్రాజెక్టు కో–ఫౌండర్ వివేక్ తెలిపారు.

ఏఐతో ప్రమాదాలను ముందే పసిగట్టి..



పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాలతో పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఆస్తినష్టం కూడా భారీగానే ఉంటోంది. ఈ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలుంటే ముందుగానే పసిగట్టే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐఐటీహెచ్‌లో అభివృద్ధి చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో 'డీప్‌టెక్ బేస్డ్ అసిస్ట్ మానిటరింగ్, ఫెయిల్యూర్ ప్రిడిక్షన్ సిస్టం'ను రూపొందిస్తున్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఎంబీఏ చేస్తున్న కొలుసు వినయ్ కుమార్‌తోపాటు మరో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఈ టెక్నాలజీ ద్వారా 30 హెచ్‌పీ నుంచి 3 వేల హెచ్‌పీ సామర్థ్యం ఉన్న మోటార్లతోపాటు, భారీ జనరేటర్లు సైతం ఫెయిలై ప్రమాదం జరిగే అవకాశాలుంటే వెంటనే గుర్తిస్తుందని, ఆయా మోటార్లు, జనరేటర్లు ఎంత కాలం పనిచేస్తాయనే దానిపై ఎప్పటికప్పుడు రిపోర్ట్ ఇస్తుందని వినయ్ చెప్పారు. దీంతో ప్రమాదం జరగకుండా ముందుజాగ్రత్త పడొచ్చని, ఇది ల్యాబ్ టెస్టింగ్ దశలో ఉందని తెలిపారు.

నర్సులకు రోగి నరం ఇట్టే దొరుకుతుంది..



రక్త పరీక్ష కోసం రోగి రక్తాన్ని సేకరించాలన్నా.. సెలైన్ ఎక్కించాలన్నా.. రోగి చేతికి ఉన్న నరాన్ని గుర్తించేందుకు నర్సులు తంటాలు పడుతుంటారు. చాలామందిలో ఈ నరం దొరకడం కష్టం. చిన్న పిల్లలు, వృద్ధుల్లో నరం చిక్కించుకోవాలనుకుంటే ఇంకా ఇబ్బంది. ఇకపై ఈ నరాలను ఈజీగా గుర్తించేందుకు ఏఐ సహాయంతో ఆధునిక పరిజ్ఞానాన్ని రూపొందిస్తున్నారు. 8 మంది విద్యార్థులతో కలిసి ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నామని ఇంజనీరింగ్ ఇన్ ఫిజిక్స్ చదువుతున్న టి.ప్రశాంత్ తెలిపారు.

1,200 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకునే సూట్



ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటితేనే మనం అల్లాడిపోతాం. అలాంటిది 1,200 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతను కూడా తట్టుకునే ప్రత్యేక సూట్ 'ఎక్స్‌ట్రీం ఫైర్ రెసిస్టెంట్ సూట్'ను అభివృద్ధి చేస్తున్నారు. ఫైర్ ఫైటర్లు, ఆర్మీ, నేవీల్లో పనిచేసే వారికి ఉపయోగపడే ఈ సూట్‌పై ఇండియన్ నేవీతో కలిసి పరిశోధన సాగుతోందని వీరా టాక్టికల్ డైనమిక్స్ అనే డిఫెన్స్ స్టార్టప్ ప్రతినిధి, విద్యార్థి సుక్రుత్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సూట్‌లలో అల్యూమినియం మెటీరియల్‌ను వాడుతున్నారని, ఈ ప్రత్యేక సూట్ కోసం సాఫ్ట్ కంజిట్ ఫైబర్ మెటీరియల్‌ను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సూట్‌లు త్వరలోనే నేవీకి వెళ్తాయని చెప్పారు.

సులభంగా కేన్సర్ చికిత్స



కేన్సర్‌కు ఆధునిక వైద్య చికిత్సలు చేయాలంటే ఎంతో విస్తృతమైన యంత్ర పరికరాల అవసరం ఉంటుంది. ఈ పరికరాల కోసం ఎక్కువ విస్తీర్ణంలో స్థలం అవసరం ఉంటుంది. తక్కువ విస్తీర్ణంతోపాటు మరింత ఆధునిక వైద్య చికిత్సను అందించే 'టేబుల్‌టాప్ ఎక్స్‌లేటర్ ఫర్ కేన్సర్ థెరపీ'పై ఐఐటీహెచ్‌లో పరిశోధన సాగుతోంది. తక్కువ ధరతో, తక్కువ విస్తీర్ణంలో ఉండే ఆధునిక పరికరాలను అభివృద్ధి చేయడం ద్వారా కేన్సర్ చికిత్సను అందుబాటు ధరల్లో అందించేందుకు వీలవుతుందని ప్రొఫెసర్ భువనేష్ రామకృష్ణ తెలిపారు. పది మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఈ ప్రాజెక్టుపై పరిశోధనలు చేస్తున్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ


గిరిప్రదక్షిణ చేస్తున్న విప్ బీర్ల ఐలయ్య, ఈఓ భాస్కర్‌రావు, భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. సోమవారం శ్రీస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని యాదాద్రి కొండ చుట్టూ ఉదయం 6.05 గంటలకు గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి వైకుంఠద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం కొండ చుట్టూ తిరిగి శ్రీస్వామిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తుల భజనలు, శ్రీస్వామి వారి కీర్తనలతో ఈ కార్యక్రమం కొనసాగింది. ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా స్వాతి హోమాన్ని నిర్వహించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టాలంకారమూర్తులకు అష్టోత్తర శతఘటాభిషేకం చేశారు.

విద్యతోనే 'విలువ'


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

తిరుమలాయపాలెం: 'చదువెందుకు.. ఇంత కష్టపడి ఎందుకు చదవాలి.. మీరు చదువుకున్నాక ఏం కావాలనుకుంటున్నారు.. అందుకు మీరేం చేయాలి.. తోటి స్నేహితుడు దారితప్పితే కాపాడాల్సిన బాధ్యత మనపై లేదా.. మీకు ఉన్న సమస్యలేంటి..'అంటూ ప్రశ్నలు సంధించిన ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సమాధానాలు రాబట్టడంతోపాటు భవిష్యత్ లక్ష్యాల సాధనకు చేయాల్సిన కృషిని వివరించారు. ఇందుకోసం ఆయన మోటివేషనల్ స్పీకర్‌గా మారారు. తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో డెంగీ కేసులు పెరుగుతుండగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం ఉదయం కలెక్టర్ పర్యటించారు. ఆతర్వాత గ్రీవెన్స్ డేకు హాజరుకావాల్సి ఉన్నా, జల్లేపల్లి పాఠశాలలో ఎక్కువ మంది పిల్లలు ఉన్నారని తెలియడంతో అక్కడకు వెళ్లారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి చదువు విలువను వివరిస్తూ వారిలో ఉత్సాహం నింపారు.

పిల్లలతోనే గిన్నెలు కడిగించి..



చర్లరూరల్: మారుమూల ప్రాంతంలో ఉన్న ఆ పాఠశాలకు వచ్చి ఎవరు చూస్తారులే.. అని అనుకున్నారేమో కానీ, పాఠశాల విద్యార్థులతో అంట్లు (గిన్నెలు) కడిగించిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి ప్రాథమిక పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం చేశాక అన్నం, కూర గిన్నెలను ఇద్దరు చిన్నారులతో కడిగిస్తుండటం 'సాక్షి'కంటబడింది. దీనిపై హెచ్ఎంను ప్రశ్నించగా.. వంట కార్మికులు బయటకు వెళ్లడంతో విద్యార్థులతో కడిగిస్తున్నామని, ఇలా ఇదివరకు ఎప్పుడూ జరగలేదని చెప్పారు.

స్కూల్ షాక్ కొడుతోంది


వరండాలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఇన్‌సెట్లో) గోడకు అమర్చిన బోర్డుకు టెస్టర్ తాకిస్తే వెలుగుతున్న దృశ్యం

దుద్యాల్: శిథిలావస్థకు చేరిన ఓ పాఠశాల భవనాన్ని ఎక్కడ ముట్టుకున్నా కరెంట్ షాక్ కొడుతోంది. బోర్డు, గోడలు, కిటికీలు, తలుపులు ఇలా.. దేన్ని టచ్ చేసినా విద్యుతాఘాతం విసిరికొట్టింది. దీంతో విద్యార్థులు హడలిపోయారు. ఈ ఉదంతం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హస్నాబాద్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. భవనం మొత్తానికి షాక్ వస్తుండటంతో పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిపేశారు. గత ఆదివారం పూర్వ విద్యార్థులు నిర్వహించిన సమ్మేళనం కోసం వేసిన టెంట్ కింద, వరండాలో తరగతులు నిర్వహించారు. ఈ పాఠశాలలో 6నుంచి 10 తరగతులకు చెందిన 236 మంది అభ్యసిస్తున్నారు. 9 మంది బోధనా సిబ్బంది, ఇద్దరు బోధనేతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. 80 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ స్కూలు భవనం ఇటీవల కురుస్తున్న వర్షాలకు తడిసిముద్దైంది. స్లాబ్ కురవడంతో పాటు పగుళ్లు వచ్చిన గోడల్లో నీళ్లు నిలిచాయి. తరగతి గదుల్లో పూర్తిగా నీరు చేరింది. చిన్నపాటి వర్షానికే తరగతి గదుల్లో నీరు నిలుస్తోందనీ, ఇప్పుడు షాక్ కొడుతుండటంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా భయపడుతున్నారని ప్రధానోపాధ్యాయుడు నర్సింలు చెప్పుకొచ్చారు.

బాలుడి తోక శస్త్రచికిత్స సక్సెస్



బీబీనగర్: వెన్నుపూస కింది భాగంలో తోకను కలిగి జన్మించిన ఓ బాలుడికి యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాల పీడియాట్రిక్ విభాగం వైద్యులు సర్జరీ చేసి తోకను తొలగించారు. 2023 నవంబర్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జన్మించిన హైదరాబాద్‌కు చెందిన మగ శిశువుకు పుట్టుకతోనే వెన్నుపూస కింది మలద్వారం పై భాగంలో 15 సెంటీమీటర్లు పొడవు కలిగి చర్మంతో కూడిన తోక ఉంది. దీనిని తొలగించాలని బాలుడి తల్లిదండ్రులు ఎయిమ్స్ వైద్యులను సంప్రదించారు. శిశువు తోకను పరిశీలించిన పీడియాట్రిక్ సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ శశాంక్‌పాండ నేతృత్వంలో ఈ సంవత్సరం జనవరి నెలలో రెండు గంటలకు పైగా సర్జరీ నిర్వహించి తోకను తొలగించారు. శిశువు శరీరంలోని నరాల సంబంధిత లోపాలు రాకుండా ఆరు నెలల పాటు శిశువు ఆరోగ్య పరిస్థితి పట్ల ఎయిమ్స్ వైద్యులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వచ్చారు. సోమవారం మరోసారి శిశువును ఎయిమ్స్ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు సర్జరీ చేసిన భాగంలో పరీక్షలు నిర్వహించారు. స్కానింగ్ చేసి శిశువులో ఎలాంటి సమస్యలూ లేవని నిర్ధారించుకుని సర్జరీ విజయవంతమైనట్లు వైద్యులు ప్రకటించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.